# శిలాయజ్ఞం



డా॥ కలువగుంట రామమూర్తి

# శిలా యజ్ఞం

(మొదటి భాగం)



రచన

డా॥ కలువగుంట రామమూర్తి

**SILA YAGNYAM—I**

By

Dr. KALUVAGUNTA RĀMAMOORTHY
M.A., M.Phil., Ph.D

Cover Design : "CHANDRA SEKAR"

First Edition : May 1995

Copies : 1000

All Rights Reserved

"తిరుమల తిరుపతి దేవస్థానముల ధార్మిక గ్రంథ ప్రచురణ ఆర్థిక సహాయ పథకం క్రింద ముద్రించబడింది."

Price Rs. 30/-

SRI VENKATESWARA
CENTRAL LIBRARY &
RESEARCH CENTRE
Acc. No. 48796
Date.............
TIRUPATI

" DEEPAM " Publications-2
Copies can be had from :
Master K. VANADEEP
B-27, Vinayaka Nagar, T.T.D.
Tirupati-517 507

Printed at :
Lakshmi Graphics
48-B, Ramanuja Iyer Street
Madras-600 021

# “స్పందనా శతఘ్ని”

18 పర్వాల మహాభారతం ద్వాపరయుగ పుంగవుడికి ముకుటమైతే, 18 అధ్యాయాల ‘శిలాయజ్ఞం’ కలియుగపురుషుడికి తలమానికం. శిలా యజ్ఞాన్ని ఆలోకించి, ఆ హోమధూమ దివ్య పరిమళాల్ని ఆఘ్రాణించిన నా శ్వాసకు ఆత్మవిశ్వాసం భాసై, రసానందం మహా హిమాసై, కళానుబంధం ఉత్తుంగ శ్లైపై కొత్త వూపిరు లందించాయి.

మోడర్నిజమ్ రక రకాల సబ్జెక్టులను ఆకర్షిస్తూ వున్న ఈ కాలంలో—కళల విషయంలో కానీ, మానవతా విలువల విషయంలో కానీ, జీవన సూత్రాల విషయంలో కానీ శిలాయజ్ఞం గత వైభవపు పునరావలోకనం. ఇది శిల్పాన్ని చెమరించి కన్న కల. గగనాల నుంచి గంధవతిపైన వాలిన గాంధర్వ కళ. ఇది సౌశీల్యపు సంజీవ వ్యంజనం. బహుమూల్యపు రసాంజనం. ఇహము - మధులిహము. పరము - ప్రణయ పరము, ఆముష్మిక పారము - అనురక్తిపారము కలబోసిన కలవరింత! ఇదొక మన్మథ భవంతి - మధు స్రవంతి - మధూళికా వాసంతి.

ఆధునికమైనవి, ఆకట్టుకునేవి, జడత్వాన్ని పోగొట్టేవి, నరాల బల హీనతల్ని కాకట్టు పెట్టుకునేవి ఎన్నో అంశాలు వుండగా రాళ్ళను – ఎవరి హృదయాల్లోనూ చిగురించని మోళ్ళను శిరసుకెత్తుకోవడంలో రచయిత అంతర్యం ఏమిటి?

శిల్పులు అజ్ఞాత కళానిధులు. మహోత్కృష్టమైన కళను ప్రపంచానికి పరిచయం చేసి కూడా నిరాడంబరంగా, నిరాసక్తంగా, నిస్స్వార్థంగా తెరవెనుకే మిగిలిపోయారు. శిల్పకళ మన సంస్కృతిని వేరతీసింది. మాత

టంలో పుణ్యచింతనను, పాపభీతిని, భక్తిభావాన్ని, మానవతా విలువల్ని చిరస్థాయిగా నిలిపివుంచింది. మన ధర్మాన్ని, నాగరికతను వాటి వైశిష్ట్యాన్ని దేశ దేశాలా ప్రచారం చేసింది. శిల్పాలు మానవుడికి ఇహ పరాల విచక్షణను కలిగించే సహచరాలు. తర తరాల చరితాస్వరాల వేణు స్వనాలు. ఇంత పరిపుష్టమైన కళను గురించి, దాన్ని అభ్యసించి ఆదరించి మహా కళాఖండాలను ఈ జనాంత సురాలయంమీద జెండాలుగా ఎగరేసిన శిల్పవర్యులను గురించి తనకున్న తన్మయతను, ఆరాధనను తనివిదీరా చెప్పాలనే తపన ఒకటి ఈ కృతిగా ఆకృతి పొందిందనేది రచయిత నుంచి రాబట్టిన వివరం.

ఇందులోని ఇతివృత్తం లోకవృత్తంలో తిరుగాడేదే అయినా రచయిత వాడిన కలం, సిరాబ్రాండు, కాగితాలు సమాజపు ఇంగితపు పరిధి లోనివే అయినా, అక్షరాలన్నీ అక్షరమాలా క్రమంలో ఒదిగిపోయినవే అయినా—అహర్నిశలూ అన్ని దిశలూ గాలించి, ఆదమరచి పేదమరచి, తీయటి బాధను తరచి రసతుషారాల్లో ఈదులాడి రచయిత రాసులు పోసిన ఈ కావ్యంలోని భావనా రతనాల శకలాలు, అభిరతి రజాలు.

రచయిత శిలాయజ్ఞం కోసం భాషను దివి నుంచి భువికి దించలేదు. కానీ ఏదో సురలాహిరిలో లలిత లాఘవంగా శివం చేస్తారు. మహాకావ్యాల మీద మోహరించిన మోహన మొయిలీ కోనల్లో రమణీయ శైలీ పథాల వెంట పదాల రథాలెక్కి రాజసూయాలు చేస్తారు.

వేదనదాలు, యోగతీరాలు, అనురాగ పారావారాలు, మరుశరాలు, ప్రణయ ప్రసరణాలు, జ్ఞానావరణాలు, శిలసరోవరాలు, సహజాతుల అనుభూతుల రీతులు, గణానుబంధ సేతువులు—అనేక గుణగణాల అంతర్యాగం. శిలాయజ్ఞ అవలోకనం, ఆస్వాదనం జీవన సంస్కారం. ఆ దివ్యత్వపు పారం శిల్పులు తప్ప కవిష్ఠులు అందుకోలేని దూరం!

శిలాయజ్ఞం ఏ మధుర నిదురలోనూ, ఏ సుప్తచేతనలోనూ మనం ఊహించలేని కళాభిజ్ఞానం. అదొక సకల కళామయ గళం. స్పందనా సంప్రసరణ గోళం. అనుభూతులతో ఫలించిన అంతరాళం. ఇందులోని ప్రతి పుట పదాల మధుశాల. ప్రతి పదం ఏదో సమ్మోహనాల మంత్రశాల. తరచినకొద్దీ ఈ నవలలోని భావసంపద అతిశయించి, మతి లయించి మళ్ళీ ఈ విస్తారంలోకి జారడానికి, జీవసాహిత్యం నుంచి రసరాహిత్యానికి, ఆవేశం నుంచి సంవేశానికి, ఆశయాన్నుంచి సంశయానికి, సఫలీకరణం నుంచి సరళీకరణానికి, మధూళి స్రావం నుంచి మృగతృష్ణకు దిగజారడానికి మనసు తల్లడిల్లుతుంది.

శిలాయజ్ఞంలో ఏవో గంధర్వలోకా లున్నాయి. ఈ చిన్న గ్రహ గంధవహ ఆఘ్రాణించలేని దివ్యగంధా లున్నాయి. మరపురాని మకరందా లున్నాయి. ఆత్మరాగం చలించి ఫలించి వరించి తరించే అపూర్వ సంగమా లున్నాయి. ఆనందాశ్రుసందనా లున్నాయి. కళ కోసం, కవితార్చన కోసం, ఒక అమలిన ప్రణయ యాతన కోసం, జీవిత సత్యం కోసం, ఆనంద నృత్యం కోసం, అనురాగ లక్ష్యం కోసం పరితపించే హృదయాలకు మహోపశమనం ఈ కావ్యం. మాంద్యం ఆవరించుకున్న ముంగిళ్ళలో మహా ప్రస్థానం ఈ కావ్యం. దైన్యం, హైన్యం దర్శనీయమవుతున్న దేవాయతన వైవాల్లో విక్షిప్తధనం ఈ కావ్యం. మానవత్వానికి - మనోహరత్వానికి, శిల్పానికి - కల్పానికి, ఉషస్సుకూ - తపస్సుకూ, మోహనత్వానికి - సాహసత్వానికి, ప్రణవానికి - ప్రణాదానికి ఊపిర్లు పోసిన ఒరవడి ఇది.

ఈ ఇతివృత్తానికి సౌరాఖ్యుడు సమ్రాట్టు. ఇందులో నిర్మాణం జరిగిన ఆలయం కంటే పవిత్రుడు. మూల విరాట్టునైనా మంత్రముగ్ధుణ్ణి చేయగల శాశ్యసింహుడు, శ్రీపుత్రుడు. జ్యోతిర్మండలమంత

ఓజస్వంతుడు. సకల శాస్త్రాస్త్రధరుడు. విషయ గంభీరుడు. వేదాంత ధీరుడు. ప్రణయ పాండితీ దర్పకుడు.

శిలాయజ్ఞానికి యాజకుడు సౌరాఖ్యుడు. సౌరాఖ్యుడి పాత్ర స్వర్ణ శిల్పం. కల్పాలనే ఏలగలిగిన మహాశిలోద్భవం. నిరంతరాయంగా పెల్లుబికే అతని భావోద్వేగం యామినులను వెలిగించే సౌరయాగం. సౌరాఖ్యుడొక సజీవ సహజీవి. ఈ జీవన్మహాయాత్రలో అతను ఆహ్లాదకరమైన గమ్యం. అతను వున్నచోట ఆరామాలు ఆమనులతో దిగివస్తాయి. అతని అడుగులు సాగిన ఉదయసంధ్యలు లహరికల నూపుతాయి. అతని చూపులు ఆగిన మేఘద్వారాలు స్వాగతహారా లవుతాయి. అతడి తలపుల్లోకి వచ్చిన సౌందర్యమంతా శిల్పాలమయమై రాసులు తీరింది. లయతప్పిన అతని గుండెస్పందనంతా సహస్రానేక రహస్య కవాటాల్ని తెరచుకుని అక్షర సరోవరాలై, మయూఖ సరాలై, సాహితీ వరాలై కురిసిపోయింది. సౌరాఖ్యుడు సజీవమూర్తి. ఉన్నచోటనే ఉత్తమగతులు చూపగల దివ్యస్ఫూర్తి. ప్రేమకు, ప్రణయానికి ఎవరూ చూపని దివ్యాసనాన్ని శిల్పించిన మనోజ్ఞ శృంగారదీప్తి. అసలు నవలలో అతను నిర్మించిన ఆలయం స్వామికోసం కాక ప్రేమకోసమే అనిపిస్తుంది.

ఈ నవలను చదివి ఆ మహాభావనావాహినీ శిలాల్లో కొట్టుకు పోకుండా, తారాపథాల నుంచి తరంగలించే ధారాపాత వర్ణనా తటిద్ఘాతాలకు సొమ్మసిల్లిపోకుండా, అక్కడ వింజరాళుల్లా వర్ధిల్లే వ్యక్తిత్వాలకు విస్మితితో బాహ్యవిస్మృతికి లోనుకాకుండా నిలద్రొక్కుకోవడం అనుభూతి జీవులకు, స్పందనాంశ సంభూతులకు సాధ్యం కాదు. అది వశీకరణ మంత్రాలు వెల్లువ లెత్తుతున్న కంతుని కోట. తమాలవాటికల్లో సౌరకాంతుల పేట. ఎక్కడ దృష్టి సారించినా శైలయంత్రాలను మరపిస్తూ విడిది చేసిన వెన్నెల వశాళి

వైభవాలు, సాంద్రారణ్యాలతో పాత్రపదీనాలు, కవితాత్మక విరజావళీ తీర వాహ్యాళులు, కళాత్మక ప్రణయాశ్లేషలు అపాదమస్తకం చుట్టుకుని అడుగు ముందుకు సాగదు. ఆ పదాల విందుకు పరంధామాల పదారవిందాలైనా కదలివస్తాయి. భావసూక్ష్మతకు దృష్టి చెమరిస్తుంది. విధాత సృష్టి చలించి ఫలించి తరించిపోతుంది.

'అగ్నిగర్భ'ను అధిగమించే నవల వుండదని అనుకున్నాను. కానీ ద్వితీయ ప్రయత్నం అద్వితీయం. యావత్సాహితీ యశోరాజ్యంలో శిలాయజ్ఞం ఒక ప్రజ్ఞాప్రతీక. దీనికి దీటైన కవితాత్మక స్నిగ్ధసాంద్రతా స్పర్శ వేదివి రానున్న కాలంలో రచించడం జరిగితే అది ఈ రచయితవల్ల తప్ప అన్యుల ఆత్మధర్మం కాదు.

శిలాయజ్ఞం అపాదమస్తకం ఆస్వాదయోగ్యం. ఈ ఆహవానికి దివ్యులను ఆహూతించడానికి సమాయత్తం చేసిన రమణీయభావనా పుష్పకాలు రచయిత ఊహించి, మోహించినవి కావు. కొన్ని శకాల సుఖాలు సడల్చుకుని, ధ్యానించి దర్శించి స్పర్శించిన హర్షాకర్ష సాక్షాత్కారాలవి. సాక్షాత్కార శ్రీకారాలవి. ఆ మహద్భావయుతుల అదృశ్య ఆవేశనోద్ధృత సంగమాలు రచయిత తల్లడిల్లిన క్లిష్టక్షణాలు. దివ్యావహనాన్ని, అనుభూతి తీవ్రతను భరించలేని అశక్తత ఆవరించినపుడు—ఏం జరుగుతున్నదో తెలియని అలౌకిక అవ్యక్తదశలో—ప్రాణాలు విలుపుకోవడం కూడా సంశయాత్మకమేనని స్ఫురించిన అంతశ్చేతన స్థితిలో శిలాయజ్ఞ కార్యం అసంపూర్ణంగా ఆగిపోతుందేమోననే రచయిత ఆత్మఘోషను ప్రతి అక్షరంలో అర్థం చేసుకోగలను. ఎందుకంటే శిలాయజ్ఞాన్ని చదువుతున్న నెలరోజులూ ఏదో అపూర్వమైన, అలేఖ్యమైన నిర్విరామభూతి, ఎవరిదో మహత్తరమైన ఆవహన విరామం లేకుండా రాత్రింబవళ్ళు నన్ను వూపి వూపి విశ్వంభరానికి, వినీలాంబరానికి మధ్య ఒక విశ్వాంతరాల విమోహన వియద్గంగా

సంగాతం శత బాహువుల్ని చాపి లయింపచేసుకున్న వివశత్వం నన్నింకా వదలలేదు

'అగ్నిగర్భ' రచనకు ఈ అంతర్వాణిని ప్రోత్సహించిన నేను శిలా యజ్ఞానికి సకల విఘ్నాలూ కలిగించాను. తన మనసు తల్లడిల్లకుండా వుండాలన్నది మాత్రమే నా దృష్టి. అతని సాహితీ సమారాధనకు హారతి ఎత్తిన ఈ చేతితోనే ఆ కళామహసంశను, వరయురిని, యాగవహ్నిని అంతరింపచెయ్యాలనుకోవడం దారుణం కాదు—దైన్యం! కళను కౌగిలించుకుని గుండెను కాల్చుకోవడమే అతనికి ఫలితంగా మిగులుతున్నపుడు అతని సాహితీ సామ్రాజ్యాన్ని కొల్లగొట్టి ఆ స్థానంలో ఒక నిర్లిప్తతను, మరో నిర్వేదాన్ని, నిర్వికార నిరామయాల్ని నియమించి పాలించడమే శరణ్యమనుకున్న దుర్దశ అది! అశాంతికారకమైన అతని సహజ కళల్ని మరపించే మహత్కృశను నా దగ్గర నేనే అభ్యసించానని చెప్పడానికి తలదించుకోవలసింది నేను కాదు—నిర్వీర్యమైపోయిన సమాజం.

రచయిత ఆశయాలు, వేద సంస్కృతిపట్ల వున్న గౌరవాదరాలు, శాస్త్రీయమైన అవగాహన, పదబంధనా పాటవం కలబోసిన మహావర్ణనా వైశ్వదేవం 'అగ్నిగర్భ' కావ్యం. దీనిమీద ఎన్నో ఆశలు నిలుపుకుని, సామాజిక అంతశ్చేతనకు అనుదారణ నివ్వాలనుకున్న రచయితకు కనీసం దానిని సీరియలైజ్ చేయించడమే సాధ్యం కాలేదు. రచనా పద్ధతి విషయంలో కానీ, రాజీపడే విషయంలో కానీ రెండవ మార్గం పట్టని నైష్ఠికత, ప్రయోజనకరమైన ప్రక్రియను పదిమందికి ప్రకాశమానం చెయ్యాలనే గాఢత—ఈ రెంటి రాపిడి మధ్య ఎంత పరితాపమో, నిద్ర రాని ఒంటరి నిశ్శబ్ద వేదన ఎంత శాపమో రచయితలో నేను చూశాను.

దివిర్లోకాల నుంచి దూకే కావ్యప్రవాహాలను అభినవ భగీరథుడిలా అందుకుని, ఏదో అపస్మారక స్థితిలో ఎన్నో రాత్రింబవళ్ళు వాటిని వరసక

రించి సారాన్ని అందించే ప్రయత్నంలో అతని తపన ఎంతో, యాతన ఎంతో నాకు తెలుసు. ఎంతెంతో ప్రతిస్పందన లభించవలసిన ఇంత సాధనకు—నీచ రాజకీయం చేస్తూ ప్రజలను చౌకబారు సాహిత్యానికి అలవాటు చేసిన పత్రికలు, లోతైన లావణ్యాలను, బలితమైన భావాలను జీర్ణించుకోలేని నీరస తరాలు, విరసాంతరాలు కలిగిన దురదృష్టకర వాతావరణంలో ఈ సాహితీ సమాహితమూర్తికి కీర్తి కంటే ఆర్తి, అశ్రువు శేషిస్తున్నాయి. అందుకే శిలాయజ్ఞ రచనకు నేనే మొదటి అవరోధమయ్యాను.

సాహితీ విలువల్ని ప్రలోభాలకు ఆహుతి చేసి, రచయితలు కారుచౌకగా అమ్ముడుపోతున్న ఈ దేశంలో, లలిత దళిత భావాలు తిరువారావాలు ఆత్మాహుతిని ఆశ్రయించిన క్లేశంలో—ఏదో అనర్గళ ఆవేశం, ఒక అతిరేక అభినివేశం, అభిమంత్రణం, అంజలి, అంతర్యాగం, అంతర్ముఖత్వం ఈ యజ్ఞానికి సంభారాలయ్యాయి. శిలాయజ్ఞం సాహితీ స్వర్ణయుగం. అవర్ణ్య జగానికి అదొక అనాయాస యానం.

ఈ నవల నఖశిఖ పర్యంతం చదివాక భావాక్షర వన్యాసం చెయ్యాలనుకున్నాను. దీనిముందు ఎవరు ఏమి రాసినా, ఎంత భాష దూకినా, ఎన్ని భావాలు సోకినా, ఎన్నెన్ని శిఖరాలకు ఎగబ్రాకినా వెలితి తీరదు. ఈ యజ్ఞాన్ని ఎందరు చేసినా ఈ వైభవం రాదు. శిలాయజ్ఞాన్ని నవాలు చేసే పదబంధాలు, భావనా మధువనాలు, వర్ణనా శిలాపాలు లేవు. మానవత్వానికి, దివ్యత్వానికి, నవ్యత్వానికి ఆదిప్రభవం శిలాయజ్ఞం.

శిలాయజ్ఞశాలకు భాష అంగణం. భావాలు సింహద్వారాలు యుక్తులు గవాక్షాలు. వర్ణనలు యూపాలు. మానవత్వం యజ్ఞవేది. పాత్రలు హోమద్రవ్యాలు. దివ్యాంతరాలు మంత్రోచ్చారణా స్వరాలు యజ్ఞఫలం ప్రేమాపాదనం, ప్రణయారాధనం.

అరణ్య ప్రాంగణాల్లో అతీంద్రియ అతిథి అడుగుపెట్టినా, అరకు లోయల్లో ఒక సురలోక సురభిళం వెలరేగినా, వెన్నెల ఏనాదాల్లో ఓ ఏకాంత గళయుగళం గుండెల్ని హత్తుకున్నా, శీతకిరణ శీకర శిలోచ్ఛయాల మీద యామిని ఆమని యాతనపడుతున్నా, పరిగంధపు ఛాయల్లో సోమధారా స్రోతస్విని సికతాల మీదకు ఆకాశ శరాసనాల నుంచి సౌదామనులు దిగి వచ్చినా అక్కడ అగ్నిగర్భం విచ్చుకుంటుంది. అది శిలాయజ్ఞానికి వదనమవుతుంది.

ఇలా ఎంత సాగినా ఈ శిలామధూళి రేగుతూనే వుంటుంది. ఎంత తరచినా ఈ 'శిల్పస్వప్న' వ్యూరాళి తీగ సాగుతూనే వుంటుంది. ఎంత ఆస్వాదించినా ఈ కళా మధుభాండం స్రవిస్తూనే వుంటుంది.

ఈ రచయితకు రచనా వ్యాసంగం వ్యసనం కాదు. తను నమ్మిన సత్యాన్ని గురించి, చూసిన సాక్షాత్కారాన్ని గురించి, స్వానుభవం చెప్పిన సౌజన్యం గురించి, సహజ సౌశీల్యం గురించి రాస్తే అది శిలాయజ్ఞమైంది. ఇందులోని సౌరాఖ్యుని వ్యక్తిత్వ ప్రభ, ప్రాజ్ఞత, సర్వజ్ఞత, రసజ్ఞత, గంభీరత, తాత్త్విక సాత్త్వికతలకు రేఖాకృతి ఇస్తే ఆ రూపం రచయిత అంతర సారశీలం. రచయిత ఈ పాత్రలో మెస్మరిజాన్ని చొప్పించారు. సౌరాఖ్యుడు నన్ను వశీకరించుకున్నంత గాఢంగా సాహిత్యంలో ఏ పాత్ర ఆకట్టుకోలేదు. నా మనసెందుకో సౌరాఖ్యుడికి, ఈ శిలాయజ్ఞ రచనా సౌరాఖ్యుడికి అభేదాన్నే చూస్తుంది. సౌరాఖ్యుడి మాటలో, చూపుల తీరులో, వ్యక్తిత్వంలో, రాసిక్యంలో, ప్రతి కదలికలో నాకు రచయిత కనిపించి, ఆహ్లాదపు ఝరులు కురిపించి, కదిలించి, కమలాప్తుడై వెలిగిపోతారు.

రచయితది కమర్షియల్ స్టైల్ కాదు. లోక వ్యవహార సంస్కారణ లాలస. నిజమే—విశేషవర్గాన్ని మాత్రమే ఈ రచన రంజింపజేస్తుంది. మిగిలినవారి మాటేమిటి? వెలకట్టలేని తన వైదుష్యాన్ని వెలార్చడమే

జతగాని విధానం కాదు. పాఠకుల స్థాయికి తను అవనతం కావడం కంటే—జనవాదికి తన కవితావాటిని శోధించి, ఏది సత్యమో ఏది సత్వమో ఆ గాదిలో వారిని నిలపడానికి, సాహితీ దాడి జరపడానికి, వారిని తన స్థాయికి సమీకరించడానికి రచయిత సమాయత్తమయ్యాడు. సమాజాన్ని ఎడ్యుకేట్ చెయ్యాలన్న అతని ప్రయత్నం ఎంతవరకు సాధ్యమో కాలం చెప్పాలి.

శిలాయజ్ఞం అల్పులు చదివి ఆకళింపు చేసుకోగలిగేది కాదు. అర్థం లేని ఆచారాల నిర్బంధంలో మగ్గేవాళ్ళు, కట్టుబడులతో, మొక్కుబడులతో, పెట్టుబడులుగా మారినవాళ్ళు, పరిధులను ప్రలోభాలను అధిగమించలేనివాళ్ళు శిలాయజ్ఞం ముందు నిలబడలేరు. సంస్కారం మాత్రమే శిలాయజ్ఞ గాన వాల్ని చదవగలదు. కళాహృదయం మాత్రమే శిలాయజ్ఞ కలశాల్ని కళ్లెత్తి చూడగలదు. ప్రేమౌన్నత్యం మాత్రమే శిలాయజ్ఞ సిందూరాన్ని శిరసు కెత్తుకోగలదు. అనుభూతించడం తెలిసిన జీవనాడి మాత్రమే శిలాయజ్ఞ సారాన్ని ఆస్వాదించగలదు. ప్రగాఢమైన చెలిమి మాత్రమే శిలాయజ్ఞ కుడి హస్తాల్ని స్పృశించగలదు. ఒక అలౌకిక స్ఫూర్తి మాత్రమే శిలా యజ్ఞ లోకంలోకి అడుగుపెట్టగలదు. ఒక దివ్యాంశ మాత్రమే శిలాయజ్ఞో ద్దీపనాన్ని సంపూర్ణంగా దర్శించగలదు.

'అగ్నిగర్భ' కానీ, 'శిలాయజ్ఞం' కానీ రచయిత ఊహాజనితాలు కావు. ధ్యానధామంలో నుంచి ఈ నైష్ఠికుడు ధాత్రిని దర్శించాడు. గత జన్మల సంస్కార ధావళ్యం నుంచి ఈ సేవగాల్ని నైవేద్యంగా తెచ్చారు. ఏ రచనకైనా బ్రహ్మసృష్టి ఆలంబనైనప్పటికీ, ఈ కవితా సోమయాజి దృష్టి అద్వితీయం. గీర్వాణుడి సృష్టిలో గుండాటవా లెన్నో! సర్వేశ్వరుడి సంకల్ప శిలా సంపుటా లన్నీ ఈ శాణికుడి చేతిలో శాతకుంభ శిల్పా లయ్యాయి.

జీవిత పోరాటంలో సొమ్మసిల్లుతున్నవారికి శిలాయజ్ఞం సర్వాంగ సుందరమైన స్వప్నాలు. 'అగ్నిగర్భ'లో ఫలించని ప్రణయం 'శిలాయజ్ఞం'లో సార్వభౌమత్వాన్ని పొంది జ్వలిస్తుంది. భాష, శైలి, ప్రతిభా పాటవాల పరంగా చూస్తే 'అగ్నిగర్భ' అబ్బురపాటును కలిగిస్తుంది. 'శిలాయజ్ఞ' శైలి స్పందనా శతానంద శస్త్రం. ఇందులోని రచయిత భావనా ప్రపంచం త్రిముఖ శాస్త్రం.

'అగ్నిగర్భ' ప్రేమ సామ్రాజ్యమైతే, 'శిలాయజ్ఞం' శృంగారజీవ ధనాగారం. అదొక పారలౌకిక ప్రణయ పాతువనం. ప్రేమ తనొక్కడికే తెలుసని రచయిత 'అగ్నిగర్భ'లో చెప్పుతున్న మాట ప్రత్యక్షర సత్యం. అందుకు సజీవసాక్షిని నేను. ఏ విధమైన అనుబంధమైనా సరే—ఒక వ్యక్తిని మరో వ్యక్తి గానీ, ఒక అతీతశక్తిని ఏ యతి నియతి గానీ ప్రేమించలేని, ఆరాధించలేని, అర్చించలేని ఒక అవ్యక్త ఆశ్చర్య చాలన లాలనం అది. అతనితో స్నేహం కైలాసం. అతనికి చేసే ఉపచారం కైంకర్యం. అతనితో ఏకాంత సాహచర్యం కైవల్యం. ఈ యాంత్రిక లోకంలో జడజీవ వృత్తికి అలవాటుపడిన జనతాళానికి అర్థంకాని జీవ లక్షణం అది. చేతన కోసం ఏ యాతననూ ఆహ్వానించలేని అమేధ్య స్పర్శకు అందని మృదుత్వం అది.

నేను ఇంతకాలంగా గమనిస్తున్నా. అతని స్నిగ్ధగళం సరికొత్తగా గమకిస్తూనే వుంది. ఎంత తరచి చూసినా ఆ ఔన్నత్యం ఉద్ధతి ఎంతో, ఆ ప్రేమగురికి గాంభీర్యం ఎంతో, ఆ వాత్సల్యపు ఝరికి అగాధపు ఆనవాలు ఎక్కడో, అతని ఆరాధనోపాసనలో ప్రణయగీతా పారాయణ పరాకాష్ఠ ఏమిటో ఎప్పటికీ అంతుపట్టని అమాయకత్వం నాది. అతని భావాలు, ఆలోచనా విధానం, ప్రవర్తనా ధోరణి—ఎక్కడో మోహరించిన అలౌకిక

పశ్చాత్తాపపు గుత్తుల్లో, మనీషపు మత్తుల్లో, నాకూ అందని మౌనాల ఎత్తుల్లో వుంటాయి. అపరి సుకుమార సుధాకరుడు ఈ సంకుచిత సమాజంలో ఎలా ఇమిడివున్నాడో, ఇంత ఎదిగిన ఈ ఆధునిక కవితాయోధుడు ఇరుకు తరాల, కటువు వ్యవాల మధ్య ఎలా ఒదిగివున్నాడో నాకూ ఎప్పుడూ అనూహ్యమే! చతుష్షష్టి కళలతో కరిగించే అతని స్నేహమాధుర్యాలు, కాలం తెలియని సంభాషణా సారళ్యాలు ఎంత ఆర్తినైనా ఆశానువాదం చేసే స్నిగ్ధాను నయాలు, వైరస్యం లేని వివశత్వాలు, వైముఖ్యం తెలియని అపేక్షలు— ఓహో అతనొక యక్షలోక కావ్యం—విద్యాధరుల ప్రేమ సామవేదం— యోగశక్తితో, ఆధ్యాత్మిక అవగాహనతో ప్రేమసాధన చేస్తున్న సురసీమల మత గ్రంథం!

జీవిత పోరాట మహాకావ్యంలో క్షాపించడానికైనా ప్రమితం లేని చరిత్రతో ఒక్కొక్కసారి నేను చూపే నిరాదరణను నజరానాగా, వాక్పారు ష్యాన్ని నిఘంటువులా, నిందల్ని నిగమాలుగా, నేను నిర్వేదంతో విలువలు విస్మరించిన వేళల్లో నా అజ్ఞానాన్ని ఆహితాగ్నిగా, నేను పెట్టే అశాంతిని ఆయుర్వేదంగా స్వీకరించి, ఆప్యాయంగా ఆమోదించి ఆశీర్వదించే ఈ ప్రేమాతిశయుడికి, ప్రేమ యాజ్ఞికుడికి, తరళ తథాగతుడికి నేనే మివ్వ గలను? ఇన్ని ఒత్తిడుల మధ్య, వికల్పాల మధ్య ఈ సాహితీ వస్త్రాత్వుడికి ఏ స్యందనాంజలులు సమర్పించగలను? ఈ దివ్యపురుషుడికి ఏ సురలోకాల నిక్కడ స్థాపించగలను?

ఆర్భాటం తప్ప ఆర్ద్రత తెలియని అతివాదులు, అట్టహాసాలు తప్ప దరహాసం నేర్వని దాంభికులు, అజ్ఞత తప్ప విజ్ఞతలేని అనుజీవులు, ఆశ తప్ప ఆసక్తిలేని అర్భకులు, కీర్తి కండూతి తప్ప కౌశలం లేని కవిష్ఠులు, అతిశయం తప్ప అణకువలేని అనర్హులు, పేరు వినా పాండిత్యలేని షగటిపేష

గాళ్ళు, మాత్సర్యంతో ప్రతిభా ప్రావీణ్యాల్ని పరిణతిని పరాభవించే పాశవికులు, కర్కశత్వానికి నాగరిక వేషధారణవేసి ఆదే కళ అని చాటుకుంటూ వాతావరణ కాలుష్యాన్ని సృష్టించే కిమ్మీరులు, అన్నిటికీ వెలకట్టి వెళ్లార్పే ఉన్మత్తులు — తిరుగాడుతున్న సమాజంలో, అతిథిగా అడుగుపెట్టిన ఈ ఊర్ధ్వ గ్రహాంతరవాసి ఎంత తల్లడిల్లుతున్నాడో ఎవరికి తెలుసు? ఎంత అగ్నికల్లోలానికి గురవుతున్నాడో, ఎంత దుర్భర వేదనను దిగమ్రింగుతున్నాడో ఎవరికి కావాలి? ఇన్ని దారుణ మనస్తత్వాల మధ్య, అమానవ గుణాల మధ్య, అసూయాగణాల మధ్య, శాపగ్రస్త క్షణాల మధ్య సత్త్వ తత్త్వ మహత్త్వ సాధన చేస్తూ, నిర్భరవేదనలో ఎంతో మనోనిబ్బరంతో, ధీమసంతో జనతామనహరణానికి పూనుకుని ఈ రెండు కావ్యరథాలను సంకల్పించి, శిల్పించి నిసర్గ స్వర్గద్వారాలను దాటించి ఈ విస్తృత విస్తార తీరాలకు దించిన దివ్యుడికి, హవ్య వహుడికి ఏ అందాల అరవిరి ప్రాణారవింద హారాల సత్కారాలు చేయగలను?

పేదరికం భౌతిక వాతావరణంలోనే తప్ప, అతని హృదయం — ఉషస్సులు, కవితా యశస్సులు, ఉద్వేగ సంభ్రమాలు, భావనాహ్లాదసుమాలు, విహార విలిరాగాల తేజసాలు, మేధోరాజసాలు కలబోసిన సాహితీ సువర్ణ శిఖరం.

వ్యక్తిగా తను నిలబడిన పునాదులకు అభివ్యక్తి ఇతని అక్షరశక్తి. అతని అక్షరశక్తికి ఉపనిషత్తులకున్న గాఢత వుంది. వేదాలకున్నంత ఉత్కర్ష వుంది. ప్రాచీదిశకు వున్నంత ఉత్తేజం వుంది. ప్రణవ ప్రభంజనం సంధించిన సహస్ర కుండలినుల సహవాసం వుంది. సత్యయుగం సంధిల్లే క్షణాల సాయుజ్యం వుంది.

సమాజం నుంచి ఏ సన్మానాలనూ ఆశించని ఈ సాహితీ గాంగేయుడికి, ఆత్మ ఉద్బోధానికి అద్దం పట్టడం తప్ప సంకుచిత జనాకర్షక

సూత్రాలు తెలియని ఈ ఆర్యపుత్రుడికి సర్వజనీన రత్నగర్భ 'అగ్నిగర్భ' రజతాద్రిమీద రత్నఖచిత సింహాసనం అయితే, సారస్వత గర్భం ఈ 'శిలాయజ్ఞం' కనక కుంభాభిషేకం!

సహచరుడై ప్రక్కనేవున్న ఈ గంధర్వుణ్ణి గురించి, గ్రహాంతర మిత్రుణ్ణి గురించి, సరస్వతీ పుత్రుణ్ణి గురించి పదిమందికి చెప్పగలిగిన ఈ అవకాశం నాకు ఆకాశమంత అపురూపమైంది. నా ఉత్కంఠ తప్ప ఇదీ ఈ ఉద్గాత కివ్వదగిన యోగ్యతాపత్రం కాదు. రచయిత ఆహ్వానం తప్ప, ఇది ఈ దివ్యకథానికి నేను పట్టగలిగిన అర్హతా ఛత్రమూకాదు. నేను ప్రాజ్ఞను అవలేకాను. ఈ కావ్యం ముందు డాక్టరేటు డిగ్రీలు తుచ్ఛమైనవి. ఈ పీఠిక వ్రాయడానికి నాకున్న అర్హత స్పందించే మనసే.

ఈ అభిజ్ఞుడు, సువిన్నితుడు, సురతుడు, సురూపుడు ఎన్నో కారణాల సాక్షిగా అనివార్యంగా ఈ దారుణ సమాజావరణాల్లోనే జీవిస్తున్నాడు. బ్రతుకు తెరువుకోసం భంగపడుతున్నాడు. అందరితోపాటు అతి సాధారణంగా నిలద్రొక్కుకోవడం కోసం అర్హతలుచాలని ఉద్యోగం చేస్తున్నాడు విలువ తెలియని మనుష్యుల మధ్య శిలువ సంఘాతంతో సాగిపోతున్నాడు. సాంద్రతలేని వాతావరణాన్ని శాపగ్రస్తుడిలా భరిస్తున్నాడు. శిథిల శకాల మీద వివర్ణ ఉదయాస్తమయాల్ని చూస్తూ వెలవెలబోతున్నాడు.

ఈ అభిజాతుడు ఎక్కడివాడో! ఏ అభీష్టం కోసం వచ్చాడో! ఏ మహాయాన మధ్యంలో ఇక్కడ విరామం తీసుకుంటున్నాడో! ఏ ఉషో కాంతులకోసం వేచివున్నాడో! ఇక్కడ జారవిడుచుకున్న ఏ దివ్య అభిజ్ఞానం కోసం అన్వేషిస్తున్నాడో! విస్మరించిన ఏ మంత్రాక్షర స్ఫూర్తికోసం మథనపడుతున్నాడో కదా! స్వీయ సమస్యా తరణం కోసమే కాకుండా దివ్య భావనా వితరణంతో క్షణకాలపు ఈ మజిలీలో తన ఉనికి చిహ్నాల నిక్కడ శాశ్వతంగా ప్రతిష్ఠించిన చరితార్థుడు ఈ కవితా పార్థుడు.

నాకోసం కేటాయించిన ఈ పుటల్లో నా అనుభూతిని వ్యక్తీకరించడానికి ఉదాత్తంగా సహకరించిన భాషలోని ఏ ఒక్క పదాన్నీ నేను అతిశయించి వాడుకోలేదు. అతన్ని రచయితగానే మీ ముందుంచడానికి ప్రయత్నించాను. కానీ ఈ చిన్న ప్రయత్నం అతన్ని ఇముడ్చుకోలేక వెలవెల బోతూనే వుంది. పాక్షిక ధోరణికి ఇక్కడ ఆస్కారమే లేదని రచన చదివిన సహృదయులకు సందేహాతీతంగా తెలుస్తుంది. ఇతను అందరివాడు. ఈ మహారచన అందరికోసం. ఈ రసదాడి అందరికోసం. ఈ భవ్య బ్రహ్మసవం అందరికోసం. శిలాయజ్ఞవాటికలో అడుగుపెడితే చాలు ఒక అలౌకిక ఆవాహన! దృష్టి సారిస్తేనే సృష్టిసాగే సప్తచైతన్య వర్ణనల వృష్టి! స్పందించే హృదయం వుంటే చాలు అన్నీ అప్రమాణపు విందులందించే చందన నందనవనాలే! సెన్సిటీ వుంటే, ఈ వనలలో ఎక్కడ చూసినా డెన్సిటీతో సాగే వన్నెవేగాలే!

సృష్టించిన క్షణంనుంచీ, ప్రకృతి ప్రతి జీవాన్నీ ఈ ప్రపంచం నుంచి తప్పించడానికి ప్రయత్నిస్తుంది. మరణ పర్వంలో ముందు వెనుకల క్రమంలో అందరూ స్వయంచలిస్తున్నవారే. అందరితోపాటు సాగుతున్నట్టు కనిపిస్తూనే ఇతను ఆ మహాపథంలో ఎప్పుడో ఎక్కడో ఆగి మరణాన్ని జయించే ఈ మహాక్రతువును చేసి సజీవ మోక్షసిద్ధిని పొందిన దివ్య వర జీవి—సాహితీ చిరంజీవి.

డా॥ వి. పార్వతీదేవి.

# స్ఫూర్తి - ఆర్తి

'మనస్సు లేనివాడివని తెలిసినా కవితాహృదయం వున్నవాడివని నమ్మి నీ దగ్గరకు వచ్చాను. అదేం దురదృష్టమో కానీ నేను దగ్గరయ్యాక ఆ వున్న కవిత్వం కూడా నీకు దూరమైంది' అని ఆమె ఒక తీక్ష్ణ నవ్వి పేశంలో రెండు కన్నీటి చుక్కల్ని రాల్చింది. ఆ కన్నీటి చుక్కల్లో ఒకటి నా మొదటి నవల 'అగ్నిగర్భ'గా ఆవిర్భవించింది. ఇంకొకటి నా రెండో నవల 'శిలాయజ్ఞం'గా రూపు దిద్దుకుంది.

'అగ్నిగర్భ'ను రాయడానికి మూడేళ్ళు తపసించాను.

'శిలాయజ్ఞం' చేయడానికి ఐదేళ్ళు దీక్ష వహించాను.

నా మొదటి నవల 'అగ్నిగర్భ'మీద శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగుశాఖ నుంచి ఒక పిహెచ్.డి సిద్ధాంత గ్రంథం కూడా వెలువడింది. ఈ రెండు నవలల్ని చదివాక 'ప్రేమ ప్రేమనే ప్రేమిస్తుంది' అనే విశ్వాసం ఆమెలో బలపడింది.

అగ్నిగర్భలో జరిగిన ప్రేమయజ్ఞానికి ఆహ్వానితులైన దేవతలు అగ్నిగృహ దర్భాస్తరణల మీద సూక్ష్మరూపాల్తో ఆసీనులయ్యారు. అదొక ఆవాహనం. అదొక దివ్యావతరణం.

అలా ఆ లోకాల కావలనుంచి అవతరించిన దివ్యశక్తులకు అందమైన ఆ వాసం కావాలి. ఆ దృష్టితోనే శిల్ప కళాత్మకమైన సాహితీ దేవాలయాన్నొకదాన్ని రూపొందించాలని ఈ శిలాయజ్ఞానికి ఉపక్రమించాను.

శిల్పులు సర్వహస్త కళాజీవనులకు ప్రతీకలాంటి వాళ్ళు. అన్ని చేతివృత్తులకు, అన్ని కళలకు శిల్పకళ పతాక లాంటిది. మానవమేధకు కళాత్మక పరాకాష్ఠ శిల్పం. ఆ శిల్పం ఏ కళకు చెందినదైనా కావచ్చు.

మనిషి జీవించడానికి యత్నించిననాడే శిల్పకళ ప్రారంభమైంది. వేటాడడానికి ఈటె చేసినవాడు శిల్పి. ఆటాడడానికి ఆయుధం చేసినవాడు శిల్పి. పుట్టినబిడ్డ బొడ్డు కోయడానికి చురిక చేసినవాడు శిల్పి. భుక్తి కోసం భూమిని దున్నడానికి గోదారణం (నాగలి) చెక్కినవాడు శిల్పి.

ఉండడానికి ఇల్లు, పూజించడానికి కల్లు (రాయి) నిల్పినవాడు శిల్పి. వీరగల్లులు, విజయగల్లులు నిల్పింది శిల్పులే. దుండగపు రాచతంత్రాలను చేదిన దండి మగల మగటిమికి గుర్తుగా మండల మధ్యంలోనో, గ్రామ పొలిమేరలోనో గెలుపు కంబాలు (విజయగల్లులు) నిలిపింది శిల్పులే. పోరులో జయిస్తే ఆ శూరుడి పేర విజయగల్లు పడుతుంది, రణంలో మరణిస్తే ఆ వీరుడి పేర వీరగల్లు పడుతుంది.

ఇక ఛాయాస్తంభాలు — అంటే స్మృతి చిహ్నాలు. రాజులు, రాణులు, మతగురువులు, ప్రవీణులైన వృత్తిపనులవాళ్ళు మరణిస్తే, వాళ్ళ స్మృతికి చిహ్నంగా ఈ ఛాయాస్తంభాలు వెలసేవి. మరణించిన వాళ్ళ ఛాయలు ఈ స్తంభాల్లో వుంటాయని వాళ్ళ నమ్మకం. ఆ శిలాస్తంభాల్ని శిల్పించవలసింది శిల్పే! ఈ రకమైన వీరగల్లుల, విజయగల్లుల కంటే ముందు క్రీ.శ. 3వ శతాబ్దం ప్రాంతం నుంచి ఛాయాస్తంభాల్ని శిల్పులు చెక్కుతున్నట్టు చరిత్ర చెబుతోంది.

లేఖ్యకరణం — అంటే శాసన రచన. భూమి పాలకుల, స్థితిపరుల దానధర్మాలను ఋజువుగా కాలాతీతంగా నిలిచిన శాశ్వత పత్రాలు ఈ శిలా శాసన ఫలకాలు. వీటిని చెక్కేదెవ్వరు? సంధి, విగ్రహి అనే రాజాధికారుల ముందు శిల్పి ఈ శాసనాల్ని చెక్కాలి. 'పాండులేఖ్యేన ఫలకే భూమౌవా ప్రథమం లిఖేత్.' శాసన రచనలో శిల్పులు అక్షరాల్ని ఒకేసారి శిలాఫలకాల మీదో, తామ్ర ఫలకాలమీదో చెక్కకూడదు. ప్రథమంగా సుద్దముక్కతో ఒక ఫలకంమీదో, మరే దానిమీదో రాసిచూసుకోవాలి. పై అధికారులు ఆ లిపిని

పరిష్కరించాలి. అప్పుడు ఆ విషయాన్ని కావలసినదానిమీదకు శాసనంగా ఎక్కిస్తారు. ఆ శాసనాలు శ్రీతో ప్రారంభం కావాలి—అన్నది నియమం.

నమ్మిక శాసనాలు—అంటే ప్రజలకు పలానా కష్టం ఇక రాదని రాజులు అభయమిస్తూ వేసిన శాసనాలు.

సమయకమ్మ శాసనాలు—అంటే వృత్తివనివారికి ఆ యా గ్రామాల ఆదాయ విభాగాల్ని గురించిన వివరాలు లిఖించిన దానశాసనాలు. శ్రీతో ప్రారంభమై స్వస్తి, సిద్ధిరస్తు అనే శుభాకాంక్షలతో ముగిసేలా శిల్పవరులు వీటిని చెక్కుతారు.

తాంత్రిక శాసనాలు—అంటే మంత్రాలు, యంత్రాలు రాళ్ళమీద చెక్కి ఊరి పొలిమేరల్లో నాటించినవి.

ఆత్మాహుతి ఫలకాలు—అంటే రాజుకు భృత్యులైన గరుడ, లెంక మొదలైనవాళ్ళు, రాజు బాధపడితే తమ శరీరాల్ని హింసించుకుంటారు. రాజు మరణిస్తే వీళ్ళు మరణిస్తారు. ఇవి వీళ్ళకు సంబంధించిన ఫలకాలు, ప్రతిమలు ప్రార్థనా శ్లోకాలు—ఇలా ఒక్కటేమిటి అనాది మానవ జీవితానికి సంబంధించిన ఆర్థిక, సాంఘిక, రాజకీయ సన్నివేశాల్లో సంఘటనల్లో శిల్పులు ముఖ్యపాత్ర వహిస్తున్నారు.

యాజ్ఞవల్క్య స్మృతిలో శిల్పులు చెక్కే శాసనాలు ఎలా వుండాలో పేర్కొన్నారు.

> 'దత్త్వా భూమిం నిబంధం వా కృత్వా లేఖ్యంతు కారయేత్
> ఆగామి భద్రనృపతి పరిజ్ఞానాయా పార్థివః'

శాసనాన్ని చెక్కే శిల్పులు—రాజులు దానం చేస్తున్న ఆ భూపరిమాణాన్ని, దాని ఎల్లల్ని, కాలాన్ని రాజు హస్తాక్షరితోపాటు శాసనంలో పొందుపరచే జాగ్రత్తలు తీసుకోవాలి అని సూచించబడి వుంది.

కేవలం ఆలయ నిర్మాణాలకే కాకుండా పైన పేర్కొన్న జీవిత ఘట్టాల్లో శిల్పులు తమ వంతు కర్తవ్యాల్ని నిర్వహిస్తూనే వస్తున్నారు. పై పనుల్లో నిమగ్నమైన శిల్పికి నైపుణ్యంతో పని లేకపోవచ్చుగానీ ఆలయ శిల్పకళ దగ్గరకు వచ్చేకొద్దీ శిల్పికళాతపస్వి కావలసి వుంది.

శిల్పి చేతిలోని నైపుణ్యం శిలను ఒక సన్న పనికి సంధిస్తున్నపుడు ఆ శిల ఒక వాద్యమవుతుంది. శిల్పి తానే కళగా మారి ఉలి ద్వారా శిలలోకి ప్రవహిస్తాడు. అలాగే రూపుదిద్దుకుంటున్న శిల్పం కూడా శిల్పిలోకి ప్రవసరి స్తుంది. అలా తాదాత్మ్యం చెందినపుడు శిల్పకళ పరాకాష్ఠ నందుకుంటుంది.

సంగీతంలోని ఆరోహణ శిల్పంలో అంచులు తేల్చడం అవుతుంది. సంగీతంలోని అవరోహణ శిల్పానికి లోతులు నొక్కడంలో వ్యక్తమవు తుంది.

శిల్పి భంగిమల్లో నాట్యవేదం కూడా దాగివుంది. నాట్యం చిత్రకళని గర్భీకరించుకుంది. సాహిత్యం సర్వకళల సమాహారం. అలాంటి సూక్ష్మ రూపానికి శిల్పం స్థూలరూపం. శిల్పి మౌనశిల్ప సాహిత్యస్రష్ట. శిలను తొలచడంలో శిల్పి పాటించే నియతే యతి. ఉలి మలిచే యాసే ప్రాస. రూపొందుతున్న శిలారూపమే రూపకాలంకారం. లీలగా ఏర్పడిన శిల్పం యొక్క సంధుల్ని విడగొట్టి చేసే విడదొలుపు పనే సాహితీ సమాస వివ్యాసం అవుతుంది.

ఒక శిలలో రెండు శిల్పాలు ద్యోతకం కావడం శిల్పశ్లేష. శిల్పానికి చేసే సొపుపని, కవి తన కావ్యానికి అక్షరుమారు ఏర్పరచే పక్షరక్షర సంయోగ ప్వర్శతో సమానమవుతుంది. శిల్పానికి శిల్పి తెచ్చే తీరికలు, జీవ రేఖలు కావ్యానికి కవి సమకూర్చే అలంకారాలు అవుతాయి. దార్శనిక దృష్టికి ప్రతికళా సర్వకళల సమాహార మవుతుంది.

శిల్పం పాషాణ కళ. ప్రాచీన కళ. అలా శిలాత్మక పదార్థంలోకి కళాత్మక యథార్థాన్ని చొప్పించడం శిల్పం. అది శిల్పులు సృష్టించే మరో ప్రపంచం.

నాట్యంలోని గతిశీల భంగిమ, శిల్పకళలో స్థిరశీల భంగిమతో ఒక క్షణం నిలిచి శిల్పమవుతుంది. కొన్ని సమయాల్లో శిల్పాన్ని పువురెమ్మ కన్నా సున్నితంగా, పూరేకు కన్నా మెత్తగా చూసుకోవాలి శిల్పి.

శిల్ప సౌందర్యం బహుముఖ కోణాల్లో ఆ శిల్పం చుట్టూ పరిభ్రమిస్తూ వుంటుంది. శిల్పికి అనంతకోణాల నుంచి శిల్పం విన్యసిస్తూ సాక్షాత్కరిస్తుంది.

ఒక ఆత్మ—తల్లి గర్భంలో తాను శిశురూపాన్ని ధరించడానికి ముందు అది తన తండ్రి కాబోతున్న వ్యక్తి తలచుట్టూ మూడు నెలలపాటు పరిభ్రమిస్తూ తనకు కావలసిన సంస్కార శక్తుల్ని సంగ్రహించుకుంటుంది. అలాగా ఒక శిల్పరూపం శిలమీద నిలవడానికి ముందు అది శిల్పిచుట్టూ మండలం కట్టి సహవాసం నెరపుతుంది. శిల్పి తనపైన మోపిన బరువు బాధ్యతల్ని అభయంతోపాటు శిల్పాలన్నీ శతాబ్దాల కొద్దీ శిరసావహించి శిల్పి బ్రహ్మమీది గౌరవాన్ని ప్రకటిస్తూ వుంటాయి.

ఎవరి ఎదలో ఏ రకమైన భావజాలం వృద్ధి చెందుతుందో వారు భౌతికకాయాన్ని వదలివేసిన తర్వాత వారి ఆత్మ చుట్టూ ఆ రకమైన భావాలు, సంస్కారాలు, వాసనలు స్థూలరూపాల్లో కొలువు తీరుతాయి. దీని ప్రకారం—దుష్టసంస్కారాల్ని పెంపొందించుకున్నవారి ఆత్మ చుట్టూ భయంకరమైన వాతావరణం చోటు చేసుకుంటుంది. అదే నరకం. అందమైన ఆలోచనల్ని అభివృద్ధి చేసుకున్నవారి ఆత్మచుట్టూ సుందర జగత్తు రూపొందుతుంది. అదే స్వర్గం. ఇది ఋషివాక్కు.

మానవుడు జీవయాత్ర ముగించిన తర్వాత వాడి ఆత్మచుట్టూ ఇలా ఏర్పడవలసిన దివ్యమైన వాతావరణం కళల ద్వారా అతడికి సంక్రమిస్తుంది. ముఖ్యంగా ఆలయకళ పామరజనాన్ని ఆకర్షించి వాళ్ళ హృదయాల్ని ఆనందోన్ముఖం చేస్తుంది.

కళాకారుడు స్వర్గ ప్రతినిధి. వాడు యోగి. వాణ్ణి నిరుపయోగి అనుకునే వారిని చూసి జాలిపడాలి — అంతే.

దేవతలు ఉషస్సులతో సంబోధించుకుంటారు. ప్రకృతి అందాలతో సంభాషించుకుంటారు. రంగులతో ఆలింగనాలు చేసుకుంటారు. మెరుపులతో మిళనక్రీడ లాడుకుంటారు. దేవతలది బంగారు రంగులు ఒలికే వర్ణబాహుళ్య భాష. దేవత సూక్ష్మంగా ఒక దివ్యభావ ప్రతీక. అలాంటి దేవతల విడిది గృహాలే ఆలయాలు.

స్థూల ప్రపంచం నుంచి సూక్ష్మమండలాలకు తీసుకుని వెళ్ళేవే కళలు. వాటితో మన మానసిక మండలాలు విచ్చుకుంటాయి. మనిషి వాంఛా మండలాలు, నాడీకేంద్రాలు విరబూసిన గవాక్షాలవుతాయి. దీనితో అతనికి ఆధిభౌతిక, ఆధ్యాత్మిక లోకాల దివ్యసౌందర్యాలు సునాయాసంగా దర్శనమిస్తాయి. ఈ బృహత్కార్యానికి సహాయకారులు కళలే.

మానసాలు నిష్కల్మషంగా వున్నప్పుడు కాంతి తరంగాలుగానో, మౌన తరంగాలుగానో మనల్ని కలవడానికి గగన మండలాల్లో ఎన్నో దివ్యాత్మలు తపనపడుతుంటాయి.

దివ్యకళారూప దీపాలతో కళాకారులు, శాస్త్రవేత్తలు శారీరక ధర్మాల నుంచి మనిషికి ఆత్మికధర్మాలవేపుకు దారి చూపుతున్నారు. ఆ ప్రయత్నంలోనే శిల్పులు తమ శిల్పకల్పనతో దేవాలయాల్ని నిర్మిస్తున్నారు. ఈ శిల్పుల కళా కల్పనను విప్పడానికి ప్రేమగాథాగర్భ సందర్భ సాహితీ దర్భాస్తరణను పరచి భూమిపూజ ప్రారంభించాము.

లౌకిక వ్యాపారాల్లో పాల్గొంటూనే అలౌకిక భావజగత్తును అందుకోవడానికి ప్రతి నిముషం వినూత్న యాతన ననుభవించాను. శ్వాసతోనే పరిసరాల్ని కలుషితం చేసే మనుష్యులు మసలుతున్న సమాజంలో, భయంకరమైన రాక్షస మానసాలకు అందమైన తొడుగులు వేసుకుని తిరిగే మారువేషాల మోసగాళ్ళు నడయాడే సంఘంలో, యౌవనంలోనే ఎముకలు కుళ్ళిన కంకాళాల్ని మోస్తూన్న యువత నడయాడే సముదాయంలో, మూనాళ్ళ తిరునాళ్ళలాంటి జీవితంలో అహంకార వికారాలు చావని వృద్ధుల్ని, కళ్ళలో కాంతులు పోగొట్టుకున్న జనాభాను చూస్తూ, క్రూరంగా జీవితం విసిరేసిన పిలుపులుడిగిన శిలువను మోస్తున్నా, ఇలాంటి కావ్యాల్ని రాస్తూన్నా! ఎందుకు?

నా రచనల్లో ఇన్ని కాగితాలు కదిపిన వాళ్ళ మతిలోకి పిడికెడు కొత్త పదాలు చేరాలని, నాలుగు పుటలు పఠించినవాళ్ళ మదిలో చేరెడు మెత్తటి భావాలు ఊరాలనే రాస్తున్నా. సుందర భావధేనువులు మేతలు మేసే నందనవన సానువుల్లో సమాసాలా వేణుస్వనాల వానలు కురిపిస్తున్న వెన్నెల గుడి పొన్నతోటల్లోకి అలా పాఠకులు విహరించాలనే రాస్తున్నా. జారుడు మెట్ల లాంటి రచనలమీద అనాయాసంగా దిగజారడంకంటే, ఎంత కష్టమైనా ఏడుకొండల్ని ఎక్కి దిగితే పాఠకుడి కంఠకి గుండెకి ఇంత పటుత్వం ప్రాప్తిస్తుంది కదా అనే రాస్తున్నా.

ఒక్కో పదచిత్రం కోసం, ఒక్కో భావచిత్రం కోసం, ఒక్కో వాక్యనిర్మితి కోసం మేధస్సును హవిస్సు చేసుకున్నా ఏ శిలాయజ్ఞంలో! అనుభూతి తీవ్రతతో రాత్రుళ్ళలో నిద్రరాక పలవరించాను. ఎన్ని చుక్కల రాత్రులు మైనపు చుక్కల్లా రాలిపోలేదు! రుచులకు, రంగులకు, రాగాలకు దూరంగా ఋషిలా కృషించి ఏ లోకాలలోనో విహరిస్తూ నా వారందరినీ ఎన్నిమార్లు నిరాదరణకు గురిచేసి ఇంటికి కంటతడి తెప్పించలేదు! ఈ

కళాత్మక సృజనేచ్ఛకి నేను నమిదనై పోతున్నానన్న వేదనతో ఆమె ఈలా యజ్ఞానికి మొదట నన్ను ప్రోత్సహించలేదు.

గగనతలాలు వంచి ఒక ఉత్తమకావ్యం ఎవడి చేతి ఒడుపుకో ఏ దివ్య మహూర్తంలోనో భూమిపైకి రాలడం ఒక గగనమైపోతుంది. అలాంటి పని ఒకడు చేశాడే అనుకుందాం—ఇక వాడిమీదకు ఈర్ష్యాసూయలతో దాడికి దిగే వర్గం ఎప్పుడూ కాచుకుని వుంటుంది. గుణదోషాల్ని న(మ) హృదయంతో ఎత్తి చూపే సంస్కారులూ వున్నారనుకోండి—ఆ సంఖ్య అతితక్కువ.

ఏ ఉత్తముడో ఒక కావ్యానికి ఇంత గౌరవం కల్పించాలను కుంటాడు. మరో అధముడు ఆ కావ్యాన్ని చదవకనే ఈ టెలాంటి కలాన్ని తీసుకుని సున్నితులైన కవుల కలల్లోకి చొరబడి భైరవనృత్యం చేస్తాడు. ఇంకో మిధ్యా విద్యాధిక యువకుడు వాలుగేళ్ళయినా నవల చదవడు. మరీ విలదీస్తే 'నాకు ఆ నవల చదవడం ఒకటేనా పని చెప్పండి!' అంటూ తెచ్చిపెట్టుకున్న గొప్పను ప్రదర్శిస్తాడు. పక్షపాత వాతోద్ధూతతూలికల్లా ఎగిరి వచ్చి గురుపీఠాల మీదపడి అతితేలికగా వేలాడుతూన్న వ్యక్తులున్న ఉన్నత విద్యాలయాల నుంచి వినిపించే ధ్వనులు, కనిపించే దృశ్యాలు ఏ కవిచేతా కవితీకరించే క్రైంను మరోసారి చేయనివ్వవు. కానీ వీళ్ళ మాటల రూట్ తెలిసినవాడికి ఆత్మస్థైర్యం పెరిగి తీరుతుంది.

మరొకడు కావ్యాన్ని చదివి, లోలోపల ఆశ్చర్యంతో తలమునక లవుతూనే పైకి మాత్రం ఏదో అన్యమనస్కంగానో, అర్ధమనస్కంగానో బాగానే వుంది అంటాడు. ఇంకో సంపాతకుడు గొప్పగా రచనను పొగుడు తాడు. క్రైం, సెక్సు నవలల మీద టీవీలో విరుచుకుపడతాడు. వైవిధ్య మున్న రచనలు కనిపిస్తే కావలించుకునేలా కనబడతాడు. ఆహా! జ్ఞానోదయ మైన సంపాదక గౌతముడనుకుని దగ్గరి కెళితే—'మీరు కమర్షియల్‌గా

రాయడానికి ప్రయత్నించండి' అంటూ భయంకరమైన వాగ్బాంబును విసురుతారు.

ఇంకో పండితమ్మన్యుడు ప్రక్కవాడితో—'ఇతని నవల చదివాను. ఉండబట్టలేక అందులో చక్కని కవిత్వం వుందన్నాననుకోండి' అంటూ తాను తెలియక చేసిన పాపానికి ప్రాయశ్చిత్తాన్ని చేసుకుంటాడు. అన్యోదొకడు వేదాంతదేశిక ప్రభువులా నిరంతరం వేదాలు, ఉపనిషత్తులు అంటూ ఊదరగొడుతుంటాడు. ఇది అలాంటి రచనే కదా అని, చదవమని ఇస్తే 'మొన్న అర్ధరాత్రి కొన్ని పుటలు చదివాను. అంతా చదివి చెప్తాను' అంటూ ఏదేళ్ళయినా చదవడు. ఇంకొందరుంటారు—ఒక కావ్యాన్ని చదవడానికి అలాంటి సంస్కారవంతమైన రక్తమే తమలో లేదని తెలుసుకోకుండా—డిగ్రీలున్నాయి కదా అని ఆ కావ్యాన్ని ప్రశంసించేవారితోనే వాదనకు దిగుతారు. ఇంకొకడు సాహితీ దౌష్ట్యంతో అర్ధమైన గద్దె సంపాదించుకుని కులుకుతూ, పాఠకుల్ని అధోగతిపాలు చేస్తూ, ఆరోగ్య వర్ధక ఔషధాల్లాంటి రచనల్ని చూసి ఇలా రాయడం సులభం, చెత్తగా రాయడమే కష్టం అంటూ ఆత్మవంచనకు అలవాటుపడి పరవంచనకు ప్రయత్నిస్తారు. బయట ప్రపంచానికి కనిపించకుండా చీకటి తప్పులా రాస్తుంటాడు.

సాహితీ శిఖరాల్ని అధిరోహించినవారు, కవితా సామ్రాజ్య మకుటధారులు, ఆచార్య పీఠాధిపతు లెందరో నా రచనను నిరుపమానంగా ప్రశంసించారు. వారికి సదా నా కృతజ్ఞతాభివందనాలు. ఒక కవో, రచయితో ఒక కొత్త నేరం చేస్తే, ఒక ప్రయోగం చేస్తే—దాన్ని అసూయాగ్రస్తులై చూసే జనాభా గలాటాను గురించే నేను చెప్పింది. అందరూ నా రచనల్ని ప్రశంసించాలని కాదు. భూమిమీద ఏ రచనా సర్వజనామోదం కాలేదు, ఎదుటివాడి ముఖం చూస్తే వాడి ఏడుపేంటో తెలిసిపోతుంది కదా!

కనిపించిన వాటిని గురించే, మన పంచేంద్రియాలకందిన వాటిని గురించే ఎల్లకాలమూ రాయాలనుకుంటే ఆ సాహితీ పరిధి, ప్రజ్ఞ తగ్గుముఖం పడతాయి. మానవ మేధాశక్తి ఉడిగిపోతుంది. ప్రగతి అధోగతికి చేరుతుంది. కనిపించేదాన్నే తెలుసుకుంటూ కూర్చుంటే భూమ్యాకర్షణ శక్తిని గురించి, ఇతర ఖగోళ సుదూర విషయాల్ని గురించి ఆలోచించే దెవరు? అలౌకిక భావనను ఆధారం చేసుకోకపోతే భౌతికశాస్త్రం కూడా పురోగమించదు మరి! భౌతిక, ఆధ్యాత్మిక శక్తులతోపాటు విశ్వంలో వున్న ఎన్నో రహస్యాల్ని మనిషి ఛేదించాల్సి వుంది.

మరి ఆకలి, అణచివేత, అగచాట్లు ఇలాంటి యథార్థ ఇతివృత్తాల కథేంటి? అని ప్రశ్న. వాటిని రాయకూడదని కాదు. అందరు రచయితలూ వాటిని గురించే రాయాలా? అని ఎదురు ప్రశ్న. మనిషి అవసరాలు రాయడం ద్వారానే తీరేటట్లయితే అందరం అహర్నిశలూ అదేపని చేద్దాం. సోదర రచయిత లెందరో ఆ పనిమీదే వున్నారు. వాళ్ళు నవసమాజ నిర్మాణం చేసేశాక అప్పటికప్పుడు మనిషికి సున్నితమైన, ఉన్నతమైన గుణాల్ని చొప్పించాలంటే వీలుపడదు. ప్రేమభావనను, సౌందర్య దృష్టిని మనిషికి ఒక్కసారిగా అలవరచాలంటే కష్టసాధ్యం అవుతుంది. ఒక శాతం రచయితలు ఈ Social animals కు అలా సౌందర్యసీమల కోమల భావాల్ని కూడా మేపడం అత్యవసరం అని నాలాంటివాళ్ళ భావం.

ఇప్పుడొస్తున్న రచనల్లో చాలాభాగం, మనల్ని మనదేశ వాతావరణం నుంచి దూరంగా లాగిపడవేసి మన నెత్తిన ఏ విదేశీ సంస్కృతినో కామక్రోధ హింసారస సమ్మిళనంతో రుద్దేస్తున్నాయి. ఘన భావనాతీరాల్ని ఈ రకం రసరహిత అహిత సాహిత్యం అతివేగంగా ఎడారిలా దురాక్రమించుకుంటూంది. ఈ బలాత్కారపు చేతబడుల వాతపడకుండా తప్పుకోవడం పాఠకులకు కష్టసాధ్యం అవుతూంది. బలహీనతల్ని రెచ్చగొట్టే

ఇలాంటి బలహీనమైన సాహితీ కుట్రతో పాఠకుల భావనాబలం దెబ్బతింటూంది. మానసికంగా వాళ్ళు రోగ నిరోధక శక్తిని కోల్పోతున్నారు. మానసిక ఎయిడ్స్‌కు గురవుతున్నారు. పాఠకుల తమంత తాముగా పెంచుకున్న సంస్కార మనో వనవాటికలమీద రచయితలని చెప్పుకుంటున్న చాలమంది తమ కలరా కలాలతో రాకెట్ దాడులు నిర్వహిస్తున్నారు. భావ సౌందర్యాన్ని, భాషాసంపత్తిని ఏమాత్రం పాఠకుల దరిదాపులకు రానీయకుండా ఒక Network కార్యక్రమాన్ని అమలు జరుపుతున్నారు. కలాలతో వాళ్ళ బలహీనతలమీద మెరుపుదాడులు నిర్వహిస్తూన్నారు. సాహితీ ప్రియుల చుట్టూ అమానుషపు రచనలతో వలలు పన్నుతూ సాహితీ చీకటి యుగాన్ని సృష్టించడానికి అసంకల్పిత రహస్య పథకాన్ని అనూహ్యంగా సిద్ధం చేస్తున్నారు.

మానవ ప్రాక్తన రక్తంలో దాగివున్న బలహీనతల్ని, హింసా క్రౌర్యాది విషజ్వాలికల్ని రెచ్చగొట్టడమే పనిగా వుంచుకుంటే, రేపు రూపొందే దానవ దావానలంలో ఆ రచయితలు, వాళ్ళను ప్రోత్సహిస్తున్న సంపాదకులతోపాటూ అందరూ బలికావలసి వుంటుందన్న విషయాన్ని తెలిసే విస్మరిస్తున్నారు. ఈ దుష్టసాహిత్యపు పద్మ వ్యూహంలోవున్న పాఠకులు అభిమన్యులు అవుతున్నారని అనుకుంటున్న రచయితలు ఆ పాఠకులే ఈ దుర్జనత్వాన్ని నిర్జించే అర్జునులై గర్జించే కాలాన్ని త్వరలోనే చూడబోతున్నారు.

రచయితల కలాలు వాళ్ళ దురాశల్ని, కీర్తి కండూతిని తీర్చే మంత్ర దండాలు కావు. రచయితల కలాలు ప్రజల మానసాల్లో గూడు కట్టుకున్న అపోహల అహంభావాల్ని, అజ్ఞాన తిమిరాల్ని పోగొట్టడానికి, పాఠకుల మానసాల్లో నివురు కప్పుకునివున్న జ్ఞానాగ్నిని కదిలించి ఒక యజ్ఞాన్ని నిర్వహించడానికి పనికివచ్చే నేతిదర్వులు (గరిటలు).

స్త్రీని పురుషునితోపాటూ సమానంగా చూడాలన్నదే గొప్ప వివాదం అయిపోతూన్న ఈ రోజుల్లో, అసలు స్త్రీయొక్క విరాడ్రూపాన్ని ఆవిష్కరించి, అందరిచేత అంజలి పట్టించే ప్రయత్నం నా రెండు నవలల్లోనూ చేసినట్లు చదివినవారికి తెలిసివస్తుంది. స్త్రీనుండే పురుషుడు పుట్టాడు. స్త్రీ లేకుంటే పురుష ప్రసక్తే లేదు. ఆమెనుండే పుట్టి ఆమెనే హరించే పురుషుడు ఒక బదనిక. ఒక పారసైట్. ఆమె కృశిస్తే ఈ పరాన్నభుక్కూడా కృశిస్తాడు. ఆమె ఒక పూల రథంలా ఎదిగితే ఇతడు కూడా పూజనీయుడవుతాడు. త్రికరణశుద్ధితో ఈ ఫెమినిజం సందేశాన్ని ఆవిష్కరించాను నా రచనల్లో!

ఏ రచనకూ కొలమానాన్ని నిర్దేశించడం అజ్ఞానం. వంద సంవత్సరాల నవలా చరిత్రలో ఆ ప్రక్రియకు కొన్ని లక్షణాలు ఏర్పడి వుండవచ్చు. రాబోయే నవలలన్నీ ఇలానే వుండాలనే శిలాశాసనం విజ్ఞులు చేయరు. కవిత్వానికి వెయ్యి సంవత్సరాల వయసొచ్చింది. అది ఎన్నో పోకడలు పోతూంది. నవలకు వంద సంవత్సరాలకే అన్ని మార్గాల్ని మూసేస్తారా! దాని శాఖలు విస్తరించనీ, విచిత్రమైన పూలు పూయనీ, అన్నీ లోటకు అందాన్నిస్తాయి. సమగ్రతను తెస్తాయి. ఎందరు కాదన్నా నవలా స్వరూప స్వభావాలు మారడం అనివార్యం. అలాంటి వినూత్న పద్ధతికి సిలబస్‌గా ఓ రెండు రచనలు వెలువరించాను. ఇవి అపూర్వాలు – అవి నేనంటే వింతగా చూస్తే చూడొచ్చుగాక! ఇవి వెనుకటి వాటిలా లేవే అంటే – ఉండకూడదనేగా ధ్యేయం.

కథను గురించి ఒక్కమాట – యథార్థ కథా పదార్థాన్ని ఇష్టపడే వాళ్ళే వాటిని రచనల్లో చూసి కూడా గుర్తుపట్టగలగాలి. నవల సాధారణంగా ఒక వ్యక్తి జీవితంలోని ఒక ఘట్టాన్ని చిత్రీకరించడానికి యత్నించే ప్రక్రియ. ఒక వ్యక్తి ఒక చోటుకెళ్ళి ఒక పని పూర్తిచేసుకుని, ఒకరితోటి

పరిచయాన్ని స్థిరీకరించుకుని, జీవితంలోకి అడుగుపెట్టేలోపున ఎన్నో ఘట్టాలు, గొడవలు సినిమాకథల్లోలాగా తరుముకుని రావు. నా జీవితంలో అలా రాలేదు. కథంటే 'కలగాపులగం గందరగోళం'గా వుండాలనుకునే వాళ్ళ జీవితాల్లో కూడా అలా జరిగిపోలేదు. అందుకే కథను, సర్కస్ కంపెనీ కోతిపిల్లను చేయలేదు నేను.

'శిలాయజ్ఞం' 'అగ్ని గర్భ'కు అనుబంధమైన నవల. అగ్ని గర్భలోని సుషమ, వనదీపుడు అననుకూల పరిస్థితులకు లొంగి విడిపోవలసి వస్తుంది. ఇద్దరూ ఒకరినొకరు స్మరిస్తూ విరహతప్త హృదయాలతో శేష జీవితాన్ని గడిపేస్తారు. పునర్జన్మను ఎత్తిన వాళ్ళిద్దరూ బలీయమైన గత జన్మల వాసనల ఫలితంగా ఈ నవలలో చేరువవుతారు. అగ్నిగర్భలో వన దీపుడి చివరి సందేశాన్ని కాలికి కట్టించుకుని ఎగురుతున్న పావురం కోసం చూస్తూ జీవితాన్ని చాలించిన సుషమ ఈ నవలలో ప్రవాళగా అలాగే ఆకాశ సందేశం కోసం గగనావలోకనం చేస్తూ వుంటుంది. శిలాయజ్ఞంలోని పాత్రల తత్త్వం లోతులా తెలియాలంటే ముందు అగ్నిగర్భను చదవాలి. దేనికది విడివిడి రచనే. కాని ఒకదాన్ని చదివితే మరోదాని పుటలు పూర్తిగా విచ్చుకుంటాయి.

శిలాయజ్ఞంలోని ఆలయంలో సర్వదేవతలు సమావిష్టులై వుంటారు సర్వదేవతా స్వరూపాలు ఒక్కటేననే భావంకోసం చేసిన ప్రయత్నం అది తెలంగాణాలోని నిజామాబాద్‌లో వెలసిన నీలకంఠేశ్వర దేవాలయం శైవ క్షేత్రమైనా అందులో వైష్ణవ దేవతామూర్తులుండడం, ఈ ప్రయత్నానికి ప్రేరణ.

గర్భగుడిలో ఆవు నేతితో వెలిగే దీపమే మనలోని కుండలినీ ఆత్మ శక్తి. గర్భగుడిలోపలి పైకప్పు ప్రస్తుతం మన శిరోపరితలం. పంచ లోహాలతో ఆ ప్రస్తరంలో నిలిపిన చిన్నిగొద్దం స్తూపి వుండే, అదే మన

సహస్రార ద్వారం. ఈ దీపశిఖ ఆ స్థూపిలోకి ప్రసరించడం మూలాధార చక్రంలోని కుండలినీ కాంతిరేఖ సహస్రారాన్ని చేరడం - దానితో ప్రతి మనిషి దేహం దేవాలయమై దివ్య సంపన్నం కావడం - ప్రతీక. ఇవన్నీ శిల్పశాస్త్ర రహస్యాలు.

ఇలాంటి నవలలు రాయడానికి వున్న కారణాల్లో ఒకటి-దేవాలయాలే పోలీస్‌స్టేషన్లకంటే ఎక్కువగా ప్రజల్ని సన్మార్గంలో నడిపించడానికి దోహదపడుతున్నాయి.

సిమెంటు సమాధుల్లాంటి మేడల్లో నిద్రిస్తూ ఉషస్సుల సోయగాలు, సిరివెన్నెలల హాయి రాగాలు, ప్రకృతి పైటచెంగు విసిరే పవనతరంగాల అంతరంగాలు తెలియకుండా కలుగుల్లో ఎలుకల్లా బ్రతుకుతున్న మన మనుష్యుల్లోకి ఇంత సౌందర్యరస ప్రసరణం జరగాలని కూడా ఈ నవలలు రాశాను. నాకు నేనే మనసారా చదువుకోవాలని ఈ నవలలు రాశాను. ఇలాంటి రచనలకు నన్ను ఎన్నుకున్న ఆ అతీంద్రియ శక్తికి సర్వాంగ సమాలింగిత భూతలుడనై ప్రణమిల్లుతున్నాను. కాలస్వరూపుడి పాదపద్మ ముకుళాల మీద పుంఃచాపీ రచనల్ని—వాటి వాసిని కాలమే నిరూపిస్తుంది.

'శిలా యజ్ఞం' అనే పేరంటారా! శిల అనే పదం విషాదానికి, శాప గ్రస్త జీవితానికి ప్రతీకే అయినా, యజ్ఞం అనే రెండోపదం దైవప్రీతికి, ఆర్ష సంస్కృతికి ప్రతినిధి అవుతుంది. 'శిలా - యజ్ఞం'లోని మొదటి పదం అహల్య అయితే, రెండో పదం హరిపాదం అవుతుంది. ఇది శిలమీద శిల్పులు చేసే యజ్ఞం కాబట్టి నవలకు 'శిలాయజ్ఞం' పేరే బాగుంటుందనిపించి అలానే వుంచేశాను.

ఇక భాషంటారా? చివురు కొమ్మతో చేసిన ధనుస్సుతో సుదూర లక్ష్యాన్ని ఛేదించిన యోధు డెందూ లేడు. సామాన్యుల వాడుక భాషతో

విశ్వరహస్య మహస్సుల్ని వెలువరించడం వీలుకాని విషయం. నాకు వ్యావహారిక భాషంటే చిన్నచూపు లేదు. దాని రేంజ్ తక్కువ. గడదేరిన చేవ కర్రతో చేసిన ధనుస్సుకు అల్లెత్రాడు బిగించి సంధించడానికి ముష్టికి, దృష్టికి పుష్టి పుష్కలంగా వుండాలి. భుజబలం, బుద్ధిబలం రెండూ లేని వాడు ధనుర్వేదాన్ని తిడితే ఎలా?

గుడి గోపురాల మీద గరుడపక్షుల్లా మసలుతున్న కారుమబ్బుల నేపథ్యంలో, పచ్చని కొబ్బరిచెట్ల వీవనలతో, పురంపై స్వర్ణకాంతుల ఆశీరక్షతలు చల్లుతున్న గోపుర కలశాలతో, కింకిణీ నిక్వాణ స్వాగత స్వనాల చిరుఘంటికామయ మహాద్వార మహాకవాటాలతో, గగనతలాలు ప్రతిధ్వనిస్తున్న ఆలయ ఘంటానినాదాలతో, ధూపదీప నైవేద్య పరిమళాలతో స్వర్గసీమ నుండి ఊడిపడిన పుణ్యఖండంలా వున్న ఈ మహాశిల్పాలయంలోకి పాణిపాద ప్రక్షాళనంతో, మానసిక శౌచంతో పాఠకోత్తముల్ని అడుగుపెట్టండని ఆహ్వానిస్తూ—

— రచయిత

శేషేంద్రశర్మ
1-7-1991

గ్యాన్‌బాగ్ పేలెస్,
గోషామహల్, హైదరాబాదు
500 012.

మిత్రులు, నఖశిఖ పర్యంత కవితాప్రాంశు స్వరూపులు శ్రీ కలువగుంట రామమూర్తిగారికి ప్రేమపూర్వక నమస్కారములు.

మీరిచ్చిన 'అగ్నిగర్భ' చదవడానికి చాలా కాలం పట్టింది; ఇప్పటికీ ఇంకా కొంత మిగిలే వుంది. కానీ మీ మనోహర కావ్య సీమలో పాదచారినయి ఇంతదూరం నడిచిన తర్వాత ఇన్ని పరిమళాలు ఇన్ని రంగులు ఇన్ని రుచులు ఆస్వాదించిన తరువాత పంచేంద్రియాలకు మృష్టాన్న భోజనం లభించింది

మీ కావ్యంలో కావ్యత ఎంత సంపూర్ణంగా వుందంటే అది పఠిత పంచేంద్రియాలనూ శబ్దస్పర్శరూప రసగంధాదులన్నీ ఇచ్చి ఒక మాతృదేవిలా లాలించి ఒక మధురానుభూతి కలిగిస్తుంది. ఇదే ఒక కావ్యానికి ప్రధాన లక్షణం. విశ్వకర్మ నిర్మించిన రావణ భవనాన్ని వర్ణిస్తూ వాల్మీకి అంటాడు -

"ఇంద్రియా ణీంద్రియార్థైస్తు పంచ పంచభిరుత్తమైః ।
తర్పయామాసమాతేవ తదారావణ పాలితా".

విశ్వకర్మ నిర్మాణము ఒక గొప్ప కళాకృతి. కనుకనే అందులో వాల్మీకి కావ్యత చూశాడు.

నిజంగ ఇది ఆధునికాంధ్ర సాహిత్యంలో 'కాదంబరి'.

"సర్గబంధోఽభినేయార్థం తథైవాఖ్యాయికా కథా"

అని భామహుడు చెప్పిన పంచవిధ కావ్యాల్లో ఇది కథ అవుతుంది. కథాకావ్యం సృజనాత్మక రచన.

సామాన్య శబ్దార్థములు అసామాన్యములు నూత్నములు అవుతాయి. "కావ్యేరస పరిగ్రహాత్ సర్వేనవా ఇవాభాంతి మధుమాస ఇవ ద్రుమాః" కనక మీ రచన ఆపాదమస్తకమూ కావ్యత చేత పరిలిప్తమై వుంది. సర్వత్ర ఆహ్లాదజనకంగా వుంది

ఇంగ్లీషు సాహిత్యంలో ఇలాంటి కవిత్వమయ కథా రచనలు చేసిన విఖ్యాత రచయితలు, కవులు వున్నారు. ఉదా:— డి. హెచ్. లారెన్స్ రాసిన Rainbow, లారెన్స్ డర్రెల్ రాసిన క్లియా ఇత్యాదులు. ప్లాబో నెరూడ కూడ ఒక కవిత్వమయ వచన రచన చేశారు, Memoirs. అయితే అది అఖ్యాయిక (auto-biography), కాని జాతి లక్షణం అదే.

మొత్తం మీద 'అగ్నిగర్భ' ఒక అత్యంత విశిష్టకృతి, మీకు నా హార్దిక అభినందనలు.

ఇట్లు,
మీ
శేషేంద్రశర్మ.

# నమస్సుమాలు

శిలల్ని గురించి, శిల్పాల్ని గురించి ఏమీ తెలియని స్థితిలో "శిలా యజ్ఞం" చేయాలని సంకల్పించాను. అలా టి.టి.డి. శిల్పకళాశాల అధ్యాప కుల్ని వెతుక్కుంటూ వెళ్ళి శ్రీ పి. సుబ్రహ్మణ్యంగారిని కలిశాను. ఆయన శిల్పకళను గురించి నాకో అవగాహనను అనక్తిని రేకెత్తించారు. ఎన్నో రోజులు గంటల కొద్దీ ఓపికతో శిల్పశాస్త్ర విషయాల్ని వివరించారు. ఆయనకు నా ప్రథమ కృతజ్ఞతాభివందనాలు.

శిల్పకళాశాల ప్రాంగణంలో కెళ్ళి, నే నెందుకు పరిశీలిస్తున్నానో కూడా చెప్పకుండా శిల్పాల్ని మలుస్తున్న శిల్పుల్ని, శిల్పకళను అభ్య సిస్తున్న విద్యార్థుల్ని గమనించేవాణ్ణి. వాళ్ళెవరో కూడా నాకు తెలియను.

గ్రంథాలయాల్లో ఎన్నో శిల్పశాస్త్రాల్ని, శిల్పగ్రంథాల్ని అధ్యయనం చేశాను - వాటిని రచించిన వాళ్ళ పేర్లు కూడా నేను రాసుకోలేదు.

ఈ శిల్పోపనిషత్తును ఓ పరిశోధనగా, ఓ పరివేదనగా నేను తీసు కున్నాను. ఐదు సంవత్సరాలు తపసించి రాసిన ప్రాథమిక వ్రాత ప్రతి ఓ గహనాటవి. అందులో బాటలుతీస్తూ, ఆ వేయి పుటల్ని ఎడిట్ చేసు కుంటూ ముద్రణకోసం శుద్ధ ప్రతిని తయారుచేసి ఇచ్చిన నా శ్రీమతి డా॥ వి. పార్వతీదేవికి కృతజ్ఞతల్ని తెలుపుకుంటున్నాను.

నా అంత చదువుకొని, నాతోపాటూ ఉద్యోగంచేస్తూ, దైనందిన యానంలో ఈ గడియారపు ముళ్ళ తోపుళ్ళకు ఎప్పుడూ తనే అడ్డు పడుతూ, ఈ రచనకు పరోక్షంగా ప్రోత్సాహాన్ని అందించిన నా అర్థాంగికి. అర్ధాంగికి మరోమారు కృతజ్ఞతలు తెలుపుకోవడం రచయితగా నా ధర్మం. అలాగే ఈ నవలా ఆముఖంగా స్పందనా శకున్ని పేల్చినందుకు ఆమెకు నా కృతజ్ఞతలు తెలపడానికి అక్షరాలు సమర్థవంతాలు కావు.

సరే! ఈ బృహత్కథను ముద్రించాలి. కలియుగ దాత ఇంకెవరున్నారు. అందరికీ ఏడుగడ ఆ ఏడుకొండల వాడు. ఆయన గడప దొక్కి ఆర్థిక సహాయాన్ని అర్థించాను. నా మొదటి నవల "అగ్నిగర్భ"కూ ఆర్థికసాయం అందించాడు. ఇప్పుడూ ఈ "శిలాయజ్ఞం" నిర్విఘ్నంగా వెలువడడానికి తన కటాక్షాన్ని ప్రసరించాడు. ఆయనకు నా సాష్టాంగ ప్రణామాలు.

అలాంటి శ్రీవారి కార్యనిర్వహణాధికారి, అభ్యుదయ హృదయులు అయిన శ్రీ ఎన్. రమేశ్‌కుమార్ గారికి కృతజ్ఞతలు.

ఆచార్య కొత్తపల్లి వీరభద్రరావుగారు, ఆచార్య బ్రహ్మానందంగారు, కళావధాని చక్రవర్తి డా॥ మేడసాని మోహన్‌గారు, శ్రీ జానమద్ది హనుమచ్ఛాస్త్రిగారు, ఆచార్యనాయని కృష్ణకుమారిగారు, సప్తగిరి మాజీ ఎడిటర్ శ్రీ కాట్రపాటి సుబ్బారావుగారు—ఇప్పటి ఎడిటర్ శ్రీ ఎన్. ఎస్. రామమూర్తిగారు - వీళ్ళ శుభాకాంక్షలు తోడయినాయి.

మిత్రులు, లక్ష్మీ గ్రాఫిక్స్ అధిపతి శ్రీ వీరబ్రహ్మంగారు ప్రూఫులు శ్రద్ధతో దిద్దినందుకు, దీక్షతో కంపోజింగ్ చేసిన కార్మిక మిత్రులకూ, నా హృదయ పూర్వక కృతజ్ఞతలు.

ఈ పుస్తక ముఖచిత్రం కోసం అందంగా కవర్ డిజైన్ చేసి ఇచ్చిన ఆధ్యాత్మిక మిత్రులు సప్తగిరి ఆర్టిస్టు శ్రీ చంద్రశేఖర్ గారికి నా కృతజ్ఞతలు.

ఒక కావ్యరచన మహత్కార్యం; దానికి తోడ్పడే వారంతా మహోన్నతులు అన్న కవి వాక్కు యథార్థం. ఈ నా బృహత్కార్యానికి ఇలా ప్రత్యక్షంగా, పరోక్షంగా తోడ్పడిన వారెందరో ఉన్నారు. ఎవరి సత్కర్మ ఫలితం వారికి అందించటం ప్రకృతి ధర్మం. తథాస్తు.

# సమర్పన

ఏ పుణ్యవతుల గర్భాలు పండి
ఆయా గర్భాలు శిల్పకళతో కళ కళ లాడుతున్నాయో
ఏ పుణ్య సతుల సాహచర్యంతో
శిల్పులు తమ అనల్ప కల్పనలకు పూనుకుంటున్నారో
ఏ శిల్పి బహ్మల శ్రమ స్వేదంతో వెలిసిన
గుడి గోపురాలు ఆర్ష సంస్కృతికి పట్టుగొమ్మలై
అలరారుతున్నాయో

ఆ మాతృమూర్తుల దివ్యహస్తాలకు
ఈ శిలాముఖ అమృత కళాకళశాన్ని అంకిత మిచ్చి
సమ్మానిస్తున్నాను.

ఆ ధర్మపత్నుల్ని సాదరంగా
కుంకుమ సుమ సుగంధ చందనాక్షలతో గౌరవిస్తున్నాను,
ఆ శిల్పర్షులకు ఆరాధనతో
సర్వాంగాలింగిత భూతలుడనై ప్రణామా లర్పించుకుంటున్నాను.



# శిలాయజ్ఞం

# 1

శిలమీద లిపి నిలిపే వ్యక్తి శిల్పి. శిల్పి లిపి శిల్పం. శిల్పం చిత్ర లిపి. శిల్పం మాట్లాడని కావ్యం. కావ్యం మాట్లాడే శిల్పం. శిల్పకళ విశ్వకర్మ కన్నకల. శిల్పి శిలాప్రియుడు. కళాపుత్రుడు. శిల్పాలు కప్పుకున్న మేలిముసుగుల్ని తొలగించే నెచ్చెలులు ఉలులు. నగం నిజం నగం స్వప్నం - అది జీవితం. నగం శిల నగం కళ - అది శిల్పం.

"విశ్వకర్మా! త్వష్టా, మయబ్రహ్మా! మీకు నా నమోవాకాలు" ప్రాతఃకాల స్నానాదికాలు నిర్వర్తించడానికి శిల్పాచార్యుడు నెమ్మదిగా కొలని సోపాన పంక్తుల్ని అవరోహిస్తున్నాడు. ఆయన పాదాలకున్న గండపెండేరాలు, హస్తాలకున్న స్వర్ణ కంకణాలు మంజుల రవళుల్ని వెలువరిస్తున్నాయి.

"మత్స్యపురాణమా! అగ్నిపురాణమా! మానసార మహాశిల్ప గ్రంథమా! మీకు శిరసా నమస్కరిస్తున్నాను" అనుకుంటూ ఆయన నెమ్మదిగా నీటిలోని మెట్లమీదుగా దిగి కటిదఘ్నంగా వచ్చిన స్వచ్ఛ జలాల్లో నిలుచున్నాడు.

ప్రపంచ దృష్టినే ఆకర్షిస్తున్న అత్యద్భుత శిల్పకళామూర్తుల్ని శిల్పించిన భారతీయ శిల్పస్రష్టలు ఎవ్వరో! ఎందరో! ఆ మహాశిల్పుల పేర్లు కూడా ఈనాడు మనకు అపరిచితాలైపోయాయి. అలాంటి శిల్పి తపస్వుల నామధేయాల్ని మనకు అందించిన ఆ గ్రంథరాజాలంటే ఆయనకు ఆరాధన. అందుకే ఆ శిల్పాచార్యుడు సంధ్యావార్చుకుని నిత్యం ఆ శిల్పుల్ని స్మరించుకుంటాడు.

"విశ్వకర్మాచ విశ్వేశః విశ్వసారః ప్రబోధకః ।
వృతశ్చైవ మయశ్చైవ, త్వష్టాశ్చైవ మను ర్నలః ॥
మాన విన్మాన కల్పశ్చ, మానసారో బహుశ్రుతః ।
ప్రష్టాచ మానబోధశ్చ విశ్వబోధనయ స్తథా !
ఆదిసారో విశాలశ్చ విశ్వకాశ్యప ఏవచ ॥
వాస్తుబోధో, మహాతంత్రో, వాస్తు విద్యాపతి స్తథా ।
పారాశరీయకశ్చైవ, కాలయూపో మహాఋషిః ॥
చైత్యాఖ్యః చిత్రకః ఆర్యః సాధక సారసంహితః ।
భానుశ్చేంద్రశ్చ లోకజ్ఞః, సౌరాఖ్యః శిల్పవిత్తమః ।
తే ఏవ ఋషయః ప్రోక్తా ద్వాత్రింశతి సంఖ్యయా ॥"

అంటూ జలాంజలితో ఆ ఆచార్యుడు 'మానసార' మహాశిల్ప గ్రంథంలో పేర్కొన్న ముప్పయిరెండుమంది శిల్పర్షుల్ని స్మరించుకుని మహాపాతా వాళ్ళకు అర్ఘ్యం సమర్పించాడు.

కావిరంగుల వెదజల్లుతుంటూ తూర్పు కనుమల మీదుగా బాల భానుడు ఎగసి వస్తున్నాడు. ఒక్కో పడికట్టు నధిరోహిస్తూ కోనేటినుంచి సర్వాంగ సుందరుడైన శిల్పాచార్యుడు పైపైకి వస్తున్నాడు. ఆయన నెరిసిన గడ్డం జ్ఞానకాంతుల్ని విరజిమ్ముతూంది. తామరపూళ్ళనుంచి నీళ్ళు ప్రవహిస్తున్నట్లు ఆయన తెల్లని వెంట్రుకలు వీపుమీదుగా జలబిందువుల్ని జాలువారుస్తున్నాయి. దృఢమైన శరీరంతో, శ్వేత వస్త్రధారణతో ఒక వినూత్న తేజాన్ని విరజిమ్ముతున్నారతను.

"ప్రకృతిలోని శిలలన్నీ సిగ్గుచెరగని కన్నెలు. ఏదో ఒక శిల్పానికి జన్మ నివ్వాలన్న తపనతో ఏ ఉలి స్పర్శ కోసమో ఎదురు తెన్నులు చూస్తున్న ఆ శిలల శిల్ప స్వప్నాల్ని ఫలింపచేస్తే జగమంతా శిల్ప శాలగా కళకళలాడిపోదా!

విశ్వపారా! ప్రతిలోకా! బహుశ్రుతా! విశ్వబోధా! ఆదిపారా! కాశ్యపా! మహాతంత్రా! విద్యాపతీ! శౌరశక్తీ! శిల్పి తపస్వులారా! నన్ను ఆశీర్వదించండి. నేను మామూలు మనిషిని.

శిల్ప రీతుల్ని కుక్షిలో నిక్షిప్తం చేసుకుని ఇలాతలం మీద ఇలా పడివున్న ఈ శిలారూప అహల్యల్ని తట్టి లేపడానికి నేను శిల్ప కళాభిరాముణ్ణి కాను. నేను మామూలు మానవుణ్ణి..." అనుకుంటూ శిష్యుడు సిద్ధంగా ఉంచిన పూజాద్రవ్యాలతో శిల్పాచార్యుడు పంచముఖ విశ్వకర్మను అర్చించాడు.

నియమానుసారంగా శిల్పాచార్యుడు ధరించవలసిన వస్త్ర భూషణాల్ని ఆయన విస్మరించలేదు. ఆతను శిఖా యజ్ఞోపవీతాలతో శ్వేతవస్త్రాలతో బుద్ధికి బృహస్పతి వారసుడిలా దర్శనమిస్తున్నాడు. అతని లలాటం, భుజస్కంధాలు, హస్తాలు విబూది రేఖలతో, శ్వేతచందనంతో శోభిల్లుతున్నాయి. శిరోవేష్టనం, కర్ణాభరణాలు, శ్రేష్ఠమైన కంఠాభరణం, హస్తాభరణాలు, అంగుళ్యాభరణాలు — ఈ పంచాంగ భూషణాలతో ఆ పంచాంగ బ్రహ్మ దివ్యంగా భాసిస్తున్నాడు. ఒక ఉన్నత శిలాతలం మీద పద్మాసనస్థుడై కూర్చున్న ఆ శిల్పిబ్రహ్మ అంతర్ముఖుడై విగ్రహంలా నిశ్చలంగా వున్నాడు. శోభాయమానంగా వున్న పరిసర ప్రకృతి విహంగ కలరవాలతో సంధ్యార్చన చేస్తున్నట్లుంది. ఎత్తైన శిఖరాలు అతనిలాగే ధ్యానావస్థులైనట్లు కనిపిస్తున్నాయి. గాఢ సమాధిస్థితిలో ఆ కర్మయోగి గగనమండలాల నుంచి దివ్యభావ కిరణాలేవో తన హృదయంలోకి ప్రసరిస్తున్న అనుభూతికి లోనయ్యాడు. ఎక్కడో విహరిస్తున్న తన సూక్ష్మ శరీరం కోసం స్థూల శరీరం వేచి కూర్చున్నట్లు సజీవ ప్రతిమలా ఉన్నాడాయన. విశ్వాంతరాళాల దివ్యానుభవ నాళీమండలాలు ద్రవించి అక్కడి హిరణ్మయద్రవం కిరణాలుగా తన హృదయంలోకి ప్రసరించడాన్ని అతను దర్శించాడు. ఆ ఆర్ద్ర కిరణాలు అమృత ధారలుగా ప్రశాంతశీతలం చెందుతున్నాయి

"శిలాయజ్ఞంలో ప్రతిరాయీ ఓ సమిధ. ప్రతిమలోని ప్రతిసలుపూ ఓ మంత్రం. శిల్పకళా శ్రవ్యకావ్యంలో గుడులు గోపురాలు దృశ్యకావ్యాలు. పరమాత్మ పరమహంసలా విహరించే పుష్కరిణి ఆలయం.

యుగాంకొద్దీ తపిస్తున్న శిలలు దీపక రాగాభ్యాసకులు. అవి లోలోపల దహించుకపోతుంటాయి. శిల్పాలు మేఘమల్హరి రాగాభిమానులు. అవి కళాభిహర్షాన్ని కురిపిస్తుంటాయి.

విలువైన రత్నాలతో, రాళ్ళతో అందమైన మందిరాలు కట్టుకునే మనిషికి నిసర్గ సుందరభావాలతో ఒక పర్ణశాలను నిర్మించుకోవడం ఎంత కష్టమో తెలిసివస్తుంది. జంతువులతో పాటు జన్మనెత్తిన మనిషికి అందాల భావాల్ని అందుబాటులోకి తరలించుక రావాలి శిల్పి. అప్పుడుగానీ మనిషికి ఆనందధ్రువాలు అందవు. ఎదలో మాధుర్యం ఇంకిపోయిన మనిషి మృగలోకానికి అగ్రనాయకుడుగా ప్రకృతి శక్తులతో ఏకగ్రీవంగా ఎన్నుకోబడతాడు. ఈ అపాయానికి ఉపాయాన్ని వెదకవలసిన బాధ్యత శిల్పిమీద ఎంతైనా వుంది.

ఒక భావ విహంగం పదేపదే మన హృదయ కాసారంలోకి వచ్చి వాలుతూ ఎగిరిపోతుంటే ప్రతిసారీ దాని రెక్కలకి కొత్త శక్తి వస్తుంది. అసలు ఆలోచనలూ, ఆశయాలూ శక్తిని పుంజుకునేది మనిషి హృదయంతో పరిచయం పెరిగాకనే!

తన సంకల్పమే ఈశ్వర సంకల్పం అయ్యేదాకా మనిషి నిద్ర పోకూడదు. తను తాకిన ప్రతిశిలా శిల్పం అయ్యేద్దాకా శిల్పి విశ్రమించ కూడదు.

పరమాత్మ పతద్వంది పథకంనుంచి ఒక్కసారి పొరలి జాలువారిన భావాలు శిల్పోపాసకుల ద్వారా కళా భాష్యాలవుతాయి. ప్రతి శిల్పం ఒక

శిలా పుష్పం. శిలల కంఠలు అందించబడి మిణుగురుల నెత్తురుబొట్లు రాలిస్తేనే కానీ కన్నెశిలల ఆనంద బాష్ప బాష్పాల్లాంటి శిల్పాలు పుట్టవు. శిలాతలాలు గుహాపదేశాక్షరాలు చెరిపేసిన విద్యార్థుల పలకాల్లా వుంటాయి. శిల్పి కళాభ్యాసం చేస్తున్న విద్యార్థిలా వాటిమీద శిల్పాక్షరాలు చెక్కుతాడు.

శిలాశయాల్లో, లీనమైన సంగీత ప్రపంచాలున్నాయి. మునిగిన గంధర్వ లోకాలున్నాయి. యక్షుల గ్రామాలున్నాయి. అప్సరసల అంతఃపురాలున్నాయి అదొక అజ్ఞాత శిలా స్వర్గలోకం దావానల జ్వాలికలు బాలికలైన రూపాలెన్నో దాగున్న మార్మికలోకం అది శిలాతలాల్లో కన్నెచెరలు తొలగని కమనీయ కామినులున్న అంతఃపురాలున్నాయి. తమను చెక్కినవాడి చూపుకే దక్కాలనుకునే అసూర్యం పశ్యలెందరో ఈ శిలామయ పరదాల మాటున రాణిస్తున్నారు. ఈ శిలలు ఉలితో హలీకరించబడి శిల్పాలు కానున్న శాపగ్రస్త అహల్య లెందరో కాలం గడుపుతున్న కఠిన కుటీరాలు. మనిషికి దేవుడు మనిషిలానే కనిపిస్తాడు. శిల్పికి దేవుడు శిల్పంలానే కనిపిస్తాడు.

గండశిలలెన్నో ఏళ్ళకొద్దీ ఎండల్లో, గాలుల్లో గర్భవతులైన సింహాకల్లా భారంగా నిలబడి చూస్తుంటాయి శిలకు శిల్పం కాను్పు

శిల్పి చూపులకు ఈ పెనుశిలలన్నీ ఆరిపోయిన అగ్నిగుండాల్లా కనిపిస్తాయి నిపురు కప్పుకున్న ఆ నిప్పు పొరల్ని చేదించగానే కేవల నిద్రాణమైవున్న దివ్యశక్తి మేల్కొంటుంది. తనను అలంకరించమని ఆత్మీయంగా తన అంగాంగాల్నీ శిల్పి ముందు విరబూస్తుంది. ఈ శిల లన్నిటికీ ఆత్మక్షేత్రాలున్నాయి. అక్కడే దివ్యత్వం బీజరూపంలో దాగి వుంటుంది, శిల్పి శిలాక్షేత్రాల్ని ఉలితో హలీకరిస్తాడు. అంతే—అంతాల భూజాతలు ఆవిర్భవిస్తారు

శిల్పి శిల్పమయ తపస్సు చేయాలి. లేకపోతే తమస్సులాంటి శిల మంచి ఉషస్సులాంటి శిల్పాన్ని ప్రత్యేకించడం అసంభవం అవుతుంది.

శిలలు కఠినాలు అని అజ్ఞానులు కావాలంటే పరమ యోగీశ్వరుడైన శిల్పాచార్యుని వ్యర్థ పోకార్చిందే. తనలోని ఆత్మపరాగాన్ని ప్రతిశిల తీయమని శిల్పిని మూగభాషతో శిలలన్నీ ప్రార్థిస్తుంటాయి. కనరాని వేయి కళ్ళతో అన్వేషిస్తుంటాయి. అందాలు కనిపించని శిలాహృదయంలో దాగిన హిరణ్మయ మందహాసమే శిల్పం.

క్రమశిక్షణ శిక్షలాగా అనిపించినా అదే శాస్త్రం అవుతుంది. శాస్త్రంవల్లనే శిల శిల్పమై ఆరాధనీయం అవుతుంది. శిలను ఛేదించి దానిలోని కళాసౌందర్యాన్ని శోధించడమే శిల్పం. శిల్పాలు శిలల అంతరాల్లో దాగిన కలకండ అమృతాలు. శిల్పాలు రాతినార ఉదయాల కలగలిపిన కాంతిచీరలు కట్టుకుంటాయి. శిలాసముద్ర తీరాల్లో ఆలయశిల్పాల గుంపు అర్ఘ్యాలు. గుళ్ళు శిల్పరస కలశాలు. భగవంతుని ఆశీనుల కోవెళ్ళకు కళా ఒయాసిస్సులైన శిలాతలాలు గుళ్ళు.

ప్రవహించలేని ఏనుగుమందల్లా పర్వతశ్రేణులు పడివుంటే, శిల్పి శస్త్రచికిత్సతో శిల్పాకారాల్ని వెలికితీసే దేవవైద్యుడు. మనిషిది ప్రజ్ఞ శిల్పిది ఉపజ్ఞ. ఉపజ్ఞ దానికదే ఆవిర్భవించే శక్తి.

మదూరపు గోపురాల మీద పావురాల బృందాల్లా విహరిస్తున్న మేఘాల క్రింద ఏదో శిల్ప ప్రశాంతి, రశ్మి కిరణాల తోరణాలై గుడి గుమ్మాలకు వ్రేలాడుతున్న ఉదయాల రాగచంద్రికల రాగాలు, ఆలయ ఆరామంలోని తులసి తోటల పత్రికల పవిత్ర గీతాలాలపిస్తున్న రవళి — ఇవన్నీ శిల్పిమదిలో కదలాడుతుంటాయి.

ఈ శిలాతోరణాలు కొండచిలువల్లా గుటకరించిన ఎన్ని శిల్పాల్ని పొట్టలో దాచుకుని పడుకున్నాయో! గండభేరుండపు గోటిపోటులా శిల్పి ఉలి పేటు శిల్పాల్ని వెలికి తీస్తుంది. శిలలోని శిల్పం ఆవిష్కరించబడగానే శిల శిథిలమవుతుంది. ఆత్మ ఉత్క్రమించగానే పతనమైపోయే శరీరంలా

లా నశించిపోతుంది. శిల్పావిష్కరణే శిలకు ముక్తి, శిలకు మోక్షమే శిల్పసిద్ధి.

కాలప్రవాహంలో శిల్పానికి అంటుకున్న వ్యర్థ పదార్థాల ముద్దలు శిలలు. శిలలోని అనవసర భాగాల్ని శిల్పి తొలగిస్తాడు. శిల్పి శిలలోని శిల్పాన్ని దర్శించాకే వ్యర్థ మాంసాన్ని ఉలితో ఊడగొడతాడు. అప్పుడు సలక్షణమైన శిల్పోత్పత్తి జరుగుతుంది.

శిలా సంస్కారి శిల్పి. అది గండశిల గుండెల్లో ముద్దగట్టిన మూగభాష. అది భూదేవి కలల ముద్దు. అసంస్కార రూపం శిలది. ప్రకృతి ముడిపదార్థం శిల. యుగాల వ్యవస్థాల కన్న భూగోళం చెక్కిటి మీంచి జారి ఘనీభవించిన ఆనంద బిందువులు శిల్పార్థ శిలలు. అవి విప్పరు గప్పిన విప్ప ముద్దలు. శిలకు మరో శిలకు మధ్య సాంస్కృతిక శిల్పాకర్షణ వుంది. అది ఆకాశ లోకాల్లోని గోళానికి గోళానికి మధ్యవున్న అవ్యక్త అనుబంధం లాంటిది. శిలారూపంలో విరేఖలు అధికం కావడంవల్ల శిల్పానికి కళాపారవశ్యం అధికం అవుతుంది.

శిలలకు శిల్పాలకు శోభన గృహాలు. శిల్పి పాణిగ్రహణం తర్వాత జరిగే తతంగమంతా శిలకన్న కలల అంతరంగాలే. ఉషోదయ స్వర్ణ కాంతులు జాలువారే చషకాల విషాదకళ్ళతో శిల్పాలు శిలల గర్భాల్లో ఎదురు చూస్తుంటాయి. ఈ సుముహూర్తం కోసం శిల్పాలు కన్నెశిలలుగా భూమాత స్వగృహంలో వున్నన్ని రోజులూ వాటిని ప్రకృతి సుకుమారంగా లాలిస్తూ వుంటుంది. వాటి మౌనభావ తరంగాల్ని ఆలకిస్తూ వుంటుంది.

అరణ్య గృహాల్లో, భూగర్భాలల్లో ప్రొద్దుపుచ్చే ఈ శిలల వెచ్చెలలకు మలిపొద్దువేళ ఆకాశంలో తెరలు తెరలుగా జాలువారే రంగుల వలువల్ని సంధ్యాసుందరి తన అందాల కానుకగా పంపుతుంది. బంగారు

పన్నె కిరణాలు పసుపు పచ్చని వెచ్చని నిచ్చెనలై శిలల పాదాల దగ్గర వారి పందెరంగుల పూలలోయల్లో విహరిద్దాం రమ్మని ఆహ్వానిస్తాయి.

దట్టమైన తోటల్లో పరిమళాలు మత్తుగా వీస్తున్నవేళ, మసక వెలుగులు శిలల పిగల్లో రంగుల గోరింటల్ని తురిమేవేళ, వెన్నెల వెల్లువలో శిలలు జలకన్యలై అందగించేవేళ శిలల అదరాలపై శిల్ప దరహాస సాంద్ర మాధుర్యాలు తళ తళిస్తాయి.

శిల్పాలు కావాలన్న తపనతో తమ గట్లమీద వడి నిట్టువపాపాలు చేస్తున్న ఆ శిలల ఆశయాల్ని జలాశయాలు తమ అంతరంగ సంగీత లహరుల్లా వినిపిస్తున్నాయి. ఆకాశాలు తమ అంతర్యాల్ని మహోన్నత పర్వత శిఖరాలతో వెళ్ళబోసుకుంటున్నాయి. శిఖరాలు వృక్షాల మునివ్రేళ్ళతో గగన నేత్రాల్ని తుడుస్తూ ఊరడిస్తున్నాయి. కొండల్లో, కోనల్లో నిండిపోయిన కాలవాహిని తన ప్రాచీనతను అక్కడే పదిలపరచుకుంటూంది. అరణ్యాల అగర్భ భూగర్భాల్లో అందుకే యుగాల యుగళ గీతాలు వినిపిస్తాయి. విశ్వ శిల్ప సౌందర్య సంభాషణంతా అర్థంకాని మార్మిక సాంకేతిక భాషలో జరిగిపోతోంది. ఈ దివ్య భాష్యానికి శ్రోతలు కావాలనుకున్నవారి హృదయాలు మాలిన్య రహితంగా వుండాలి

లేత ఎండలు, మొలక వెన్నెలలు, రంగుల తారలు తమ కరతలాలతో శిలాతలాల పాలతలాలు తాకి వాటి తాపోష్ణాన్ని పరిశీలిస్తుంటాయి. గగనంలో అతిథుల్లా అడుగుపెట్టే విదేశీ వెలుతురులకు స్వాగతాలు పలికే తొలి కార్యకర్తలు శిలలే మరి!"

ఆకాశ ప్రసరణం ఆగిపోయినా ఆ స్థితిమంచి బయటపడడానికి ఇచ్ఛగించక అలాగే కూర్చుండిపోయాడతను. అతని హృదయం ఆనంద తీవ్ర స్పందనకు తట్టుకోలేకపోయింది. కళ్ళు చెమరించాయి. తనువు కంపించింది.

• • •

ఎత్తైన పర్వతంలా కవిపిస్తున్న పురాతనమైన మహలు ముందున్న శాద్వలతలంలో వెన్నెల కన్నెలా అటూ ఇటూ విహరిస్తూంది ఓ యువతి. ఆమె పదేపదే ఆకాశాన్ని అవలోకిస్తూంది తనకు చేరవలసినదేదో మేఘాల మధ్యనే చిక్కుకుపోయినట్టు మబ్బులకేసి చూస్తున్న మయూరిలా ఆ తోటలో నడయాడుతున్నదామె. అది ఆమె దినచర్య. తానెందుకలా చూస్తోందో తనకే తెలియదు. అలా ఎదురు తెన్నులు చూడకుండా ఎందుకు వుండ కూడదో కూడా ఆమెకు తెలియదు. ఆమెకు అదొక పురాతన యాతనలా వుంది. కానీ ఆమెలో అది నిత్యనూతన చేతనను రేకెత్తిస్తూంది.

తన మనోసామ్రాజ్య సర్వార్థ సంకేతాన్ని ఏ విహంగమో తన్నుకు పోయినట్టు ఆమె కలతపడిపోతూంది. ఆమె ఆ పరిసర అరణ్యమంతా కలయదిరుగుతూంది. ఆమె ఒక సందేశ సంగమాభిలాషతో తపిస్తున్న అభి సారిక ఆమె ఒక సంకేత స్పందన కోసం సంచరిస్తూన్న నటీవ విరహ గీతిక. ఆమె కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి. దానితో పరిసరాలు మసక బారుతున్నాయి.

గగనంలో గరుడపక్షి కూజితం వినిపించింది. దూరంగా పర్వత సానువుల మీద నెమళ్ళ కేకారావాలు ప్రతిధ్వనిస్తున్నాయి. సమీప అరణ్య ప్రాంతం నుంచి వస్తూన్న కొండగాలి సుడులు తిరుగుతూ వృక్షాల్ని కుదిపే స్తూంది. అది మహలు మహద్వారం ద్వారా దూసుకుని వచ్చి ఆ యువతిని చుట్టుముట్టింది. వన్యప్రాణులు కోలాహలం చేస్తున్నాయి. దివ్య పరిమళ మేదో ఆమెను ఆవరించుకుని పొదివి పట్టుకుంది

"ఎక్కడిదీ దివ్యపరిమళం? అవును - ఎవరిదీ అశ్వగంధం — ఎవరు? ఎవరు నన్ను గాలిలా తాకుతున్నారు? ఎవరు? ఎవరు? ఎవరు?"

తాను మామూలు మనిషినన్న సత్యం ఆమెకు ఆ క్షణంలో బా - తెలిసి వచ్చింది. ఇలది గర్భంలో ఉష్ణ తరంగాలు ఎగసిపడుతున్నట్టు ఏవో స్మృతులు గతజన్మల వాసనలై లోలోపల ప్రత్యపడుతున్నాయి. కానీ వాటిని

కాలాలలోకి అనుభవించడం ఆమెకు చేతకాలేదు. దానితో ఒక మూగవేదన ఆవరించింది.

ఆమె తనమీద రాలిన మొగలిపూల పుప్పొడిని ఆఘ్రాణించింది. ఆ మలిగాలిలోని తేనె పరిమళాల్ని పీల్చింది. శిగలో తగులుతున్న పూలను చేతికి తీసుకుని కళ్ళకు అదించుకుంది. జీవకారుణ్య బుద్ధుపవనం ఒకటి ఆత్మలా వచ్చి తనను అనునయించిన అనుభూతికి లోనయిందామె విరహ హృదయం.

ఆ హోరుగాలిలో కొట్టుకుని వస్తున్న ఒక పత్రపుటంలా కపోతం ఒకటి కలవరపడుతూ ఆమె మీదుగా ఆకాశంలో వలయాలు చుడుతూంది. తన గోళ్ళకు గుచ్చుకుని వున్న ఒక ఫలిత పత్రాన్ని అది ముక్కుతో గుచ్చి గుచ్చి విదిలించుకుంది. ఆ పండిన బంగారు రంగు ఆకు గాలిలో తేలుతూ క్రిందకు పడుతూంది.

ఆ పడుతున్న పత్రాన్ని పట్టుకోవాలని ఆమె అంగాలన్నీ అసంకల్పితంగా ఒక ఉదుటున సమాయత్తమయ్యాయి. ఆ పత్రిక గాలిలో అటూ ఇటూ ఎగసిపోతూంది. ఆమె దాన్ని ప్రాణం కన్నా మిన్నగా భావిస్తూ దానికోసం తహతహలాడిపోతూంది. ఆ ఫలిత పత్రం ఆమె చేతిలోకి వచ్చి పడ్డవెంటనే ఆమెలోని ఆత్మిక శక్తులన్నీ ఒక్కసారిగా విక్షణించాయి. గబగబా ఆ ఆకుని పరిశీలించిందామె. దానిమీద ముద్రాక్షర వ్యాయంలో ఏవో అక్షరాలు రూపొంది వున్నాయి.

"ఇది ఏ భాష – ఇందులోని సందేశం ఏమిటి?

తక్ష... శిల్పాచార్యుని వద్దకు పరుగు తీసిందామె. శిరవి వాంఛతో తృప్తుడు, శిలాన్ని దాటుకుని పునర్జన్మించిన ఆత్మ, ఆ వీధిలో అందమైన ఆడపిల్లలా పరుగులు తీస్తున్న దృశ్యాన్ని దర్శించిన ప్రకృతి పులకించింది. చెట్టు వృక్షాలనుంచి పూలు రాలాయి. అవన్నీ తమ గర్భాల గంధాల్ని

కోమలంగా గాయాలను అప్పగించి పంపిస్తున్నాయి. వెంపరులు జలదరించి తేమ్మగిలినట్లు కలవరపడుతున్నాయి.

"ఆచార్యా! ఆచార్యా!"

ఆ పిలుపులోని ఆర్తికి కళ్ళు విప్పి చూశాడతను. ఆ కంఠంలోని ఆతురతకు, ఉద్వేగానికి ఆశ్చర్యపోతూ లేచాడతను. "అమ్మా! ఏమిటి తల్లీ! ఎందుకలా పరుగులు తీస్తున్నావు" ఆమె ముఖంలోని కురులత. జాలు అతనికి సమ్మోదాన్ని రేకెత్తించాయి.

"చూడండి! ఈ ఆకులోని రేఖల్ని చదివి చెప్పండి" ఉత్కంఠతో అతని ముఖాన్ని చూస్తూందామె.

"ఇందులోనా! ఏమున్నాయి?" ఆమె తెలివైన యువతి అని మాత్రం తెలిసిన ఆ శిల్పాచార్యుడికి ఆమె ధోరణి అర్థం కాకుండాపోతూంది.

"దయచేసి చూడండి — ఇందులో ఒక భాష వుంది."

"అలాగే" అటూ ఇటూ ఆ పత్రికను త్రిప్పి చూశాక అతనికి అందులోని అక్షరాలు అర్థం అయ్యాయి.

"आयामि" అన్నాడతను.

"ఆయామి - అంటే"

"వస్తున్నాను"

"అవును - వస్తున్నాడు" ఆవేశంతో కేరింతలాడినంత పనిచేసిందామె..

"ఎవరు? ఎక్కడికి?" అడిగాడాయన.

"నాకూ తెలియదు - కానీ వస్తున్నాడు" అంటూ అతనికి కృతజ్ఞతల్ని చెప్పి కొండగాలికి వెన్నెలిలా అక్కడనుంచి ఒక్క క్షణంలో మాయమైంది.

"ఆచార్యా! ఆమె....మన జమీందారుగారి కుమార్తె కదా" ప్రశ్నించాడు శిష్యుడు.

"అవును. ఆమె పేరు ప్రవాళ" ఆమెలోని వర్చస్సు, ముఖంలో కదలాడే పసితనపు నైర్మల్యం, అంగాల వెల్లువలా ఆమె ప్రవహించే విధానం ఆచార్యుణ్ణి ముగ్ధుణ్ణి చేశాయి. కనుచూపుమేర దాటిపోతున్న ఆమెకేసి చూస్తూ నిలుచున్నాడు.

"ఈ అమ్మాయికున్న భావావేశం, కళాత్మక హృదయం ఈమెను రక్షించాలి" అనుకుని లోలోపలే ఆశీర్వదించాడాయన.

అతను ఒకచేత జపమాలను, మరోచేత కమండలువును తీసుకుని ఆలోచనామగ్నుడై నడుస్తున్నాడు. నిరంతర శివధ్యాన తత్పరుడైన అతను శిష్యునికి అపర శివమూర్తిలా దర్శనమిస్తున్నాడు. ముఖమండలం ముంగిట వెన్నెల పడుతున్నట్లున్న అతని తెల్లని గడ్డం మెరుస్తూ అతని మేధావితను ప్రకటిస్తూంది. అమరశిల్పాల్ని దర్శించడానికా అన్నట్టు అతను తదేకంగా ఆకాశలోకాల్ని చూస్తున్నాడు.

గురుదేవుడు ధ్యానాసీనుడై లేచిన కూర్మాకారదారుపీఠాన్ని, విబూది చందన కరండికను, బంగారు పళ్ళెరాన్ని, దీపపు కుందిని, అగరు మానె కొప్పెరను, తిలకపేటికను, ఉదికిన బట్టల్ని తీసుకుని శిష్యుడు ఆయన ముందుగా దారితీశాడు. శిల్పాచార్యుని ముందు నడుస్తున్న శిష్యుడు ముళ్ళ కంపల్ని, కరకురాతిపలుకుల్ని కాళ్ళతో నెట్టివేస్తున్నాడు.

"ఆచార్యా! కొలనిగట్టుమీద మీరు అర్చించిన ఆ శిల్పం...." ఆచార్యుని ప్రసన్న వీక్షణాన్ని గుర్తించి తన సందేహాన్ని వ్యక్తం చేశాడు శిష్యుడు.

"ఆ విగ్రహం యోగముద్రలోని పంచముఖ విశ్వబ్రహ్మది. ఆ బింబాన్ని నేనే మలచాను. శిల్పి తాను చెక్కిన దేవబింబాన్ని తానే అర్చిస్తే ఫలితం శతాధికంగా వుంటుంది. సత్వరంగా మహోభీష్టి సిద్ధిస్తుంది."

"విగ్రహాలు దేనితో తయారుచేసుకుంటే శ్రేష్ఠమంటారు?"

"మృత్తికా (మట్టి) దారు (కర్ర), శిలా విగ్రహాల కంటే లోహ విగ్రహాలు శ్రేష్ఠం. ఆ లోహంలో కూడా రాగికన్నా వెండి, వెండికంటే బంగారం, దానికంటే రత్నమయ విగ్రహారాధన ఉత్తమోత్తమం. వీటన్నిటి కంటే ఆరాధకుడి అంతర స్థితమైన భక్తి ప్రధానమనుకో!"

"దేవతా విగ్రహాలు మనుష్యుల్లాగా అన్నివైపులా వ్యక్తమవ్వాలా? లేక...."

"దేవతా బింబాల్లో ముఖ్యంగా పూర్ణబింబాలు సర్వోత్కృష్టం. అంటే విగ్రహం ముందు భాగమే కాకుండా వెనకభాగం కూడా శాస్త్రాను గుణ అంగ పరిమాణాలతో పూర్తిగా శిల్పించి వుండాలి. ఇలాంటి పూర్ణ బింబాన్ని పూజిస్తే పూర్ణకాములౌతారు. ఉత్తమ ఫలం ప్రాప్తిస్తుందన్న మాట.

ఇక అర్ధబింబాలు—ఈ అర్ధ చిత్రాల్లో ముందు భాగం మాత్రం మలచబడి వెనుక భాగం చదునుగా వదిలివేయబడి వుంటుంది. ఇలాంటి విగ్రహాల్ని అరాధిస్తే మధ్యమ ఫలం దక్కుతుంది.

ఆభాస బింబాల విషయానికొస్తే—ఈ చిత్రాలు ఎత్తు పల్లాలు లేని కాగితం మీదో, ఫలకం మీదో లిఖించబడి వుంటాయి ఈ చిత్రాలు వున్నట్లే కనిపిస్తాయిగానీ పరిపూర్ణ ఆకృతి వుండదు. వీటిని అందుకే ఆభాస చిత్రాలంటుంది కాశ్యప శిల్పశాస్త్రం. వీటిని అర్చిస్తే ఫలితం అంత సంతృప్తి నివ్వదు. ఇదీ వాయవా శిల్పశాస్త్రం విగ్రహారాధనకు సంబంధించి వ్యక్తీకరించిన రహస్యం."

'ఒక సందేహం వ్యక్తంచేస్తే దాని పూర్వాపరాలు ఇంత కూలంకషంగా వివరించే మీలాంటివారి శుశ్రూష చేయడం నా భాగ్యం" అంటూ శివ్యుడు ఆయనకు నమస్కరించి ఉత్సాహంతో ముందుకు సాగాడు.

శిల్పమందిరం ఇక వాళ్ళకు ఓ ముప్పై ధనుస్సుల దూరం వుంది. శిల్పి కొడుతున్న ఉలిదెబ్బలు స్పష్టంగా అక్కడికి వినవస్తున్నాయి. నగిషీపూల కారకలు రాలిపడుతున్నట్లు ఉలుల తాకిడికి శిలలనుంచి మిణుగురులు ఎగసిపడుతున్నాయి.

అక్కడ జంబూ (నేరేడు), అశ్వత్థ (రావి) మహావృక్షాలు శాఖోపశాఖలుగా వితానాన్ని దాటి, అంతరించిపోతున్న ఆ శిల్పకళని ఆశీర్వదిస్తున్నట్లు విస్తరిస్తున్నాయి. చిక్కని పీఠల్లో చెక్కబోయే విగ్రహాల పరిమాణానుగుణంగా సమీపిత పర్వత ప్రాంతాలనుంచి వాహనాలమీద తరలించుకు వస్తున్న పెద్దపెద్ద శిలాఖండాల్ని ఒకవైపు దించుతున్నారు. అక్కడి కూలీల కోలాహలం ప్రశాంతమైన ఆ వన ప్రాంతంలో ప్రతిధ్వనిస్తూంది. దానికి నేపథ్య సంగీతంలా శిలాతలాలమీది టంక (ఉలి) విన్యాసాలు వింత సవ్వడులు సృష్టిస్తున్నాయి.

తరగతుల వారీగా శిష్యులు కొంత దూరదూరంగా తమతమ పనుల్ని ఏకాగ్రతతో నిర్వర్తిస్తున్నారు.

"సోదరా నేను వేసిన గీతల ప్రకారం ఆ శిరసు మలచాలి. కొద్దిగా వ్యత్యాసం వచ్చినా నాన్నగారి విషయం తెలిసిందేకదా" సూత్రగ్రాహి వర్ధనుని హెచ్చరించాడు.

"ప్రాథమిక రూపాన్ని ఏర్పరచమని మాత తక్షకుడికి ఆ శిలను అప్పగించాను. స్థపతులవారు నన్ను మహాపీఠాన్ని త్వరగా పూర్తిచేయ మన్నారు...." అంటూ పీఠంలోని కంఠాన్ని, కట్టడను, మహాపట్టికను కొలిచి చూసుకుంటూ అప్పైన పద్మాన్ని ఎన్ని అంగుళాలో మరోసారి గణించుకుంటున్నాతను.

"నువ్వు చెక్కుతున్న మకర, వ్యాళ, గరుడ, వృషభాది చిత్రాలు పీఠానికి వన్నె తెస్తున్నాయి."

"బంగారుతోనో, వెండితోనో పూసిస్తే మరింత కళాత్మకంగా వుంటుంది పీఠం."

"మరి దేవతా విగ్రహాలు లేకపోయినా వాటిస్థానే నిలిచి పూజకు అర్హమయ్యే ఈ పీఠాల్ని ఎంతో భక్తితో మలచాలి మనం!"

"ప్రాతః స్నానానికి వెళ్ళిన ఆచార్యులు ఇంకా " అంటూ వెనుదిరిగి చూశాడు సూత్రగ్రాహి

"వస్తున్నారు...." అంటూ వర్ధకి తన చేతిలోని అయోఘనంతో ప్రక్కనున్న శిలమీద గట్టిగా రెండు మూడుసార్లు కొట్టాడు. ఇనుప రజ పరిమాణం ఎక్కువగా వున్న ఆ శిల హెచ్చరిక ఘంటికను ప్రయోగించినట్లు ఠంగ్‌మని ధ్వనించింది. సృష్టికి ప్రతిసృష్టి చేయిస్తున్న విశ్వామిత్రులిలా స్థపతులవారు, ప్రాణప్రతిష్ఠ చేయించుకుంటున్న గణాలు, ఏనుగులు, పక్షులు ఇలాంటి నానావిధ మూర్తుల్ని తదేకంగా పరిశీలిస్తూ ముందుకు వెడుతున్నారు.

"మృదుల వస్త్రాలెందుకు వేసుకోలేదు మీ కాళ్ళక్రింద? అలా నగ్న పాదాలతో ఆ శిలామూర్తులమీద కూర్చుని చెక్కకండి. కపిలం గోనె సంచుల్నో, పాతబట్టల్నో మీ పాదాలక్రింద వేసుకోండి" అంటూ శిల్పులకు మార్దవంగా సూచించారాయన. ఎండ ఎక్కేకొద్దీ పీఠలోని శిలలు కూడా వేడెక్కిపోవడం సహజం. ఆ కవోష్ణమే క్రమేణ శిల్పి శరీరానికి పట్టించడంచే రక్తం పడడం కూడా కద్దు. అలా శక్తికి, బాధావిముక్తికీ శిల్పాచార్యులవారి సూచన ఆదరణీయమైందనే విషయం అనుభవజ్ఞులైన శిల్పులకు మాత్రం తెలుసు

"అయ్యా! ఇది ఏ తాళ ప్రమాణంతో చెక్కుతున్న బింబం" ఓ శిల్పి మలుస్తున్న విగ్రహాన్ని పరిశీలిస్తూ అడిగారాయన.

"ఇది ఉత్తమ దశ తాళప్రమాణంతో రూపొందిస్తున్న విగ్రహం ఆచార్యా"

"ఈ బింబం కంటిలోపలి విస్తారం– అదే తెల్లగుడ్డు విస్తారమెంత?"

"12 యవలు"

"నల్లగుడ్డు విస్తారం?"

"8 యవలు"

"యవధాన్యపు గింజను సేకరించుకురా" విగ్రహ నేత్రాల్ని దీక్షతో పరిశీలించసాగాడాయన. 'సర్వేంద్రియాణాం నయనం ప్రధానం' అన్నట్లు దేవతా విగ్రహాల విషయంలో కంటిపాప సమదృష్టిని కలిగి వుండేలా శ్రద్ధ తీసికోవడం శిల్పి ప్రధాన బాధ్యత. ఏమాత్రం వక్రదృష్టి విగ్రహానికి ఏర్పడినా దేవాలయాన్ని కట్టించే యజమానికి అశుభం కలుగుతుంది.

"ఇదిగో ఆచార్యా" యవగింజను అందించాడతను.

"యవను ఒక నన్నని దారంమీద పెట్టి కొలువు ...అది 12 యవల పొడవు. కంటి పొడవు చూడు....ఒక యవ గింజ వాసి తగ్గిందంటే ... దానితో కనుపాప పరిమాణం తగ్గుతుంది. దురదృష్టవశాత్తూ విగ్రహం చూపు ఏ ఆగ్నేయ దిక్కుకో పడిందంటే....మనల్ని ఆదరిస్తున్న ఈ జమీందారుగారికి మనం ద్రోహం చేస్తున్నామన్నమాట. ఇక్కడొక ముఖ్యాతి ముఖ్య విషయం వుంది. ఈ వడ్లగింజను ఎప్పుడూ విలువుగా పెట్టి కొలవాలి. అప్పుడే 8 యవలు ఒక దేవాంగుళం అవుతుంది. ఈ గింజను అడ్డంగా పెట్టి కూడా కొలవవచ్చు. అప్పుడు నాలుగు యవల పరిమాణం మాత్రం ఒక దేవాంగుళంగా గుర్తించాలి. జాగ్రత్త...." అంటూ ఆయన తన శిల్పగృహంలోకి వెళ్ళిపోయాడు.

తను కూర్చునే వ్యాఘ్రాజినం ప్రక్కగా వున్న నటరాజు పాదాల మీద, కొలని గట్టున కోసుకుని వచ్చిన పారిజాత సుమాల్ని వెదజల్లాడు, కాసేపు ప్రశాంతంగా పులిచర్మంమీద కూర్చున్నాడు.

"నాన్నగారూ! జమీందారుగారు వస్తున్నారు" అంటూ సూత్రగ్రాహి శిల్ప గృహంలోకి వచ్చాడు.

"స్థపతిగారికి నమస్కారాలు."

"విభీషణరావుగారూ రండి" లేచి వెళ్ళి సాదరంగా ఆహ్వానించి ఎదురుగా వున్న పీఠం మీద కూర్చోమని స్థపతి జమీందారును కోరాడు.

"అయ్యా! మీరు ఋషితుల్యులు. మీకు తెలియందేమున్నది? నా అర్ధాంగి ఆఖరి కోరికగా ఈ ఆలయ నిర్మాణ బృహత్కార్యాన్ని భుజాని కెత్తుకున్నాను. ఇంతకు మునుపు రెండు మూడుసార్లు విఘ్నాలు ఎదురయ్యాయి. అవి పునరావృతం కాకుండా మీరు శ్రద్ధ వహించాలి."

"అది నా బాధ్యత, నా కర్తవ్యం, నా ఊపిరి. నేను స్థాపత్యం వహించినవాణ్ణి—స్థపతిని. అంటే ..." తనను గురించి తానే చెప్పుకోవడం ఇష్టంలేక ఆగారాయన.

"స్థపతి అంటే నాకు తెలుసును లెండి. మా అమ్మాయివల్ల ఇలాంటి విషయాలు కొన్ని తెలుసుకోగలిగాను" కుమార్తె వివరించిన విషయాలు స్మరణకు వచ్చాయతనికి.

"నాన్నగారూ! స్థపతి సర్వాంగ సుందరుడుగా వుండాలి. స్థపతికి గణితం, పురాణం, చిత్రలేఖనం మొదలైన కళలతో మంచి పరిచయం వుండాలి. దయాధర్మ గుణాలుండాలి. స్థపతి సోమరితనం లేనివాడుగా వుండాలి. ఇంద్రియ నిగ్రహణ వుండాలి. సప్త వ్యసన వర్జితుడుగా వుండాలి. దృఢమైన నిర్ణయాలు తీసుకునే మనస్తత్వం వుండాలి. శిల్ప ఆగమ వాస్తు శాస్త్రాల్లో నిష్ణాతుడై వుండాలి. దేవతా ప్రతిమల్ని శిల్పించడమే కాకుండా వాటిని ఆలయాల్లో ప్రతిష్ఠించగల శక్తిసంపన్నుడై వుండాలి" ఈ మాటలు మనసులో ప్రతిధ్వనించడంతో స్థపతివేపు భక్తి పూర్వకంగా చూశాడు జమీందారు.

"ఎవరయ్యా అక్కడ.... సూత్రగ్రాహిని, వర్ధకిని, తక్షకుని పిలవండి" స్థపతి ఒక శిష్యుని పురమాయించాడు.

"అతను సూత్రగ్రాహి ... నా కుమారుడు" పరిచయం చేశాడు స్థపతి.

"సూత్రగ్రాహిగా వ్యవహరించేవారు స్థపతి పుత్రుడుగానీ ప్రధాన శిష్యుడుగానీ అయివుండాలి. అతను శిల్ప వాస్తు విషయాల్ని స్థపతి ద్వారా తెలుసుకుని వుండాలి. స్థపతి ఆజ్ఞను శిరసావహించాలి. సూత్రం, దండం వుంచుకుని రాళ్ళమీద స్థపతి సూచించిన పరిమాణాలతో శిల్పాన్ని ముందుగా గీసివుంచడం ఇతని పని ... అవునా ..." కించిత్ గర్వంతో జమీందారు స్థపతిని చూశాడు.

"ఈ విషయాలు మీకెలా తెలుసు?" ఆశ్చర్యంతో అడిగాడు స్థపతి.

'మా అమ్మాయి పురావస్తు విభాగానికి సంబంధించిన చదువే చదివింది. శిల్పాలన్నా, శిల్పులన్నా విపరీతమైన అభిమానం. ఆలయాల్ని గురించి ఆమె నాకు చాలా విషయాలు చెపుతూంటుంది".

"ఇంతకు మునుపే కలిసింది నన్ను. మీరు నిజంగా ధన్యులు ... ఆ అమ్మాయికి నా శుభాశీస్సులు అందించండి.... అతను వర్ధకి.... సూత్రగ్రాహి వేసిన రేఖల ప్రకారం ఇతను శిల్పాల్ని మలుస్తాడని మీకు నేను చెప్పనవసరం లేదనుకుంటాను...." భావయుక్తంగా నవ్వారు ఆచార్యుడు.

"ఇతను తక్షకుడు"

"ఇతని కార్యక్రమం గురించి చెప్పండి. అమ్మాయి చెప్పింది కానీ మరచిపోయాను"

"ఇతను కూడా దారు, శిలా శిల్ప నిర్మాణ చాతుర్యం కలవాడు అగ్ని కుండాల నిర్మాణం మొదలు శిల్పాలకు సంబంధించిన అన్ని విషయాలు తెలిసినవాడు. ముఖ్యంగా మా అందరికీ ప్రీతిపాత్రుడుగా వుంటూ, శిల్పించే కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తూ వుంటాడు" చిరునవ్వుతూ స్థపతి వివరించాడు.

"అవునవును .. జ్ఞాపకం వచ్చింది . మీరు వలుగురూ ఆలయ శిల్పకళకు నాలుగు స్తంభాలన్నమాట ... మీలాంటి శిల్పకళా దీక్షాదక్షులు మాకు తారసపడడం మా సుకృతం. మీకు ఏ సౌకర్యాలు కావాలిసివచ్చినా తెలియజేయండి. వెంటనే సమకూర్చుతాం. వీలైనంత త్వరగా ఆలయ నిర్మాణం. నింద ప్రతిష్ఠాపనం జరిగిపోవాలని నా ఆకాంక్ష ... నా ఆతురత మీకు చెప్పాలికదా మరి...." అంటూ లేచి నిలుచున్నాడు.

"చెప్పడం మరచాను.... మీకు సహకారంగా ఇంకా కొందరు శిల్పుల్ని రప్పిస్తున్నాను" అన్నాడు జమీందారు.

ఈ మాట వింటూనే స్థపతి ముఖమండలంలో ఏదో అశాంతి జమీందారుకు గోచరించింది.

"ఏం.... అవసరం లేదంటారా.... మీ యిష్టం.... దక్షిణ ప్రాంతంలో మంచి శిల్పాచార్యుల కుటుంబాలున్నాయని విన్నాను. అక్కడికి మా మనుష్యుల్ని పంపాను. ఎవరైనా వస్తే మీకు సహకరిస్తారు కదా అని నా ఉద్దేశం.... మీరు వద్దంటే అలాగే త్రిప్పిపంపుతాను వాళ్ళని" స్థపతి భావాన్ని చదవాలని జమీందారు అతని కళ్ళలోకి చూచాడు.

"అబ్బే ... రానివ్వండి.... వచ్చిన వారిని పంపడం భావ్యం కాదు " ఆగంతకుడెవరి వల్లనో తనకు అపకీర్తి కలగబోతోందన్న శంక మనసుకు తోచడం చిత్రంగా అనిపించిందాయనకు. అవును అతనెవరో ఇక్కడికే వస్తున్నాడా? నాకే మచ్చ తెచ్చేటంతటి అమరవజ్ఞుడా ఆతను? ఎవరు? ఎవరతను?? తీక్షణంగా ఆకాశానికేసి చూస్తూ నిలుచున్నాడు స్థపతి.

"నమస్కారం ... వెళ్ళివస్తాను" ముభావంగా ఎటో చూస్తున్న స్థాపనాచార్యుని దగ్గర సెలవు తీసుకున్నాడు విభూషణరావు.

# 2

ఉదయ బింబానికి వృక్షాలు అడ్డు వచ్చినప్పుడే సూర్యుడు భూగోళానికి చెందినవాడవుతాడు. లేకపోతే ఆ పొద్దుపొడుపు ఏ లోకానిదో అనిపిస్తుంది. శిలమీద శాస్త్రం వాలితే ఒక రూపం తేలుతుంది. శిలను శాస్త్రంతో అనుసంధిస్తే కళ పుడుతుంది. కళ దైవాంశ అవుతుంది. ధనుస్సు నుంచి శరంలా శిల్పిద్వారా శాస్త్రం వ్యక్తమవుతుంది. సంధించేది ఎవరో? సాధించేది ఏమిటో? మనిషి ప్రేక్షకుడు సమీక్షకుడు అంతే. శిల్పికున్న కలలు శిలా కావ్యాలవుతాయి. ఆకార రేఖలతో రాళ్ళమీద కబ్బాలు పబ్బాలు జరుపుకుంటాయి. తన కళాత్మక భావాల్ని శిరసావహించే మనిషి దొరక్క శిల్పి శిలలతో చెలిమి చేసుకుంటాడు అది కళల కలిమిగా మిగిలిపోతుంది.

విశాల నీల విశ్వసాగరంలో తేలియాడే తెప్పలాంటి భూగోళం మీద మనిషి కళలతోనే మానవత్వాన్ని నిలుపుకోవలసి వుంటుంది. శిల్పం విశ్వమానవ కావ్యం. మహాశిలలు శిఖరాలపై వాలిన గండభేరుండాలు. శిల్పి వాటికున్న క్రూరత్వాన్ని తొలిచి, వాటినుంచి హంసల్ని, పరమహంసల్ని వెలికి తీస్తాడు. శిల్పాలకు శిలలు పంజరాలు. నిరామయ శిలామయ జీవులకవి కారాగారాలు. ముక్కా చెక్కా అక్కా రూపొందని శిల్పాలు శిలాలోలితలు. అవి భూగర్భ గృహపాలితలు.

ప్రకృతి పరాకృతిగా మారడానికి ముందు ఒక వికృతికి లోనవుతుంది. శిల్పకళా అంతే — శిల్పీ అంతే. సున్నితమైన శిల్పకళ కఠినమైన శిలల్ని ఆశ్రయించి వది కాలాలు జీవిస్తుంది. మధురమైన ప్రేమ కర్కశ హృదయాల్ని తాకి భగ్నమై పరిమళిస్తుంది. చిన్న శిలను ఆశ్రయించుకుని శిల్పకళ మహోన్నత శిఖరాల్ని అధిగమిస్తుంది. ఉలి తగలగానే శిల

SRI VENKATESWARA ... RESEARCH CENTRE
TIRUPATI.
48796



తాండవిస్తుంది. శిలా తాండవం శిల్పంలో విశృంఖలంగా పరిణమిస్తుంది. శిల్పం కాలం పళ్ళ కింద రాయిలా పడి కొరుకుడు పడకుండా చిరకాలం నిలుస్తుంది.

శిల్పాన్ని విప్పితే శాస్త్రం కప్పితే కల్పన. పాంచభౌతిక ప్రపంచంలో కిరణాలూ శిల్పులే—అవి ఏవో నీలినీలి నీడల్ని శిల్పిస్తాయి. గాలులూ శిల్పులే—అవి ఆకాశ వేదికలమీద మేఘాల మృదుపదార్థాలతో ఏవో రూపాల్ని రూపొందిస్తాయి. జలాలూ శిల్పులే—అవి అలల వేళ్ళతో ఇసుక తీరాలమీద హ్రస్వలిపిలో జలభావాల్ని రచిస్తాయి. భూమాతా ఒక మృణ్మయ శిల్పి అది అందాల శిఖరాల్ని తొలుస్తుంది. ఆకాశం ఒక శిల్పి అది అగోచర బింబాల్ని నిర్మిస్తుంది కాలం ఒక విచిత్ర శిల్పి— అది విశ్వకర్మను మొదలు విశ్వాంతర శిల్పాల్ని సృష్టిస్తుంది. నక్షత్రాలు కిరణాల్ని ప్రసవిస్తాయి. గ్రహాలు కాంతుల్ని ప్రసరిస్తాయి. పక్షి కంఠంతో కూతను మలుస్తుంది. మొక్క పువ్వును పుట్టిస్తుంది విశ్వపతి అశ్వపతి (యోగి)తో కలిపి కళల్ని కలలు కలలుగా కంటూంటారు. విశ్వాంతరాళమంతా ఒక వినూత్న శిల్పశాల.

"అమ్మాయీ! శ్రీగంధం జమీందారు ఊరికి ఈ దారిపోతుందా? ఇంకా ఎంత దూరం వెళ్ళాలి?" కొండ చరియలో గడ్డి కోసుకుంటున్న ఓ గ్రామీణ యువతిని మృదువుగా ప్రశ్నించాడు సౌరాఖ్యుడు.

"ఆ ఊరు ఐదు క్రోసుల దూరం వుంది బాబూ రెండు కనుమలు దాటి నడవాలి." పైట చెంగు బిగించి కట్టుకుందామె ఆమె రూపం శిల్ప శాస్త్రానికి నమూనాలా అనిపించిందతనికి.

"బాబూ! మీరేమనుకోకపోతే కాస్త సాయం పట్టరూ" మోపును తలకెత్తమని కోరింది.

"నేనో మూడు క్రోసుల దూరం ఈ దారిలోనే వస్తా. ఆ తర్వాత మీరు మిగిలిన దూరం వెళ్ళిపోవచ్చు" తన వెనుక మౌనంగా నడుస్తున్న సౌరాఖ్యుణ్ణి ఉద్దేశించి అంది.

"అలాగే...." పరధ్యానంగా బదులు పలికాడు.

"ఆ ఆకుల కట్టేమిటి?" గోపవనిత భుజానికి వేలాడుతున్న పత్రసంచయాన్ని చూస్తూ అడిగాడు.

"అవి మోదుగాకుల్లే బాబూ. మా అయ్య రోజు కులదేవరకు పూజ చేసి మోదుగ విస్తరిలో తప్ప భోజనం చేయడు. అందుకని వీటిని కోసుకెళుతున్నా."

ఆమె ప్రకృతి సిద్ధమైన పరిపుష్ట సోయగాలు సౌరాఖ్యుని హృదయంలోని శిల్పతృష్ణను రగుల్కొలిపాయి. ఎండ తీక్షణంగా వుంది. మార్గాయాసక్లేశంతో అతను, వీరెండలలో కూడా వీరెండని దొరువుల మీదుగా దిగి స్వచ్ఛమైన జలాల్ని దోసిళ్ళ కొద్దీ త్రాగాడు.

జలభక్షణ, వాయు భక్షణాలతో శాఖోపవాసాలు చేస్తున్నట్లున్న తరు శాఖలు వేదాంతుల్లా ఆకాశ విలోకనాలు చేస్తున్నాయి.

నడచి నడచి ఉసిరిక చెట్టు నీడలో కాసేపు విశ్రమించారు వాళ్ళు.

శ్రుతిలీనంగా వాయులీన మధుర ధ్వనులు వెలువరిస్తున్న విహంగాలు కోనల్లోని ఉత్తాల తరువుల మీదుగా గగన విన్యాసాలు చేస్తున్నాయి. పొగ చల్లని లేత ఎండ ఎంతో తీక్షణతను అందుకుంటూంది. సూర్యుడు శుః ప్రభాభాసుడై మేఘ పంక్తుల మీదుగా గగన శిఖరారోహణం చేస్తున్నాడు. కొండ గుండెల పరిమళాలు వ్యాపిస్తున్నట్లు అక్కడ కలమాగిన పనస పళ్ళ మధుర పరిమళం వ్యాపిస్తూంది. దట్టమైన అరణ్యం ఆ కోన కన్య నీలి చూపుల్లా నిగూఢంగా వుంది.

"కళాకారుడిది కాముక దృష్టి.. కళాదృష్టి తెచ్చుకోలేని అమోఘ య ప్రయాణం కాబోదు" ఆ వనకన్య లావణ్యం, ఆమె వయోభారాలు అతనిలోని కళాతృష్ణని తట్టి లేపుతున్నాయి. ఆ కామినిని చూస్తూ తనను తనే సంధలించుకున్నాడు ఆ యువశిల్పి.

"మీరెక్కడ నుంచి వస్తున్నారు బాబూ!" నందివర్ధన సుమకోమలంగావున్న అతని శరీరాన్నీ, దానికి మరింత హుందాతనాన్నిస్తున్న శ్వేత వస్త్రాల్ని చూస్తూ అడిగిందామె.

"నేనొక సుదూర తెరువరినిలే...." నైష్ఠిక కాఠిన్యమేదో కంఠంలో ఖంగుమంది. తిరిగీ కాలుకదిపారిద్దరూ.

అతను దారిప్రక్కనున్న తులసి దళాలు రెండు తెంపి నోట్లో వేసుకున్నాడు. విష్ణుప్రియ తులసి పరిమళం వెంటనే అతని మనసును విష్ణు సన్నిధానానికి తరలించుకుపోయింది. కార్తీకమాసాల్లో ఉపవసిస్తూ రూపెత్తిన అచలిత భక్తిభావాల్లావున్న ఈ ఆమలక వృక్షాల క్రింద విష్ణు దేవుణ్ణి అర్చిస్తే జన్మ ధన్యమవుతుందని శాస్త్రం కదా! అనుకుంటూ ఏపుగా ఎదిగి నీలమేఘశ్యాముని రూపాన్ని తలపుకు తెస్తున్న ఉసిరిక వృక్ష సమూహాల్ని చూస్తున్న అతని మనసు దివ్యానుభూతినందుకుంది. ఆ కొండలు, కోనలు కోవెలలుగా, తంగేడు గుబురులు, అడవిమల్లెల పూల పొదలు ఆ ఆలయాల ముంగిట పద్మాలతో పెట్టిన మంగళ రంగవల్లులుగా అతని మనోనయనాలకు ప్రత్యక్షమయ్యాయి.

ఈ వృక్షాలు సాలగ్రామాల్ని, శివలింగాల్ని దానంచేస్తున్న పుణ్యమూర్తుల్లా వున్నాయి అనుకుంటూ బిల్వ వృక్షాలకు ప్రదక్షిణం చేసి ముందుకు సాగాడతను.

"బాబుగారూ! మా అయ్య పిలుపు వినిపిస్తూంది. ఇంకా క్రోసు దూరంలో వుంది మా కొండపల్లె దానిమీదుగానే వెళ్ళాలి మీరు" అంటూ కొండ మలుపుల్లో గబగబా సాగిపోయిందా ముగ్ధ. చేయెత్తి వీడ్కోలు చెప్పాడామెకు

చేతిసంచిలోని టంకాలు, అయోఘవాలు టంగుటంగుమని ధ్వనించి తమ ఉనికిని తెలియజేస్తున్నాయి. వెంటనే అతని హృదయం శిలా తులా

కారంగా మారిపోయింది. తన మాతృమూర్తి మనోవేదనాగ్ని జ్వాలికలా తనను పరివేష్టించి అతని పిడికిళ్ళు ముడుచుకుపోయాయి.

"పేదవాడి కోపం పెదవులు కొరుక్కోవడానికి తప్ప పనికి రాదయ్యా!" తల్లి దీనవదనం కళ్ళకు కనిపించింది.

"ధర్మం అందరికీ ఒకటేనమ్మా! పొగడ చెట్టులాంటి కన్నతండ్రిని పున్న పళంగా అన్యాయం చేసిన ఆ శ్రీగంధం సంస్థానాన్ని అంత సులభంగా వదలిపెట్టను. పెనకపోయిన లతలాగా శిల్పంకోసం వాళ్ళే పంపిన ఆహ్వానం నాకు లభించిన అవకాశం. ప్రతీకారం తీర్చుకుంటానమ్మా!" ఉలిని పట్టిపట్టి కాయలు కాసిన అతని అరచేయి ఉద్వేగంతో మరింత కఠినంగా మారింది.

"పొట్టేళ్ళు కొండలతో ఢీకొంటే ఏమౌతుందిరా తండ్రీ!" కన్నీళ్ళు పెట్టుకుందామె.

"కొండను ఢీకొనకూడదమ్మా! ఈ ప్రభాకర భూపతి కుమారుడు ఆ కొండలో దావానలం పుట్టిస్తాడు. ఈ పొట్టేలు కొమ్ముతో కొమ్మను రాపాడి కార్చిచ్చును పుట్టిస్తుందమ్మా! అది ప్రతీకారాగ్నిగా మారి వాళ్ళను చుట్టుముట్టుతుంది. అసలు నాన్నగారి అకాల అన్యాయానికి వెనుక దాగిన ఆ శృంగార రహస్యాన్ని ఛేదించగలిగితే కాని నాకు ప్రశాంతిలేదు. నిశ్చింతగా సెలవిప్పించమ్మా" తన మనోదర్పణంలో ప్రతిబింబించిన ఆ సన్నివేశం సౌహాఖ్యవిలో విప్పురాళ్ళను సంమర్షింపజేసింది. అతడు ఉరకలు కొడుతున్న కొండవాగులా వాగులూ వంకలూదాటి సాగిపోతున్నాడు దూరంనుంచి ఏవో మృగాల వింతధ్వనులు అతనికి వినవస్తున్నాయి. మాధవ దేవునికి, వసంతునికి స్వాగతమంటున్నట్టు మాధవీలతలు పూలపుప్పొడిని వెదజల్లుతున్నాయి. వన మల్లీ మకరందాల పరిమళం మరులు రేపుతూంది.

ఒక కోన మలుపులో పూస్తున్న ప్రసన్న పరిమళం అతని దృష్టిని మళ్ళించింది.

మనిషి ప్రకృతి తరంగాలు మీటే స్వరాల తంత్రుల వీణకదా మరి - అనుకున్నాడతను.

ఫలరసాల్ని కుత్తుకబంటిగా తాగిన చిలుకలు కలకండ పలుకుల్ని వనమంతా వెదజల్లుతూ ఎగసిపోతున్నాయి. చల్లని రాతిబండల మీద గుంపులు తీరిన అడవిమేకపిల్లలు ఆనందంగా గంతులు వేస్తున్నాయి. ఆ కీకారణ్య సోయగాల్ని పరిశీలించుకుంటూ సౌరాఖ్యుడు గమ్యానికేసి గమిస్తున్నాడు.

ఓ కొండపల్లె పరిసరాల్లో యువతులందరూ ఏదో ఉత్సవం చేసుకుంటున్న కోలాహలం అతనికి వినవచ్చింది. తన కాలిబాటను వదలి వాళ్ళకు తెలియకుండా అతను ఉత్సవ ప్రదేశాన్ని సమీపించి ఓ గుబురు చెట్టు కొమ్మల మధ్యనుంచి రహస్యంగా చూడసాగాడు.

"తిన్నదం నేర్చుకోవే ఎందుకైనా మంచిది" అంటూ ఒక తన్వె పిల్లను ఆటపట్టిస్తూ అశోకం దగ్గరకు లాక్కెళుతున్నారా బాలికలు.

అందాలు చిందుతున్న ఆ యువతి అందెలు మంజులంగా రవళిస్తుండగా అశోక వృక్షాన్ని తన మృదుల పాదంతో తాడించింది. మిగిలిన యువతులందరూ మొగ్గలెక్కడెత్తాయే ఈ కొమ్మలు అంటూ వెంటనే చెట్టును పరిశీలిస్తూ కిలకిలా నవ్వుతున్నారు.

"ఇలా రావే సిగ్గెందుకు....కౌగిళ్ళు పట్టడాలు నీకు అలవాటవుతుంది గానీ....గోముగా కౌగలించుకోవే భామా ఈ వృక్షాన్ని" అంటూ పరువాల బరిణెలా ఒక ముద్దుగుమ్మను కురవక వృక్షం వద్దకు తోలించుకుపోయారు. ఆ అమ్మాయి సిగ్గులొలుకుతూంది. అందుకు మొరాయిస్తూంది. తన ఈడు ఆడపిల్లల గోలను భరించలేక ఆ కురవకాన్ని కౌగిలించుకుందా చిన్నారి.

"విరులెక్కడే ఈ తరువుకు" అంటూ ఆ ముగ్ధలందరూ గోరింట చెట్టును ఎగబడి చూస్తున్నారు.

"ఈ పిల్లదాని బుగ్గల్లో పూచాయి మొగ్గలు గిల్లుకొండే" అంటూ అందరూ వెంటబడడంతో పరుగులు పెట్టిందా సిగ్గుమొగ్గ. "ఒక మాటకు ముందు నాలుగు నవ్వులు రువ్వుతుందే ఈ వగలాడి. ఈ పిల్లను పట్టుకోండి. దీని నవ్వుల వానకు పొన్న వన్నెవన్నెల పూలు పూస్తుంది." మరో సుదతిని చేయిపట్టి పొన్నచెట్టు వద్దకు నెట్టి ఆ అమ్మాయిని పకపకలాడించారా అమ్మలమిన్నలు.

"ఈ కొండగోగుతో సల్లాపిస్తే ప్రియుడితో ఊసులాడడం తెలిసొస్తుందే గుమ్మా" అంటూ మరోకన్నెను మోమాట పెట్టారు.

ఇలా ఆ అడవి నెమళ్ళలాంటి ఆడపిల్లలు కోనలూ, లోయలూ ప్రతిధ్వనించేలా కిలకిలలాడుతూ, కొండవాగుల్లా పడుతూ లేస్తూ, ఒకరి నొకరు తరుముకుంటూ, పరవశించి పాటలు పాడుకుంటున్నారు ప్రకృతి ఒడిలో విరిదండల్లా పెరుగుతున్న ఆ చిన్నారి కన్నెల దోహదక్రియా విలాసాలకు సౌరాఖ్యుడు ముచ్చట పడ్డాడు.

శిల్పి ఎంత అసమర్థుడు. అదే కవికుమారుడైతే ఓ భావగీతికను ఇప్పటి కిప్పుడే లిఖించి పాడుకుని వుండేవాడు. గాయకుడైతే ఆలాపన అందుకునేవాడు. నేనేం చేయను ఈ ఉలితో ఏ శిలమీద ఈ కోనకన్నెల స్వేచ్ఛా బృంద నృత్యాన్ని శిల్పించను! కళలన్నీ పరిమితాలే....కళాకారులందరూ అల్ప సుకృతులే. అనుభూతి అపారం. ఆవిష్కరణ అత్యల్పం." సౌరాఖ్యుడు భావావేశంతో రెక్కలు విప్పుకుని శిఖరాల మీదుగా ఎగిరిపోతున్న ఓ విహంగాన్ని ఒక చిరుశిల మీద చెక్కుతూ కూర్చున్నాడు.

పరువాల వింత పరిమళాలేవో తనను ఆవరించినట్లనిపిస్తే అతను చుట్టూ పరికించాడు. ఆ అడవి పిల్లలందరూ తనను తదేకంగా పూ పొదల

మాటునుంచి పొంచి చూస్తూండడంతో ఆ యువశిల్పి లేచి గబగబా తన దారి వెంబడీ నడకసాగించాడు.

* * *

"నేను నీకు అప్పగించిన శిలనుంచి శివలింగాన్ని ఎంతవరకూ వెలికి తీసావు?" స్థపతి తన కుమారుడు సూత్రగ్రాహిని పిలిచి అడిగాడు.

"వర్ధకిని నేను హెచ్చరిస్తూనే వున్నాను. దాదాపు పూర్తి కావస్తోంది." "త్వరగా పూర్తికావాలి. అది జమీందారుగారు తనకు తెలిసిన స్వామి ఊర్లో కడుతున్న ఆలయంలో ప్రతిష్ఠించబోతున్న శివ లింగం. ఈ శివలింగ ప్రతిష్ఠను కూడా నువ్వు దగ్గరుండి జరిపించి రావాలి." పుత్రుని వైపు వాత్సల్యంతో చూస్తూ అన్నారాయన. శిలలతో సహవాసం చేసి కఠినంగా మారిపోయాడా అన్నట్లు గంభీరంగా వుండే స్థపతి చిరునవ్వారడం చూసి. అతని శిష్యులు అదొక సన్మానంగా ఆనందపడతారు. సూత్రగ్రాహికి అలాంటి అనుభూతే కలిగింది.

"ఇంకో విషయం....శిల్పుల్ని విగ్రహాల నయన నిరూపణ విషయంలో అత్యంత శ్రద్ధ తీసుకోమని చెప్పయ్యా. బింబాల మీదకు ఆయా దేవతల్ని ఆవహింపజేస్తున్నాం కదా ఆ దృష్టిపాతం వక్రమైతే అన్నీ అనర్థాలే జరుగుతాయి. కళ్ళు మూసుకుని ఇదంతా కల్పన అనుకునే అపరిణత మనస్కులను గురించి మనం ఇప్పుడు చర్చించాల్సిన అవసరం లేదు భగవంతుని ప్రతినిధుల్లా ఆయన పతిబింబాల్ని ప్రతిష్ఠిస్తూ బ్రతికే శిల్పులకు శాస్త్ర మర్యాద అవసరం. అలాంటి నాస్తిక మనస్తత్వం వున్న వాళ్ళెవరైనా మన శిల్పుల్లో వుంటే మరెక్కడైనా పనికి కుదరమని చెప్పు వాళ్ళతో....'' స్థపతి వదనంలో ఆవేశంతో ఒ శితమైన ఆవేదన కదలాడింది.

"నాన్నగారూ! విగ్రహాల దృష్టి క్రిందకుపడితే యజమాని అయిన ధర్మకర్త నాశనం జరుగుతుందనీ, దృష్టి ఊర్ధ్వంగా వెళితే అశుభాలు

ఆపదలు వంటబట్టిస్తాయని, పార్శ్వదృష్టి ఏర్పడితే గ్రామప్రజలు నశించి పోతారనీ కాశ్యప శిల్పశాస్త్రం ఘోషిస్తూందన్న విషయాన్ని నేనెలా విస్మరిస్తాను ?" తలవంచుకుని దృఢంగా సమాధానం చెప్పిన కుమారుణ్ణి ఆయన ప్రశంసాపూర్వకంగా చూశారు.

"సెలవు నాన్నగారూ ...ఆ పనిని పూర్తి చేయిస్తాను." లేచిరా సూత్రగ్రాహి వర్ధకి వద్దకు బయలుదేరాడు.

ఒక ప్రత్యేకమైన శిల్పగృహంలో వర్ధకి ఉపవాస దీక్షతో శివదేవ లింగానికి తుది మెరుగులు దిద్దుతున్నారు. ఆ లింగాన్ని చెక్కడం ఎవరికీ కనబడకుండా శిల్పగృహం చుట్టూ కొబ్బరిమట్టలతో దళ్ళు కట్టివున్నారు. ఆలయంలో ప్రతిష్ఠించబోయే లింగాన్ని చెక్కే సవ్వడి కూడా ఇతరులకు వినబడకూడదు. ఆ శివలింగాన్ని చెక్కడం ప్రారంభమైనప్పటి నుంచి ఆ శిల్పగృహం ముందు మంగళవాద్య ఘోష కొనసాగుతూనే వుంది.

"చిన్న శిల్పస్వాములు వస్తున్నారు....శ్రుతి పెంచండి శిల్పిస్తున్న ఉలి సవ్వడి వెలికి వినిపిస్తూందని సూత్రగ్రాహి ఎక్కడ ఆగ్రహిస్తాడోనని వాద్యగాళ్ళు విజృంభించారు. మంగళవాద్య ఘోష ఆ పరిసరాల్లో ప్రతిధ్వనిస్తూంది పర్వత శిఖరంలా ఉన్నతంగా వున్న జమీందారు పాత మేడ బీటలు వారిపోతుందా అన్నట్లు ఆ వాద్యధ్వనులున్నాయి. ఆ ధ్వనులకు లయబద్ధంగా ఓ గుర్రం కదం త్రొక్కుతూ వచ్చినట్లు రంగులుగూడలందిని లాక్కుంటూ ఆ మహలు ముందుకు వచ్చి ఆగింది ఆ తర్వాత కొంతసేపటికి వరుసగా నాలుగైదు గుర్రపుబళ్ళు వచ్చి ఆ మహలు ముందున్న విశాలమైన తోటలోని చెట్ల క్రిందికి వచ్చి ఆగాయి జమీందారు మహలు వెలికి వచ్చారు. వచ్చిన భూస్వామి శాలూకు వారందరినీ ఆదరంగా ఆహ్వానించి లోపలికి తీసుకెళ్ళారు.

భూస్వామితోపాటు వచ్చిన వారందరూ అక్కడి ఇసుక నేలమీద పరచిన తివాచీ మీద కూర్చున్నారు. జమీందారు కూడా నిరాడంబరంగా

వారితోపాటే తూర్పువి శివలింగ సౌందర్యాన్ని చూడాలని ఉబలాటపడ సాగారు.

అయ్యా! ఆ దేవ బింబానికి మంగళస్నానాలు నిర్వర్తించి, పూజాది కాలు పూర్తిచేసి త్వరలో మీకు అప్పగిస్తాము" అంటూ స్థపతి శిల్పగృహం లోకి వెళ్ళిపోయారు.

జమీందారు వచ్చిన అతిథులతో స్థపతికున్న శాస్త్ర పరిజ్ఞానం, వ్యక్తిత్వం, ఆయన శిష్యులకున్న భక్తిశ్రద్ధలు, తాను నిర్మించబోతున్న ఆలయ విశిష్టత—ఇలాంటి విషయాల్ని గురించి ముచ్చటిస్తున్నారు.

"లేవండి....లేవండి" మంగళవాద్యాలతో పాటూ విగ్రహం తరలి రావడం చూసి జమీందారు అక్కడ సమాసీనులైన వారందరినీ నిలబడ మన్నారు.

ఇష్టదేవతను స్తుతిస్తూ స్థపతి, పీఠంమీద నిలబెట్టిన బింబం ప్రక్కన నిలబడ్డారు. పసుపు, కుంకుమాది పూజాద్రవ్యాలతో ఆ దేవబింబం సాక్షాత్తూ ధ్యానశివుని ప్రతిబింబంలా దివ్యత్వంతో కళకళలాడుతూంది.

భూస్వామి మంగళవాద్య గీతాల మధ్య స్థపతిని పుష్పమాలలతో సమర్పించి, పాదాభివందనం ఆచరించారు. పీర్కాని దోపతులతో పాటూ విలువైన వస్త్రాలతో ఆయనను సన్మానించారు. స్థపతి అతనిని ఆశీర్వదిస్తూ కొన్ని సూచనలు చేశారు.

"అయ్యా! ఈ దేవబింబాన్ని జాగ్రత్తగా తీసుకుని వెళ్ళి ముందుగా మీ గ్రామానికి ప్రదక్షిణ చేయించండి. తర్వాత మీరు నిర్మించిన ఆలయా నికి ఈశాన్యపు గదిలో ఈ బింబాన్ని ఓ మండలం రోజులు వరిధాన్యపు రాశిలో దాచి పైకి కనిపించకుండా వుంచండి. దీన్ని ధాన్యాధివాసం అంటారు.

మండలం రోజులు (40 రోజులు) గడిచాక పవిత్రమైన కూప(బావి) జలంతో గానీ, నదీజలాలతో గానీ సుగంధద్రవ్యాలతో కలిపి నింపిన తొట్టిలో ఈ దేవబింబాన్ని — సూత్రగ్రాహి మావాడే వస్తున్నాడు. అతను చెప్పినన్ని రోజులుంచి వెలికి తీయండి. తరువాత పంచగవ్యాలతో, చంద నంతో ఆ బింబాన్ని అభిషేకించాలి. దీన్ని జలాధివాసం అంటారు.

ఆ తర్వాత పట్టువస్త్రాలతో బింబాన్ని అలంకరించాలి. ఆ బింబానికి నైవేద్యం పెట్టాలి. దూది పరుపులు పరిచి వాటిమీద శయనింపజేయాలి. దీన్ని శయనాధివాసం అంటారు.

అలా శయనాధివాసం పూర్తిచేశాక యాగశాలలో యజ్ఞం చేసి జల కలశాలలోకి దేవతల్ని ఆవాహన చేయాలి. ఆ శాస్త్రోక్త విషయాలన్నీ మావాడు దగ్గరుండి నిర్వహిస్తాడు. మీకు ముందే చెప్పాలని ఈ వివరాలు తెలిపాను....అన్నీ సవ్యంగా జరుగుతాయి....బింబ స్వీకరణ చేయండి" అన్నాడు స్థపతి.

విగ్రహ ప్రతిష్ఠకే ఇంత చరిత్ర వుంటే ఇక ఆలయవాస్తుశాస్త్రం ఎంతవుందో, శిల్పాగమ శాస్త్ర పరిజ్ఞానం ఎంతవుందో అని ఆలోచిస్తున్న వారందరిలో శిల్పులమీద, ఆలయ కళల మీద అనిర్వచనీయమైన గౌరవ భావం ఏర్పడింది.

"ఓ దేవబింబమా! ఈ రోజు మంచి ఈ కర్త నీకు పూజాది విధా నాన్ని సక్రమంగా భక్తిశ్రద్ధలతో నిర్వర్తిస్తాడు. ఆయనను, ఆయన కుటుం బాన్ని, ఆ ఊరి ప్రజల్ని క్షేమంగా నీ చల్లని చూపులతో కాపాడు" అంటూ కన్యాదానం లాంటి బింబదానాన్ని నిర్వర్తించడానికి దేవబింబానికి సాష్టాంగ పడి లేచి స్థపతి నెమ్మదిగా స్వహస్తాలతో ఆ శివలింగాన్ని ఎత్తుతున్నాడు. ఆయనకు సహాయంగా ఓ చేయివేస్తూ సూత్రగ్రాహి, వర్ధకి, తక్షకి ప్రక్కన నిలబడ్డారు.

"ఆచార్యా! ఆగండి. ఈ శివలింగ నిర్మితిలో నాకు కొంత సందేహం ఏర్పడింది!" విగ్రహదాన ఉత్సవాన్ని చూడడానికి గుమిగూడిన స్త్రీ పురుషుల మధ్యనుంచి ఒక పురుష కంఠం ఖంగుమని వినిపించింది.

"అయ్యా! అలా ఆక్షేపించిన వారెవ్వరో ఇలా ముందుకు వచ్చి మా లోపాల్ని ఎత్తిచూపితే వాళ్ళను మేము సమ్మానిస్తామే కానీ అవమానించము" అంజలిబద్ధుడై వినయంగా చూస్తున్న ఆ స్థపతి ఔన్నత్యానికి సౌరాఖ్యుడు ముగ్ధుడయ్యాడు.

"ఆ అతిథిని మేము ఆహ్వానిస్తున్నాం" తిరిగి జనసమూహంవైపు చూసారాయన.

స్థపతి మనస్సు మునుపు కీడు శంకించినట్టే ఈ అపశ్రుతి ఎదురు పడడంతో అతని ఎదలో ఓ బాధాకరమైన స్పందన మెరుపులా మెరిసింది. గుండెలో కమ్ముకున్న కారుమబ్బులు పరస్పరం ఢీకొని ఫెళఫెళార్భటులతో ఉరుముపాగాయి. నయనాల్లో సన్నని తుంపరలా కన్నీటి బిందువులు క్రమ్ముకున్నాయి.

"స్థపతుల వారికి ప్రణామాలు'' సౌరాఖ్యుడు వంగి ఆయన పాదాలకు నమస్కరించాడు.

"అయ్యా! మా శిల్పకల్పనలోని దోషం ఏమిటో ఎత్తిచూపుతారా?" అతని కంఠం కంపించింది.

"ఆర్యా! శివలింగం శిల్పశాస్త్రం ప్రకారం రూపొందకపోతే అది పెద్ద పులిలా ఆరాధించే వాళ్ళందరినీ హరించి వేస్తుందని మీకూ తెలుసు — కానీ . ''

''చెప్పయ్యా''

''ఈ శివలింగ రూపంలో లోపం వుందేమో అనిపిస్తుంది నాకు"

"ఆ లోపాన్ని ఎత్తి చూపాలిగా" మాటలో కాఠిన్యం ధ్వనించింది.

"పుం శిలాభిః కృతం లింగం స్త్రీశిలాభిస్తు పిండికా
నపుంసక శిలాభిస్తు పాదాధారః సమాచరేత్" అన్నాడు యువశిల్పి.

"కాశ్యప శిల్ప శాస్త్రంలోని 49 పటలంలో వున్న శ్లోకాన్ని ఆధారంగానే మేము శివలింగాన్ని నిర్మించాం" వినపాదిగా అన్నాడా శిల్పాచార్యుడు.

"అదే అక్కడే సందేహం" అప్పటికి అంతగా అందుబాటులో లేని కాశ్యప శిల్పశాస్త్రప్రతి వీరికి లభించిందన్నమాట— అనుకుంటూ తడబాటును అణచిపెట్టి సందేహాన్ని వ్యక్తం చేశారు.

"ఆ మాత్రం తెలియకనే ఉలిపట్టి శిలనెక్కామనా మీ ఉద్దేశం!" సూత్రగ్రాహి ముందుకొచ్చాడు.

"పరీక్షించుకో— శివలింగంలోని లింగభాగాన్ని పురుష శిలతో, పానవట్టాన్ని స్త్రీశిలతో, ఆధార పీఠాన్ని నపుంసక శిలతోనే రూపొందించాం."

సౌరాఖ్యుడు శివలింగానికి నమస్కరించి ఉలితోలింగాన్ని తాడిస్తూ పురుష, స్త్రీ నపుంసక శిలా శబ్దవైవిధ్యాన్ని గమనించాడు.

"ఏం! లోపాన్ని ఎత్తి చెబుతావా?" స్థాపనాచార్యుడు ధీమాగా ప్రశ్నించాడు. "లేదు" అన్నాడే కానీ అతని మెదడు చురుగ్గా ఆలోచిస్తూంది.

ప్రజలు, జమీందారు ఆ వన్నివేశం నుంచి తేరుకోకముందే యువ శిల్పి మరో అభ్యంతరాన్ని లేవదీశాడు.

"ఆచార్యా! శివలింగాన్ని మూడు రకాల శిలలతో శిల్పించారు— నా సందేహం నివృత్తి అయింది. కానీ ఈ శివలింగాన్ని ప్రతిష్ఠించబోతున్న ఆ మందిర నిర్మాణం ఏ శిలతో జరిగిందో ముందే తెలుసుకున్నారా?"

''అది— అవును—'' అంటూ సూత్రగ్రాహివైపు, వర్ధకివైపు అపరాధిలా చూశాడు ఆచార్యుడు వాళ్ళు నేరస్థుల్లా అతనివైకేసి చూడడంతో యువశిల్పికి ఆత్మవిశ్వాసం ఏర్పడింది.

"ఆర్యా!

హర్మ్యం లింగం చ పిండీచ పాదాధార శిలాపపి
ఏకశిస్తు కర్తవ్యం సంకరంతు న కారయేత్
యత్రైరం కల్పితం లింగం వృద్ధిహేతు రుదాహృతమ్
అన్యోన్య సంకరశ్చేత్తు రాజో దుఃఖ భయావహమ్.

ఈ శ్లోకం ప్రకారం శివలింగాన్నే కాదు దాన్ని ప్రతిష్ఠించబోతున్న దేవ గృహాన్ని ఏ శిలతో నిర్మించాలో ముందే నిర్ణయించుకోవాలి. లేదా ఆ దేవమందిరాన్ని పూర్వ శిల్పులు ఏ శిలతో నిర్మించివున్నారోనన్న విషయాన్నయినా నిర్ధారించుకొని వుండాలి.'' అన్నాడు సౌదాఖ్యుడు.

"ఈ శ్లోకాలు ..." విస్మత్తువగా చూశాడు ఆచార్యుడు.

ఈ శ్లోకాలు కాశ్యప శాస్త్రం లోనివే. అవి మా తండ్రిగారు ఎంతో శ్రమతో ఉత్తర దేశం నుంచి తెప్పించిన తాళపత్ర ప్రతిలోనివి. మిగిలిన చాలా వాటిల్లో కొన్ని పటలాలు శిథిలమై పోయాయని కూడా ఆయన అంటుండేవారు. ఆ విషయాన్ని దృష్టిలో పెట్టుకునే నేనీ ఆక్షేపణను లేవ నెత్తాను. ఎందుకంటే ఇలాంటి సంకర దోషంతో రూపొందిన శివలింగాన్ని అర్చించేకొద్దీ ఆ దేశాధిపతికి, ఆ ప్రాంతాల ప్రజలకు ఎంత కీడు కలుగుతుందో మీకు నేను వివరించనక్కరలేదు" అంటూ గంభీరంగా దోషారోపణం చేస్తున్న ఆ యువకుణ్ణి కించిత్ ద్వేషంతోను, ఎంతో అభిమానంతోను చూస్తున్నాడా ఆచార్యుడు.

ఆ సమీపంలోని మహలు పై అంతస్తు గవాక్షం నుంచి ముగ్ధలై తననే చూస్తున్న కళాత్మకమైన కళ్ళు అప్రయత్నంగా ఆ యువకుని కంట

బిడ్డాయి. ఒక అపూర్వ ప్రణయానుభూతి ఏదో అతని గుండెనిండి తొణికిస లాడింది.

"అయ్యా! ఇప్పుడీ యువకుడి ఆరోపణ నిరూపణ అయినట్లేనా" అసహనంగా ప్రశ్నించాడు జమీందారు.

నిర్లిప్తంగా నవ్వాడు స్థాపనాచార్యుడు. అక్కడి ప్రజల్లో ఒక ఉత్కంఠత చోటుచేసుకుంది.

"అపార శిల్పశాస్త్రంలో నేను ప్రప్రథమంగా ఒక ముఖ్యవిషయాన్ని విస్మరించాను. కారణాలు ఏమైనా కావచ్చుకానీ పర్యవసానం మాత్రం అనూహ్యంగా పరిణమించింది. దీనికి సూత్రగ్రాహి కానీ, వర్ధకి కానీ కారకులు కారు" అని ఆ లోపానికి పూర్తి బాధ్యతను తానే స్వీకరిస్తున్న ఆ వృద్ధమూర్తి మీద విభూషణరావుకు గౌరవంతోపాటు జాలి ఏర్పడింది.

"పోనివ్వండి. ప్రమాదో ధీమతామపి అన్నట్టు ఏదో జరిగిపోయింది. త్వరలోనే వాళ్ళకు మరో శివలింగాన్ని శిల్పించి ఇద్దురుగాని" అంటూ అనునయించాడు.

"అయ్యా! మీరు పెద్దలు. పెద్ద మనసుతో మీరు నన్ను మన్నించినా నా అంతరాత్మ నన్ను క్షమించదు. "శిష్యాదిచ్ఛేత్ పరాజయం" అన్నట్టు నా శిష్య సమానుడైన ఈ యువకుడి ప్రజ్ఞముందు నేను తల వంచడం నా అజ్ఞానం కాదు—అతని ప్రజ్ఞానం"

"అదెలాగ?"

"నా దగ్గరవున్న శిల్ప శాస్త్రాల్లోని కొన్ని పటలాల తాళపత్రాలు లుప్తమైపోయాయి. శిల్పికి శాస్త్రజ్ఞానమే కాకుండా అనుభవ జ్ఞానం కూడా అవసరం. అతను లోపాన్ని ఎత్తి చూపేదాకా నా మనసెంతో ఆ విషయాన్ని ఆలోచించడమే మానివేసింది. ఇదేదో జటిలమైన పురాకృత ప్రారబ్ధం అనుకుంటున్నాను. పూర్వజన్మలో ఆ యువకుడికి నేను తెలిసో తెలియకో

ఏదో అపకారం చేసివుంటాను. అందుకే అతని ద్వారా కలిగిన ఈ పరాభవాన్ని నేను నిర్వికారంగా స్వీకరిస్తున్నాను. మనసటి పాపానికి మూల్యాన్ని చెల్లించుకుంటున్నాను."

"మీరు ఈ వయసులో, జరిగిన చిన్న పొరబాటుకు చాలా పశ్చాత్తాపపడుతున్నారు."

"విభూషణరావుగారూ! మీకు అభ్యంతరం లేకపోతే ఈ శివలింగాన్ని ఆ బిల్వవృక్షం క్రింద ప్రతిష్ఠిస్తాను" లింగమూర్తికేసి చూస్తూ అన్నాడు.

"మీ ఇష్టప్రకారమే కానివ్వండి" శిల్పాచార్యుని కళ్ళు చెమరించటం చూసి ఆ జమీందారు చలించాడు.

శిల్పులందరూ కలిసి కొద్ది గంటల్లోనే ఆ మారేడు చెట్టుక్రింద శివలింగానికి ఒక అర్చాస్థలిని నిర్మించారు. శివార్చనతో, ధూపదీపారాధనతో ఆ పరిసరాలు పరిమళభరితంగా మారిపోయాయి.

"లింగమూర్తీ! ఈ కోనల మధ్యనే కొలువుతీరదలిచావా స్వామీ! అందుకే ఆ గ్రామానికి తరలి వెళ్ళడానికి సిద్ధమై కూడా మాతో పాటే ఇక్కడ ఆగిపోయావు. జయాపజయాలన్నీ నీ లీలా విభూతే కదా!" అంటూ సుగంధచందనాలతో కళకళలాడుతున్న భవమూర్తికి సాష్టాంగపడిన స్థపతాచార్యునితో పాటూ అక్కడి వారందరూ సాగిలపడి మ్రొక్కారు.

"ఇలా రా నాయనా—నీ పేరేమన్నావు?"

"సౌరాఖ్యుడు"

"సార్థక నామధేయమే విభూషణరావుగారూ! ఈ యువకుణ్ణి నేను స్థపతిగా నా స్థానంలో నియమిస్తున్నాను" అంటూ ధగధగ లాడుతున్న తన చేతి స్వర్ణకంకణాన్ని తీసి అతనికి అలంకరింపజేసాడు.

"ఆచార్యా!" సౌరాఖ్యుని కంఠం రుద్ధమైంది. ఆ వృద్ధమూర్తితో విద్యాపతి, పావనమిత్రుడు మొదలైన శిల్పులు, చిత్రకారులు అతనికి దర్శనమిచ్చారు.

"బాబూ! మిమ్మల్ని విడిదిగృహానికి తీసుకెళ్ళమన్నారు జమీందారు గారు" అంటూ ఒక వ్యక్తి సౌరాఖ్యుని ముందుగా దారితీశాడు.

"మహలు మీదనుంచి నన్ను అంత ఆత్మీయంగా చూసిన ఆ సుకుమారి ఎవరు? ఆమె చుట్టూ ఏదో సుపరిచిత కాంతివలయం వున్న అనుభూతి ఏమిటి? కొమ్మమీద తన జంటపక్షిని చూసిన వేటగాడి వలలోని పక్షిలా నా ఆత్మ ఎందుకిలా రెపరెపా కొట్టుకుంటూంది? భగవాన్! ఏమిటీ అమోఘ మేఘానంద సంఘర్షణ? నేను ఇక్కడ అడుగు పెట్టి దెందుకు? ఆదిలోనే ఈ హంస సందేశమేమిటి? విశ్వకర్మ సర్వకర్మ సాక్షివి నువ్వు. సత్పథంలో నడిపించు నన్ను, అనుకుంటూ విడిదిగృహం చేరి సుందర తల్పం మీద మేను వాల్చాడు. అతని హృదయం ఆలోచనల ఉప్పెనలతో సతమతమై పోటెత్తిన సంద్రంలా అయిపోయింది. అనంత భాసజాలాల అవలినుంచి మంద్రస్వర మధుర గీతమేదో తేలివచ్చి అతణ్ణి లీలగా వివశుణ్ణిచేసి ఒక స్వప్నాంచలంలోకి చేర్చింది.

అదొక అరణ్య వాటిక. ఆమె ఒక సౌంధ్యదీపిక. ఆ ఉషాసుందరిని పోల్చుకోవడానికి అతను తపన పడుతున్నాడు. ఆమె నయన క్షేత్రాల్లో కమ్ముకున్న హోమధూమారుణిమలు— ఆమె గళసీమలో శ్రుతి తప్పిన శ్రుతిగీతాలు. వల్కలాలు ధరించి నేలకు జారిన ఉల్కలా వచ్చి ఆమె అతని ముందు నిలిచింది. ఆ నవ్వు అతిసాంద్రంగా, వెన్నెలనాటి సంద్రంగా అతన్ని కలవరపెట్టింది.

అంతలో కర్పూర వరాగ రాగాలురేగే వెన్నెలవీణల వానలు కురస్తున్న ఎనిముంగిట, మయూరికల బృంద నృత్యం చెలరేగిన అనుభూతి మానసంలో పురులు విప్పింది. "శిల్పాధిదేవతా! నీ కళ్ళలో ఆకాశ ధరహాసాలు చూస్తున్నాను. నీ చూపుల్లో వాయు తరంగాలలో విరిసే పొగడపూల మత్తును దర్శిస్తున్నాను. నీ కళ్ళలో కాటుక పిట్టలు

రెపరెపలాడుతున్నాయి. నీ క్రీగంట చంద్రకాంతాలు జాలువారుతున్నాయి. నీ నవ్వుల్లో మంచు శిలల నుంచి మలచిన కూజాలనుంచి వెన్నెల మధు వులు వర్షిస్తున్నాయి."

"యువశిల్పీ! ప్రేమికుల హృదయ క్షేత్రాల్ని త్రవ్విచూసే కొద్దీ ఆ-నిజ సంపద బయటపడుతుంది. ఆధ్యాత్మిక భూమికల్లో విహరించాలని ఆకాంక్షించే వాళ్ళకు వరిపడే బంగారు రెక్కలు ఆ భాండాగారాల్లో నిక్షిప్తమై వుంటాయి. వాటిని విప్పి ధరించాలి శిల్పి." ఒక విమర్శనాత్మక దరహాస విలాసంతో అతన్ని చూసిందామె. ఉత్తుంగ భావావేశంతో ఆమె గళం అనర్గళంగా గలంగలిస్తూంది. "సచ్చిదానంద కేంద్ర బిందువులోని విశ్వసృష్టికి మూలమైన తాత్త్విక స్వరూపం యోగనిద్రలో అనుభూతిస్తూ వుంటుంది. ఆ దివ్య స్వర్గ బిందువు వేషకు మానవులను ఆకర్షించుకు పోయే బోధకశాస్త్రం శిల్పాన్ని సృజిస్తుంది. శిల్పహస్తం ప్రేమ హస్త స్పర్శకు నోచుకున్నప్పుడు అది శిలమీద శిల్పవిన్యాసం చేస్తుంది.

దేవతలు తమ దివ్యత్వాన్ని కాపాడుకోవడం కోసం తపస్సుతో సంపాదించుకున్న అమృత వర్షిణి ప్రేమ. త్రివిక్రముడు వామనుడై చరిస్తున్నట్లు మనమర్త్య ప్రేమ మారు రూపంలో సంచరిస్తూవుంది. అణువు లోని అనంతం ప్రేమ. సూక్ష్మంలోని మోక్షం ప్రేమ. మృత్తికావృత జాంబూనద స్వర్ణం ప్రేమ. దూరం మారని సారవంతమైన మార్మిక తీరభూమి ప్రేమ. కలకండ భూముల్లో ప్రేమికులు గుండె దిటవుతో శ్రమిస్తే విరగకాసే పంటచేను ప్రేమ. జీవన శాఖికకు పుష్పం ప్రేమ. మానవ ప్రకృతికి వసంతం ప్రేమ. మహావిశాల నీలిసాగరంలోని ఆకర్షక సుడిగుండంలో బొండుమల్లె మొగ్గల్లా పరిభ్రమిస్తున్న గోళాలు బ్రహ్మాండ ప్రేమ పురాణ భావచిత్రాలు.

మానవ జీవితమంతా మంత్ర సందేశం ప్రేమ. ఎన సుధా సారాభి వర్షిణి ప్రేమ. అది సర్వలోక వివశంకరి— సర్వప్రాణి శివంకరి. అఖిల లోక అభయంకరి. అది వింధ్యాచల సంధ్య రూపిణి. ప్రేమ ఆదిమవేద ఉద్గీతి ప్రేమ మనోజ్ఞ లీలావినోదిని సర్వజ సంజీవ నౌషధి ప్రేమ. అది ప్రకృతికి మహాభాష్యం. అది అపార కాంతినికేతనం అది కౌముది కలా ముకుళం. అది వెయ్యిరేకుల నెమలి. ప్రేమ అభిజ్ఞాన ముద్రిక" రెండు దేవత ఎవరో చుక్కలతో మీనమేషాలు లెక్కపెడుతూ వేచి చూస్తున్నట్లు ఆ దివ్యసుందరి ఆకాశఫలకం మీద వేళ్ళతో తారాగ్రహ గోళాల్ని తాకితాకి గణించుకుంటూండి తనవేపు జాలిగా, విషాదంగా చూస్తుంది. ఆమె సమ్మోహక వక్షోజాల మీద కాషాయవర్ణ వల్కలం శోభిస్తుంది ఆమె తన సువర్ణవర్ణ కపర్దిని విసుగ్గా సవరించుకుని తిరిగి సంభాషిస్తుంది

"శిల్పి అన్వేషి చేసే కొద్దీ అతన్ని అనంత కాంతిసీమల అంచులలో కాలువారే సొబగులు గుబగుబలాడిస్తాయి ఎంత అందినా ఎంత పొందినా ఇంకా తనకు వశంకాని దేవికోసమో శిల్పి ఆత్మ నదీతీరంలోని విరహిణిలా ఓపికతో వెతుకులాడుతూనే వుంటుంది

ప్రేమకు రాజు కావాలనుకున్నవాడు కామునకు బానిస కాదు. శిల్పి నయన గోళాలు ఆలయాలు కావాలి. కనురెప్పలు ఆలయ ద్వారాలు కావాలి. అతని ఆత్మ దేవతావిగ్రహంలా దర్శనమివ్వాలి. అప్పుడే శిల్పకన్న శిలాత్మకమైన కలకు శిల్ప న్యాయం చేకూర్చగలుగుతాడు. అప్పుడే అతనిచేత ఖండించబడే ప్రతి శిలాశకలం ఓ శిలాఖండం అవుతుంది.

నోరు తెరచుకుని కబళించడానికి మీదకు వస్తున్న కాలానికి అందకుండా శిలలు శిల్పాలై కూర్చుంటాయి. మనిషి శరీరాన్ని మృత్యువు నోటిలోకి తోసేసి, ఆత్మ కృతఘ్నతతో ఎగిరిపోతుంది. శిల తన శరీరాన్ని ఉలికి ఖండించి శాశ్వతంగా మారిపోతుంది.

శిల్పది అనల్ప తపస్సు. అందాల కోణాల్లో ఒకదాన్ని పట్టుకునే లోపున మరోటి చేజారిపోకుండా అన్నిటిని అందిపుచ్చుకోగలిగినవాడే శిల్పి.

ఏదో పగ తీర్చుకున్నట్టు మానవుల్ని అసమగ్రంగా, అసుందరంగా సృజించిన సృష్టికర్త ముందు శిల్పి తన పటిమను ప్రదర్శించి అతని సృష్టికి నమూనాలు శిల్పిస్తాడు.

గగన మండలాల అవల విరామయ వినర్గ స్వర్గసీమల్లో జ్వలించే మృత్యుంజయ మహాగ్నిగుండాల చెంత చేతులుంచి శిల్పి చలికాచుకోవాలి. అప్పుడు అతని వేళ్ళు తొలి తమ్మి వెలుతురు రేకుల్లా విచ్చుకుంటాయి.

అంతర్యామికి అంకితమైన ప్రతి ఆత్మ ఇలాతలం మీద కళా కైంకర్యానికి అర్హమైనదే అవుతుంది. కళామయ దీపకళికల్ని తలదాల్చిన ప్రమిదలు ప్రమాదవశాత్తున కూడా మలగిపోవు. ఈశ్వరుణ్ణి, ప్రేయసిని, కళను అన్వేషించాలనుకున్నవాడు తన మనసు వదలిన బీటలగుండా పై లోకాల అందాల్ని దర్శించుకోవలసి వస్తుంది. బెదరని వెదురుతోటలా హృదయం నిలబడితే తప్ప మధురనాదాలు వినిపించవు" అంటూ ఆమె గత జన్మ స్మృతిలా నిగూఢంగా నవ్వింది. కొంత కటువుగా తిరిగీ ఇలా అంది—

"మనకు లోకం నేర్పుతున్న విలువలు స్వర్గారోహణ శిఖరాల మీద వీచే ప్రచండ మారుతాలకు ఎటు ఎగసిపోతాయో తెలియదు. మామూలు మంచితనాలు, పగటు వెగటు మర్యాదలు, పిల్లలు అడుకుని ఆఖరున వీధిలో విసిరిపోయే కర్రముక్కల్లా, రాతి చెక్కల్లా నీరసాలు, నిస్సారాలు. ప్రగాఢమైన ప్రేమానుభూతి ఒక్కటే చివరకు ఆలంబనగా మిగిలేది. దాన్ని అభ్యసించాలి శిల్పి. శిల్పది పలాయనవాదం కాదు.

ప్రకృతిలోని పవిత్రమైన, ప్రవిమలమైన ప్రతి ఆకృతి పై లోకాల ప్రశాంత దివ్య వేదువులకు సాంకేతిక అనుకృతి అవుతుంది. తనలోని

శిల్పాన్ని కళ్ళ చూడాలనుకున్న శిల కొన్ని శిలాకండరాల్ని త్యాగం చేసుకోక తప్పదు. ప్రకృతి మానవ మార్మిక రహస్యాల్ని శిల్పి పసికట్టాలి. తన మానసిక దుఃఖాంలోని వరుకు సమవరించే బయటనుంచి మాల్యం దక్కుతుంది." తెలిపిందా అన్నట్టు చూసిందామె.

"నేను ప్రేమికుడినా, శిల్పినా, యోగినా, విరాగినా, అపరాధినా, చెప్పు" ఫోరున అశ్రువుల్ని జార్చాయతని నయనవనాలు "కుండలినీ మహాకాంతి సుకులు తిరుగుతూ లేచేదాక మనిషి లోపల లోయల్లో భయంకర భల్లూకకేళి ముగిసిపోదు. ఇలా నోళ్ళు తెరుచుకున్న పాతాళ ద్వారాలకు అందకుండా మనిషిని ఉద్ధరించి వుంచుకున్నవి శిల్పాలే. దోషాలూ రోషాలూ కళ్ళుగా మోసే పడగల్ని విప్పుకున్న తమస్సు శిరస్సు మీద తన పేనపాదమద్దింది శిల్పకళ! అలయ శిఖర కలశాల కాంతులు ప్రసరించినంత మేర మలిశకు ఒకరి భిక్ష అక్కరలేదు. ప్రేమ దృఢ దీక్షను నేర్పాలి కానీ ఆత్మవంచనను, వలాయన పాఠాన్ని నేర్ప కూడదు." భావగర్భితంగా మెరుపు కొరడాల్లా ఆమె చూపులు అతని ఎద మీద వరుస దెబ్బలు తీస్తున్నాయి.

"కల్పన వల్లనే మనిషి మాహాత్మ్యాన్ని చేరుకోగలడు కనిపించే ప్రకృతి అశాశ్వతం. క్షణికం. లేనిది శాశ్వతం. శిల్పిది కళాహృదయం. అది లేనిదాన్ని ఒక్కోసారి సృష్టించి చూపుతుంది. అప్పుడది కల్పన అవుతుంది. కల్పనలోనే కైలాస విలాసాలు లాస్యమాడుతుంటాయి.

ఉషోరేఖలు సువర్ణవాకల్లా అధ్యాత్మ హృదయాన్ని ఉన్మత్తతలో ముంచుతాయి. అప్పుడు ఎద కేరింతలు పోతుంది. విశ్వకీర్తను ఆత్మ అవలోకించడంతో పరమాత్మ పవిత్రతాన్ని విశ్వసిస్తుంది. మనిషి జీవన సాగరతీరంలో కట్టుకునే ఇసుక మేడలు కాం కల్లోలిత తరంగాల వశమై వుంటాయి కళ శిలలాంటిది. ఉలిలాంటి చెలిచేతి తాకిడితో తప్ప దాని నిజరూపం బయటపడదు.

శిలలు చీకటి ముడులు. వాటిలో దీప కళికల్లా కళా ఖండాలు దాగి వుంటాయి. శిల్పాలు పరమాత్మ పిలిపాదాలు. అవి ఆకాశాల్ని దాటుకుంటూ వెళ్ళి దివ్యకాంతుల్ని కానుకలుగా తెచ్చుకుంటాయి. దేవగణాలు తమ వరగణాల్ని దాటివచ్చి శిల్పిమీద తమ సంకల్పాల తేజోమయ చక్రాల్ని దొర్లిస్తాయి.

ప్రేమను సువ్యక్తం చేయాలంటే సంకేతాలు, సంఖ్యలు, అక్షరాలు అంకెలు అక్కరలేదు. అవి ఒక నిర్దిష్ట భావాభివ్యక్తికి మాత్రమే పనికి వస్తాయి శిల్పం ప్రేమతల్పం నుంచే ఉద్భవిస్తుంది. శిలాకలాపు కార్ఖానాలు శిల్పాలు కార్మికులు.

ఎక్కడో పెంజీకటి కవతల ఏకాకృతితో దేదీప్య కళికలా వెలిగే పరమాత్మ సంకల్పాలు మెరుపులుగా శిల్పి మేదస్సు మీదపడి ఉరుముతాయి. అమర భావాలు వర్షిస్తాయి. అప్పుడు అతని ఎద నదిగామారి ఉరకలు వేస్తుంది.

ప్రేమ సంద్రంలోకి అత్మలు స్రోతస్వినులై పుష్పోదీ వనులద్వారా, స్వర్గగనుల ద్వారా పరవళ్ళు తొక్కడం అతనికి కనిపించింది. కారుమబ్బులు పిలికొండల్ని వాటేసుకున్నట్లు, మసక చీకటి కోవి చుక్కల ఆకాశాన్ని దిక్కులు పొదివి పట్టుకున్నట్లు, కొండల కవతల నింగీనేల వంగి వంగి ఏవో ఉదారంగుల రహస్యాల్ని చెవుల్లో ఊదుకుంటున్నట్లు అతను అనుభూతించాడు.

అతనికొక వినూత్న దృక్కు దక్కినట్లయింది. వృక్షాలు కొమ్మల చేతులతో సూర్యకిరణాల్ని పాయలు తీసి వెలుతురు జడల్లుతున్నాయి. సమోహన కిరణాలు చిక్కులుపడిన ముళ్ళతో వృక్షశిఖరాల మీద తగులు కుని వ్రేలాడుతున్నాయి. కాలపురుషుడు వేదపురుషుడిలా నిర్మించుకున్న యజ్ఞవేదికల్లా పర్వత కనుమలు ప్రభాసిస్తున్నాయి. హోమంలా ఉదయ

సంధ్య, ధూమంలా జలదాలు—ఒక అపూర్వానుభూతి పారవశానకు అతను లోనయ్యాడు. తన వరాంగిమీద ప్రేమ తప్ప మిగిలిన భావాలన్నీ అపస్వరాలు పలుకుతుండడం అతను గమనిస్తున్నాడు. ఆమె చిరునవ్వుంపూలవాక్కులు అతనిమీద రాలాయి. అతని పురాతన స్మృతుల్ని తట్టిలేపుతున్నాయి. "మహాశిల్పీ! నువ్వు దేవతల చేతులమీదుగా బహుమతి పొందుకోవలసినంతటి ప్రజ్ఞ వున్న కళాప్రతినిధివి. నీతో కాసేపు ముచ్చటిస్తే హృదయంలోని ఊసరక్షేత్రాలు కళా సత్యాలతో బంగారు కంకులు వేసి ఊగాడుతాయి. అంతర్యంలో అనురాగ పక్షపాలు లేని అంగాంగ సౌందర్యం వెలవెలబోతుంది. శిల్పిలోని పుష్పిత ఎద శాఖల మీద వసపుల పికశాబకం నిరంతర శిల్పాగమ గానసాధన చేస్తుండాలి. ప్రేమికుడూ, కళాకారుడు పరదేశీయులు. శిల్పి మరీ సుదూర ప్రవాసి. అతను భూమిమీదే నివసిస్తాడు. అయినా వాడి మానసనివాసం ఎక్కడో తెలుసా? ఆకాశ లోకాలకావలి తారల దారులు దాటిన స్వర్గలోకపు పొలిమేరల్లో ఎక్కడో! అందుకే అతను స్వప్నావ సంగీతం కోసం హృదయాన్ని మేళవించుకుంటుంటాడు.

ఉదయసూర్యుడు అతనికి పై లోకాల నుంచి వచ్చిన వార్తాహరుడిలా తెచ్చినవేవో ఇన్ని సంకేత సందేశాలందిస్తాడు. ప్రేమికులు అశాశ్వతులు — ప్రేమ శాశ్వతం. శిల్పి అశాశ్వతుడు - శిల్పం శాశ్వతం. ప్రేమ భూముల్లో పండిన చక్కెర తోటల నుంచి ఏవో ఇన్ని ఈనెల్ని సేకరించి గిజిగాళ్ళలా గజిబిజిగా గూళ్ళు రూపొందించడమే శిల్పం అవుతుంది. కవికైతే కల్పన అవుతుంది. శిల్పంలో మాటాడే కవిత్వం వుంది—కవిత్వంలో మూగబోయిన శిల్పం వుంది.

ఆమె వాక్కులు ఆగని ఋక్కుల్లా అతన్ని ఉత్తేజితుణ్ణి చేశాయి. అతని ఫాలం మీద పాలవెల్లి వెల్లి అల్లుకున్నట్టు ఏదో కాంతి ప్రస్తావనలు చేశాయి.

"విశ్వ కావ్యంలో ప్రేమికులది ప్రథమాధ్యాయం. ప్రేమను కాపాడడమే శిల్పి ధ్యేయం" అందామె మందరంగా.

"స్త్రీకి, శిల్పానికి ప్రధాన భేదం వుంది చెప్పు చూద్దాం!" అందామందరి కొంటెగా.

"స్త్రీకి జీవం వుంది—శిల్పానికి లేదు" సందిగ్ధంగా అన్నాడు.

"జీవం లేనిది శిల్పం అవుతుందా?" చురుగ్గా ప్రశ్నించింది.

"అదే....అనుకున్నాను" అన్నాడతను కించిత్ సిగ్గుపడుతూ.

"శిల్పం తాకడానికి కఠినంగా వుంటుంది. శిల్ప హృదయం సున్నితంగా వుంటుంది. స్త్రీ స్పర్శ సున్నితంగా వుంటుంది — స్త్రీ హృదయం...."

"అర్థమైంది — మహాభాష్యకారుడివి బయలుదేరావు. నీకు ఒక ప్రేమ హృదయంతో స్నేహం కుదిరితే తప్ప నీ శిల్పంలో అంతరతేజం వ్యక్తం కాదు."

"శపిస్తున్నావా!"

"కాదు—దీవిస్తున్నాను—కళలో జీవించమని" కిలకిలా నవ్విందామె. వెన్నెల కిరణాలు వెండిపూల చషకాల్లో రాలిన సురభిళాత్త ఉదాత్త రవళి అతణ్ణి ఉన్మత్తుణ్ణి చేసింది.

"దేవీ! ఉలి చేతిలో లేని శిల్పి శిలమంచి కళాఖండాన్నెలా వెలికి తీయగలడు? హృదయంలో ప్రేమ లేని ప్రేమికుడున్న దైవత్వానెలా దర్శించగలడు? మనిషికున్న నైపుణ్యాలన్నీ ఏ పురాకృత పుణ్యఫలాలో అవుతాయి. ఆనందానికి నేపథ్య సంగీతం విషాదం కాకుండా కళాకారుడు జాగ్రత్త వహించాలి. మనిషి నిరంతర కర్షకుడు. ఏవేవో ఆకర్షక బీజాలు తెచ్చి హృదయక్షేత్రంలో నాటుకుంటాడు. తీరా అవి ఎదిగేదాకా తెలియదు— ఏ మొక్కతో ఏ చిక్కు వస్తుందో — దేని ఫలం విష్ఫల

మౌతుందో! ఈ భూగోళం నిరంతరం ఏదో ఒక వేదనతో పొరలాడుతుంది. శిల్పిస్పర్శ ఆ షడమితల్లి ఒంటిమీద కళాత్మక ఓనధితో కట్టు కట్టడమే అని తెలుసుకున్నాను" అతను సమాధి స్థితిలో నుంచి మాట్లాడుతున్నాడు.

క్షుద్రదేవతలు కరుణించినంత సులభంగా స్వర్గదేవతలు కరుణించరు. క్షుద్రదేవత అర్భాటానికి లొంగుతుంది. అపవిత్ర ఫలాన్నిస్తుంది. స్వర్గ దేవత ఆరాధనకు మాత్రమే లొంగుతుంది. పవిత్రమైన వరాలిస్తుంది. వేదంలాంటి వేదన నుంచి కానీ ఆరాధన అవిర్భవించదు

శిల్పీ! జీవితం ఓ విపణివీథి. ప్రతివానికి వెల కట్టేస్తుంటారు. నువ్వు చేసేపని ఎంత గొప్పదో చేశాకే వాళ్ళకు తెలియదు. ముందే దాని గురించి చెప్పావంటే దాని ధర ఎంత అనేస్తారు జాగ్రత్త. కళాకారుడు, ప్రేమికుడు త్యాగమూర్తులు కావాలి అందుకే—మరచిపోకు."

ఆమె చూపుల్లో అతనికి ప్రపంచాలు తెలి యవస్తున్నాయి. ఆమెతో పాటూ అలా అతనూ సాంద్రారణ్యాల మీద తేలిపోతూ, ఆమె చేతిని పట్టు కొని శిలాతలాల మీద సాగిపోతున్నాడు.

ఆమె అరణ్యదేశ లోని రాళ్ళను రప్పల్ని రప్పల్లో కప్పల్ని పరి చయం చేసింది. స్త్రీ శిలల పురుష శిలల పులకింతల్ని చూపించింది. సామూ హిక శిలా సమాజాన్ని అతని దృష్టికి తెచ్చింది పూల గాలుల్ని. శిలల స్పందనల్ని అతను గమనించాడు

ఆమె కళా జలాశయపు లోతుల నుంచి పైకి తేలిన ప్రతి స్వర్ణ మీనాన్ని అతను, దేగలా తన కళ్ళతో ఒడుపుగా తన్నుకుపోయి, నమ్మ కాల కొమ్మలమీద పెట్టుకుని ఆరగిస్తున్నాడు.

విశ్వకర్మ నేత్రం ఎంత అందంగా వుంటుందో అంత భయంకర మైంది. ఆ చూపుకు తరతమ భేదాల్లేవు వైరాగ్యం ఒంట బట్టేంతవరకూ ఆ చూపు క్రూరంగానే వుంటుంది. కళాత్మకమైన వెన్నెల పులుముకుంటే

తప్ప రాత్రికి రాగతనం రాదు. చంద్రవంక లేకపోతే జీవితం కాళరాత్రిలా భయం గొల్పుతుంది.

కళాహృదయం విశ్వానికి ప్రధాన కేంద్రం అవుతుంది. దిగంతాలను దాటివచ్చే దివ్య సందేశాలకు రంగులు మారుతాయన్న సందేహం కళాకారుడికి వుండి తీరాలి. ఈ దృష్టితో సత్యదర్శనం చేయకపోతే అపార్థాలు అనర్థాలు చోటు చేసుకుంటాయి. మన చూపులోని లోపం వల్ల ఉజ్జ్వల సత్యాలు కొంత మసకబారుతాయి. ఈ నిజం తెలిసినా చాలు చాలా ప్రయోజనం వుంటుంది.

గంధర్వుల రాజధానికో, అప్సరసల కేంద్రానికో నువ్వు చేరుకోవాలంటే దారి ఒక్కటే — అది ప్రేమ. చందమామను అరవిందంగా మకరందంతో పాటు అందే లోకాలకు రోదసీ సీమ ద్వారా వెళ్ళాలంటే దారి బత్తెం ప్రేమ ఒక్కటే! ప్రేమ దైవ సంస్పర్శకు నోచుకుంది. అందుకే దానితోటి పరాజయం కూడా విజయవంతమైన ఉన్మత్తత నిస్తుంది. శిలకైనా చెలి వుండాలి. కలకైనా కళాహృదయం వుండాలి.

పేరూ ఊరు తనవారు అన్నీ మరచిపోయిన ఒక అవ్యక్త శూన్యానుభూతికి లోనైన క్షణంలోనే తేజోపూర్ణ రోదసీ సీమల పరిధిని చేరుతుంది హృదయం. విశ్వప్రేమ చైతన్యంలోని ఒక స్పందనను పరమాత్మ బంధించి పెడితే అది సృష్టిగా మారి కూర్చుంది.

బంగారు వాకిళ్ళ లోగిళ్ళలో కెళ్ళాలని కలలు కనే మనసుకు గత జన్మల కావలి తీరభూముల నుంచి బలిష్ఠమైన రెక్కలతో సంస్కారాలు ఎగసిరావడం దర్శనమిస్తుంది. హృదయ సాగరంలో ఎక్కడో మార్మిక అగాథాల్లో తిమింగలాలు తమకంతో తల్లక్రిందులవుతున్నట్టు ఏవో పురాకృత ప్రాకృత భావసంచలనం! గగన గర్భంలో మరపురాని మెరుపుల్లా ఒకదానికొకటి ఒరుసుకుని కాంతిపుష్పాలు రాలుతున్నట్టు ఏవో మధుర-

స్మృతులు! ప్రేమ ఉదయించిన హృదయాల్లో ఆలోచనలు శ్వేతాశ్వాలై బారువాల కొద్దీ అనుభూతుల బంగారు బస్తాలతో నిరంతరం పరుగులు తీస్తుంటాయి. అక్కడ వెన్నెల లోకాలనుంచి రాజహంసలు ముంగిళ్ళలోకి అవతరిస్తాయి. యాదృచ్ఛికంగా తమ పచ్చని పాదాలకు హత్తుకున్న స్వర్ణపత్రాల్ని అక్కడ విడిచిపోతాయి. అక్కడే తారాపథాల నుంచి స్మృతి పథాలకు నవనవలాడే నవరత్న కాంతుల కిరణాలైపోతాయి వార్తాహరుల్లా అహర్నిశలూ వచ్చి వాలడం జరుగుతుంది. ఆ ప్రేమానుభూతికి లోనుకానివాడి ఎదనుంచి ఏ కళ మాత్రం ఏపుగా ఎదుగుతుంది చెప్పు! శిల్పం అనన్య విద్య. ప్రేమ ఆ కల్పాంత దివ్య ప్రసాదం. జాగ్రత్త!"

తనెవరో పిలవడంతో సౌరాఖ్యుడు దిగ్గున లేచాడు. అతని కల చెదిరింది. అది కలకాదు. గత జన్మ స్మృతి శ్రుతిఘోషలా వినిపించిన దివ్య ముహూర్తం. ఆమె—అవును....ఆమె—తను ధారపోసుకున్న హృదయం. ఆమె ఎవరో? ఎవరు! తన తనువు నుంచి విడివడిన ఆత్మ కళ! అవును ఏదో లీలగా—కాదు—గాఢంగా ఆదిమ ఆరాధనా పరిమళాలు గుబులుకుంటున్నాయి. అవే కళ్ళు—అదే ప్రవర్తన—అదే పలకరింపు—అదే పులకరింపు—ఈమె—ఈమె....ఈమారు ప్రాణాన్ని వదలడానికి సిద్ధపడతాను గానీ ఈమెను వదలుకోడానికి అంగీకరించను.

అవే కళ్ళు—గత జన్మ కళ్ళు—ఈ మహలు మీది గవాక్షం నుంచి చూస్తున్న అవే కళ్ళు—నే నెక్కడున్నాను—తల పట్టుకొని విడిది గృహం ముందరి వేదిక మీద చతికిలపడి కూర్చున్నాడు సౌరాఖ్యుడు.

"అయ్యా! తమరి అవసరాల్ని, సౌకర్యాల్ని చూడమని నన్ను పంపారు అయ్యగారు" నౌకరు నిలబడివున్నాడు.

"అలాగే" అన్నాడతను అన్యమనస్కంగా.

'ఈ పగటి వెలుగులకు తెలుసు—ఈ గాలికి తెలుసు—ఈ నేలకు. నింగికి తెలుసు. ఆమెవరో నాకు తప్ప అన్ని శక్తులకూ తెలుసు. నేనెవరో నాకు తప్ప ఈ పాంచభౌతిక ప్రకృతికి తెలుసు. ఈ రహస్యాన్ని ఛేదిస్తాను-ఫలశ్రుతిని సాధిస్తాను" లేచి నిలుచున్నాడతను.



శిల్పానికి ఆధ్యాత్మిక తేజం ఆత్మ లాంటిది. దాన్ని సాధించని శిల్పి కేవలం కార్మికుడవుతాడు తప్ప కళాకారుడు కాలేడు. శిల్పంలో భావోన్మీలనం తేగలిగిన శిల్పి మాత్రమే శిల్పాచార్యుడవుతాడు. శిల్పానికి ఆధ్యాత్మిక తేజం రావాలంటే ముందు ఆ లక్షణం శిల్పిలో వుండాలి, భౌతికమైన సౌందర్యం, రసపుష్టి, రూపరేఖా విన్యాసం, శిల్పరచనా నైపుణ్యం, దివ్యలావణ్యం శిల్పంలో అతిశయించాలంటే ఆ శిల్పి అగ్నిపుత్రుడు కావాలి. నిత్యవ్రత నిష్ఠాగరిష్ఠుడు, దేవోపాసనా దీక్షాదక్షుడు అయితే తప్ప వాటిని శిలలో నుంచి వెలువడే శిల్పంలోకి చొప్పించలేడు. కీటకం వాలితే జారిపోయేంతటి నైగనిగ్యం శిల్పానికి తేవడం సులభమే—కానీ దాని అంగాంగాల్లో అపురూపమైన తేజాన్ని, కళ్ళలో కాంతిని తీసుకురావడానికి శిల్పి తపస్వి కావాలి—ఇలాంటి ఆలోచనలతో సౌరాఖ్యుడు విడిది గృహం ముందు చల్లని నీడలో పచార్లు చేస్తున్నాడు.

"ఇతని రాకతోనే ఈ పరిసరాలకు ఒక వినూత్న ఉత్తేజం వచ్చి పట్టిందే"—మహలు పై నుంచి అతన్ని తదేకంగా గమనిస్తోంది ప్రవాళ.

"నాన్నగారూ! ఎవరా యువశిల్పి? ఎక్కడ నుంచి వచ్చాడు? అసలేం జరిగింది?" ఉత్కంఠతో ప్రవాళ జమీందారుమీద ప్రశ్నల వర్షం కురిపించింది.

"ఏం జరిగితే ఏం లేమ్మా! నాలాంటి దౌర్భాగ్యుడికి దేవాలయ నిర్మాణం కూడా కలిసివస్తుందా?" నిరాశగా వచ్చి కూర్చున్నాడు.

"స్థపతిగారు ఏమంటున్నారు? ఆలయ నిర్మాణానికి ఏ ఆటంకం రాదు. మీరు దాన్ని గురించి బాధపడకండి...."

"దురదృష్టాన్ని చేతులారా పిలిపించుకున్నట్టు మన ఆహ్వానాన్ని అందుకునే వచ్చారట ఆ యువశిల్పి" భారంగా తల వెక్కి వాల్చాడు.

"అతను చేసిన అపకారమేమిటి?" చురుగ్గా అంది.

"ఇంకేం చేయాలి! స్థపతిగారు స్థాపత్యాన్ని వదులుకున్నారు."

"అలాగా....మరి....ఆలయ నిర్మాణం!" ఆమె మాటల్లో ఆందోళన రేకెత్తింది.

"సౌరాఖ్యుని చేతిమీదుగా జరుగుతుందట. ఆ సౌరాఖ్యుని స్థపతిగా వుండమని ఆదేశించాడు కూడా."

"మరి ఆ యువశిల్పి ఏమన్నాడు?"

"శాస్త్రప్రమాణాలను దృష్టిలో పెట్టుకుని ఆక్షేపించానే కానీ ఈర్ష్యతో కల్పించి చెప్పిన లోపాలు కావనీ, ఆ తర్వాత మీ యిష్టమనీ అన్నాడమ్మా."

"ఓహో! శిల్పశాస్త్రంలో తానంత పారంగతుడనే అహంకారం వుందన్నమాట అతనికి" కించిత్ ఉద్రేకపడింది.

"ప్రవాళా! ఆ యువకుడి సూక్ష్మదృష్టికి నేనే ముగ్ధుడనై పోయాను" కుమారైను సమాధానపరచబోయాడు.

"ఇంత చిన్నవయసులో అంత ప్రజ్ఞతోపాటూ స్థపతి కాగలనన్న దురహంకారం అతనికి ఎలా ఏర్పడిందన్నది నాకు అంతుపట్టని విషయం నాన్నగారూ!"

"శివాలయ నిర్మాణానికి వినియోగించిన శిలతోనే శివలింగాన్ని చేయాలన్న విషయాన్ని తన విధివైపరీత్యం కొద్దీ విస్మరించానని స్థపతి చాలా ఆవేదనపడ్డాడు. అగ్నిదేవుడి లాంటి ఆ అబ్బాయి ఎంతవరకు ప్రజ్వరిల్లుతాడో అంతవరకూ అతన్ని ఆటంకపరచవద్దని తన శిష్యులకు సూచించాడు. నేను మరీ ప్రాధేయపడితే ప్రధాన స్థపతిగా నామమాత్రంగా వ్యవహరిస్తానని హామీ యిచ్చాడు."

"స్థపతిగారి నొకసారి పలకరించి వస్తే బాగుంటుంది కదా నాన్న గారూ."

"నీకు అభ్యంతరమేముందమ్మా" వాత్సల్యంగా కూతురి సౌందర్యాన్ని చూస్తూ ఏదో గతంలోకి వెళ్ళిపోయాడతను.

"పోనీలెండి – సంధ్య వార్చుకుంటూ, సద్గ్రంథాల్ని పఠించుకుంటూ ఈ వయసులో ఆయన ఆలయ నిర్మాణాన్ని పర్యవేక్షిస్తుంటే చాలు."

"ఆ యువకుడిలో స్థపతికి వుండవలసిన అన్ని లక్షణాలు మూర్తీభవించి వున్నాయి. మీరు తలపెట్టిన ఈ మహత్కార్యం అతని ద్వారానే పూర్తవుతుంది. నిశ్చింతగా వుండమని మరీమరీ చెప్పాడమ్మా స్థపతి" ఒక సందిగ్ధ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడాయన.

"ఏది ఏమైనా ఇంతవరకూ ఎదురైన ఆటంకాల్ని, జరిగిన ఆలస్యాల్ని పునరావృతం కానీయకూడదు. అమ్మకు లభించబోయే ఆత్మశాంతికి ఏదీ అడ్డురాకూడదు."

"బాబుగారూ!" వృద్ధ సేవకుడొకడు వచ్చి నిలబడ్డాడు.

"ఏం వీరయ్యా?" ప్రవాళ అడిగింది.

"కొత్త స్థపతిగారు నాన్నగారితో మాట్లాడాలని అనుమతి అడుగుతున్నారమ్మా."

ప్రవాళకు అంతవరకు అతనిపట్ల వున్న ఆవేశం అతను వస్తున్నాడన్న మాటతోనే అదృశ్యమైపోయింది. చనువుగానూ, హుందాగానూ తండ్రితో కలిసి అందరితోనూ రాజకీయ, ఆర్థిక విషయాలన్నీ మాట్లాడే ప్రవాళ పరదాల మాటున బ్రతికే అంతఃపుర కాంతలా లోపలికి వెళ్ళిపోయింది. అలా దాగిపోవడం తనకే నవ్వొచ్చి నవ్వుకుంటూ అద్దాల హాలు లోకి వచ్చింది. తన చర్యను సమర్థించుకుంది. కానీ విపరీతమైన తత్తరపాటుకు లోనైంది. సుందరమైన అతని ఆకార రేఖను చూసి అప్రయత్నం

SRI VENKATESWARA RESEARCH CENTRE
TIRUPATI.
48776

నిలబడలేక "ఇంతకీ వీడు మనిషా? లేక సమ్మోహన మాంత్రికుడా?" అను కుంటూ తన గదిలోకి వెళ్ళిపోయింది. రణరంగం నుంచి పారిపోయి రహస్య గదిలో తల దాచుకున్న వీరుడిలా వుంది ఆమె పరిస్థితి.

"నమస్కారం" సౌరాఖ్యుడు సౌమ్యంగా నిలుచున్నారు.

"నమస్కారం. రండి....ఇలా కూర్చోండి" మనస్ఫూర్తిగా అత నితో మాట్లాడలేకపోతున్నారు జమీందారు.

"మీరు ఆలయం ఎవరి పేరుమీదుగా నిర్మిస్తున్నారు?" పరిసరాల్ని పరిశీలిస్తూ అన్నాడు సౌరాఖ్యుడు.

"మా భార్య పేరుమీద" ఆమె చిత్రపటంవేపు చూశాడు.

"ఆమె .."

"లేరిప్పుడు."

"మరి ఎవరిని ఆలయకర్తగా భావించుకుని నిర్మిస్తున్నారీ దేవా లయాన్ని?"

"మా అమ్మాయిని."

"ఆమె...."

"ఇక్కడే వుంది....కాని ఆమెతో మీకున్న పనేమిటి?"

"అయ్యా! ఆలయ ప్రతిమల్ని కొలవడానికి నాలుగు రకాల కొలతల్ని మనం అనుసరించాల్సి వుంటుంది. వాటిలో మొదటిది మానాం గుళం. అది చాలా సూక్ష్మమైన కొలత.

మాత్రాంగుళం రెండోది. ఎవరిని ఆలయానికి నిర్మాణకర్తగా భావించి నిర్మిస్తున్నారో వారి దక్షిణహస్తం నడిమి వేలి మధ్య కణుపు పొడవును గానీ, వెడల్పును గానీ, చుట్టుకొలతను గానీ జాగ్రత్తగా కొలిచి తీసుకోవాలి. పై వాటిలో ఒక్క కొలతైనా ఒక మాత్రాంగుళం క్రింద లెక్క. వీటితో మూలవిరాట్టుకు బదులుగా మనం పూజించుకునే అర్చ నించాల్సి శిల్పించాల్సి వుంటుంది.

దేహాలబ్ధాంగుళం మూడోరకం కొలత. గర్భాలయంలో మనం ప్రతిష్ఠించబోతున్న మూలబింబం ఏ తాళప్రమాణానికి చెందిందో—అంటే అది దశ తాళప్రమాణమైతే పదితో, నవతాళ ప్రమాణమైతే తొమ్మిదితో ఆ విగ్రహం ఎత్తును భాగించాలి. భాగించగా వచ్చిన అంకె ఒక దేహ లబ్ధాంగుళం అవుతుంది.

ఇక యవాంగుళం. ఇది నాలుగో రకం కొలత. ఇది వడ్లగింజ వెడల్పును ఆధారంగా చేసుకుని ఏర్పడుతుంది. దీనితో చిన్న చిన్న విగ్రహాల్ని చేస్తారు.

ఈ కొలతలన్నీ వుంచే ఎప్పుడైనా మీరు అడిగిన వెంటనే ఆయా రకాల శిల్పాల్ని నిర్మించగలం. అందుకని ప్రధాన స్థపతిగారు పంపితే ఇలా వచ్చాను" ఆతని మాటల్లో మితిమైన కరకుదనాన్ని, దర్పాన్ని పసిగట్టాడు విభూషణరావు.

"ఆయన పంపారా....మంచిది....అలాగే తీసుకుందువుగాని ఆ కొలతల్ని" జమీందారు మనలోకి కళవచ్చింది. మాటలో మార్దవం చోటు చేసుకుంది.

"నే నెప్పుడేమీ తీసుకోను" ఏవో పానీయాల్ని తీసుకొచ్చిన పరిచారికతో అన్నాడు. జమీందారు బలవంత పెట్టినా సున్నితంగా వారించాడా శిల్పి.

"అమ్మా!...." లోపలికి చూస్తూ పిలిచాడాయన.

"కన్నెపిల్లల్ని ఆలయ నిర్మాణకర్తలుగా నియమించుకుని ఇదివరకెవరైనా ఆలయాలు నిర్మించారా? లేదా?" దీన్ని సమన్యగా క్షణమాత్రం భావించాడు పౌరాణ్యుడు.

"ఆత్మలకు ఆడ, మగ, చిన్నా, పెద్దా ఏమిటి! అందరూ పరమాత్మ సంభూతులే కదా!" స్థిరభావనతో స్థాయిగా జూర్చుని మాటాడుతున్న ఆతని మీద ఏదో సదభిప్రాయం ఏర్పడింది జమీందారుకు.

పర్వత శిఖరం మీదనుంచి ప్రవహిస్తున్న లావణ్య ఝరిలాగ మంద మంద మలయానిల పరిమళంలా ఇక్కడికి వచ్చింది ప్రవాళ.

"ఈమె మానవ కాంతే కదా:" సౌరాఖ్యుడు తన గుండెలో శివ ఢమరుకం ఉధృతంగా ధ్వనిస్తున్న అనుభూతికి లోనయ్యారు.

"రాళ్లూ రప్పలూ చెక్కుకునే వాడిలో ఇంత కోమలత్వం, ఇంత సౌందర్యం, ఇంత గాంభీర్యం ఎలా వుంటాయి?" శ్వేతవస్త్రాలతో గంధర్వ సుందరుడిలా భాసించాడతను. స్నిగ్ధ భావ కోమల భూముల్లో అగ్ని పర్వతాలు బ్రద్దలై వలపుల లావాలు ఎగజిమ్ముతున్న స్థితికి గురయిందామె. ఆమె రక్తంలోని ఆభిజాత్యం, భావనల్లో కూడా అతనికి లొంగిపోవడాన్ని సహించలేక తిరుగబడి మరిగిపోతూంది. వెంటనే ఏదో అవ్యక్త బాంధవ్యంతో ఎద విచ్చుకుంటూంది.

"ఇలా కూర్చోండి...." చిరునవ్వు నవ్వాడు సౌరాఖ్యుడు.

తన ఇంటిలో తనకే మర్యాద చేస్తున్న అతన్ని చిరుకోపంతో చూస్తూ కూర్చుంది.

"అమ్మా! విగ్రహ తాళమానాల కోసం నీ కుడిచేతి మాధ్యమికాంగుళి కొలతలు అతనికి ఇవ్వు" ప్రసన్నంగా కూతురివైపు చూశాడు.

ఒకక్షణం తటపటాయించి ఆమె తన చేతిని అతని ముందుకు చాచింది. స్నిగ్ధ గాంభీర్యంగా సౌరాఖ్యుడు ఆమె అంగుళి పరిమాణాలు సూక్ష్మసూత్రంతో శ్రద్ధగా కొలిచితీసుకున్నాడు. అతనికా సన్నివేశం పాణిగ్రహణ మహోత్సవంలా హృదయంలో మధురానుభూతుల్ని రేపింది. జన్మాంతర సౌహార్దం కళ్ళు విచ్చింది.

"ఇక నాకు సెలవిప్పించండి" ఇద్దరివైపు చూస్తూ వాళ్ళకు ప్రతి నమస్కారం చేశాడు సౌరాఖ్యుడు.

"మంచిది. అన్నట్లు మీ వివరాలు అడగనేలేదు నేను...." జమీందారు కంఠంలో గరగర ధ్వనించింది.

"మాది దక్షిణాది....మా నాన్న ప్రఖ్యాత....ప్రభుదాసు అని హరికథా కారుడు. నాకు అలాంటి విగ్రహాల మీద శ్రద్ధవల్ల....ఇలా...." మనసులో ఉద్రేకం మరలా తిరగడంతో అతను ఆ భావాల్ని మొహంలో కనిపించనీయకుండా వెళ్ళడానికి పైకి లేచాడు.

"ఆగండి... మీతో ఓ ముఖ్యమైన విషయం మాట్లాడాలి" విభూషణరావు సౌభాగ్యవతితో పాటు మహలు వెలుపలకు వచ్చాడు.

కోటలాంటి ఆ భవనం జమీందారుల జీవితచరిత్రల్ని ప్రకటిస్తున్నట్లు కనిపిస్తుంది. రాజుల అంతఃపుర రహస్యాలు, రాణుల రహస్య ప్రణయక్రీడా కలాపాలు మనసుకు లీలగా స్ఫురించి మటుమాయమైపోయే అంత నిగూఢంగా వుందా భవంతి. మహలుకు ఎదురుగా వున్న విశాలమైన తోటలో లోతైన కోనేరు, దట్టంగా పెరిగిన వృక్షాలు, గడ్డిమేస్తున్న జాతి గుర్రాలు రాచరికపు పరిమళాల్ని ఇంకా పరిరక్షిస్తున్నట్లు కనిపిస్తున్నాయి. మహలు ఎత్తైన గోడలమీద అక్కడక్కడా ఏవో మొక్కలు పెరుగుతున్నాయి. ఎత్తుగా పెరిగిన రకరకాల వృక్షాలు ప్రాచీనతను బంధించి కావలా కాస్తున్నట్లున్నాయి.

"వీరయ్యా! ఆ గది తలుపులు తెరువు."

"ఎందుకయ్యా ఆ గదిలోకి వెళ్ళి మనసు పాడుచేసుకోవడం" అంటూనే తెరిచాడతను. ఇద్దరి మనుష్యుల ఎత్తున బలమైన తలుపులు కిర్రుమంటూ తెరుచుకున్నాయి.

"రండి...." తలకు తగులుతున్న బూజును తుడిపేసుకుంటూ లోపలికి నడిచాడు విభూషణరావు. ఓ కర్రతో సాలెగూళ్ళన్నింటినీ తొలగిస్తున్నాడు వీరయ్య. ఆ గదిలో పగటిపూట కూడా మసకచీకటి కమ్మినట్లు వస్తుజాలమంతా లీలగా కనిపిస్తుంది.

"ఎవరక్కడ వదుతున్నవాళ్ళు ." కొంత ఉలికిపాటుతోనే అడిగాడు సౌరాఖ్యుడు. విషాదంగా నవ్వాడు విభూషణరావు.

"వీళ్ళే శిల్పి! నాకున్న మనశ్శాంతినంతా హరించివేస్తున్నవాళ్ళు.... వీరయ్యా! ఆ ముసుగులు తొలగించు."

"వద్దయ్యా....మీ బాధ నేను చూడడం కష్టం."

"విః గించకురా....చెప్పింది చెయ్యి."

"ఆ . ఎంత అందమైన స్త్రీ విగ్రహాలివి!!" సౌరాఖ్యుడు పైకి అనకుండా వు దలేకపోయాడు.

"దివ్వెను కాస్త వెలిగించరా " మసక వెలుగులో విగ్రహాల్ని ఆత్మీయంగా తడివిచూస్తున్న సౌరాఖ్యుణ్ని చూస్తూ అన్నాడు. ఆ శిల్పశైలి అచ్చితంగా తన తండ్రిదేనని అతను గుర్తించాడు.

"వీటన్నటికీ ప్రాప్తించిన ఒకే రకం దురవస్థను మీరు గుర్తించేవుంటారు ." వీరయ్య అందించిన దివ్వెను కాస్త పైకెత్తి పట్టుకున్నాడు జమీందారు.

"అన్ని విగ్రహాలకూ వక్షోజాలు, నాసికాగ్రాలు ఎందుకు మొక్కపోయి వున్నాయి...." సౌరాఖ్యుడి కంఠంలో ఆతురత ధ్వనించింది కళ్ళతో కదలాడిన కన్నీటిని ఎవరికీ కనిపించకుండా జాగ్రత్త పడ్డారతను

"అదే బాబూ.. ఈ ఆస్థానానికి పట్టిన ఒక రహస్య గ్రహణం."

"దీని అర్థమేలా కాస్త వివరించండి."

"శిల్పులు స్త్రీ విగ్రహాల్ని పూర్తిచేసిన మరునటిరోజు రాత్రికి ఆ విగ్రహాలకు ఇలా ముక్కులు, చనుముక్కులు మొక్కపోయి తిరుతాయి."

"ఆ "

"ఈ అంతుబట్టని జేతాళ రహస్యాన్ని ఛేదించలేకపోయాము."

ఆశ్చర్యంగా చూస్తున్నాడు సౌరాఖ్యుడు.

"మీరే స్వయంగా ఆ విగ్రహాన్ని పరిరక్షించుకోలేకపోయారా?"

"అన్ని ప్రయత్నాలు విఫలమయ్యాయి."

"అంటే....మీ ముందే విగ్రహం శతగాత్ర అయిందన్నమాట."

"ఒకరోజు ప్రభాకర స్థపతి చెక్కిన ఆ స్త్రీ విగ్రహాన్ని నా గదిలోకి తెచ్చిపెట్టించుకుని తలుపులకు తాళాలువేసి ఒంటరిగా పడుకున్నాను. అర్ధ రాత్రి కావస్తుండగా ఢన్‌మని శబ్దం రావడంతో ఉలిక్కిపడి లేచాను. అప్పటికే నేను నా పట్టెమంచం నుంచి క్రిందపడి వున్నాను. ఉరోజాలు, సంపెంగ నాసిక భగ్నమైన ఈ స్త్రీమూర్తి నా ప్రక్కగా పడి వుంది. జీవి తంలో మొదటిసారి అంత గట్టిగా కేకపెట్టి భయభ్రాంతుడనై మూర్ఛ పోయాను. తలుపులు ఊడగొట్టి పనివాళ్ళు లోపలికి వచ్చి నన్ను సేదతీర్చి విశ్రమింపజేసారు...." ఆ అనుభవం తాలూకు గగుర్పాటు అతనిలో గమ నించాడు సౌరాఖ్యుడు. దిక్కుతోచనివాడిలా చూస్తూ వింటున్నాడతను.

"ఈ విషయాలన్నీ చెప్పాను మన స్థపతితో. ఆయన దీన్ని స్వయంగా పర్యవేక్షించి తెల్పుకుంటానన్నారు....దానితో ప్రశాంతంగా గడుపుతున్నాను .... " విగ్రహంమీద తిరిగి వస్త్రాన్ని కప్పివేస్తూ నిట్టూర్చాడు.

"ఒకసారి ప్రభాకర స్థపతిగారని విశ్వబ్రహ్మలాంటి మహాశిల్పి ఇలా స్త్రీ విగ్రహం క్రిందపడి స్పృహ కోల్పోయాడు. అతన్ని అడవి మార్గం ద్వారా రాత్రికి రాత్రే సుదూర ప్రాంతానికి వైద్యం కోసం తరలించే ఏర్పాట్లు చేశాను. మార్గమధ్యంలోనే చనిపోయాడనీ, భోరున కురిసే వర్షంలో ఏం చేయాలో దిక్కుతోచక ఆ అరణ్యంలో ఎక్కడో అంత్య క్రియలు చేసి వచ్చామని పనివాళ్ళు చెబితే విని నా గుండె తరుక్కు పోయింది. అది మా ఆస్థానానికి మాయని మచ్చగా మిగిలిపోయింది." కళ్ళు ఒత్తుకుంటూ అన్నాడు జమీందారు.

"స్త్రీ విగ్రహం మీదపడి మరణించాడా లేక స్త్రీకి చెందిన అపవాదు మీదపడి మరణించాడా...." అనబోయి కథ మరీ జటిలమైపోతుందని ఆపే శాన్ని అణచుకుని అక్కడ నిలబడలేక బయటకు నడిచారు సౌరాఖ్యుడు.

"స్త్రీ విగ్రహాలు లేకుండా ఆలయ నిర్మాణం ఎలా సాధ్యమౌతుంది మరి....?" జమీందారును సూటిగా చూస్తూ అడిగారు.

"మోహినీ పిశాచమేదో ఈ మహలును ఆశ్రయించుకుందని వదం తులు వ్యాపిస్తున్నాయి. మీలాంటి యువశిల్పులు ఈ పీడకేదైనా విరుగుడు కనిపెట్టకపోతారా అని ఆశ."

సౌరాఖ్యుడు కొంతసేపు ఆలోచిస్తూండిపోయారు. అతని మనసు పరిపరి విధాల పరుగులు తీసింది ఈ విషమ సమస్యను పరిష్కరించకపోతే తన ఉనికికే అవమానమని భావించారు.

"సరే... ఈ వ్యవహారమేమిటో తెలుసుకుంటాను ఈ వైపరీత్యా నికి కారకులైనవారిని అంత సులభంగా వదిలిపెట్టను. ఇది నా జీవన్మరణ సమస్య లాంటిది....మీరు స్తిమితంగా వుండండి సెలవు" అంటూ సౌరాఖ్యుడు శిల్పశాలలో శిలల్ని పరిశీలించడానికి అక్కడికి చేరుకున్నారు.

"భావస్థిరాణి జననాంతర సౌహృదాణి"

అనుకుంటూ ఒక విలాసవతి ఆకారరేఖను ఒక శిలపై విన్యసించా లని సౌరాఖ్యుడు యత్నిస్తున్నాడు. పాద బాహు కంఠకటి తటీ జఘనోరు ప్రదేశాల భూషణ యోజితలైన సాలంకృత కన్యలు అతని ముందు కదలి పోతున్నారు. నిష్కాలు (బంగారు నాణేలు) కూర్చిన దండలతో ఉరోజాల సోయగాల్ని ద్విగుణీకృతం చేసుకుంటూ కనులముందు కదలి పోతున్నారింకొందరు కన్యకామణులు. నిష్కగ్రీవలు, హిరణ్య కర్ణాభర ణలు, మణిగ్రీవలు, నవరత్నహారాలతో సర్వగ్రహపీడా విముక్తులైన వనితల బృందం అతనికి దర్శనమిస్తూంది.

పౌరాఖ్యుడు నిశీలాకాశం కేసి చూస్తూ వైదికయుగ దేవశిల్పి, త్వష్టను, అతని శిష్యులైన ఋభువుల్ని స్మరించుకున్నాడు. ఇతిహాసయుగ మహాశిల్పి విశ్వకర్మను ధ్యానించాడు. అసురశిల్పి మయుణ్ణి తలచుకున్నాడు.

అతని మనోనయనానికి వాస్తుపరీక్షనం చేస్తున్న శిల్పులు, వాస్తుపూజాది శాంతిక పౌష్టికాలు చేస్తున్న శిల్పులు, సూత్రపాతంతో భూమాపనం చేస్తున్న స్థపతులు, శిలోద్యమానికి నడుం కట్టిన శిల్పి ముఖ్యులు ఒక్కసారిగా దర్శనమిచ్చారు.

వప్ర ప్రాకారాల్ని నిలిపిన పూర్వాచార్యులకు, మహోన్నత పుర గోపుర ద్వారాల్ని, మత్తవారణాల్ని, మత్తకాశినుల్ని, అకాశ చుంబిత అలయాల్ని నిర్మించిన మహాశిల్పాచార్యులకు మనసా సాష్టాంగపడ్డాడు పౌరాఖ్యుడు. పుణ్యాహ వచనపూర్వకంగా వాస్తుపురుషుని ప్రార్థించి ఒక అపురూప రూపవతి ఆకార రేఖా విన్యాసానికి పూనుకున్నాడు.

మామిడికాయా వంటి వంపు బుగ్గ లున్నదిరా
లలితాంగి అధరాలు లావణ్యవతిరా ఇది
సింహమధ్య చక్రజఘన జలజ వదనరా
కలువకంటిరా బాల కంబుకంఠిరా
చక్కదనాల భిత్తివిరా తలిరుబోడికి
అలివేణిరా ఇదీ శశి బాలరా
శిలాలలిరా ఇదీ అలకనందరా
కుంద రదన రా కలికి మందగమనరా
ఏ లయజగద్ధీ ఇది మహామానవతిరా
ఏ కవి పెద్ద బొమ్మలదిది చారు బింబోష్ఠిక
చెక్కుటద్దములదిదీ శ్రీకార కర్ణములది
లతల వంటి చేతులదీ లలితమైన మాటలదీ

అంభోరుహ వదన బాల రంభోరుహా
నిర్మల పాదాలందీ ... నిక్కిన కుచకుంభాలందీ —"

ఇలా ఆలాపిస్తూ లలిత ఆకార రేఖా సౌందర్యాన్ని మనోదర్పణం మీదకు తెచ్చుకుని స్త్రీ శిలమీద బొగ్గు ముక్కతో రూప విన్యాసం చేస్తున్న సౌరాఖ్యుని ఈ గీతంలోని చివరి పదోచ్చారణ అసంకల్పితంగా ఆగిపోయింది.

"ఇక్కడే ఈ అంగ భంగిమనే నేను సంతృప్తికరంగా శిల్పించలేకపోతున్నాను. ప్రకృతి సహజమైన అందాలు అందుబాటులో లేక, పరిశీలించాలన్న ప్రయత్నమూ చేయక నేనొక అర్భక శిల్పిలా అయిపోతున్నాను. కళాకారుడికి కళ తప్ప కల్మషం ఎందుకంటుతుంది? ఈ విషయమై స్థపతిని అయ్యాక కూడా ఇలా తడబడడం శిష్యులకు తెలిస్తే ..." రూపవిన్యాసం చేస్తూన్న తన చేతిలోని బొగ్గు ముక్కను నేలకేసి విసిరికొట్టాడు. సుదూర భూముల్లో కానవస్తున్న పర్వత శిఖరాలకేసి దీక్షగా చూస్తూ కూర్చున్నాడు.

"ఆచార్యా! దూరప్రాంతం నుంచి బండ్లమీద వచ్చిన గండశిలలు ఎక్కడ దించమంటారు?" ఓ శిల్పి సౌరాఖ్యుని వద్దకు వచ్చి అడిగాడు.

"శిలలు వచ్చాయా? శిలా నిర్ధారణ ఎవరు చేశారు? ఏ ప్రాంతం నుంచి వచ్చాయవి?" ఆదుర్దాగా ప్రశ్నించాడు సౌరాఖ్యుడు.

"సూత్రగ్రాహిగారు ఓ వనప్రాంతానికి వెళ్ళి ఆ శిలల్ని సేకరించారు."

"ఇంతవరకు అతనూ, నేనూ కూడా శిలాసేకరణకు వెడతామని చెప్పింది. నాకు తెలియకుండా ఓ శిలకూడా ఇక్కడికి రావడానికి వీల్లేదు." ప్రసన్నంగానే చెప్పినా అందులోని దృఢత్వం అవతలి వ్యక్తికి అర్థమైంది.

"పద... పద శిలల్ని చూద్దాం" పెనుశిలల్ని లాక్కొని వచ్చి, నురగలు కార్చుతున్న వృషభాల్ని కరుణతో చూస్తూ హస్తతాపనం చేశాడు.

"ఇలా రండి" అక్కడ శిల్పాలు చూస్తున్న శిష్యుల్ని దగ్గరకు రమ్మన్నాడు. "మీకు ప్రధాన స్థపతిగారు చెప్పే వుంటారు కానీ మీకు శిల్ప విజ్ఞానం గురించి చెప్పవలసిన బాధ్యత నామీద వుంది కాబట్టి చెప్తున్నా. సంగ్రహించిన శిలను మొట్టమొదట నీటితో బాగా కడగాలి."

"అవునండి."

"ఎందుకు?"

"పరిశుభ్రత కోసం"

"కాదు....శిలలో వెంట్రుక వాసంతటి బీటవున్నా ఆ నీరు నెమ్మదిగా అందులోకి దిగుతుంది. అది మనకు బాగా బీటలా తెలుస్తుంది. అప్పుడది శిల్పానికి పనికిరాదని తెలిసిపోతుంది ఆ శిలా శకలాన్ని ఇలా తీసుకు రండి....ఇలాంటి నల్లని మచ్చలున్న శిలలు శిల్పార్హతను కోల్పోతాయి. బాలశిల యౌవనశిల, వృద్ధశిలల్లో మొదటిదీ ఆఖరుదీ శిల్పానికి పనికిరావని మీకు తెలిసిందే. యౌవనశిలలో వుండే లోపాలు చెప్తాను.

ఆ రాతి పలుకునిలా ఇవ్వండి....దీన్ని జాగ్రత్తగా గమనించండి. మిలమిలలాడిపోతూంది కదూ....ఇందులో ఇసుకరజం శాతం అధికంగా వుంది. ఇలాంటి శిల మీద శిల్పాలు చెక్కడం కష్టం. ఉలులు మొక్కపోతాయి. పిప్పరవ్వల్ని కక్కుతాయి. ఆకార రేఖ అనుకున్నంతగా దీని మీద రూపొందదు. కాబట్టి వీటిని పరిత్యజించాలి.

నెమలి పింఛంలాంటి చారలు, నల్లటి చారలు వున్న శిలల్ని వదిలేయాలి. ఈ శిలల్లో అశుభ లక్షణాలు అధికం. వీటితో శిల్పాలు చెక్కితే దేవతలు చర్మరోగుల్లా కనిపిస్తారు.

ఈ శిలాఖండం ఎలా మ్రోగుతోందో చూడండి. మరీ ఖంగుమంటూ గంటలా వుంది ధ్వని. ఇలాంటివీ పనికిరావు. "నరేనా ఎర్రబండమీది పెను శిలలు కదలకుండా వాటి కింద వుందకుని తెచ్చిన పెద్దపెద్ద శిలాఖండాల్ని సేకరించే శిష్యులకు అతను వివరించిన పద్ధతి వాళ్ళను ఆకట్టుకుంది.

"సరే....మీ పనులు మీరు చూసుకోండి. శిలా సంగ్రహణ ఓ అపారశాస్త్రం. దాన్ని గురించి తర్వాత వివరిస్తాను....ఆ బండ్లవాళ్ళను ఇలా పిలవండి....ఇదో బాబూ....ఇసుక నేలల్లో ఈ శిలల్ని ఎద్దులచేత లాగించుకుని వచ్చేటట్లయితే ఇసుక రేకుల్ని ఆ ఇసుకదారిలో పరచి వాటి మీద చక్రాలు వచ్చేటట్లు బండ్లు తోలుకురావాలి. అప్పుడు ఎద్దు అలసిపోవు. త్వరగా గమ్యం చేరుతారు కూడా...." పూర్వాచార్యులు శిలల్ని సేకరించిన పద్ధతుల్లో ఆతను ఈ విషయాన్ని ఎక్కడో చదివాడు. దాన్ని వాళ్ళకు వివరించాడు.

"మరి ఇసుపరేకులు బాబయ్యా!"

"నేను విభూషణరావుగారితో చెపుతాను"

"ఆ పుణ్యం కట్టుకోండయ్యా" నమస్కరించి వెళ్ళిపోయారు వాళ్ళు.

"ఆ రాతిమీద ఉప్పు ఎవరు పోశారు?" శిల్పులవేపు ప్రశ్నార్థకంగా చూశాడు సౌరాఖ్యుడు.

"నేనేనండి" ఏదో వంటపనికో వున్న ఒక యువకుడు వచ్చి నిలుచున్నాడు.

"చూడయ్యా! శిల్పాలు చెక్కబోయే రాళ్ళను విండు నెలలతో వున్న బివరాళ్ళలా జాగ్రత్తగా చూసుకోవాలి. ఉప్పునీరు తగిలేకొద్దీ రాళ్ళలోని సారం తగ్గిపోతుంది. మీకు తెలియదనుకుంటాను. సముద్రపు అలలు తాకుతున్న రాయి సారహీనమై బెండువడిపోయుంటుంది....అన్నట్టు మర చాను—సోదరుడు సూత్రగ్రాహిని, వర్ధకినీ, తక్షకినీ నేను రమ్మన్నానని పిలవండి" ఆతను ఓ చెట్టునీడలో ఏకాంతంగా వెళ్ళి కూర్చున్నాడు.

వినయంగా నిలబడిన సూత్రగ్రాహి భుజంమీద చేయివేసుకుని సౌరాఖ్యుడు ఆ శిలలవేపు నడిచాడు. మిగిలినవాళ్ళు ఆ ఇద్దరినీ అనుసరించారు.

"చూడండీ....సాక్షాత్తూ విశ్వకర్మలాంటి శిల్పాచార్యుల పుత్రులు మీరు. మీకు నేను కొత్త విషయాలు చెప్పాలనుకోవడం నా అల్పజ్ఞత అవుతుందని నాకు తెలుసు" ప్రశాంతంగా చూస్తున్నారు సౌరాఖ్యుడు.

"అలా అనకండి....మా నాన్నగారు కూడా మీ గురించి చాలా గొప్పగా చెబుతుంటారు" మనసులో ఏ మూలనో సౌరాఖ్యునిపై వున్న అసూయను సూత్రగ్రాహి సంస్కారంతో శమనం చేసుకున్నారు. పైగా నిజమైన నైపుణ్యం వున్నవాళ్ళ దగ్గర నేర్చుకోవాలనుకునే వినయ స్వభావం వున్నవాడు కాబట్టి స్వచ్ఛంగా నవ్వాడతను.

"విద్యకంటే మీ దగ్గర విశాలహృదయాన్ని, వినయాన్ని చూసి నేను మీకు శిష్యుడనై పోదామనిపిస్తుంది."

"అంతమాటనకండి" కదలిపోయి చేతులు జోడించాడు సూత్రగ్రాహి.

శిల్పుల ఆచారం ప్రకారం తెల్లటి బట్టలు ధరించిన వాళ్ళందరూ రాజహంసల గుంపు తటాకంలోని రాళ్ళ మధ్య ఈదులాడుతున్నట్లు సాగిపోతున్నారు. ఏ అంతరిక్ష కక్షలోనో విహరించే దివ్యశక్తులకు మూర్తి కల్పన చేసి సామాన్యుల జన్మలకు సార్థకత కలిగించే అమరమూర్తులు వాళ్ళు.

"సోదరా!" సూత్రగ్రాహి నుద్దేశించి అన్నారు.

"చెప్పండి."

"ఈ శిలలు శిల్పాల్లా రూపొందడానికి చాలాకాలం పడుతుంది కదా! వీటిని అంతవరకూ ఇలా ఎండలో, గాలిలో వదిలేసి వెళితే ఆ శిలల్లోని మార్దవం తగ్గుతుందని మీకూ తెలుసు. రైతులు పచ్చని పొలాల పదును తగ్గకుండా ఎలా పరిరక్షించుకుంటారో అలా శిల్పయోగ్యగండశిలల్ని పట్టతో కప్పి కాపాడుకోవాలి. అసలు మనం భూమిలోపల వుండే శిలలే సారవంతా

-లని కదా శిల్పాల కోసం వాటిని శ్రేష్ఠంగా భావించి సంగ్రహిస్తాము! నేల మంచి వెలికితీసి ఎండలో పడవేస్తే ఎలా మరి రాళ్ళు పచ్చికర్రల్లాంటివి. ఆ చెమ్మ తగ్గితే ఉలికి సున్నితంగా లొంగవని శాస్త్రం ఘోషిస్తుంది. పెరువరాళ్ళు మనం వాడకపోవడానికి కారణం అదేకదా!" వ్యాసంగా సంభాషిస్తున్న సౌరాఖ్యుని ముందు తమ నిర్లక్ష్యానికి నొచ్చుకున్నారు వాళ్ళు. అతని సూక్ష్మగ్రాహితకు, శాస్త్రదృష్టికి లోలోపలే అభినందించారు కూడా.

"తూలీనము విలిచి ఈ పెనుశిలలన్నింటినీ మట్టికో కప్పి వీలైతే అప్పుడప్పుడూ నీళ్ళు చిలకరిస్తుండండి" అంటూ సూత్రగ్రాహికి, వర్ధకికి ఆ పని పురమాయించాడు సౌరాఖ్యుడు.

"సోదరా! ఈరోజు ఓ స్త్రీ శిల్పాన్ని ప్రారంభించాలనిపిస్తోంది" ఎదురుకాబోతున్న సమస్యను ఎంత త్వరగా పరిష్కరించుకుంటే అంత మంచిదని అతని ఉడుకురక్తం తొందరపెట్టసాగింది.

"అవశ్యం" సౌరాఖ్యుని ముఖంలోని ఉద్రేకాన్ని గుర్తించి వెంటనే అంగీకరించారు సూత్రగ్రాహి. సౌరాఖ్యుడు స్త్రీ శిల్పగ్రహణాన్ని తొలగించివేస్తాడన్న నమ్మకం అతనిలో కుదిరింది.

"శిల్పారంభానికి సిద్ధం చేయండి". సౌరాఖ్యుడు గంభీరంగా మారిపోయాడు. అతని మనసు అవ్యక్త భావామధురమైపోయింది. అతని చూపు సుదూరాల కావలి పిలిమలో లీనమైంది.

"అయ్యా! చల్ల తాగుతారా?" చల్లని కంఠధ్వని వినిపించింది.

"ఇదెక్కడో విన్నట్టుందే...." నెమ్మదిగా తిరిగి చూశాడు సౌరాఖ్యుడు.

"మవ్వ...." మజ్జిగ దుత్తలున్న గంప నెత్తిన పెట్టుకుని కన్పించిన ఆమె తనకు వరాలివ్వడానికి అవతరించిన దివ్యాంగనలాగా అనిపించింది.

"మీరు ఇక్కడేం చేస్తారు బాబు" ఆ మాటలోని ఆత్మీయతా సమ్మిళిత మాధురిని అతని హృదయం అందుకుంది.

"నేను స్థపతిని" కళ్ళలోకి చూస్తూ అన్నాడు.

"అమ్మో...." రాళ్ళమీద కూర్చుని శిల్పాలు చెక్కే ఆ శిల్పులందరికీ మజ్జిగ అందిస్తూ గమనించింది - స్థపతి అంటే ఎంత పెద్దవాడో, అందుకే ఒక అడుగు వెనక్కు వేసింది

"ఏం స్థపతి అంటే మనిషి కాదా" నవ్వాడతను.

"మనిషే....మామూలు మనిషి కాదుగదా" చల్లకుండల భారాన్ని దించుతూ ఓరగా చూసిందా కన్నెపిల్ల.

ఆ పల్లెటూరి పిల్లలో కూడా అంత విజ్ఞత వున్నందుకు ముచ్చటగా చూశాడతను

"...." సిగ్గుతో తల వంచుకుందామె.

"రోజూ వస్తుంటావా ఇక్కడకు?"

"ఈ ప్రాంతంలో శిల్పులకు, ఆ కొండక్రింద రాళ్ళుకొట్టే వాళ్ళకూ మజ్జిగ అమ్మిపోతుంటాను." ఆమె ముద్దుగా మద్ద మందారంలా, సంధ్యా సిందూరంలా అతనిలోని శిల్పతృష్ణను రగిలిస్తూంది.

'పక్కన కుచకుంభ' అతని గుండె ఝల్లుమంది.

"ఆ రోజు అడవిలో దారి చూపావు నాకు, ఇప్పుడు...." అతని కంఠంలో కృతజ్ఞత రవళించింది.

"ఏదారి చూపమంటారు బాబూ" మంజీర గుళుచ్ఛంలా లయబద్ధంగా కదలాడినట్లు నవ్విందామె.

"నీపేరేమన్నావు...." కొద్ది పరిచయంతోనే చొరవ తీసుకుంటున్నాడతను.

"తృణబిందు" అతని చొరవను ఆమె ఆకాంక్షిస్తూంది.

"అశ్రమవాసుల కంతవరకిసినంత మంచిపేరు....ఎవరు పెట్టారు మీకు?"

"మీలాగే ఎవరో ఋషి అడవి దారి వెంబడే వెళుతూ, మా ఇంటికి వచ్చి చల్లని మజ్జిగ తాగి నన్ను చూసి ఈ పేరుపెట్టి వెళ్ళాడట."

ప్రకృతి సిద్ధమైన జాణతనం ఆమె అద్దాల కళ్ళలో మెరిసిపోతుంది.

"నేను ఋషినని ఎవరన్నారు?" అతని చూపులో కొంటెతనం ప్రస్ఫుటించింది.

"ఏమో - నా కలా అనిపిస్తూంది" చల్లదుత్తను తన మెత్తని ఒడిలో వుంచుకుంది.

"మంచు ముత్యంలాంటి పేరు...."

"గడ్డి కోసుకునే వాళ్ళం....మాకెందుకు బాబూ అంత మంచిపేరు!"

"ఆ పేరులోని అర్థంకూడా అదే."

"అలాగా...." మళ్ళీ నవ్విందామె.

"చెప్పండి మీరేదో అడగదలచుకున్నారు" ఒక మట్టి పాత్ర నిండా చిక్కటి మజ్జిగ నింపి చేతిలో పెట్టుకుంది.

"ఆ రాతి మీదనుంచి గంప దించు" అనబోయి ఆగిపోయాడు. ఆ అమ్మాయికున్న వక్షోజశ్రీ అతణ్ణి ఆకట్టుకుంది. ఎంత తపస్సు చేసిందో ఈపిల్ల ఇంత కుచసంపద సంపాదించడానికి! అప్రయత్నంగా అతని చూపు ఆమె పైటమీద పడి దారికోసం వెతుకలాడసాగింది.

"నావల్ల మీకేం సహాయం కావాలో చెప్పండి" అనుమతి పత్రం లేకుండా లోపలికి ప్రవేశించబోతున్న ఆకతాయి కుర్రాళ్ళను అడ్డుతున్న ప్రతిహారుని అరచేతిలా ఆమె సర్దుకున్న పైటచెంగు అతని చూపులకు అడ్డుపడింది. అతని అంతర్మథనాన్ని ఆమె గమనిస్తూ కూర్చుంది. అతను కాసేపు ఆత్మ పరిశీలనలో పడ్డాడు. అతనిలో ఆత్మ విమర్శ ప్రారంభమైంది—

'ఇంత నీచంగా ఎలా తయారయ్యావు?'

'ఇది నీచమని ఎలా అంటావు?

'కళపేరుతో కాముకతను ప్రదర్శించటం లేదూ నువ్వు?'

'లేదు....ఆ అభాండం వేయకద్దు నామీద.'

'నీ తల్లి చెల్లి అయితే-ఇలా ప్రవర్తిస్తావా?'

'వాళ్ళ విషయం వేరు.'

'పరాయివాళ్ళ విషయమైతే మనం పశువులం కావచ్చా.'

'కళాసృష్టి పశుత్వమా?'

'ఈ ప్రయోగాలు నీ అర్ధాంగితో చేసుకోవాలి.'

'భార్య వుంటే నాకీ దౌర్భాగ్యం వుండేది కాదు.'

'పెళ్ళి చేసుకో.'

'ఆ విషయం నేనింకా నిర్ణయించుకోలేదు'

'మొన్ననే చూశావు—అప్పుడే ఇంత చొరవ చేస్తున్నావు! నువు గోముఖ వ్యాఘ్రానివేమో.'

'మరీ నీచంగా సంభాషించకు....ఇది సనాతన రక్తం. నిత్యసత్య వ్రతాచరణతో, తపస్సమాధి నిష్ఠతో బ్రతుకుతున్న శిల్పకళాభిరామున్ని నేను....నువ్వు అనుకున్నంత కాముకుణ్ణి కాను....ఓ శాస్త్రవేత్తలా నేను కొన్ని అంగభంగిమల్ని ప్రకృతి నుంచి నేర్చుకోవాలి. అది తప్పుకాదు.... స్త్రీ కూడా ప్రకృతిలో భాగమే....కాదు ప్రతిబింబమే....వచ్చిన స్త్రీని నగ్నంగా చూడడం పాపమైతే ప్రకృతి అందాల్ని పరిశీలించి చూడడం కూడా పాపమే అవుతుంది....ఏమంటావ్?' అనిమనెన అతని కళాత్మక భావనతో గొంతు చేసుకోవడంతో మనస్సు మౌనం వహించి తలవంచి వున్నట్లు అతనికి అనిపించింది. కాముకతను జయించిన శిల్పకళావిన్యాసంలా ఆ వనకన్యవేపు తేరిపార చూశాడు. "నువు నాకు చేయవలసిన సహాయం ఏమిటో చెప్తాను.. నా విడిదిగృహంలోకి వస్తావా?"

"ఎందుకూ?...." గుండె గుబగుబలాడగా, అతని మనఃసర్వస్వమూ, కళ్ళలోని దివ్యదీప్తికి ఆ ముగ్ధ మంత్రముగ్ధలా అతన్ని అనుసరించింది.

"నేనంటే నీకు ఆత్మీయత వుందా?"

"దాన్ని నేను నోటితో చెప్పాలా బాబూ!" సౌశాబ్యుడు కూర్చున్న ఆసనం ముందు అతని పాదాల దగ్గర కూర్చుందామె.

"నేనేమడిగినా ఇస్తావా?" అతని కంఠం ప్రకంపించింది.

"ఇవ్వకూడనిది అడిగేటంత చెడ్డవారు కాదుకదా మీరు" ఆమె కళ్ళలో కన్నెపిల్ల వయసుకున్న పదును ప్రకటితమైంది. మనసు వశే మథనం రక్తంలో సుడులు తిరిగి బుగ్గల్లోకి అరుణ తరంగాలుగా ప్రసరించింది. గుండెలో నెత్తురు కలువ విచ్చుకుంటూంటే ఆమె లోలోపల రేకల ముగ్గులు గీసుకున్న కన్నెమొగ్గలా అతని ముందు శిరసు వంచుకుని కూర్చుంది. ఆమె మనస్సు వలపుల ఇంద్రధనుస్సులా మారి అతనికి పాద పీఠమై నిలిచిందని అతను గుర్తించాడు. తన తపశ్శక్తి అంతా కాంతి తరంగాలుగా ప్రసరిస్తున్న గురువు సన్నిధిలోని ప్రియ శిష్యురాలిలా ఆమె మొదటిసారి అద్వితీయానుభూతికి లోనైంది.

"నేను మీ అధీనము" అన్నట్లు చూసిందామె.

"అయితే....శిల్పులకు ప్రాణదానం చేసే అదను శిరశిల్పాల్ని దర్శనం చేసుకోవాలని వుంది" నాటికేసి చూస్తూ నమస్కరించాడతను.

కోమల హస్త పాద విన్యాస విరాజితమైన రాసక్రీడలోకి తనను కృష్ణుడు ఆహ్వానించినట్లు, పొన్నచెట్టు నీడనే పైటగా మిగిల్చి చుంబించి తన మోహం రేపిన మోహనాకారుడు తన ఎదుట నిలిచి కొంటెగా నవ్వుతున్నట్లు. గోప కామినుల గోపాంగ సుమాల మీద నీలిమేఘశ్యాముని నీలి చూపులు తుమ్మెదలై ఝుమ్మనే రాగంతో రాపాడినట్లు, సున్నితమైన కన్నె పుష్పదళాలమీద గండు తుమ్మెద తన గరుకు పాదాలతో రతిక్రీ

లాపినట్లు, నీలిమేఘం చుట్టూ మెరుపు తీగలు నగ్నంగా ఆడినట్లు, ఉద్విగ్నంగా పాడినట్లు, లేగదూడ చెంగు చెంగున యమునా తీరం వెంబడి దూకుతూ వచ్చి పరిశ్రమైన పాడి ఆవు పొదుగును ప్రగాఢంగా దూటినట్లు, తానే బృందావన రాణి అయిపోయినట్లు ఆమె మనస్సు ఏదో మాటలకందని అనుభూతుల లోతుల్లో ఈదసాగింది. స్పందనానంద శిఖరాల శిర్షాల మీదుగా విహరించసాగింది. శృంగారమొక విద్యుత్ తరంగమై తాకి, కొంతసేపు ఆమె మూర్ఛనలు పోతున్న ముగ్ధవీణగా మారి, అతని పురుష పరిషళానికే రాగాలు తీసింది.

"పున్నమ రాత్రికి....మా ఊరి పొలిమేర గుడి దగ్గరకు రండి" తేరుకుని, అతని అంతర్యాన్ని అర్థం చేసుకున్న మహాయోగినిలా నిలుచుంది.

"చల్ల తాగనేలేదు" అందించబోయింది.

"వద్దు....నేను త్రాగలేనిప్పుడు."

ఆమెలో కనిపించిన అకాల మాతృత్వానికి ముగ్ధుడై మరోమారు చేతులు జోడించారు. తన ఆర్తిని, కళాతృష్ణను, నిజాయితీని అర్థం చేసుకున్న ఆ ప్రాకృతకన్య ఔదార్యానికి అతను చలించిపోయాడు.

బయటేదో మాటలు వినబడడంతో జ్ఞానోదయం చెందిన గోప కాంతలా నిండు మనసుతో చల్లగా అతన్ని చూస్తూ వెళ్ళబోయిందామె.

"ఆగు...." తృణబిందును అటకాయిస్తు జమీందారు తోటమాలి పౌరాఖ్యని సుదారంలోకి వచ్చాడు.

"ఏమిటి?" అసహనంగా అతనికేసి బొమముడితో చూశాడు పౌరాఖ్యుడు.

"ఇకమీదట అనుమతి తీసుకోకుండా ఈ పాలమ్మాయిని మహలు తోటలోకి వచ్చి మీతో మాట్లాడవద్దని చిన్నమ్మగారు చెప్పమన్నారు."

"ఈమె నాతో మాట్లాడలేదు—నేనే ఈమెతో మాట్లాడుతున్నానని మీ అమ్మగారికి చెప్పు....అంతేకాదు—రోజూ ఈమె వచ్చి పోతుందని కూడా చెప్పు....అది సరే కానీ నా అనుమతి తీసుకోకుండా గుడారంలోకి నువ్వు ఎలా వచ్చావు?" అతనికేసి తీక్షణంగా చూశాడు సౌరాఖ్యుడు.

"క్షమించండి. తప్పయిపోయింది" అనుకొని ఈ హఠాత్పరిణామానికి తోటమాలి నిత్తరపోయాడు.

సౌరాఖ్యుని చూసి మందహాసం చేస్తూ వెళ్ళిపోయింది తృణబిందు.

ఎవరో వస్తున్న అలికిడి విని వెనుదిరిగి చూశాడు సౌరాఖ్యుడు.

"ఏమిటయ్యా! ఈ శిలలు ఉలికెలా ఒదుగుతున్నాయా?" చిరునవ్వు నవ్వుతూ ప్రధాన స్థపతి సౌరాఖ్యుని సమీపంలో వచ్చి కూర్చున్నాడు.

"ఇవి మీ పర్యవేక్షణలో సేకరించినవి కదా—లోపాలేమీ లేవు" గౌరవపూర్వకంగా చూశాడు. ఇలా వాళ్ళు సంభాషించుకుంటున్నంతలో అటుగా వచ్చాడు జమీందారు.

"ప్రధాన స్థపతిగారికి నమస్కారాలు. మా దూరపు బంధువుల ఈ నేలలో ఆలయానికి పునాదులు తీస్తుంటే ఒక అవాంతరం ఏర్పడిందట.

"ఏమిటో చెప్పండి" అన్నాడా వృద్ధ స్థపతి నింపాదిగా.

"వాళ్ళకు బాగా అచ్చివచ్చిన స్థలంలో ఒకవైపున చాలావరకు కట్టడాలు లేచాయి కూడా—లోపలెక్కడో చిన్న బుగ్గనుండి నీళ్ళు నెట్టుకొని వస్తున్నాయి."

"ఏది అడ్డుపెట్టినా ఆగలేదా?"

"లేదు. మరోవైపున మట్టిని తోసుకుని వస్తోంది ఆయన చాలా బాధపడుతూ నా దగ్గరకు పరుగెత్తుకొచ్చారు. నేను మిమ్మల్ని అడిగి పోదామని ఇలా వచ్చాను."

"అలాగా—" దీని పరిష్కారమేమిటో పాలుపోక ఆలోచిస్తున్నారు వృద్ధ ప్రధాన స్థానాచార్యులు.

"అయ్యా! మీకేదైనా సహాయపడగలనేమో. నాకూ ఆ సమస్యను తెలుపుతారా?" దూరంగా శిల్పం చెక్కడానికి పనికి వస్తుందా లేదా అని నలువైపులా శిలను పరీక్షిస్తూ వున్నవాళ్ళ మధ్యనుంచి అక్కడికి వచ్చాడు సౌరాభ్యుడు.

"మావారిలో శిలబుగ్గ బెడద" సంక్షిప్తంగా చెప్పారు వృద్ధశిల్పి

"ఓహో!" చకచకా శిల్పశాస్త్రాలన్నీ అతని స్మృతిపథంలో పరుగులు తీస్తున్నాయి

"మీరు ఒక్కటి తంలా వున్నారు. చెప్పినా పరిష్కారం చెప్పేయగలరు." జమీందారు మనసులో ఏదో విశ్వాసం అతనిమీద ఏర్పడింది.

"మీకు తెలిస్తే చెప్పు నాయనా" ఈర్ష్యారహితంగా ధ్వనించింది ప్రధాన స్థపతి వాక్కు.

"జమీందారుగారూ! పెద్ద పెద్ద కొరమీనులు దొరుకుతాయా వాళ్ళకు"- పాలోచనగా అడిగాడు.

"అటువైపు చెరువులన్నీ వాళ్ళవే కదా!" గర్వంగా అన్నాడు.


"చెరువుల్లో నుంచి దెబ్బ తగలకుండా లావుపాటి కొరమీనులు పట్టుకోవాలి వాళ్ళు. శిలబుగ్గ వస్తున్న చోటగా లోపలికి చేయిపెట్టి వాటిని వదిలిపెట్టాలి. అలా ఒక్కొక్కదాన్ని నీరు ఆగేదాకా వదులుతూ రావాలి. నీళ్ళు వచ్చే దేశంగా బురదలోకైనా చేరే దూసుకుపోయే గుణం చేత జాతిలో ఒక్క కొరమీనుకే చాలా వుంది. ఈ ప్రయోగం చేసి పూర్వం ఒక శిల్పాచార్యుడు ఆలయ నిర్మాణంలో ఏర్పడిన ఇలాంటి అవాంతరాన్ని అధిగమించాడు" శిల్పహంగా సూచనలిచ్చాడతను.

జమీందారు సంతోషంగా లేచి నిలుచున్నారు. అతనికి ఈ ప్రయోగం ఫలిస్తుందనే నమ్మకం ఏర్పడింది.

"చూడండి! ఆ నీరు ఆగీ ఆగగానే కట్టడం గబగబా పూర్తికావాలి. ఆ శిలలదగ్గ లాడతీసి ఆ ప్రాంతంలో చిన్నదాని త్రవ్వడం మంచిది. అప్పుడు పునాదికి భద్రత ఏర్పడుతుంది."

"అలాగే బాబూ! అతనికి విషయం చెబుతాను. స్థపతిగారూ! మా కాంటి యువశిల్పిని రప్పించదలుస్తున్నారు" అంటూ కంయువా సర్జకుని వెళ్ళిపోయారు

"శిల్పం పేరు నిలబెట్టావు బాబు!" ఆప్యాయంగా భుజం తట్టి ఒక క్షణం లోతుగా అతని కళ్ళలోకి చూసి ముందుకు నడిచారు స్థాపనాచార్యులు. పౌరాణ్యుని ముఖంలో చిరునవ్వు విచ్చుకుంది.



# 4

తనను తాను తెలుసుకోవాలని తనను వదలి కొండలూ కోనలూ తిరుగుతూ తననుండి ఎంతోదూరం వెళ్ళిపోయిన ఒంటరి బాటసారి శిల్పి. శిలావిష్కృతం ప్రస్తావన—మోక్షం పరిణతి. జీవుడికీ, దేవుడికీ మధ్య వంతా వాటికి శిల్పి శిలను ఎన్నుకుంటాడు. యోగికి తప్ప మరొకడికి పరమాత్మతోటి ప్రత్యక్ష సంబంధం సవ్యంగా ఏర్పడదు.

అసంపూర్ణుడైన మనిషి సంపూర్ణతను సాధించడానికి కళల్ని ఆశ్రయించాడు. కానీ అక్కడా అసంతృప్తే. శిల్పాలు స్వర్గాలు జార్చిన ఆనంద బిందువులు. శిలాఫలాలు ప్రశ్నపత్రాలు. శిల్పి యత్నాలు జ్ఞాన పత్రాలు. అశిక్షిత ప్రాకృత స్వరూపాలు పర్వతాలు. శిల్పి ప్రకృతికి ముద్దు బిడ్డ. పరమ పిత ప్రతిరూపాల్ని తయారుచేసి తల్లికి చూపుతూ ఆమె ఒడి వైభవాన్ని సముపార్జించుకుంటాడు.

శిలా సముద్రపు అలలమీద తేలివచ్చే రత్న కరండికలు శిల్పాలు. కళాత్మకత ఇంత గుండెలో పూరించుకుని శిల్పి శిలతో తలపడతాడు తన హృదయాన్ని శిల్ప దర్పణంలో చూసుకోవడానికి పిచ్చి పిచ్చికలా కలబడతాడు. చంచపుటాల్లాంటి ప్రేమ్న రక్తసిక్తమైనప్పుడు ఆ శిల్పంలోని అమరాగ రాగమేదో వింటాడు. మానవుల శరీరం మీద స్మృతుల భావం ప్రతిఫలించేదేమోగానీ కఠిన శిలల్లో సుస్మిత భావం ప్రస్ఫుటమవుతుంది.

ఉలులు శిలలతో ప్రణయ భాషణలు చేసుకుంటూ కిలకిలలాడుతున్నట్లు మధుర ధ్వనులు ఆ ప్రాంతమంతా సందడిస్తున్నాయి. శిలల్ని శిల్పసంపత్తుగా పరిస్తున్నట్లున్న సవ్వడి ఆ మహా ప్రాంతాన్ని ప్రతిధ్వనింప జేస్తోంది.

"అమ్మాయిగారూ! పిలిచారా....!"

"వీరయ్యా! కొత్త స్థపతిగారు శిలార్చన ప్రారంభించి శిల్పం చెక్కబోతున్నారట.... ఆ విషయం వెళ్ళి చూచిరా...." ఆమె మాటలో తీక్షణత చోటుచేసుకుంది. అలాగేనంటూ వెళ్ళిపోయాడు నౌకరు.

యువ స్థపతి విషయంలో తన మనస్థితి ఏమిటి? ఆత్మ పరిశీలన చేసుకుని తెల్సుకోవాలని మనసులోకి తొంగిచూసిందామె. అక్కడ జరిగే వాగ్వివాదానికి ఆమె సాక్షిగా నిలిచింది.

'అబ్బే — మామూలు శిల్పి ఎక్కడ? మవ్వెక్కడ?"

'నిజంగా ఈ మాట మనస్పూర్తిగా చెబుతున్నావా? అతనిలోని వర్చస్సు. ఆ గాంభీర్యం, నైష్ఠిక పటుత్వం, సౌందర్య తపన, ముఖ్యంగా వ్యక్తిత్వం నిన్ను మంత్ర ముగ్ధను చేస్తున్నాయి కదూ!"

'ఛీ ...ఛీ....అదేంలేదు!'

'ఉంది....మరి — చల్లలమ్ముకునే పిల్ల విషయమై అతను నీకు తెలియజేసిన ప్రత్యుత్తరం—అతని వ్యక్తిత్వం నిన్ను మరీ ఆకర్షించాయి కదూ!'

'అతనికి కొంత తలబిరుసుంది....తనే గొప్ప శిల్పాచార్యుడని ... దాన్ని పోగొట్టాలి.'

'ఎలా....'

'ఉలి చేత పట్టుకుని మా ఆస్థానంలో రాతిపని చేయడానికి వచ్చిన ఓ మామూలు యువకుడికి ఇంత అహంకారమా!'

'దాన్ని నిజంగా అహంకారమనే అనుకుంటున్నావా?

'కాక మరేమిటి?'

'కాదేమో. ఇంతకూ నీ మనసులో అతని స్థానం ఒక శిల్పిగా మాత్రమేనా?'

'అవును.'

'అయితే....అతని గుడారంలోకి పాలమ్మాయి వెళితే నీ మనసెందుకు కలుక్కుమంది?'

'శిల్పులకు అపకారం కలిగిస్తుందా పిల్ల.'

'నేడి శిలమీద నగలంతా పనిచేసే శిల్పులకు చల్లగా ఇంత చల్ల పోసిపోయే పిల్లవల్ల వాళ్ళకు కలుగుతున్నది ఆనందమా? ఆతంకమా?'

'................'

'అలా అక్రమవంచనకు పాల్పడకు. అసలు విషయాన్ని ముందు తేల్చుకో....'

శిలమీద పనిచేసి పనిచేసి పటిష్ఠంగా తయారైన శరీరం, పవిత్రతవంతో ఆ శరీరానికి ఏర్పడిన సర్పమ్ము, కళారాధనతో కళకళలాడే విశాలమైన కళ్ళు తన శరీరాన్ని తనే శిల్పించుకున్నంత అందమైన నాసికా పోయగం. కల్పనాంగ రేఖలో నిశితత్వాని, కుశాగ్రతను ఆవిష్కరించే చూపులు, శిల్పి సాధనలో అనంకల్పితంగా పెరిగిన అతని గడ్డం....'

'చాల్లే ఇక....'

'ఇంతకూ నీకూ అతనికి ఏర్పడుతున్న అనుబంధం పేరేమిటి?'

'అనుబంధం ఏమీలేదే.'

'లేదా?'

'తెలియదు.'

మానవ న వో మార్మిక భూముల్లో జరలు విరబోసుకుని, సర్వ జంతుసామ్యాన్ని సంతరించుకుని, వింత వింత వికారాలతో సంచరిస్తున్న మనస్సు మాయావినుంచి అంత్రితమైన సమాధానాన్ని ఆశించి, ప్రవాశ చేసిన ప్రయోగం ఆమెను మరింత అశాంతికి గురిచేసింది. దానితో ఆమెకు పొరాతునీ మీద కోపం వచ్చింది. మంచు బిందువుల భారాన్ని మోయలేక మోస్తున్న చివరి టాకుల గుత్తిలా ఆమె ప్రకంపించి పోతూంది.

"అమ్మాయిగారూ! శిల్పాన్ని చెక్కడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామమ్మా!"

"రే....నీ పని చూసుకో వెళ్ళు....నాన్నగారు లేరా?"

"లేదమ్మా."

"శిల్పాన్ని చెక్కుతున్న చోటికి వెళ్ళానని చెప్పు" మహలు దిగి పోతూ నడిచింది.

ముగ్ధతతో కలిసిన సౌందర్యం, ప్రసన్నతతో చేకూరిన లావణ్యం, పంచపాత్రం ద్వారా సంక్రమించిన అభిజాత్యం అన్నీ కలిపి ఆమెకు అపూర్వ శోభను సంతరింపజేశాయి. వీటన్నిటినీ మించిన కళాహృదయంతో ఆమె పరిమళిస్తున్న సజీవ స్వర్ణప్రతిమలా రూపుదిద్దుకుంది.

• • •

"లీ ధ్యాత్ లింగం—అన్నిటినీ తనయందు లీనం చేసుకునేది లింగం. ఇదీ దీని వ్యుత్పత్తి. వాటితో తీత గోచరమైన శక్తి ఈ లింగానికి వుంది.

సృష్టికాలంలో ఆదిపురుషుని నుండి 'కాంతి' అనే తత్త్వం ఉత్పన్నమైంది. కాంతి నుంచి శక్తి పుట్టింది, శక్తి నుంచి నాదం ఉద్భవించింది. ఆ నాదం నుంచి బిందువు ప్రభవించింది. ఆ బిందువు నుండి ఈశ్వరుడు ఆవిర్భవించాడు. ఈశ్వరానుమతితో నాదము బిందువు కలిసి అనంతాకార రూపాలతో సృష్టి విలసిల్లింది.

ఇక్కడ మనకు కావలసిన విషయమేమిటంటే — ఈ నాదమే లింగాకారం, ఆ బిందువే లింగానికి ఆధార పీఠం. స్త్రీ పురుష కలయికకు ప్రతీక ఇది." చల్లని నీడలో శిల్పులందర్నీ సమావేశపరచి వాళ్ళకు శివలింగ తత్త్వాన్ని వివరిస్తున్నాడు శౌర్యాఖ్యుడు.

శిల్పికి శిల్పిస్తున్న శిల్పం యొక్క పూర్వాపరాలు తెలిస్తేనే కాని అందులో అతను లీనం కాలేడు. అలా లీనం కాకపోతే శిల్పానికి కళా

వాహన జరగదు" శివలింగ సంబంధ శాస్త్ర రహస్యాల్ని చెప్పమని కోరిన మీదట వాళ్ళకు బోధిస్తున్నారతను. సాధారణంగా తన అనుయాయులైన శిష్యులకు ప్రత్యేకంగా ఇలా తరగతులు నిర్వహిస్తూండడం అతనికి క్రొత్త కాదు.

పూలు కోసుకుంటున్న మినతో ఆ దట్టమైన పుష్పకుంజం మాటున నిలిచి ప్రవాళ ఆ యువశిల్పిని గమనిస్తూంది. అతను చెపుతున్న శాస్త్ర రహస్యాల్ని తదేకంగా వింటూంది. "శివలింగాలు చలలింగాలనీ అచలలింగాలనీ (కదపడానికిఏలులేకుండా చెక్కిన చోటే వుండిపోయేవి) చలాచల లింగాలనీ మూడు విధాలు. రత్నలింగమైతే దాని పీఠం లోహనిర్మితంగా వుండాలి. లోహలింగమైతే దానికి శిలాపీఠం వుండాలి. శిలా సంబంధమైన లింగానికి శిలాపీఠమే వుంచాలి....దారు సంబంధమైన పీఠాన్ని అమర్చడానికి వీల్లేదు" శిష్యులవైపు పాలోచనగా చూస్తూ తిరిగీ ఇలా అన్నారు—

"శిల్పాన్ని చెక్కడానికి శిలల్ని సేకరించాలి కదా! ఈ శిలా సంగ్రహణకు బయలుదేరేటప్పుడు శిల్పాచార్యులు శుభాశుభ నిమిత్తాల్ని (శకునాల్ని) గమనించాల్సి వుంటుంది....వాటిని గురించి తర్వాత చెపుతాను" అంటూ శిల్పనిర్మాణానికి ఇంకా పిలుపు రాలేదేమిటని అటుకేసి చూశాడు

"ఆర్యా! శివలింగం త్రిమూర్త్యాత్మకమని అంటారు....అది నిజమేనా?"

"వాస్తవమే. మనం చెక్కే శివలింగాన్ని మూడు సమభాగాలు చేసి క్రింది భాగాన్ని చతురస్రంగా, మధ్య భాగాన్ని అష్టకోణాంతో, పై భాగాన్ని వృత్తాకారంగా కదా చెక్కి పీఠంలోకి దించి ప్రతిష్ఠిస్తాం.

క్రిందవున్న చతురస్రాకార లింగభాగం చతుర్ముఖ బ్రహ్మకు ప్రతీక. అష్టకోణాత్మకమైన మధ్యభాగం విష్ణుమూర్తి ప్రతిబింబం. ఇక పై భాగమైన వృత్తాకార రూపం శివమూర్తికి అసరూపం.

ఇంకో ముఖ్య విషయం గుర్తించండి. పైదైన శివభాగం తక్కిన రెండు భాగాల కంటే అధికమైనదైతే వచ్చే నష్టం లేదుకానీ, బ్రహ్మ విష్ణు భాగాల కంటే శివుని భాగం తక్కువైతే మాత్రం దోషభూయిష్ఠమై పోతుంది.

మానవగృహాల్లో పూజించాలనుకునే శివలింగాలు 13 అంగుళాల లోపుగానే వుండాలి. 13 అంగుళాలదైనా, అంతకంటే పెద్దదైనా ఆలయాల్లోనే వుండాలి కానీ గృహాల్లో వుంచుకోకూడదు.

శివలింగాన్ని మానాంగుళాలతో కొలవాలి. శివలింగంలోని మూడు భాగాలు సమ విభజనతో వున్నట్లయితే దాన్ని వర్థమాన లింగం అంటారు. శివభాగం అధికమైతే అది స్వస్తిక లింగం అవుతుంది.

ఈ సమలింగం బ్రహ్మ తేజస్సును ఇస్తుంది. వర్థమాన లింగారాధకులకు రాజ్యాభివృద్ధి చేకూరుతుంది. శివమస్తకం అధికంగా వున్న లింగాన్ని అర్చిస్తే వ్యాపారాభివృద్ధి కలుగుతుంది.

సర్వతో భద్ర లింగం, సార్వదేశిక లింగం, ధారా లింగం, ముఖ లింగం - ఇలా అష్టవిధ లింగాలుంటాయని మరీచి సంహిత ప్రకటించింది.

శివలింగ శిరసో వర్తనం ఆధారంగా ఈ లింగాలు ఛత్రాకారంగా, కుక్కుటాండాకారంగా, త్రపుషంగా, అర్థ చంద్రంగా వుంటాయి.

ద్విజులకు, రాజులకు ఛత్రాభం పూజనీయం. ఇది సర్వ శ్రేష్ఠం. సర్వ కామప్రదం. వర్థమాన లింగం క్షత్రియులకు పూజనీయం. త్రపుషాభ లింగం వైశ్యులకు పూజనీయం, స్వస్తిక లింగం శూద్రులకు పూజనీయం అని కాశ్యప శిల్పశాస్త్రం విశదీకరిస్తుంది.

ఇక లింగ పీఠాల గురించి కొన్ని నియమాలు చెప్తాను. చదరంగా వున్న శివలింగ పీఠం జయప్రదమైంది. యోని ఆకార పీఠం సంతాన వృద్ధి నిస్తుంది. డమరాకార పీఠం శాంతిదాయి. ముక్కోణాకార పీఠం అభ్యుదయ-

కారి. పంచకోణ పీఠం పుష్టిని, తుష్టిని ఇస్తుంది. అష్టకోణ పీఠం రోగ నాశనకారి.

శివలింగపీఠం జీర్ణమై శిథిలమైపోతే మునుపు పీఠం ఏ ఆకృతిలో వుండేదో అదే ఆకృతిలో చేసి ఆ శివలింగ ప్రతిష్ఠ చేయాలికానీ పూర్వపు లింగానికి మరో రకమైన పీఠం అమర్చితే దుష్టఫలితాలు ఎదురౌతాయి. పీఠానికి గోముఖం తప్పక వుండాలి. అదే విగ్రహపీఠాలకైతే అక్కరలేదు" శిల్పుల మనోఫలకాంపైన శివలింగ భేదాది రహస్య విషయాల్ని శిలాక్షరాలతో లిఖించినట్లు అందరికీ అందుబాటులో లేని ఋషిప్రోక్త రహస్యాల్ని సంకుచిత స్వభావంతో దాచుకోకుండా వ్యక్తం చేసిన అతనిపట్ల శిష్యులకు ఎనలేని గౌరవభావం ఏర్పడింది.

"ఆచార్యా! శిల్ప నిర్మాణానికి సూత్రగ్రాహి మిమ్మల్ని ఆహ్వానిస్తున్నారు" ఓ శిష్యుడు పిలువందించాడు.

"వెళదాం పదండి...." ముందు నడిచాడతను. ఆ క్షణంలో బుద్ధదేవుని అనుసరించి వెళుతున్న పరివ్రాజకుల్లా కనిపిస్తున్న వారిని నిర్నిమేషంగా చూస్తున్న ప్రవాళను సౌరాష్ట్రుడు గమనించాడు. ఆ విషయాన్ని గుర్తించిన ప్రవాళ హృదయం ఝల్లుమంది. ఆమె వడివడిగా మరో వైపు నడచివెళ్ళింది.

"మీరు వెళ్ళండి....నేను ఆ కొలనిలో స్నానాదికాలు ముగించుకుని వస్తాను' తామర రేకుతో ఎదురుచూస్తున్న ప్రేయసి వదనబింబం లాంటి నిర్మల జలభరిత కొలనులోకి దిగాడతను.

'నన్ను చూసినా చూడనట్లు వెళ్ళిపోతున్న ఇతనిది అహంకారమా? ఆత్మాభిమాన లా కళాభిజ్ఞతవల్ల ఏర్పడిన ఉన్నత వ్యక్తిత్వమా? ఏదైతే నేంలే....నా మనసు అతని వేపు ప్రసరిస్తూనే వుంది' అనుకుంటూ ఆమె

మరో పూజారి గదిలోనుంచి శిల్పారంభ కార్యక్రమాన్ని గమనించ సాగింది.

"ఓం....విశ్వకర్మ, విశ్వ దేవాః ఈశం
మహేంద్ర మాదిత్యం సత్యక మగ్నిం వితథం
గ్రహక్షతం యమం గంధర్వం భృంగరాజం
పిత్ రుతిం. దౌవారికం, సుగ్రీవం, పరితృతి, మేనుకం
శోషణం, ఆవనం, నాగం ముఖ్యం సోమం అర్గలమదితో"

మొదలైన దేవతల్ని స్మరించారు సౌరాఖ్యుడు. ఇలా స్థపతి ఇష్టదేవతా స్తుతి చేస్తూ పసుపుతో చిన్న వినాయకుని విగ్రహాన్ని కల్పించాడు. గరిక పోచల్ని ఆ విగ్రహానికి గొడుగులా రూపొందించాడు.

"ఆ శిలాదేవి విలా తీసుకరండి" శిల్పాన్ని చెక్కబోతున్న గండ శిలను తరలించుకు రమ్మన్నాడతను. అది వలుచదరంగా చెక్కబడివుంది.

"పర్వత ప్రాంతం నుంచి ఈ శిలను చేదించి తెచ్చినపుడు శిరో భాగాన్ని. పాద భాగాన్ని ఇందులో గుర్తించారా?" శిల్పనా కార్యక్రమానికి అనుగుణంగా వున్న ఆ రాతిని పరిశీలనగా చూస్తూ స్థపతి సూత్రగ్రాహిని ప్రశ్నించాడు.

"ఇపుడు మేము విల్చినదే యథాతథం" తాను ఉంచిన గుర్తులు చూపించాడతను.

"ఈ శిలకు అథో భాగమేది, వృష్ఠ భాగమేది?" పరిశీలనగా చూస్తున్నారు సౌరాఖ్యుడు.

"మీ ముందుకున్న భాగమే ఈ శిల భూమిలోకి కూరుకుని వున్న భాగం. ఈ వెనుకటిది భూమిపైకి — అంటే ఆకాశంవేపుగా వున్న వృష్ఠ భాగం" దాన్ని గుర్తించడానికి తను ఇదివరకే చేసిన సంజ్ఞల్ని చూపాడు.

"మంచిది" అన్నాడే కానీ శిలా సంగ్రహం నుంచి శిల్పకల్పన వరకూ తన చేతిమీదుగా జరిగితే తప్ప అతనికి తృప్తి వుండదు.

శిల్ప కల్పనలో శిలను తలక్రిందులుగా నిలిపినా, శిలా పృష్ఠ భాగంలో ముఖాన్ని, శిలా పై భాగంలో పృష్ఠాన్ని చెక్కినా ఆ శిల్పం శిల్పిని అనర్థాలకు మూలకారణమై నిలుస్తుంది.

"ప్రధాన స్థపతిని నెమ్మదిగా నేను రమ్మన్నానని చెప్పండి వెళ్ళి" అంటూ సౌరాఖ్యుడు ఆ శిలను తిరిగి పంచగవ్యాలతో కడిగాడు. జలాభిషేకం చేయించాడు. పసుపురాసి కుంకుమ తిలకాలు దిద్దాడు. "ఏవి అమోఘన టంకాదులు" శిష్యులకేసి చూశాడు. ఒక వెండిపళ్ళెంలో పెట్టి వస్త్రం కప్పివుంచిన ఆ ఉలుల్ని, ఒక సుత్తిని అతనికి అందించారు వాళ్ళు.

"ఆచార్యా! అభివాదాలు" సౌరాఖ్యుడు ప్రధాన స్థపతికి పాదాభివాదం చేశాడు.

"చిరంజీవి....చిరంజీవి. నాకింత పెద్దరికం ఎందుకిస్తున్నావు నాయనా" అనుకుంటూ చిరునవ్వుతో శిలముందుకు వచ్చి నిలుచున్నాడు.

"ఆర్యా! మీరు మాకు పూర్వాచార్యులు. మీరు సాధించి శోధించి వదలిన దానిని మేము పూరించడానికి యత్నించాలే కానీ...." ఆయన చేతికి ఉలిని అమోఘనాన్ని అందించాడు సౌరాఖ్యుడు. "ఓం...." అంటూ ఆయన ఆ శిలకు ఈశాన్యంవేపు భాగంలో చిన్నగా కొట్టి ఓ రాతిపలుకు తీశాడు. తిరిగి స్థపతి, సూత్రగ్రాహి, వర్ధకి, తక్షకాదులు వరుసగా ఉలితో ఆ రాతిపలుకులు ఛేదించారు. ఆ శిలకు పూజాదికాలు నిర్వర్తించారు.

"ఇక కొంతసేపు తర్వాత ఈ శిలమీద స్త్రీ రూపరేఖా విన్యాసం చేస్తాను. మీరు ఆ ప్రకారం శిల్పకల్పన ఆరంభించవచ్చు" అని చెప్తూ ప్రధాన స్థపతిని సాగనంపి సౌరాఖ్యుడు తిన్నగా తన గుడారం చేరాడు.

'అతని ముఖమండలంలో ఒక విషాదరేఖ చోటుచేసుకుందెందుకూ?' అది ఓ అంగన అంగ రూప చిత్రణ గురించే అన్న విషయం తెలియని ప్రవాళ అతన్ని పొదరింటి మాటునుంచి చూస్తూ ఇలా మథనపడసాగింది.

అతని సౌకర్యాలు, క్షేమ సమాచారాల గురించి అతని గుడారంలోకి వెళ్ళి విచారిస్తే ఎలా వుంటుంది?'

'చులకనై పోతావు వద్దు.'

'పరామర్శిస్తేనే చులకనగా భావించే కుసంస్కారి అతనెలా అవు తాడు? నాన్నగారు, ప్రధాన స్థపతి అతని క్రమశిక్షణ, శాస్త్ర విజ్ఞానం, సునిశిత దృష్టిని గురించి ప్రశంసిస్తుండగా విన్నావుగా!'

'అతన్ని గురించి కాదు సమస్య—నీ మనస్సును గురించే....అది అతనివేపుగా ఇప్పుడే ఆగకుండా పాగిపోతూంది....ఇక సంభాషించి, కళ్ళతో కళ్ళు కలిపి, నాలుగడుగులు నడిస్తే అది మరీ బలీయమైన బంధమై నీ బలహీనతను రెచ్చగొడుతుందేమో ఆలోచించుకో.'

'నా మీద నాకా నమ్మకం వుంది.'

'అది చూపులు కలవనంతవరకేగా.'

'అదంతా నాకు తెలియదు. నేనతన్ని చూడకుండా, మాటాడకుండా వుండలేకపోతున్నాను. ఈ ఏకాంత శిలానగరంలో ప్రతి రాత్రి గడవడం ఓ గగనమై పోతూంది. ఈ శిలాకుడ్యాల లోయల్లో విలువైన పురాతన వస్తువులా ఇలా పడివుండడం ఇక నావల్ల కాని:వి. ఈ శిలా శిథిలాల్లోకి ఓ ప్రేమకిరణం ప్రసరిస్తుండమకుంటున్నపుడు దాన్నుంచి తప్పుకోవాలని కళ్ళకు చేతులడ్డుపెట్టుకోవడం మూర్ఖత్వం. సమయం దేనికీ మించి పోకూడదు....ఇప్పుడే వెళ్ళి అతన్ని పలకరిస్తాను....' అని దృఢంగా నిశ్చయించుకుంది ప్రవాళ. దైవదర్శనానికని ఆలయంలోకి వెళ్ళబోతున్న భక్తురాలిలా ఆమె కొలనిలోకి దిగి పాదప్రక్షాళనం చేసుకు ది. ఒక తామర ముకుళాన్ని చేత్తో లీలగా సంగ్రహించుకుంది.

'కేవలం కొలతల ప్రకారం శిల్పాన్ని చెక్కడం—పుస్తకంలో రాసిన విధంగా బ్రహ్మచారి చేసుకునే వంటలాగా రసహీనంగా,

తీయచెక్కరంగా వుంటుంది. చేయి తిరిగిన గృహిణి వంటకంలా ఏదో అనుభవ భావోద్వేగంతో శిల్పి ఉలితో చేసే 'విన్యాసం' నుంచి పటిష్ఠ శిల్పాలు కొలువు తీరుతాయి కానీ.... అందుకే పద్మిని జాతి స్త్రీలెక్కడ తారసపడతారు... తారసపడినా ...' అతని ఆలోచనలు ఒక్కసారిగా విలవిల పోయి అదృశ్యమైపోయాయి. తన విడిది గృహంలో పచార్లు చేస్తున్న సౌరాఖ్యుడికి కొలనిలో తాను స్నానంచేసే స్థలంలో దిగి ఆ జలాన్ని శిరస్సుపై చిలకరించుకుంటున్న ప్రవాళ కనిపించింది. ఆ మహార్ద్రదృశ్యాన్ని గవాక్షంనుంచి తదేకంగా చూడసాగాడతను.

'తంగేడి పూలరంగు చీరమీద మందార పూరంగు రవిక తొడిగిం దామె. పీటి నీరపై కదలాడే ఆమె కంఠాభరణం కిమ్మీర కిరణ జాలాన్ని ప్రసరిస్తూంది. దాహం తీరక జలాశయం మీదికి దిగిన రంగుల హరివిల్లులా ఆ కొలనికే ఆమె వినూత్న శోభను చేకూరుస్తుంది. ఆమె తన ఆశల శిఖ రాల మీద ప్రభవించిన సిందూర సుందరిలా అతనికే దర్శనమిచ్చింది. అత నిలో ఏదో తెలియని భావోద్వేగం చోటుచేసుకుంది.

'ఆమె నిర్మల పాద. సుభగత్వాన్ని పుణికి పుచ్చుకున్న పాద ముద్రల్ని కపీనం గమనిస్తే పాద పరిమాణంతో కొత్త ప్రమాణాల శిల్పాల్లో నెలకొల్పవచ్చు ...'

ప్రవాళ మరాళంలా కొలని సోపాన పంక్తుల్ని అధిరోహిస్తూ విలా సంగా సాగిపోయింది.

'ఆమె అడుగుల తడి ఆరిపోకూడదు' అతనిలోని కళాతృష్ణ తొందరించింది.

"స్థపతిగారూ! ఆర్యా! స్థపతిగారూ!" మంజీర మనోజ్ఞాల శింజినీ నాద మేదో సౌరాఖ్యుని గుడారంలో రవళించినట్లయింది. అంత సుమధుర ఆహ్వా నానికి బదులే లేకపోవడం ఆమెకు ఆశ్చర్యం కలిగించింది. గుడారం లోపలి

వేపుకు విలాసంగా తొంగిచూపింది. వీరావేశతో బయటకు వచ్చిన ప్రవాళ మధురానుభూతితో గోటమీటిన వీణాతంత్రి నాదంలా ప్రతిస్పందించి పోయింది. జీవితంలో ప్రప్రథమంగా ఆమెలోని అన్ని వాంఛలు తనువనే ధనుస్సుకు బిగించి సారించిన నారీతంత్రుల్లా ప్రణయ తృష్ణాపోహనా ప్రకంపనాల్ని వెలువరించసాగాయి. స్థాణువుల్లా నిలబడిపోయిందామె. తేరుకుని ఓ తరుమూలాన్ని చేరి ఎరుపెక్కిన కళ్ళతో అతనికి వీక్షణల హారతి పట్టింది.

పాద సంహితల్లో ఏవో ప్రణవనాదాల్ని వెతుకుతున్న ఋషి కుమారుడిలా నిశ్చలంగా కొలని సోపానపంక్తులమీద ఆమె అద్దిన తడి పాద ముద్రల్ని పరిశీలిస్తున్నాడతను.

* * *

"అథ కృష్ణస్య లక్షణం వక్ష్యే: మధ్యమం దశతాలమితం, ద్విభుజం, శ్యామాభం, రక్త వస్త్రధరం, సర్వాభరణ భూషిత ముద్బద్ధ కుంతలం, దక్షిణేన హస్తేన క్రీడా యష్టిధరం........

దక్షిణే రుక్మిణీం దేవీం హేమాభాం, ధమ్మిల్ల కుంతల యుతాం (వా) ప్రసారిత దక్షిణ హస్తాం, సవ్యే వామహస్తం....

వామపార్శ్వే సత్యభామాం, శ్యామాభాం, ధమిల్ల కుంతల యుతాం, సోత్పల దక్షిణ హస్తాం, ప్రసారిత వామకరాం సర్వాభరణ సంయుక్తాం కారయేత్."

అలా శ్యామసుందరుని కుడివేపు రుక్మిణినీ, ఎడమవేపు సత్యభామనూ పఠితల మనోనయనాలకు సాక్షాత్కరింపజేసేటంత మనోహరంగా వర్ణించిన శ్రీ వైఖానస భగవచ్ఛాస్త్రాన్ని శ్రద్ధాయుక్తంగా పఠిస్తూ తన్మయత్వం చెందాడా యువశిల్పి. మనసులో శిలగా కదిలే శాపోహమ అలవోకగా గమనించసాగాడతను.

'నీకు పరిచయమైన ఈ యువతుల్లో రాధ లక్షణాలు కృష్ణబిందుకూ, సత్యభామ లక్షణాలు ప్రవాళకూ వున్నాయి కదూ! మరి నువ్వు....'

'ఈ మనసు చేసే ఆలోచనలకు అదుపు, పరిధి లేవు. ఎంతటి ఋషి సత్తముల ఎదల్లోనైనా దూరి సతమత పెట్టడం దీని నైజం' అసుర సంధ్య వేళ తమాలవాటికలో ఆకులు రాలిన కొమ్మల క్రింద తలలు విరబోసుకుని సంచరిస్తున్న దయ్యాల్లా మనుష్యుల మానసాలు అతనికి కనిపించాయి. 'అవును....కృష్ణబిందు తనకు కనిపించలేదేమి?' తన మనస్సులో కృష్ణబిందు అప్పుడప్పుడూ తొంగిచూడడం అతను గమనిస్తున్నాడు.

'సుభగురాలు, లక్షణవతి అయిన యువతి తన కళకు ప్రేరణ కావాలి. ప్రవాళలో శిల్ప సౌందర్యం వుందికానీ దానికితోడు ఆమెకున్నది అహంకారమో, అభిజాత్యమో ఏమో....ఏదైతేనేమి అందిరాని అందాల్ని గురించి ఆలోచించడం అనవసరం....ఛీ....ఛీ....చాపల్యానికీ, కళాకారుడికీ పొద్దెదురు....' అనుకుంటూ సౌరాఖ్యుడు తిరిగి 'విమానార్ణవ కల్పమ్' తాళపత్ర గ్రంథాన్ని తిరగవేశాడు. ప్రధాన స్థపతి తనకు అందించిన తాళపత్ర కవిలెల్ని అతను తీరిక వున్నప్పుడంతా అధ్యయనం చేస్తున్నాడు.

"కృష్ణ ప్రతిష్ఠా విశేషః పూర్వోక్త యాగశాలా మధ్యే శయ్యావేదిం పరితః పంచాగ్నిన్ పౌండరీకాగ్నిం చ సంకల్ప్య పౌండరీకే ప్రధానాగ్ని హౌత్రం, ప్రశంస్య

కృష్ణం, పుణ్యం, నారాయణ త్రిదశాధిప మితి కృష్ణస్య:
రుక్మిణీం, సుందరీం, దేవీం, రమా మితి రుక్మిణ్యాః

సత్యభామాం, సతీం, సన్నతిం, క్షమా మితి సత్యభామాయాః గరుడస్య పూర్వవత్:"

అంటూ కవివితిరా రాధామాధవ తత్త్వాన్ని సుగంధ మలేపిత చిత్తంతో కామోన్మత్తుడిలా మళ్ళీ మళ్ళీ చదువుకున్నాడు. అతని హృదయం నిశ్చలమై దివ్యదీధితులు అందులో ప్రతిఫలించాయి. మనశ్శాంతి చేకూరింది.

"అయ్యా! మజ్జిగ పుచ్చుకుంటారా" ఓ అమ్మాయి ఆదరంగా మజ్జిగ తెచ్చి రెండు చేతులతో అందించాడు.

"ఈ మజ్జిగ ఎక్కడిది? ఎవరిచ్చారు మీకు?" వెగటుగా మొహం పెట్టుకున్నాడు యువస్థపతి.

"ప్రవాళగారు పంపారండి."

"అందుకే పల్లె చల్లకు వున్న రుచి కాస్త పోయి ధనికుల వాసన వేస్తోందిది" వెటకారంగా అన్నాడు. సౌరాఖ్యుడి మనసు ఉక్రోషంతో నిండి పోయింది.

"ఆ పాలమ్మాయి ఎందుకు రావడంలేదు!"

"తెలియదండీ....ఈ కొండ క్రింది దారిలోనే పోతూంటుంది. ఆమె ఎలుగెత్తి రోజూ పాలూ పెరుగూ అమ్మడం మాకు లీలగా వినిపిస్తూం టుంది."

"అలాగా!"

"ఈ వేళప్పుడే వస్తూంటుందయ్యా."

"మాకు ఈ మజ్జిగ అక్కరలేదు తీసుకెళ్ళు" కటువుగా అనడంతో మారుమాటాడకుండా మజ్జిగతో వెళ్ళిపోయాడతను.

'ఆ అమ్మాయితో మాట్లాడాలి. ఆ రోజు ప్రవాళ హెచ్చరికతో ఆ అమాయిక బాధపడి వుండొచ్చు. అయినా నాతో ఎవరు మాట్లాడాలో, నేనెవ రెవరితో ఎలా మసలాలో నిర్ణయించి శాసించడానికి ఈవిడ ఎవరు?' ఏ నష్టానికైనా, కష్టానికైనా చలించని సౌరాఖ్యుడు తన వ్యక్తిత్వాన్ని కించ పరిస్తే మాత్రం సహించడు.

ఆలయ శకలో అద్వితీయుడైన ఓ యువ స్థపతి మజ్జిగ కోసం కొత దారి వెంబడి బయలుదేరాడు. కొండ గాలికి రేగిపోతున్న ఉత్తరీయాన్ని

మెడచుట్టూ మెలికవేసి, ఎగుడు దిగుడు కొండచెరియల వెంబడీ రాళ్లూ రప్పల్నీ లెక్కచేయకుండా నడచిపోతున్నారతను.

రావికొట్టె కాలిం గడిసెల దగ్గర పాలూ మజ్జిగలు విక్రయించు కుంటూ, బాటసారులెవరైనా ఎండ బడలికను పోగొట్టుకోవడానికి అడిగితే వాళ్ళ దాహం తీరుస్తూ, కలకంఠ ధ్వనితో ఆమె కోనలు ప్రతిధ్వనించేలా అమ్ముకుంటూ వస్తోంది.

ఎక్కడో కొండల్లో కోనలమధ్య పెరిగిన తపనకన్యలాంటి ఈ ముద్దరాలికీ, బాల్యం మంచి శిల్పకళా శిక్షణతో రాటుదేలి నాగరక ప్రపంచంలో పెరిగి వేద, శాస్త్రాధ్యయనం చేసిన నైష్ఠిక కర్మిష్ఠి అయిన తనకు ఏమిటీ అనుబంధం....? నిర్మలమైన హృదయం ఎవరిలో వున్నా ప్రేమ పరిమళాలు గుప్పుమనకుండా ఎలావుంటాయి?...ఎంత దాచిపెట్టినా అత్తరు పరిమళించక మానుతుందా? ఎంత మూసిపెట్టినా వెలగపండు గుబాళింపు వెలికి రాకుండా వుంటుందా? అంతే—ప్రేమనిండిన గుండె మనిషిలో వుండాలే కానీ దాని తత్త్వం చూపులో, మాటలో, ఉనికిలో ఆఖరుకు తలపులో కూడా సౌవర్ణ సాంధ్య రాగల్ని ఎగజిమ్ము తీరుతుంది. అదే ప్రేమ... ప్రేమ .. భగవంతుడి రూపనామమ్మే...ఇలా ఆలోచిస్తూ అంత కంతకూ దగ్గరౌతున్నట్టు వినవస్తున్న తన్మాటల్ని క్రయ విక్రయ కూజి తాన్ని గమనిస్తూ పకుళవృక్షం నీడకు చేరారు.

'వకుళ ఫలం....ఈ వర్ణాన్ని సాధించాల్సింది సుధాకర్మతో నిర్మిత మైన విగ్రహాలకు ఆరోపించే వర్ణాల... అతని మనోవీధిలో మిలమిల లాడింది. ఆ చెట్టుక్రింద రాలిన పొగడపళ్ళన్నీ ఏరి పట్టికెత్తుకుని తదేకంగా పరిశీలించారు. సున్నంతో రూపొందిన విగ్రహాల్లకు వేసే వర్ణాల అపూర్వ మైన మిశ్రణ రహస్యాన్ని గురించి పితృసమానుడైన గురువు చేసిన ఉప దేశం అతని స్మృతిపథంలో మెదిలింది. ఆ వర్ణ మిశ్రణ మాధురి తన

తండ్రి సేకరించిన తాళపత్రాల్లో లుప్తమై పోయిన భాగంలోనిది. తనకు ఏ మాత్రం అందుబాటులోకి రాని ఒక అమృత వర్ణమాలా రచిత విధాన రహస్యం తనకు ప్రబోధించిన గురుదేవుని ఎరోమారు మనసారా స్మరించుకున్నాడు సౌరాఖ్యుడు, ఆ ప్రబోధన మరచిపోకుండా మననం చేసుకున్నాడు

'మొదట పీతవర్ణ శిలల్ని సేకరించాలి. వాటిని బాగా చూర్ణం చేయాలి. దానిలో కొబ్బరినీళ్ళు ...కాదు లేత కొబ్బరి నీళ్ళుపోసి ఆ మట్టి పాత్రను విప్పల మధ్య పెట్టి పుటం పెట్టాలి. అప్పుడు అరుణవర్ణం ఆవిర్భవిస్తుంది.

మరచ్చాన్ని... ...ఈ సుధాకర్మకు (సున్నంతో విగ్రహాన్ని నిర్మించే పని) రాజావర్తం, శ్యామం అనే రెండు రకాల రాళ్ళు శ్రేష్ఠం అని గురువుగారు హెచ్చరించారు. ... .అవును.

ఇక వర్ణ సమ్మిశ్రణ విషయం... .ఇది కొంత గజిబిజి వ్యవహారమే... .అయినా మనసులో లిఖింపబడేదే విద్య కానీ తాళపత్రాల్ల మీదిదెలా అవుతుంది. . . .

ఎరుపు, పసుపు వీటివి సమపాళ్ళలో కలిపితే ఈ పసుపు వర్ణం ఆవిర్భవిస్తుంది.

తెలుపు పసుపు సమభాగంగా కలిస్తే అది నిర్యాస వర్ణం. ఆ మేఘాల వర్ణమన్న మాట. తెలుపు నలుపు సమమిశ్రితమైనదే ఈ ధూమ్రవర్ణం.

పసుపు ఒక భాగం ఎరుపు అర్ధభాగం మిశ్రితమైతే శోపలవర్ణం. అవును—ఆ మేఘాల అవు వర్ణం వస్తుంది.

ఎరుపు ఒక భాగం నలుపు రెండు భాగాలు చేర్చితే ఈ రౌతిగుండీ లాగా గుడ (బెల్లం) వర్ణం వస్తుంది.

ఈ ధాన్యాంకుర వర్ణం రావాలంటే తెలుపుకు నీలం అధికంగా కల పాలి కాలా .. చిన్న ...

ఆ సచ్ఛవి పైరులాంటి ఛాయకు....పచ్చ రంగులో సగం హరితాళం. హరితాళంలో సగం పరిమాణం వుండే కుంకుష్ఠం (కుంకుమ) కలపాలి.

ఈ నేరేడు పండు వర్ణానికి— నలుపుకు .. ఏమి రంగు....అ.... లాక్ష (లక్క) పారాన్ని సమంగా చేర్చితే సరిపోతుంది.

'ఏం....తృణబిందు ఇంకా రాలేదు...." దూరంగా ఆమె ఎలుగు వినిపిస్తూనే వుంది.

'తృణబిందు లావణ్యాన్ని సాధించాలంటే నలుపుదానిలో రెండింతల పసుపు చేర్చితే మానవ వర్ణం పుడుతుంది....ప్రవాళ తనూ ఛాయ....! ఆమెను గురించి ఎందుకు ఆలోచించాలి? పొగరుమోతు....నేనాలోచిస్తున్నది ఆమె ఒంటిరంగును గురించే కానీ ఆమెను గురించి కాదుగా....ఆమె లావణ్యాన్ని రచించాలంటే ఏ రంగుల్ని రంగరించాలో కాశ్యప శిల్పశాస్త్రమే చెప్పలేదు .. అంత అందాన్ని ప్రకృతిలోని రంగులు ఆవిష్కరించలేవు . సరి....సరి....ఇప్పుడు ఆమెను గురించెందుకు....

ఆమె నీలాల కురుల వర్ణాన్ని రచించాలంటే....నలుపును నీలాన్ని సమంగా కలిపితే ఆ కేశవర్ణం వస్తుంది. ఆమె పాదాలు తేనెలాగా....అ వర్ణం ఎలా వస్తుంది....నలుపు ఎరుపు సమంగా కలిస్తే తేనెరంగు కనిస్తుంది.

కృష్ణం నీలం రక్తం సమం వర్ణం మధువర్ణ ముదాహృతం
తదేవ రక్త(పీత) మధికం మానుషం వర్ణ ముచ్యతే

అవునవును అదే శ్లోకం!

ప్రవాళ ఆరోజు కట్టుకున్న చీర....కాషాయం. ఆ రంగుచీరలో ఆమె చాలా అందంగా వుంటుంది. స్వచ్ఛ జలాలంత సరళంగా చూస్తుంది. ఆ రంగుల్ని సుధాకర్మ నిర్మిత విగ్రహం మీద నిలపాలంటే....ఆ శ్లోకార్థం

గుర్తుకురాలేదతనికి. స్త్రీల సౌందర్యం హృదయానికి పులుముకుంటున్నాను ఇక ఆ రంగు లెక్కడ మాసిపోకుండా వుంటాయి! ఆ....జ్ఞాపకం వచ్చింది....

కృష్ణాత్తు ద్విగుణం రక్తం మిశ్రితం తు కషాయకమ్

కృష్ణస్య ద్విగుణం పీతం మిశ్రితం నీర సన్నిభమ్

ఒక భాగం నలుపుకు రెండు భాగాలు ఎరుపు కలిపితే కషాయం. ఒక భాగం నలుపుకు రెండు భాగాల పసుపు కలిపితే అది జలవర్ణం.

ఈ వర్ణాల్ని అధికంగా కలిపినా, స్వల్పంగా కలిపినా అనుకున్న రంగును శిల్పి ఈ సుధా శిల్పాల మీదకు తేలేడు....నైపుణ్యవంతుడైన శిల్పి ఈ ద్రవ మిశ్రమంతో బహుసార, అల్పసార దోషాతీతుడు కావాలి. అసలు రంగుల సమ్మేళనం ఒక అద్భుతమైన కళ...గుర్తుంచుకో' సౌరాఖ్యునికి గురూపదేశం ఒకసారి హృదయంలో ప్రతిధ్వంచినట్లయింది. 'గురుదేవా! ఏ పర్వత ప్రాంతాల్లో సంచరిస్తున్నారో, ఏ ఏ తీర్థాల వెంబడి తిరిగి హరితాళాది (గోదావరి లోపలిమట్టి) మృత్తికల్ని నూతన వర్ణ సంస్కారం కోసం వెదుకులాడుతున్నారో....ఒకసారి...నా జీవితంలో ఒక్కసారి మిమ్మల్ని చూస్తే చాలు....మీరు మలిచిన ఈ శిల్పం శిల్పకళలో ఎంత సాధించిందో మీ నోటితో వింటే చాలు...ఈ జన్మ సార్థకమవుతుంది.' సౌరాఖ్యుడు తడికళ్ళతో తృణబిందు కోసం ఆ కోవదారిని మరోమారు పరిశీలించాడు.

"నే నెందుకొచ్చానిక్కడికి....గురుదేవుడికి నా మనఃస్థితి తెలిస్తే...." ఈ భావం అతన్ని కించిత్ లజ్జితుణ్ణి చేసింది. అతనలా నిముగ్గా చాలాసేపు వేచి చూసి తృణబిందు రాకపోవడంతో శిల్పాలవేపు నడక సాగించాడు.

* * *

'అలస్యం అమృతం విషం....ఇక ఇతని విషయంలో అలసత పనికి రాదు. విషయం చెయిదాటి పోయాక, మనసు మరొకరికి అంకితమయాక

ఎవరు చేయగలిగిందీ ఏమీ వుండదు. నేను పంపిన మజ్జిగను తిరస్కరించి....దానికోసం అంత దూరం వెళతాడా?' మహలు గవాక్షం నుంచి సౌరాఖ్యని విడిచి నేపు అతని కోసమే వీక్షిస్తున్న ప్రవాళ ఎదలో అవమాన పవనాలు వందడించుకున్నాయి

"బాబుగారూ" తృణఖిండు సౌరాఖ్యుని గదిముందు నిలబడి పిలిచి పిల్చిచి అతను లేడని తెలుసుకుని విరాళతో వెనుదిరిగింది. ఈయన ఆమెను వెతుక్కుంటూ వెళితే...అమ్మో...నేను రావద్దన్నా ఇతన్ని దర్శనం కోసం వస్తుందా .... నేను కొరగానిదాన్ని అయ్యావన్నమాట....పాల పిల్లను అనవలసిన మాటలన్నీ అందుకే అన్నాను—నేనెక్కడా....! "అది వరే కానీ...ఆ అమ్మాయి అతనితో మాట్లాడితే నాకు వచ్చే నష్టమేమి అవుడు?? ఏం లేదు .. ఏదో వుంది...అదేదో ఇదీ అని తెలీదు...' రువరుపల్ని అదుషలో వుంచి ప్రశాంతంగా తల వంచుకుని ఆలోచిస్తూ కూర్చుందామె.

'అప్పుడే ఏమిటీ గుండెదడ. . సౌరాఖ్యుడు గుడారంలోకి వెళ్ళడం చూసి ఉద్వేగంగా ఉత్తలపడే చిత్తంతో లేచింది.

"త్రర్యో! నమస్కారం...." _తన గుడారంలో నిలబడి చెక్కబోతున్న శిల్పాల సమూనాల్ని చూస్తూ, ఆలోచిస్తున్న సౌరాఖ్యుణ్ణి వెనుక నుంచి నంబోధించిందామె. అతను వెనుదిరిగి చూడలేదు. "నేను ప్రవాళనండి...." అహంకారాన్ని అధిగమించి తిరిగి అంది. అయినా అతను వెనకకు తల కూడా త్రిప్పి చూడకపోవడంతో హతాశురాలై పోయింది. హృదయం తగ్గుమంది. ఆత్మాభిమానం హుంకరించింది. తలాభిమానం కళ్లెం వేసింది. కన్నెతనం చురకొట్టింది. బేలతనం కన్నీళ్ళు పెట్టుకోరది. అన్నీ కలిసి ఒక అనూహ్య అనిర్వచనీయస్థితికి ఆమెను గురిచేశాయి. దెబ్బతిన్న నాగినిలా ఆమె మనస్సు బుసలు కొడుతూ పడగ విప్పిందే కానీ లోలోపల ఏదో స్నేహమయ దివ్యద్రవ్యం పెగలెగసే ఉద్రేకాన్ని చల్లార్చివేసింది.

పిడుగు పడబోయి ఆగిపోయిన మేఘ సంఘర్షణ లాంటి హృదయంతో మెల్లగా అక్కడి నుంచి వెళ్ళిపోయింది.

"వీరయ్యా! గుర్రబ్బండి సిద్ధం చెయ్."

"అమ్మగారూ! ప్రయాణమెందాకానండీ!" పనివాడు రెండుసార్లు ప్రశ్నించినా బదులు చెప్పకుండా నిలబడిన ప్రవాళ తీక్షణ దృక్కుల్ని చూస్తూ బండిని సిద్ధం చేశాడు.

"బండివాణ్ణి రమ్మంటానమ్మా."

"అక్కరలేదు.... నేనే ఒంటరిగా వెళ్ళిరావాలి."

"అమ్మగారూ! ఈ పరిసరాల్లోనే పల్లెప్రజల పంటల్ని పాడుచేస్తూ ఒక మదపుటేనుగు తిరుగుతుందమ్మా."

"నన్ను విసిగించకు వీరయ్యా!" విసురుగా బండిలోకి ఎక్కి గుర్రాన్ని ఒక చరుపు చరిచి కళ్ళెం పట్టుకుంది ప్రవాళ. సౌరాఖ్యుని విడిది ప్రక్కగా ఆ శకటం దూసుకుపోతూంది. "ఈమె సుడిగాలిలా ఇలా దూసుకుపోతున్నది తృణబిందు మీదికి కాదు కదా! వెళ్ళి ఆమె ఏదైనా అవమానిస్తే..." కావేపు ఆ బండివంకే చూస్తూ రకరకాలుగా మథనపడ్డాడు సౌరాఖ్యుడు. మనసును తమాయించుకుని, తనవేపు ఉద్విగ్నంగా వస్తున్న జమీందారును ప్రశ్నార్థకంగా చూస్తూ నిలబడ్డాడు.



# 5

'రూపకారి మదన మహేశ' బిరుదాంకితులు, 'రూపకారి శరభభేరుండ' పట్టభద్రులు అయిన మహాశిల్పులు ఎన్నో దివ్యక్షేత్రాల్లో శిల్పకళను అవ్యాహతంగా పండించారు. భూతల శిలలకు జరిగిన మహా మస్తకాభిషేకమే శిల్పకల్పన. శిలాతలాలకు, ఇలాతలాలకూ లభించిన మహాప్రశంసన ఫలకమే శిల్పకళ.

ఒక హిరణ్మయ రేతో బిందువును గర్భంలో ధరించి తన రక్త శక్తుల్ని కూరికూరి, తన యౌవనాన్ని ధారలు పోసి, ఎన్నో కష్టనష్టాలతో శిల్ప శిశువుల్ని సృజించే మాతృమూర్తి శిల్పి. మాతృత్వన్యం, పితృ వాత్సల్యం శిల్పి రెండు చేతుల నుంచి శిల్పంలోకి ప్రవహిస్తాయి. శిల్పానికి పరిపూర్ణమైన రూపం రాగానే శిల్పి అశ్రునయనాలతో ఆశీర్వదించి తన దారిన తాను పోతాడు.

శిలలు బీజాలు. అవి శిల్పాలుగా మొలకెత్తడానికి మంచి క్షేత్రం కావాలి. ఆ క్షేత్ర నిర్దేశమే భూపరీక్ష. సుక్షేత్రంలో వేసిన శిల్పబీజం దివ్య త్వాన్ని శాఖోపశాఖలుగా దశదిశలకూ విస్తరింపజేస్తుంది.

"స్థపతిగారూ! నమస్కారం" తనకంటే చిన్నవాడైన స్థపతిని అలా పలకరించడం లోలోపల నచ్చకపోయినా విభూషణరావు చిరునవ్వుతో సౌరాఖ్యుని సమీపించాడు.

"మా అమ్మాయి ఏ పనిమీద ఒంటరిగా వెళ్ళిందో మీతో ఏమైనా చెప్పిందా."

"లేదండి ...అసలు...ఏదో" తప్పు చేసినవాడిలా చూశాడు సౌరా ఖ్యుడు.

"మా పనివాళ్ళనందరినీ పంపావనుకోండి ఆమెకోసం...." ఆందో ళనతో అన్నాడు.

"ఆమే నెమ్మదిగా తిరిగొస్తుంది లెండి" ఓదార్పుగా అన్నారు.

"మీకు మజ్జిగ, పాలు, తాంబూలాలు, కావలసినవన్నీ సమకూరుస్తు న్నారా మావాళ్ళు....మా అమ్మాయే మీ సౌకర్యాలన్నీ స్వయంగా చూస్తోంది....మీకు ఏ అసంతృప్తీ కలగదనుకుంటాను."

"మాకు సంతృప్తిగానే ఉందండీ...." సౌరాఖ్యుని మాటల్లో ఏదో నిరాశ ధ్వనించింది.

"స్థపతిగారూ! కట్టబోయే ఆలయభూమిని మీరోసారి పరీక్షిస్తే నాకు నిశ్చింతగా వుంటుంది. ఆ స్థలం లోపమో ఏమో ఆలయ నిర్మాణానికి అటంకా లెదురౌతూనే వున్నాయి" నిట్టూర్చాడు జమీందారు.

"నా మనసులో కూడా ఆ ఆలోచనే అసంతృప్తిని రేకెత్తిస్తోంది. పదండి — ఆ భూమిని పరిశీలిద్దాం" ఏ పనికీ ఆలస్యం పనికిరాదనే స్వభావి కాబట్టి సౌరాఖ్యుడు అప్పటికప్పుడే నిర్ణయం తీసుకున్నారు. ఇద్దరూ ఆలయ నిర్మాణ విశేషాలు మాటాడుకుంటూ మధ్యమధ్య ప్రవాళ మనోప్రవృత్తిని గురించి చర్చించుకుంటూ ఆలయ నిర్మాణ స్థలంవేపు నడిచారు.

"అదిగో....ఆ కనిపిస్తున్న స్థలమే."

"ఆ కనిపిస్తున్నది మారేడు, వేప, మామిడి వృక్షాలేనా?"

"ఔను....చందన వృక్షాలు కూడా వున్నాయి. అవి ఆ స్థలంలో ఉండొచ్చా.. ." సందేహంగా సౌరాఖ్యుని చూశాడాయన.

"అవే వుండాల్సిన వృక్షాలు....ఫలవృక్షాలు, పాలుకారే వృక్షాలు వున్న స్థలాలు ఆలయ నిర్మాణానికి ఆమోద యోగ్యాలని శాస్త్రాలు ఘోషి స్తున్నాయి."

"పోనీలెండి....ఏదో వృక్షకూల....అదీ అంటుంటారు గదా అందు కని...." తన అనుమానాన్ని వ్యక్తం చేశాడు విభూషణరాయ.

"వృక్షముల ఆలయ నిర్మాణానంతరం చూసుకోవలసిన విషయం. ఆలయానికి ఎదురుగా అంటే సింహద్వారానికి ఎదురుగా వృక్షం వుండ కూడదు. ఆలయానికి నాలుగువైపులా సంపెంగ, పొగడలాంటి సుగంధ పుష్పాల్ని, ఉసిరిక, నారికేళం, బిల్వం ఇలాంటి ఫలవృక్షాల్ని పెంచుకో వాలి." ఆలయ నిర్మాణ స్థలిని విశదంగా పరిశీలిస్తున్నాడా యువశిల్పి.

"అలాగే చేద్దాం."

"విభూషణరావుగారూ! భూమిపైన మంచి పుష్ప ఫల వృక్షాలున్నాయి బాగుంది...ఈ ప్రాంతం ఇంతకు మునుపు బలిస్థలంగా గానీ, శ్మశానంగా కానీ వాడుకోబడిందా? లేదా? అనేది ఇప్పుడు మనకు కావాలి" అతని దృష్టి భూగర్భంలోకి చొచ్చుకొని పోతూంది. "తరతరాలుగా మాకు ఈ భూముల్ని గురించి తెల్సును. అలాంటి అశుభకార్యాలేవీ ఈ స్థలంలో జరగలేదు."

"అక్కడక్కడా త్రవ్వినట్టున్నారెందుకు?"

"మళ్ళ పొదల్ని సమూలంగా పెకలించడానికని...."

"అప్పుడు భూమిలోపలనుంచి బొగ్గులు, ఎముకలు, వెంట్రుకలు ఇలాంటివేమైనా బయటపడ్డాయా?"

"లేదు....అవేవీ లేవు."

"మీరు దగ్గరుండి చూశారా?

"నేనే గమనించాను."

"బురదగానీ, చెట్ల వేళ్ళుగానీ ఏమైనా పైకి తేలాయా

"అలాంటిదేదీ లేదు." నిశ్చయంగా అన్నాడు జమీందారు.

"ఎందుకంటే అలాంటివి వుంటే అమంగళకరం. ఆ ప్రాంతంలో పునాదులూ స్థిరంగా వుండవు. అందుకని అంత విశదంగా ఆలయ నిర్మాణ భూమిని పరిశోధించాలి" ఆ విశాల స్థలాన్ని మొత్తాన్ని దీర్ఘ దృక్కులు పరుస్తూ పరిశీలించాడు యువ స్థపతి.

"జమీందారుగారూ! ఈ స్థలంలో నీరెప్పుడైనా రుచి చూశారా?"

"బాగానే వుంటుందండీ."

"ఉప్పగా వుండదా?"

"అబ్బే ఉప్పునీరు మన ఊరి పరిసరాల్లోనే లేదు."

"ఉప్పునీరున్న భూమి, ఫలహీన వృక్షాలున్న భూమి విస్తారమైనా నిర్మాణానికి నిరుపయోగమవుతుంది. అందుకని...." కొంత మట్టిని చేతిలోకి తీసుకొని పరీక్షించాడు.

"ఇక్కడ చెట్లు పెడితే భూమ్యాకర్షణ, ఘుంచి ఘుంచి పళ్ళతో కొమ్మలు వాలిపోతాయనుకోండి. తమర కర్రల్ని కొమ్మలకు ఆధారంగా వుంచితేకానీ విరిగిపోకుండా వుండవు."

"అలాగా....ఈ ప్రాంతంలో ఎప్పుడైనా ఘుంటలు చెలరేగాయా? మట్టిని, రాళ్ళను పరిశీలిస్తూ అడిగాడు శౌరాఖ్యుడు.

"ఈ ప్రాంతంలో అలా మంటలు రేగడానికి ఆస్కారమే లేదు."

"సరే—పలుగు, పారతో ఓ ఇద్దరు వ్యవసాయ కూలీల్ని రమ్మనండి వాళ్ళతోపాటు చదువు, సంధ్య లేని అమాయకుల్ని ఓ ఇద్దర్ని రమ్మనండి" అతని చూపులో అద్భుతమైన బావరం రూపుకడుతూంది.

"అలాగే" ఏంమకనబోయి కుతూహలాన్ని అణచుకున్నాడాయన.

"ఈ స్థలం అష్టాస్రంగా వుండాలని నా వుద్దేశం. మీరేమంటారు?" నిక్కి చూస్తూ అన్నాడు స్థపతి.

"అలా వుండకూడదంటారా?" కంగారుపడ్డారు జమీందారు.

"చతురస్రం, దీర్ఘ చతురస్రం, షడస్రం, అష్టాస్రం ఈ కోణాల్లో నిర్మాణ స్థలం వుండాలని ఆలయ వాస్తుశాస్త్రం ఆదేశించింది. ఆ లక్షణాలకు లోబడే ఈ భూమి వుందిలెండి" మృదువుగా నవ్వాడా శిల్పి.

"పోనీలెండి....మీరిన్ని లక్షణాల్ని పరిశీలిస్తుంటే ఏ లక్షణమైనా సరిపోక పోతుందేమోనని నాకు భయం వేస్తూందనుకోండి."

"అంత భయపడి పోవలసినదేమీ లేదు....ఈ స్థలం కాకపోతే మరో స్థలం చూద్దాం."

"మీ పట్టుదల, శాస్త్ర పాండిత్యం చూసి నాకు ధైర్యం ఏర్పడింది లెండి."

"దండాలు బాబు" ఒక స్త్రీ, ఒక పురుషుడు వచ్చి వినయంగా నిల బడ్డారు.

"మీరు ఆకూ వక్కా వేసుకున్నారా?" స్థపతి వాళ్ళవైపు తిరిగి అడిగాడు.

"ఆ అలవాటు లేదండీ" పైటను వదిలంగా సర్దుకుంటూ తల వంచు కుని జవాబు చెప్పిందా స్త్రీ.

"ఇది—మన ఇంటిదగ్గర పనిచేస్తాడే వీరయ్య, వాడి కూతురు" జమీందారు స్థపతికి ఆమెను గురించి వివరించాడు.

"అది మనకు ముఖ్యమైన విషయం కాదులెండి" జమీందారు వాడిన భాష భూస్వాములకు సహజమైనదే అయినా, స్థపతి సున్నితమైన మనస్సు దానికి నొచ్చుకుంది. ఆమె ముఖంలో ఏదో అసహనరేఖ ప్రసరించి అదృశ్యం కావడం అతను గుర్తించాడు.

"నీకు పొగతాగే అలవాటుందా?" రెండో వ్యక్తిని ప్రశ్నించాడు స్థపతి.

ఈ వివరాలతో అతనికేం పని? ఏదో వుండేవుంటుంది అంతర్యం. చూద్దాం అనుకుంటూ మౌనంగా వున్నాడు విభూషణరావు.

"ఇలా రా అమ్మాయి ..." కొంత దూరం వెళ్ళి స్థపతి భూమిని కాస్త చేత్తో శుభ్రం చేసి చిటికెడు దుమ్మును తీసుకున్నాడు.

"చూడమ్మా....నోరు తెరువు. నీ నాలిక మీద వేసిన ఈ దుమ్ము రుచి ఎలా వుందో అచ్చితంగా చెప్పాలి."

"అ గాగే బాబు....బాబూ ..ఈ నేల రుచి పులుపుగా అనిపిస్తాంది" ఆమె బుగ్గల సొట్టలు పడ్డాయి.

"సరే....ఈ మట్టిని వాసన చూడు....ఏ వాసన వస్తాంది?" ఇంకొద్ది మట్టిని ఆమె అరచేతిలో పోశాడు.

"మట్టి వాసనే వస్తుందయ్యా."

"నూనె వాసన గానీ, మురుగునీటి వాసన గానీ, కుళ్ళిన వాసన గానీ, చేపల వాసన గానీ రాలేదా నీకు....బాగా పీల్చి చెప్పు."

"అ వాసనలేవీ నాకు రాలేదయ్యా" సుందరంగా, నిడియంగా నవ్విం దామె. నాగరక ఛాయలు వ్యాపించి నిర్మలమైన నవ్వులు కూడా కలుషితమై పోతున్న రోజుల్లో ఆమె నవ్వు అతనికి ఆహ్లాదాన్ని కలిగించింది. అందం గానే కనిపించే ఈమెకున్న దురలవాటల్లా పదేపదే పైటను సవరించుకోవడం కాబోలు అనుకుంటూ లోలోపలే నవ్వుకున్నాడతను.

"జమీందారుగారూ! రండి" అంతదూరం నుంచి సౌరాఖ్యుడు చేయెత్తి గట్టిగా పిలిచాడు.

"అయ్యా స్థపతిగారూ! ఈ నేల రుచి మనకు అనుకూలంగానే వుందా?" అతని ముఖంలో ఆదుర్దా కనిపించింది.

"రుచి, వాసనా మనకు అవిపించిన రుచి వాసనల్లాగే వున్నాయని వాళ్ళిద్దరి ద్వారా తెలుసుకున్నాము. ఇక రంగు అంటారా—ఈ నేల ఎరుపు రంగులో వున్నట్లు స్పష్టంగా కనిపిస్తూంది. ఆలయవాస్తు శాస్త్రం ఇలాంటి భూమి తెలుపు ఎరుపు పసుపు నలుపు నాలుగు రంగుల్లోనే వుండాలని నిర్దే శిస్తూంది వాటిలో మన భూమి వర్ణం ఎరుపు కాబట్టి ఇక ఆ కొరతా లేదు. ఇక మిగిలివున్న ప్రయోగం ముఖ్యమైంది. అది తేలిపోతే మీరు నిశ్చింతగా

ఆలయ నిర్మాణ మహూర్తాన్ని నిర్ణయించుకోవచ్చు" తన అంతర హృదయ స్థితిని పరిశీలిస్తున్నట్లు కొన్ని క్షణాలు కళ్ళు మూసుకున్నాడు స్థపతి. ఆ స్థలంలో తన మనస్సు ఏ వికారాలకూ, ఆందోళనలకూ లోను కాకుండా స్తిమితంగా వుండడం అతను గుర్తించాడు.

"మనోప్రమాణం కూడా సరిపోయిందండీ" కళ్ళు తెరిచి విభూషణ రావును చూస్తూ సంతృప్తిని వ్యక్తం చేశాడు.

"కాస్త వివరంగా చెప్పండి. మా అమ్మాయి ప్రవాళ ఆలయకళల మీద నాకు కలిగించిన కుతూహలం మిమ్మల్ని విసిగించేటట్లు చేస్తుందను కుంటాను" నవ్వాడాయన.

తన ఛత్రం క్రింద బ్రతుకుతున్న పల్లెప్రజల్ని పీడించుకు తినే కర్కశ హృదయుడైన ఈ మనిషి తనవద్ద ఇంత మన్నితంగా ప్రవర్తిం చడం . కార్యసాధకత్వం కాబోలు—పరిసర గ్రామీణుల వల్ల జమీందారు స్వార్థపరత్వం తెలిసినప్పటి నుంచి సౌరాఖ్యునికి అతనిమీద గౌరవభావం లోపించింది. ప్రవాళకూ, తనకూ మధ్య అవ్యక్త అవినాభావ బాంధవ్య తరంగాలు కళాత్మకంగా ప్రసరిస్తూండడం వల్ల తను ఈ ఆలయ నిర్మాణ కార్యదీక్ష వహించాడు. దానికి తోడు తన తండ్రి అదృశ్య రహస్యాన్ని ఛేదించాల్సిన గురుతర బాధ్యత తనమీద వుంది. "ఏదో ఆలోచనలో వున్నట్లున్నారు" విభూషణరావు నెమ్మదిగా అన్నాడు. "ఇక్కడ ఒక మానసిక ప్రశాంతి లభిస్తూంది. దాన్నే అంతర్ముఖుణ్ణి అయి గుర్తించాను. ఈ స్థల స్వభావాన్ని, స్వరూపాన్ని గురించి విశ్లేషించు కుంటున్నాను.... ఇక్కడ ఒక మూర లోతు, మూర వెడల్పు సమంగా త్రవ్వమనండి" మట్టిని పరిశీలిస్తూ ఒకచోటు సూచించాడు స్థపతి.

"స్థపతిగారూ.... మీ నాన్నగారు ఎక్కడైనా ఇంతకు మునుపు స్థపతిగా వుండేవారా?" చెట్టునీడలోకి వెళ్ళి నిల్చున్న స్థపతిని అనుసరిస్తూ వెళ్ళి నిల్చున్నాడతను.

"అదేం లేదండీ....నేల గట్టిగానే వుండేట్లుంది. వాళ్ళు త్రవ్వుతుంటే తెలుస్తుంది కదూ! అసలు విభూషణరావుగారూ! ఆలయ నిర్మాణాలు సహజంగా సముద్రతీరాల్లో, నదీ సంగమ స్థలాల్లో, కొండ శిఖరాలమీద, అరణ్యాల్లో, ఉద్యానవనాల్లో, ఆశ్రమాల్లో, మఠాలు, పీఠాలు వున్నచోట జరగాలి" జమీందారు ప్రశ్నకు సరైన సమాధానం చెప్పకుండా దాటవేయడానికి యత్నించాడు.

"మరి ఈ స్థలం వాటిలో దేనికీ చేరింది కాదుకదా" నిరాశతో చూశాడు జమీందారు.

"ప్రకృతి సౌందర్యం వున్న ఏ స్థలంలోనైనా ఆలయాలు నిర్మించవచ్చునని ఆ శాస్త్రాలే మినహాయింపులు సూచించాయి."

"అంత ప్రకృతి సౌందర్యం ఇక్కడేముంది?"

"ఉన్నదంతా సౌందర్యమే! అది లేకపోయినా మనసు ఆహ్లాదంగా వున్నట్లు అనిపించే చోటేదైనా ఆలయ నిర్మాణానికి అనుకూలమైనదేనని శాస్త్రం ప్రకటించింది.

"అది మాత్రం ఈ ప్రాంతంలో ఎవరికైనా కలుగుతుందండీ. మా తాతగారూ, నాన్నగారూ జమీను వ్యవహారాల్లో చికాకు కలిగితే వాహ్యాళికని ఇలా వచ్చి మనసు కుదుటపరచుకునేవారు నేనూ అంతే....కాబట్టి మీరు చెప్పింది సత్యమే. అదేనా మీరిందాకా కళ్ళు మూసుకుని ఆత్మ పరిశీలన చేసుకుంది... అందుకే మీరు చిన్నవయస్సులోనే గొప్ప శిల్పకారులు కాగలిగారు...మా అమ్మాయి కూడా మీ గురించి...." కూతురి సంభాషణ పదేపదే ఇతని ముందు తేవడం అంత మంచిది కాదేమోననిపించి ఆపివేస్తూ గోతిపట్టి తవ్వుతున్న వాళ్ళవద్దకు వెళ్ళాడు విభూషణరావు.

'ప్రశాంతి' పేరు వినిపిస్తే నాలో ఎందుకీ ప్రకంపన! చిత్రమైన ఆకర్షణవున్న శిల్పమామె...' జమీందారు పిలవడంతో అటుగా వెళ్ళాడతను.

"బాగుంది .... బాగా త్రవ్వారు .... ఇప్పుడు ఆ మట్టిని గోతిలోకే తోయండి."

కూలీలతోపాటు జమీందారు కూడా స్థపతివేపు ప్రశ్నార్థకంగా చూశారు. "గోతిని పూడ్చండి చెబుతాను" నవ్వుతుంటూ కూలీల్ని హెచ్చరించాడు స్థపతి.

"ఇలా చూడండి....ఇదంతా ఈ గోతిలోని మట్టే అయినా, పూర్తిగా పూడ్చాక కూడా ఇంత మట్టి మిగిలింది కాబట్టి ఇది ఆలయ నిర్మాణానికి ఉత్తమమైన ప్రదేశం."

"అలాగా" ప్రయోగాలన్నీ మంచి ఫలితాల్ని ఇవ్వడంతో జమీందారు ముఖంలో గర్వాతిరేకం ప్రకటితమైంది

"గోయి తవ్వి తిరిగి పూడ్చినపుడు ఇలా మట్టి మిగిలితే అది ఉత్తమ స్థలం గోతిమట్టి గోతికి సరిపోతే అది మధ్యమస్థలం. గోతినుంచి తీసిన మట్టితో గొయ్యి పూర్తిగా పూడక ఇంకా ఖాళీ స్థలం వుంటే అది అధమ స్థలం. అధమ స్థలంలో అసలు ఆలయ నిర్మాణాన్ని చేపట్టకూడదు. విధిలేని పక్షంలో మధ్యమ స్థలాన్ని ఎన్నుకోవచ్చు. అయితే నిర్మాణంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. మీరు అదృష్టవంతులు. మంచి నేల దొరికింది."

జమీందారు వదనం ఆనందంతో ప్రఫుల్లమైంది. "విభూషణరావు గారూ! ఒకతణ్ణి పంపి నాలుగు వత్తులువేసి నూనె నింపుకుని వెలిగించగల చిన్న దీపస్తంభాన్ని తీసుకురమ్మనండి"

"ఎందుకు....అలాగే" ఆ పనికి పురమాయించాడతను.

"అంతలోపున ఓ మూర గొయ్యి తియ్యమనండి" అని జలకుంభం కోసం చుట్టుప్రక్కల పరిశీలించాడు.

"ఆ త్రవ్విన గోతిలోని మట్టిని తీసి దాని నిండుగా నీరు పోయండి... దీన్ని నేను కొన్ని నిమిషాల వ్యవధితో పరీక్షిస్తూ వుంటాను. ఇంతలో మీరు చిరుసెమ్మె పట్టేటంత లోతు సుమారు నాలుగడుగుల లోతు గోతిని తీయండి...నేను వచ్చి తర్వాత చూస్తాను."

"ఈ నీళ్ళు ఇంకిపోవాలా?" వినువుగా స్థపతిని అడిగాడు జమీందారు.

"నిర్దిష్ట వ్యవధిలో నీరు తగ్గకుండా అలానే వుంటే ఆ నేల ఉత్తమం. నిర్దిష్ట కాలంలో రెండు మూడు అంగుళాలు తగ్గితే అది మధ్యమం. నీరు పూర్తిగా ఇంకిపోతే అది అథమ ప్రదేశం అని దీని అర్థం." జల ప్రయోగ ఫలితాన్ని చెబుతూ ఆ నేల ఉత్తమమైనదేనని తేల్చివేశాడు సౌరాఖ్యుడు.

అలాగే దీప స్తంభంలో నాలుగు వత్తులు వేసి వెలిగించి నాలుగు చదరపుటడుగుల లోతు గోతిలోకి దించి పైన పలకం కప్పుగా పెట్టి కొన్ని నిమిషాల తర్వాత చూశాడు. దివ్వెలు ఆరకుండా వెలగడంతో మృణ్మయ, జలమయ, జ్యోతిర్మయ పరీక్షలో ఆ స్థలం ఆలయ నిర్మాణానికి ఉత్త మోత్తమమైనదని తేల్చి చెప్పారు స్థపతి. ఆనంద బాష్పాలు నిండిన కళ్ళతో స్థపతికి నమస్కరిస్తున్న జమీందారు మరో పరీక్ష మిగిలిందని తెలిసి కొంత ఆందోళన చెందారు.

"విభూషణరావుగారూ! శాస్త్రోక్త పద్ధతిలో విధి విధానంగా ఉత్తమ మానవు దొరకు ఉత్తమజాతి పశువులతో ఈ నేలను దున్ని చదును చేయాలి. ఆ నేలలో నవధాన్యాల్ని నిత్తాలి. అవి మొలకెత్తే కాల వ్యవధిని బట్టి ఈ నేల ఉత్తమమో కాదో తేల్చుకుందాం....ఇక ఈ నేలకు తిరుగు లేదు...." జమీందారు సాచిన చేతిని పట్టుకుని ఓ గట్టుమీదినుంచి దిగా డతను.

"మొలకలెన్ని రోజుల్లో వస్తే మేలిమి నేలంటారు."

"మూడు రాత్రుల్లో నవధాన్యాలు మొలకెత్తితే అది ఉత్తమమైన భూమి 5 రాత్రుల కాలం పడితే అది మధ్యమభూమి. అవి మొలకెత్త డానికి 7 రాత్రుల కాలం పట్టిందనుకోండి – ఆ నేల అధమమైంది. ఇదీ అంకుర పరీక్ష....ఇక పరీక్షలేమీ లేవు. మీరు నెమ్మదిగా ఉండొచ్చు" అతని కళ్ళలోకి చూస్తూ చిరునవ్వాడు సౌరాఖ్యుడు.

"ఆ నవధాన్యాల్ని విత్తడానికి మీరే త్వరగా ముహూర్తం నిర్ణ యించండి....శాస్త్రోక్తంగానే బీజావాపన ప్రక్రియను ప్రారంభిద్దాం" అది మంచి పంటభూమి కాబట్టి జమీందారు నమ్మకంగానే వున్నాడు.

"ఈ స్థలంలో మానసిక స్థితి ఎలా వుంటుందో చూడాలి. అందుకు నేనో గంటసేపు నిశ్చలంగా కూర్చుని పరిశీలించాలి" తన ఏకాంతానికి భంగం కలిగించవద్దని సూచిస్తూ అశ్వత్థ వృక్షం పీఠకు చేరుకున్నాడు సౌరాఖ్యుడు.

"మంచిది. నేనంతలో పొలం పనుల్ని చూసుకుని వస్తాను" అంటూ వ్యవసాయ కూలీల వేపుగా వెళ్ళాడు జమీందారు.

సౌరాఖ్యుడు కళ్ళు మూసుకుని మనస్సును నివాత దీపకళికలాగా నిశ్చలంగా వుంచుకున్నాడు. అతనికి సర్వాంగ సుందరమైన దేవతా విగ్రహాలు దర్శనమిచ్చాయి. కలశకాంతులతో మెరిసిపోతున్న ఓ వర గోపురం, చిరుగాలికి చిరుగంటలతో రవళిస్తున్న మహోన్నత స్వర్ణ ధ్వజస్తంభం దర్శనమిచ్చాయి. శాస్త్ర ప్రకార ప్రాకార కుడ్యాలతో శుభ వృక్ష పరంపరతో శోభాయమానంగా ఒక దేవాయతనం సాక్షాత్కరించింది. తన తలపుల్ని ఆశీరాక్షతల్లా ప్రజలపైకి చల్లుతున్నట్లు ఆ వరగోపురం మీది మంచి కపోతాల గుంపులు కిలకిలా నేలమీదకు వాలుతున్నాయి. దివ్యలోక వాసులకు ఈ ఆలయ నిర్మితిని చూపడానికా అన్నట్లు తెలిపట్టు తెరల్లాంటి మేఘ యవనికలు తొలగిపోతున్నాయి. తేజోమయ గగనం దివ్య దీపనంగా

వుంది. సౌరాభ్యుడు మహదానంద తరంగితాంతరంగుడయ్యాడు. పర మాత్మకు కృతజ్ఞతల్ని ప్రకటించుకున్నారు. శుభదర్శనమైందని విభూషణ రావుకు చెప్పదలచుకున్నారు కానీ ఒక తీవ్రతరానుభూతి అతన్ని కదలనీయ లేదు. తిరిగి అంతర్ముఖుడై పోయాడు. అతని హృదయ కుహరంలో దివ్య వాక్కులు దుందుభిధ్వాన స్వరంతో ప్రతిధ్వనింపసాగాయి—

"శృంగారం స్వర్ణమయ శృంగాలతో యతుల ఎద సామవుల్ని కోరాడే మత్తవృషభం. అది పంతాల దంతిలా దాపురించినపుడు అచంచల ధైర్యం కావాలి.

ప్రియురాలి హస్తాన్ని పరిగ్రహించాలంటే మహాగ్రహాల్ని విగ్ర హించి రావలసి వుంటుంది. ప్రేమ ఒక మానసిక గ్రహణం. దాన్నుంచి పునర్జన్మించినవాళ్ళు అపూర్వంగా ప్రజ్వలిస్తారు.

అతని బాహుపంజరంలో ఆమె ఒక వయారి మయూరం అవుతుంది. ఆమె మది మందర కందరలో అతనొక ప్రణయసింహం అవుతాడు. ఆమె యౌవనవనంలోకి అతనొక పూల ఋతువు. అతని జాంబూనద పరు వానికి ఆమె ఒక ధూమరహిత హవ హవంతిక. అతను ఆమె వివర్శల అంక శశాంకుడవుతాడు.

ఆ మేఘంమీది చంద్రుడు చూడు శిఖరంమీది మృగేంద్రుడిలా వున్నాడు. బోనులో బంధించబడినట్టు పరివేషం (కాంతివలయం) మధ్య విశృంఖలంగా విక్రమించిన సింహ కిశోరంలా అతను!

భద్రాసనం మీది వీరభద్రుడిలా
నువ్వు నా ఒడిలో—
ఉదయ శిఖరాం మీది బాలభానుడిలా
నువ్వు నా ఎద మీద—

అదిగో! అటుచూడు! శీతల వీథి కాలంలో కలువ బాలల చెక్కిళ్ళతో కాపడం పెట్టుకునే రసికశిఖామణిలా పున్నమచంద్రుడు పుడుతున్నాడు.

విహంగాలు తమ అంగాల్ని పూలకొమ్మల్లో పూడ్చిపెట్టుకుని వెచ్చదనాన్ని అచ్చులద్దుకున్నట్టు కూర్చున్నారు వాళ్ళు. శిష్టులు మదనాభివిష్టులైన ధర్మపథానువర్తులౌతారు తప్ప దారి తప్పరు.

ప్రియుడి నేత్రాలు ప్రియురాలి గోత్రాలైనపుడు వలపు వల్లిక సాగిందని భావం. ప్రణయజీవులు నడయాడిన నేల, ఋషి సంఘాలు కపాల ఆసనాలతో శరత్కాల శతాలు తపసించి కృశించి ముక్తినందిన దివ్య క్షేత్రంలా పునీతమవుతుంది. మధుమూలఫలోపేతులై, జ్వలిత తేజసులైన ముని వృషభులు అహర్నిశలూ విహరించే విహార ఆరామంలా ఆ నేల అందగిస్తుంది. ప్రహృష్ట కోయష్టిక (కొక్కెర)లు కోకిలలు కలరవించే కాలం అక్కడ విడిది ఏర్పాటు చేసుకుంటుంది. కాళిందీ తీరంలో మేలొందిన ప్రణయజీవుల్లా అక్కడ శృంగార బంగారాన్ని త్రవ్వుకునే తరుణం అవిచ్ఛిన్నంగా నిలుస్తుంది.

శుష్క కాష్ఠాల్ని ఒక్కటిగా చేసి ఉప్పెన నుంచి తప్పుకునేలా ప్రేమ మనిషిలోని నీరసభావాల్ని కూడా చక్కగా ఒక్కటిగా చేసి దానికి రసస్పర్శ నద్దుతుంది. వేతస శాఖల్ని పట్టి వేళ్ళతో గట్టిగా కట్టి చేసిన ఆసనంలా అందంగా వుంటుంది స్నేహభావం. నవనవ ఆసన భూషణాలతో అలంకృతమైన ఆశ్రమంలా సుందరంగా వుంటుంది ప్రేమభావం. వర వర్ణినీ వర్ణాలతో గగనంలో భాసించే సూర్యదేవర తేజంలా మనసును ఆవరిస్తుంది ప్రేమ.

మఖోష్ణాంగి ప్రేయసి పరిష్వంగ పరిమళాల్లాంటి భావాలేవో అతనిలో విలవిలమన్నాయి. ప్రేమ భావనా సౌవిలావణ్యాలు కమలోర్మి మాలినిలా మనిషిని ఆవరిస్తాయి. అప్పుడు కింశుక (మోదుగ) పువ్వు కంచుకంలో

దాగిన శుక రాణుల్లాంటి భావాలు వర్తిస్తాయి. ద్విపదాంవర (పరశ్రేష్ఠుని) దరహాసం ఒకటి మబ్బుల మాటునుంచి తళుక్కుమంటుంది.

ప్రేమతో తమోమండలం భస్మమౌతుంది. అప్పుడు ఆత్మదర్శనం జరుగుతుంది. దానితో అమోఘ ఫలితాలు సిద్ధిస్తాయి. ఉషోదయ కిరణాలు సౌవర్ణదండాలై తలను తాడిస్తున్నట్టు తల్లడపడుతుంది మానసం. కామ దర్పం మనోదర్పణాన్ని మలినపరుస్తుంది.

ప్రణయోద్యానవనంలో అరణోమయ విరజాజుల్లాంటి పలుకులు, పాలనురగల్లాంటి పలుచని వలిపాల్లో కనిపించే దివ్య జవ్వని యౌవనాలు బ్రహ్మ విష్ణు రుద్ర గంథుల్ని భేదిస్తాయి.

సుగంధ తైలభరిత ప్రమిదలా, ఘృతసిక్తసమిధలా ఆమె ఎదవేది మీద ఒక ప్రణయభావం ప్రజ్వరిల్లుతుంది. వ్యోమకేశుని అసిత కేశాంతాలు పర్వత సుశ్రోణీతలంమీద కదలాడుతున్నట్టు, వాటినుంచి జలబిందువులు జాలువారుతున్నట్టు నీలి జలదాలు చినుకుల్ని రాలుస్తున్నాయి. వ్యోమభామిని సిగబంతిలాంటి చంద్రబింబం గగన కబరిపై విరిసి ప్రేమికుడి మీదకు వెన్నెలల్ని కురిపిస్తుంది. అప్పుడు చూపులు సంహత స్తనాంతర హేమ సూత్రాల్లా మెరుగులు వారుతాయి. అంగన అసితాపాంగాలకు లొంగని వెంగళికి రసహృదయం అలవడదు. అందాల పానుపుల్లో చూపులు మేపనివాడి ఎదపొదుగులో క్షీరధార ఎలాపడుతుంది? ప్రణయ ధ్యాన పరాయణులే నారాయణులవుతారు.

ధూమకేతుని కేతనం లాంటి సిగను ఎగసన దోసుకుని ముడిపెట్టు కుంటున్న మునికన్య ఎవ్వరో మనసుకు ఇంద్రియ నిగ్రహణను అభ్యసింప చేస్తున్న ఆచార్యలా వుందామె. పన్నగేంద్ర వధువుల్లా మిసమిసలాడుతున్న కోయకామినులెవ్వరో మధుగోళాన్ని ఎదకెత్తుకుంటున్నారు.

ఆకాశం నుంచి రోహిణీకాంతి వాహినిలావున్న ఏ దివ్యకన్య తనూ లావణ్యమో అతని మీదకు ప్రసరిస్తూంది. శిథిలమైన ఓ భావం వదిల మంత్రంలా మారి చేకోమ్మని అతని ముందుకు వచ్చింది.

మనిషి భావాలు జలజాలు కావాలిగానీ బాష్పజలజాలు కాకూడదు. మదహస్తులు క్రీడించి విసిరేసిన విధ్వస్త పద్మినుల మీద వాలే బంభరాలు బావుకునేదేమిటి? వాటి శిథిల దళాలకు మధుర స్మృతు లెక్కడివి ?

ప్రేమ పౌర్ణమాసీ నిశి. అదొక శాంతిశిల. మానవులు సుఖ శోకాతురులు. వాళ్ళ కళ్ళ చెలియలి కట్టలు తెగిపారే కన్నీటిలో కుప్క కమల ముకుళాల్లా అందమైన భావాలన్నీ కందిపోయి కొట్టుకపోతాయి. అందుకున్నంత ఎత్తులో వున్నా ఇందుమండలం వాళ్ళ పొందుకోరదు. అలా అరాజ్ఞితమై, రుజా నిర్జితమైన భుజాలు సాధించేదేమిటి ?

ఆమె సుజాతాంగి. అతను సుకుమారధీరుడు. ఆమెవి సుపక్ష్మ తామ్రాయత శుక్ల సులోచనాలు. ఆమెకు నాగనాసోరు సోయగముంది. కఠిన మృదుల మధుర స్తనోదర అధరాల మధుర రూపిణి ఆమె. ఆమెది సర్వలోక విలోకన మనోహర రూపం. ఆమెదొక శుభంకర సుమ యౌవనం. ఆమె అమలిన అంబరాలతో అంబర అమరబింబంలా వుంది. ఆమెది వాదానుమ సౌమ్యాకారం. అతని తలపులు సోకి ఆమె మలయ మారుత ప్రేరిత కోరకంలా రేకులు విప్పుకుంటుంది.

నగర మాలికను ధరించిన సాగర తీరంలా, నస్తఖండాల దండను దాల్చిన భూగోళంలా, భగోళాల బంతిపూల మాలికనలంకరించుకున్న విశ్వ రూపిణిలా ఆమెరూపం దేదీప్య దివ్యదీపమై దర్శనమిస్తూంది. ఆ ఇంతి బామంతి. మన్మథుని కళ ప్రకాశికను తన్నుకున్న పన్నగవరుని తడబాటు లాంటిదేదో భావన అతన్ని దడదడలాడించింది. ప్రణయశౌర్య శౌండీర్య గర్వం ఆవహించి అతన్ని పునరుజ్జీవితుణ్ణి చేసింది. దీప్తజిహ్వుడు

దీపవ్రాలు చల్లినట్టు, అతనిమీద కాంతి కిరణాలు గుప్పెడు గుప్పించాడు.

గగన గామినిలా ఆమె కనిపించింది. ఆకాశ గణానికి దంతం అంటు రిస్తున్నట్టు చంద్రరేఖ తొడసూపుతోంది. దిగాంత వనాంతరంలా కారు మబ్బు ఒకటి కమ్మింది. నిశాంత దిగంతంలా ఓ కాంతిరేఖ కన్నుల్లో విచ్చుతుంది. గజరాజ కన్యకు వన్యప్రాంతంలా ఆహ్లాదంగా వుందా వాతావరణం. కాంతార మధ్యంలో ఏకాంత కాంతలా ఆమె చూపు నిక్కుమంటూంది.

బంధుజనుల ఆగమనాన్ని సూచించే పింగళపక్షి కూజితంలా అతని నవ్వు ఆమెకు శుభదాయి అయింది. ముఖ విహీన యానంలో ప్రేమగానం బాటసారికి తోడైనట్టు ఆమె సంబరపడింది.

ప్రేమాపరాధి దైవాపరాధికన్నా శిక్షార్హుడు.

దీనమానసం ఇట్టే పరాధీనమైపోతుంది.

ఆ గగనకన్య వెన్నెల సందేశం తనకు పంపినట్టు అతనికి అనిపించింది.

సుదూర ఆకాశ దేశంలో స్పందన తారకచుట్టూ పరిభ్రమిస్తున్న జంటగోళాల్లా అతని చుట్టూ ఆమె కళ్ళు కాపు కాస్తున్నాయి. మీనకన్నె కన్నుల్లో మిన్నుల వన్నెల మిళనం అతన్ని జ్వలింపజేస్తూంది. పుణ్య పీవ వృత్తాంతాలతో ఆమె వక్షోజ వర్తులాలు అతన్ని చలింపజేస్తున్నాయి. ప్రేమభావంతో అసాంతం అతన్ని కాంత జ్వరం ఆవరించింది. ప్రేయసీ బహుపాలనా లాలన హృదయం అదృష్ట దుఃఖాన్ని రగిలించింది. జీవన అనర్థాల మీద అతనికి కోపం వచ్చింది. అతని కోపం అంతకోపమం అయింది. ఆమె ముందు అతని చూపులు అవలిభాషణా దోషభూయిష్ఠాలౌతున్నాయి. ఇతని సందిగ్ధ వమరాన్ని చూపి చిరునవ్వు శిరసొంచిందామె. అది శిరస్సుంజలి అయింది. అతను అనిందిత లోచనాలతో స్పందించాడు.

ప్రణయవేద విదాంవరుడై అతనామెను వరించాడు. మరుని మరమ్య అరణ్యాలు చరించాడు. కార్యనైరాశ్యం వదలుకున్నాడు.

పూజిత ధనుర్వ్యరాన్ని స్వయంవర వరుడు ప్రపూరణారోపణ వేవ వాలతో (అల్లెత్రాడు బిగించి, శరారోపనం చేసి, లాగినట్టు) యత్నించినట్టు అతవి కర ప్రకర్షలో ఆమె తనువు ఇమిడింది. అతను ప్రేమ యజనం, ప్రణయ అధ్యాపనం తన నిత్యకృత్యాలు కావాలనుకున్నాడు. మనుగుడుపుల ముడుపులతో ఆమె అతనికి అందాల విందులందించాలని అంది.

హతవీరత్వంతో జతపడినవాడికి సద్గతి లేదు. జడీకృత మానసం నుంచి ధీరత పొటమరించదు. ఆమె నయన కమలారామాల్లో అమలిన శృంగార హంస ఒకటి ఈదులాడుతూ తనను హింసించి బాష్ప బిందువుల్ని రెక్కలతో విదిలిస్తున్న దృశ్యం అతనికి గోచరించింది. శ్రీరివరూపిణి సీతలాంటి పొటబోసిన నూతన భావం ఒకటి అతని మనోక్షేత్రంలోకి ఏళ్ళ నాటి యాతనను తరలించుకొచ్చింది.

అటంకాల టంక పుబ్బొళ్ళను (పడికట్టురాళ్ళు) అధిగమించి ఆమె తనకోసం వస్తున్న కాషాయకామినిలా అనిపిస్తూంది.

'పౌరా! నువు ప్రక్కన లేకపోతే పదభ్రష్టాక్షరంలా ఒంటరిగా, మాత్రాహీన మాత్రంతో అందం కోల్పోయిన కవితా బంధంలాగా వున్న దానిని' అంటూ ఆమె నయన సందేశాల్ని తనలోకి ప్రసరిస్తూంది.

'సు....సు....సుమా' ఆమె పేరులోని అక్షరాల్ని కూడి పలకలేక పోయాడు.

'పుణ్య శ్లోకులైన లోకులకు, కారడవుల్లోని కాకులకూ మానసిక సంఘర్షణలు తప్పవు. బాహిర యుద్ధాల్లో తప్ప అంతరంగ రణరంగాల్లో అనాగరక జాతులు జయించలేవు. మనం అక్కడ కూడా పరాజితులమైతే ఇక గత్యంతరమేముంటుంది చెప్పు!' అని ప్రశ్నిస్తున్నట్లు చూస్తూందామె!

అతను ఆమెను బిగియారా కౌగిలించుకున్నాడు. జీమూతవాదాలు, ప్రేమార్తగీతాలు కలిసి మెరుస్తున్నాయి. బహిశ్చర ప్రాణంలాంటి స్నేహం మోహంగా మారి లోనికి ప్రవేశించినట్టు అతనికి ఒక అనుభూతి, ఒక దర్శనం ఏర్పడింది. మధ్యస్థ చింతాంతరంగుడయ్యాడతను.

అతను పరభామా కామపురంజయరంజనుడు. ఆమె పుష్యమీ నక్షత్ర చంద్రికలా పునీతురాలు. ప్రేమ సుమంత్రిత సమాచారాన్ని దేన్నో అతని చెవిలో గుసగుసమంటూంది. అతని హృదయంలో ఒక అభ్యుదయ భావం పొడుపుకొచ్చింది. ఆమె చెక్కిళ్ళు అరుణంగా నొక్కుబడ్డాయి. మోహ మహామేఘ వేగం అనురాగ రాగాల జల్లులు చల్లుతూ ఘోషిస్తోంది. వాళ్ళ మనోప్రమాణాలు పూల విమానాలై ఎగసివస్తున్నాయి. ప్రేమను నోమిన వ్రత సూత్రాలతో వాళ్ళు స్థితమతులై భాసించారు. ప్రణయవృద్ధులే సమతా గత బుద్ధులు అవిపిస్తుంది వాళ్ళకు.

వనగణాలు, భువన్రధువాలు, భవనమూర్ధాలూ కంపించేలా ఆమె హృదయం 'నిన్ను ప్రేమిస్తున్నాను' అంటూ ఘోషిస్తోంది.

అవును ప్రేమికులు బుద్ధిలో బృహస్పతులు, వీర్యంలో శచీపతులు కావాలి. వాళ్ళ ఎదలు సత్యసేవ వేదికలు కావాలి. కీర్తి యశోశీలాలు శీల వృద్ధులకే దక్కుతాయి. అందుకే ప్రేమకు శీలం ఆది పునాది. ప్రేయసీ ప్రియుల కలయిక ఒక వాత్సల్యోత్సవం కావాలి. ప్రేమసేవి జితేంద్రియుడు, నీతభయుడు కావాలి. ప్రేమికుడు స్మిత పూర్వాభిభాషి కావాలి. ప్రేమికులు రాగోపహతేంద్రియులు కారాదు. వారు ప్రీతిజనక కిరణ రవితేజో వలయాలు కావాలి. అప్పుడు వాళ్ళకు లోకపాలోపమ (విష్ణుసమాన) శక్తిసంపన్నత, దేవ దేవోప (ఇంద్రసమాన) వైభవం సంప్రాప్తిస్తాయి. పుష్పిత పుణ్యారణ్యాల్లా ప్రేమికుల హృదయాలు అందంగా అలరారాలి. తామరతూళ్ళు పూసిన అంజలి పద్మాల్లాంటి వాళ్ళ చేతులు కరుణపూరిత కావ్యాలు కావాలి. వాళ్ళ

వాళ్ళకు సువర్ణాదీన రత్నాలతో రంజింపజేసే భూషణాలు కావాలి. వాళ్ళ దృక్కులు లాజల శుక్ల మాలికా తారకాహార సంతతులు కావాలి. వాళ్ళ తలపులు మధు, సర్పి అర్పిత తర్పణాలు కావాలి. వాళ్ళ మనోరథాలు తీక్షణ శావాస్త్ర భరిత యుద్ధరథాల్లా కదలిరావాలి. వాళ్ళ ఆశయాలు హృదయ శిఖరం మీద శాతకుంభ కలశంలా అగ్నివర్చస్సుతో ప్రకాశిస్తుండాలి. భవ్య జీవనాన్ని హరించి దివ్యజీవనాన్ని ప్రసాదించాలి ప్రేమ. వాళ్ళ మానసారణ్య వీథుల్లో హిరణ్య శృంగ వృషభాలు వేవేల శుభాల ఆలమందలతో అందంగా పరుగులు తీస్తుండాలి. మలి సందెల్లో వాళ్ళ భావాంబర వీథుల్లో వెన్నెల కిన్నెరల్ని మీటుకుంటూ కిన్నర కన్యలు సాగిపోతుండాలి.

ధ్యానాన్తరణ సాధనాలైన హరిణ చర్మాలు ఋషి కన్నెలు ధరించే వల్కల స్త్రీలు ఆమెకు తనకు మధ్యన మేఘాల్లా కదలాడుతూ ఆమెను చూపుల పరిధినుంచి తప్పించి వేస్తున్నాయి.

ఎక్కడో సుదూర తిరాకాశ అగ్నిగర్భం నుంచి ఆ సువర్ణ కన్య దీన ఆక్రందన సౌదామని సంఘటాల్లా అతని ముందుకు తేలివస్తూంది.

"సోరా! ప్రేమ ఘ్రాణాపహారి. అది లౌకిక లంపట పరిమళ జ్ఞానాన్ని పోగొడుతుంది.

ప్రేమ శ్రవణాపహారి! అది మనిషికి సంబంధించిన వివేకిడి శక్తిని కోల్పోతేస్తుంది.

ప్రేమ నయనాపహారి! అది శారీరక దృష్టిని నశింపజేస్తుంది.

ప్రేమ జిహ్వాపహారి! అది తామసిక రుచుల్ని అసహ్యించుకుంటుంది.

ప్రేమ స్పర్శాపహారి! అది కామనా భావన్మయ పాయంతో ఏ సౌందర్యాన్ని తాకనివ్వదు.

ప్రేమ మనోపహారి! పక్షపాత శిక్షణా కేంద్రమైన మనస్సును వివక్షణా హితంగా భస్మీకరిస్తుంది.

ప్రేమ సర్వోపహారి! అది సతోన్నత భావాల్ని, ఉచ్ఛసీచ జీవ వాహ్నీ సమూలంగా హరించి ఒక అవర్ణ్య ఆనందమయ కాంతిసీమల్లోకి ప్రేమికుల్ని విసిరివేస్తుంది."

తనకేపుగా ఈ సందీప్త సందేశ కిరణాలు తన మనో తామస హర ణాల్లా తళ త్తళిస్తూ వస్తుండడాన్ని అతను చూస్తూనే వున్నాడు. ఈ అహ్లాద కరమైన ఆలోచనలు ఎద లోపల దివ్య పుష్పదళ మకరంద సేచనం చేస్తు న్నాయి. తనలోని కాముక కమఠంలా కావొచ్చింది. ప్రశస్తమైన మధు ధారలకది ఆలవాలం కావొస్తూంది. ఆ ప్రణయ పీఠికమీద ఒక పద్మగంధి వచ్చి కొలువుతీరింది.

దేవాయతన చైత్యతీర్థ తీరాల్లో విహరించి, పవిత్రక్షేత్ర స్నాన ఘట్టాల్లో స్నానించి, వన శైలాంతర వానోపవాసం చేస్తున్న ఒక తేజో మయ యువ తాపసిలా మారిపోయిన మానసంతో కళ్ళు విప్పార్చి చూశాడు సౌరాఖ్యుడు.

"ఆగు! నీ కోసమే జన్మించాను. నిన్ను అన్వేషించడానికే వస్తున్నాను" అంటూ అసంకల్పితంగా అతను ఆకాశాన్ని చూసుకుంటూ కొంతదూరం పరువెత్తాడు.

అయ్యో! స్థపతిగారూ! శుభదర్శనమేదైనా జరిగిందా? ఏమిటి పలవ రిస్తున్నారు?" అప్పుడే అతన్ని సమీపిస్తున్న జమీందారు అడిగాడు.

విభూషణరావుగారూ! సర్వం శుభంకరమే. అంతా ఆనందమయమే." సౌరాఖ్యుని కళ్ళలో విరజిమ్ముతున్న తేజస్సు జమీందారుకు సంతోషాన్ని కలిగించింది.

"ఆహా! ఇప్పటికి నా మనసు కుదుటపడింది" అంటూ సౌరాఖ్యుని భుజంతట్టి అతనితోపాటూ దారితీశాడు.

"బాబుగారూ! బాబుగారూ! కోవబాటలో ప్రవాళ గాయాలతో తెలివి తప్పి పడివుండే....మన తోటలో పనిచేసే కూలీలు మోసుకొస్తున్నారు మహలుకు...." ఆయాసపడుతూ వీరయ్య పరుగున వచ్చి జమీందారుకు ఆ విషాదవార్తను తెలియజేశాడు. జమీందారు హతాశుడై అడుగులు తడబడుతూ వడివడిగా కదిలాడు.

"ఎలా జరిగింది?" సౌరాఖ్యుడు చేతిలోని మట్టి బెడ్డను క్రిందకు విసిరి ఆదుర్దాగా జమీందారుతో కలిసి మహలువేపు గబగబా నడవసాగాడు.



# 6

తొలి సంజెలు పేరంటాలు చేసుకునే తొలి కొండల కోనల లోగిళ్ళలో ఒళ్ళు విరుచుకునే సురభామల కనుసన్నల్ని శిల్పి పోల్చుకోగలగాలి.

బంగారు రంగుల తడి ఇసుక తీరాల సెలయేటి నీటిలో పచ్చగన్నేరు వన్నె పాదాలు గుమ్మడిపూల పుప్పొళ్ళు రాల్చుకుంటూ వెళ్ళే ఆ మంత్ర పాదబద్ధ తరంగాల్లోని వేదమంత్రాల అంతరంగాల్ని తడితడిగా తడిమి పట్టుకోగలగాలి శిల్పి.

సూర్యచంద్రుల్ని భూమండల కుండలాలుగా, కుండలినీ కుగ్రామ పొలిమేరల్లో సంచరించే తేజోమూర్తుల్ని ఆత్మ బంధువులుగా చూడాలి శిల్పి. వకుళపుష్ప : బకుళ పరిమళాతులమైన లోయల్లో విరిసిన కన్నెపూల బావుల్లో లోతులు తీస్తూ గీతులు పాడుకుంటున్న తుమ్మెద బోయలతో స్నేహం కట్టాలి శిల్పి.

యజ్ఞవాటికల్ని నిర్మించిన ప్రజ్ఞావంతులైన శిల్పి బ్రాహ్మణులు అగ్ని కార్యాలకు ప్రథమ కారకులు. యజ్ఞవేదికలు, యజ్ఞపాత్రలు, యజ్ఞకుండాలు, దేవోపకరణాలైన చమసం ఆది పాత్రికలు దేవాలయాలు దేవమూర్తులు వీటి నిర్మాణం ఏ మహాపురుషుల మానసజన్యాలో ఆ శిల్పర్షుల్ని ఒక్కసారి మనసా స్మరించుకున్నాడు సౌరాఖ్యుడు. ఈ రూపనిరూపణ విశ్వకర్మోపజ్ఞకమైనది. కాబట్టి అది దేవశిల్పం అవుతుంది.

గృహాలు, గృహోపకరణాలు, శయ్యాశకటపాత్రికలు, రథాలు ఇత్యాది వస్తు నిర్మాణం మానవ సంకల్పోచితమైంది. కాబట్టి ఇది మానుష శిల్పం అవుతుంది.

అలా దేవశిల్పాలు, మానుష శిల్పాలు అయిన ఆ మహాశిల్పాలు దివ్యమైన వర్చస్సుతో అహర్నిశలూ కృషిచేస్తున్న దృశ్యమొకటి మేషు

యవనికలు తొలగిపోతూన్న గగన వేదికమీద సౌరాఖ్యునికి దర్శనమిచ్చింది. మన సంస్కృతికి మూలకారకులైన ఆ శిల్పతంత్రవుల్ని తనివితీరా తల పోసుకున్నారు సౌరాఖ్యుడు. ఆ పైన ఇహలోక స్పృహతో కార్యమగ్ను డయ్యారు.

"ఇలా ప్రలంబ ఫలకం పై పలకనుంచి క్రింది పలకకు ఆయా విగ్రహాల కొలతల్ని, ఘనపరిమాణాల్ని అనుసరించి సూత్రాలు వ్రేలాడ గట్టుకోవాలి.

మనం చెక్కిన విగ్రహం సప్రమాణంగా వుందా లేదా అన్న విషయాన్ని తెలుసుకోవాలనుకుంటే ఆ విగ్రహాన్ని ఈ ఫలకం మీదికి తెచ్చి చూసుకోవచ్చు. శిల్పులకిది ఒక్కటే సహాయకారి" శిల్పశాస్త్ర రంగులో అప్పుడప్పుడే రూపు దిద్దుకుంటున్న నూతన ప్రయోగాన్ని సౌరాఖ్యుడు నిర్మించి వివరించడంతో శిల్పులు ఉత్సుకతను ప్రదర్శించారు.

"ఆర్యా! వక్రత లేకుండా వున్న ఈ దారాలు ఒంపులు పోకుండా విగ్రహం ఈ పలకమీద అమరిపోవాలన్నమాట."

"అంతే....మనం చెక్కిన విగ్రహం అంగాలు అధిక పరిమాణంలో వుంటే ఈ సూత్రాలు సరళత్వాన్ని అంటే ప్రలంబత్వాన్ని కోల్పోయి వంకర అవుతాయి. ఒకవేళ విగ్రహ అంగాల పరిమాణం తగ్గిందనుకోండి ఈ దారాలకు ఆయా విగ్రహాంగాలు తగలవు. అదీ లోపమే. సప్రమాణికంగా మనం శిల్పించామా లేదా అన్నది ఈ ఫలకం ద్వారానే పరిచూసుకో వచ్చు" అర్థమైందా అన్నట్లు అందరి ముఖాలనూ పరిశీలించాడు సౌరాఖ్యుడు.

"దీనిద్వారా శిల్పదోషాల్ని, వాటిద్వారా ఏర్పడనున్న అశుభాల్ని మనం అధిగమించవచ్చు కదూ."

"ఆ ప్రయోజనం కోసమే ఈ ప్రయోగం. మనం లక్షణోద్ధార నిర్మాణంలో—అంటే శివలింగం మీద ముఖాన్ని చెక్కేటప్పుడు అత్యంత జాగ్రత్తగా పనిచేయాలి. రత్నాలతో గానీ, ధాతువులతో గాని రూపొందిన శివలింగం మధ్యలో వచ్చే బ్రహ్మ సూత్రం వుందే ఇది నిటారుగా వుండాలి. బ్రహ్మ సూత్రానికి అటూ ఇటూ పూర్వ సూత్రం పరసూత్రం వుంటాయి.

ఈ లక్షణోద్ధారము మనం పరీక్షించే ప్రతిమ శిరస్సుకు తాకిందా వ్యాధి సంభవిస్తుంది. లలాటానికి తాకితే మరణం, నేత్రసూత్రాలకు తాకితే అపస్మారం. నోటికి తగిలితే ధాన్యవినాశం, చిబుకాన్ని స్పృశిస్తే బంధు నాశనం, కంఠాన్ని తగిలితే స్కంధనాశనం, వక్షస్థలాలకు తాకితే పుత్ర నాశనం జరుగుతుందని శిల్పిఋషులు హెచ్చరించారు కదా. ఈ పలక ద్వారా అలాంటి ఆపదల్ని దాటిపోవచ్చు ఇదీ దీని విశేషం" శిల్పదోషాల్ని గురించి శిష్యులకు వివరిస్తున్నాడే కానీ సౌరాఖ్యుని మనసు, గాయపడిన ప్రవాళ చూపిన చూపుల్ని విశ్లేషించుకుంటూంది. ఆమె తలపులు మునుపటి కంటే మధురంగా ఏదో అలజడిని రేకెత్తిస్తున్నాయి.

"ఆచార్యా! మిమ్మల్ని కలుసుకోవాలని తృణబిందు బయట నిలబడి వుంది" శిల్పి ఒకడు, ఆమె ప్రాధేయపడడంతో లోపలికి వచ్చి ఆ విషయాన్ని తెలియజేశాడు. సౌరాఖ్యుడు శిల్పవిషయాల్ని చర్చించేటప్పుడు ఎవరు ఆటంకం కలిగించినా సహించడు. కానీ ఇప్పుడు ప్రవాళ క్షతగాత్ర అయ్యాక చోటుచేసుకున్న వాతావరణాన్ని దృష్టిలో పెట్టుకుని. ఆ శిల్పి సాహసం చేసి లోపలికి వెళ్ళి ఈ వార్తను సౌరాఖ్యునికి చేరవేశాడు.

"ఆ విధంగా పరిశీలించాలి—ఇప్పుడే వస్తాను.... అందాక ఈ ఫలకం మీద మీరు చెక్కిన శిల్పాల్ని వుంచి పరీక్షించుకుంటూ వుండండి.... అన్నట్టు శిల్పానికి శిల్పానికీ కొలతలు మారుతాయి కదా.... ఈ ఫలకానికి

కట్టిన దారాల స్థానాలు కూడా ఆ కొంతల ప్రకారం మారాలి" అంటూ వెలుపలికి నడిచారు. ప్రవాళ తృణబిందు వద్దకు వెళ్ళాక ఏం జరిగిందో తెలుసుకోవాలని అతను ఎదురుచూస్తున్నాడు. దానితో తృణబిందు రాక అతనికి ఆనందాన్ని కలిగించింది.

"నమస్కారం బాబూ...." తృణబిందులో సహజంగా కనిపించే ముగ్ధత్వం తగ్గి గాంభీర్యం చోటు చేసుకోవడం అతనికి నచ్చలేదు.

"నీకోసమే చూస్తున్నా....సావకాశంగా చెప్పు అసలేం జరిగిందో..." శిల్పాలకు దూరంగా నిర్మానుష్యంగా వున్న కొండచెరియలకు దగ్గరగా నడవసాగారు వాళ్ళు.

"మీరు ప్రవాళను తప్పుగా అంచనా వేసుకున్నారు."

తనను అవమానించిన ప్రవాళను గురించి తృణబిందు అలా మాట్లాడడంలోని ఔచిత్యం అతనికి అంతు చిక్కలేదు.

"అది నీ అభిప్రాయం."

"మనసున్న మనిషి ఎవరైనా ఆ అభిప్రాయానికే వస్తారు."

"తృణబిందూ! అసలు ఏం జరిగిందో చెప్పకుండా నువ్విలా విగూఢంగా మాట్లాడడం నాకు అయోమయంగా వుంది" తృణబిందు చేతిని సున్నితంగా అందుకున్నాడు.

"మీరు పెద్దవాళ్ళు....నాలాంటి గడ్డిపువ్వును ఇంత ఆదరించడం.... నేను భరించలేను...." తృణబిందు మొదటిసారిగా పురుష స్నేహ స్పర్శను అనుభవించింది. అతని చేతినుంచి తన చేతిని వెనక్కి తీసుకోవాలో, తీసుకోకూడదో కూడా తెలియని సందిగ్ధావస్థలో పడిపోయిందా పల్లెపిల్ల.

"తృణబిందూ....నన్నెందుకు అపార్థం చేసుకుంటున్నావు" ఆమె మరో చేతిని కూడా అందుకుని తనవేపుకు తిప్పుకున్నాడు. అతను సూటిగా తన కళ్ళలోకి చూడడంతో తల వంచుకుని నిలుచుందామె. అనుకోకుండా అతను తనకు ఇంత దగ్గరకావడం ఆమెకే నమ్మశక్యం కావడం లేదు.

"నాకు శిల్పాన్ని గురించి తెలుసు కానీ స్త్రీ శిల్పాన్ని గురించి బొత్తిగా తెలియదు....నన్ను పరాయివాడిలా చూడకు" ఇది అతనికి మొట్ట మొదటి స్త్రీ హస్త స్పర్శ కావడంతో అతనిలోని పురుష భావ ప్రపంచం సంచలించసాగింది.

"ఆరోజు అలా నేను మీకోసం, మీరు నాకోసం వెళ్ళి కలుసుకో లేకపోయాం కదా! ఆ తర్వాత యువరాణి లాంటి ప్రవాళ గుర్రపు బండిలో మాపల్లె కొచ్చింది. ఎలాగో తెలుసుకుని మా పాక ముందుకొచ్చి నిల బడింది. నేను కాసేపు తేరుకోలేకపోయాను. నవ్వుతూ నా చేతులు పట్టు కుని - సోదరీ! నీ మనసు కష్టపెట్టాను క్షమించు అందండీ" తృణబిందు కళ్ళు చెమరించాయి.

"అలాగా....ప్రవాళ వట్టి అహంకారి అనుకున్నాను....అందుకే...." ఆమె తన గుడారంలోకి వచ్చి మొట్టమొదటిసారి పలకరించిన సన్నివేశం గుర్తుకొచ్చి పశ్చాత్తాపపడ్డాడు.

"చెప్పండి....అసలామె అలా నా చేతులు పట్టుకోవడానికి కారణం ఏమిటో ఎంత ఆలోచించినా అంతుబట్టక మీ దగ్గరకు వచ్చాను" అతని వేపు ప్రశ్నార్థకంగా చూపింది.

కొండగాలి వీచి తృణబిందు పైటచెంగు శిల్పాచార్యుని భుజంమీద పడుతూ అతనిలో వింత అనుభూతులు రేపుతుంది. కరకు రాతి స్పర్శ తప్ప సున్నిత నాతి స్పర్శ తెలియని అతనిలోని శృంగార భావాలన్నీ సిందూర మేఘాలుగా రేగి పొగిపోవడం అతనికి కనిపిస్తూంది. శిల్పాచార్యుడి హృదయం ఆమె దగ్గరున్న ప్రణయశిల్పాన్ని అభ్యసించడానికి శిష్యరికానికి కూడా సిద్ధపడుతూంది.

"ఒకరోజు నా గుడారంలోకి వచ్చిందామె" తృణబిందు కళ్ళలోకి చూస్తూ అన్నాడు.

"వచ్చి ?" అతని విపుల వక్షస్థలం మీద ఆమె చూపులు నిలిచాయి.

"పలకరించింది"

"మీరు పట్టించుకుని వుండరు"

"....  ........" ఆశ్చర్యంగా చూశాడతను.

"అసలు తలతిప్పి చూసికూడా వుండరు"

"ప్రవాళ చెప్పిందా?"

"లేదు"

"మరి??"

"మీ గురించి నాకు తెలుసు" అతనివేపు అచిరంగా చూస్తూంది తృణబిందు.

"నేను అభిమానించే వ్యక్తిపట్ల అంత దురుసుగా ప్రవర్తించడం ధన దర్పం కాదా!"

"అది దర్పం కాదు" దృఢంగా అంది తృణబిందు.

"మరేమిటి?" కొత్త తరగతిలో మొదటిరోజు చేరిన విద్యార్థి ఉపాధ్యాయుని వేపు చూసినట్లు అతనామె వేపు చూశాడు.

"ప్రేమ"

"తృణబిందూ!!"

"అవునండీ... మీకు రాళ్ళలోని రకాలు తెలుసు కానీ ..."

"ఆడవాళ్ళలోని రకాలు తెలియవంటావు అంతేకదా" పల్లెటూరి పిల్ల దగ్గర ప్రేమపాఠాలు నేర్చుకోవడానికి అతనిలోని గురుత్వం లోలోపల సిగ్గుపడుతూనే వుంది. ప్రేమ, ప్రణయం సంటివి గురించి అడవి లోని పక్షులకు కూడా తనకంటే ఎక్కువగానే తెలుసునన్న సత్యం అతనికి మొదటిసారిగా ఇప్పుడే తెలిసొస్తూంది.

"నన్ను అవమానించింనే మీరు ఆమెను దుర్మార్గురాలనుకున్నారు కదా!"

"అవును."

"అలా ఆమెమీద మీరు వెంటనే ఒక అభిప్రాయానికి రావడానికి కారణం?"

"....ఆమె నన్ను అభిమానిస్తూందని అంటావు" అన్నాడతను.

"ఆమె మిమ్మల్ని అభిమానిస్తే ఆమెచేత నేను అవమానించబడి ఎందుకామెను ద్వేషించడం లేదు?" ప్రశ్నించిందామె.

అతని కళ్ళలో మెరుపులు మెరిసాయి. అవి తృణబిందు మనో గగనంలో వలపుల తొలకరి జల్లులు కురిపించాయి. రెండు చినుకులు తొణికి ఆమె కళ్ళవెంబడి రాలాయి.

'ఈమెకు ఏ తాపసివల్లనైనా జ్ఞానోదయమైందా ఏమిటి? ఈమె చల్ల అమ్ముకునే పల్లెపిల్ల మాత్రమే అనుకున్నాను కానీ స్త్రీ పురుష హృదయాల్ని గురించి ఇంత అవగాహన సంపాదించుకున్న నెఱజాణననుకో లేదు. ప్రేమించుకోవడం సర్వప్రాణికోటికీ అనివార్యమైనపుడు వయసొచ్చిన ఆడపిల్లకు ఆ మాత్రం తెలియదనుకోవడం....' ఆమె సహజసిద్ధమైన తనూ లావణ్యరేఖ అతని గుండెలో ఉదుల సవ్వడులు రేపుతూంది.

"ఏమిటలా చూస్తున్నారు...."

"ఏం లేదు...."

"ఏం లేదా?" కిలకిలా నవ్వింది.

"ఏ శిఖరారోహకుడూ అధిరోహించి తన అహంకార చిహ్నాల్ని ప్రతిష్ఠించకుండా స్వచ్ఛ సుందరంగా వ్యక్తమవుతున్న ఆమె పయోధరాలు అతనిలోని అరని అగ్నాద్రుల్ని తిరిగి రగిల్చాయి.

వస్తూన్న ప్రవాళ ప్రేమరాశిపిలా కనిపించింది. అత్యవ్యక్తమైన మనసుతో శిల్పాలవేపు దారితీశారు. అర్థాంతరంగా వదలి వచ్చిన పాఠం పూర్తి చేయాలనిపించలేదు కానీ క్రమశిక్షణకు అలవాటుపడిన మనసు కార్యోన్ముఖుణ్ణి చేసింది.

నృత్తమూర్తిని చెబుతూ కమా ప్రలంబ ఫలకాన్ని గురించి చెప్పాను....చర్మ ముండిక అనే క్రూరదేవత క్రోధోన్మత్త వదనంతో జగత్సంహారం చేయడానికి పూనుకున్నపుడు శివుడీ నటరాజులా అమృత నృత్యం చేశాడు. ఆ నృత్య విధానాన్ని చూసి ఆ దేవత సంతోషించి జగత్సంహారాన్ని విరమించిందని శిల్పశాస్త్రం చెపుతూంది.

ఈ నటరాజమూర్తి సర్వలోక హితకారి. ఉత్తమ దేవతామూర్తి. రాజుకూ, రాష్ట్రానికీ ఈ మూర్తివల్ల అభ్యుదయం జరుగుతుంది. మనం హరిహరార్ధ మూర్తిని మూలస్థాన వరదేవతగా ప్రతిష్ఠించబోతున్నాం. దక్షిణ భాగం హరుడు, వామభాగం హరిగా మలచాలి. కుడివైపు తల జటామకుటంతో, మిగిలిన అర్ధ శిరస్సుకు మకుటం కల్పించాలి. దక్షిణ నయనంలో రాజసదృష్టిని, వామభాగంలో సాత్త్విక దృష్టిని తీసుకురావాలి. ఎడమవైపు కొంచెం నవ్వుగల ముఖం, కుడివైపు తేజస్వంతమైన ముఖం దిద్దాలి. చతుర్భుజుడైన మూర్తి కుడివేపు పై చేతిలో పరశువు, క్రింది చేత అభయముద్ర, ఎడమవైపు క్రింది చేతిలో ఊరుహస్తం, పైచేత శంఖం వుండాలి. శివుడికి చెందిన నృత్తమూర్తుల్లో 18 భేదాలున్నాయి. అవన్నీ ఇప్పుడనవసరం. ఈ 18 రకాల నటరాజమూర్తుల్లో ఒక్కొక్కరకం మూర్తికి 16 చేతులుంటాయి. ఒక చేయి గోరీదేవి వక్షఃస్థలం మీదికి చాపి వుంటుంది. 7 వ రకం నాట్యమూర్తికో స్వామికి మూడు కళ్ళు, ఎనిమిది చేతులు, విరబోసిన జడలు వుంటాయి. అష్టమ నృత్త లక్షణం చతుర్భుజయుతుడుగా వుండాలి. నవమ నృత్త లక్షణంలో చతుర్భుజం, త్రినేత్రం, జటామకుటం వుంటాయి.

కల్యాణ సుందరమూర్తి నాలుగు చేతుల్లో కుండికను, అక్షమాలను, స్రుక్కు, స్రువాన్ని ధరిస్తాడు.

బ్రహ్మదేవుడు పద్మపీఠంపై ఉత్తరాభిముఖుడై కూర్చోవాలి. తూర్పున దేవీ దేవతలుంటారు. అమ్మవారు స్వామికి ఎడంవేపు వుండాలి.

విష్ణుమూర్తి హోమం ఉత్తరం నుంచి దక్షిణాభిముఖుడై వుండాలి. శివుని నాసిక వరకు ఇతని ఎత్తు వుండాలి. ఇతను శివుని వక్షఃస్థలం కన్నా ఎత్తు తగ్గకూడదు. ఇతను శ్యామలవర్ణుడు. పై రెండు చేతుల్లో శంఖ చక్రాలు, క్రింది చేతులతో బంగారు చెంబుతో నీరు పోస్తున్న భంగిమలో వుండాలి. ఋషులు, దైత్యులు, దేవతలు, గంధర్వులు, సప్తమాతృకలు, ఆయా దేవతల పత్నులు, శక్తులు కల్యాణవేది మీద సుందరమూర్తి చుట్టూ చేరి సంభ్రాంత మానసులై హృదయాంజలి ఘటిస్తూ నిలిచివుండాలి.

వామార్ధం పార్వతీ రూపం దక్షిణార్ధం మహేశ్వరమ్ ।
అభయం వరదం సవ్యేహస్తాభ్యాం శివాంశకే ॥

స్థానక వృషభానికి వెనుకవైపున గల ఈ మూర్తిని రెండు భుజాలతో గానీ, నాలుగు భుజాలతో గానీ చేయవచ్చు. అర్ధనారీశ్వరుని దక్షిణ పాదం సుస్థితంగా, వామపాదం కుంచితంగా వుండాలి. కుడివైపు పురుషునికి వుండాల్సిన స్తనాన్ని, ఎడమవైపు స్త్రీకి వుండాల్సిన స్తనాన్ని శిల్పించాలి. అలాగే అన్ని అవయవాలు. వస్త్రాల్లో కూడా కుడివైపు దుకూలం కట్టాలి. ఎడమవైపు వస్త్రం గుల్ఫాంతం (చీలమండ క్రిందకు) వరకు అమర్చాలి.

అగ్ని వర్ణంతో, ఎర్రని కళ్ళతో, ముడిచిన కనుబొమలతో బైటికి వచ్చిన కోరలతో, సర్పహారాలతో, అగ్నిజ్వాలలతో, ఎర్రని వస్త్రాలతో క్రిందికి తిరిగివున్న శూలాన్ని ధరించిన ఈ పాశుపతమూర్తిని సర్వ శత్రు వినాశం కోసం పూజిస్తారు.

కంకాళమూర్తి పాదాలకు పావుకోళ్ళుంటాయి. ఇతను భిక్షువులా వుంటాడు. దేవాలయ రక్షణ కోసం ఈ మూర్తిని కొలుస్తారు.

కుడికాలు కుంచితంగా వుండాలి. బ్రహ్మసూత్రం ముందుపైపున పార్శ్వ మీదుగా ప్రవరిస్తుంది. కుడిచేత పాత్ర నాభిసీమవరకు, ఎడమచేత డమరువు హస్తం హస్త్యంతం (దవడ చివర) వరకు వుండాలి. మూపున పెట్టుకున్న శూలం 40 అంగుళాలుండాలి. ఆ శూలం చివర అఘాతకుని కంకాళం బంధింపబడి వుండాలి. చతుర్భుజుడైన ఈ మూర్తి క్రింది కుడి చేత గద్దెపోచలుండాలి. దానికోసం ఓ లేడి పైకి మోర సాచినట్టుండాలి. జటా మకుటం గాపీ, విరబోసుకున్న వెంట్రుకలతో కాసీ వున్న శిగలో కుడిపైపు చంద్రుణి, పామును, చిన్న కొంగను అలంకరించాలి.

ఇలా మూర్తిభేదాల్ని శిల్పులు బాగా మనసులో ముద్రించుకోవాలి. ఆ మూర్తుల్ని ఉపాసించాలి. పదేపదే మననం చేయాలి. ఇలాగే చండేశాను గ్రహమూర్తి, దక్షిణామూర్తి, గంగాధరమూర్తి, కాలసంహారమూర్తి, లింగోద్భవమూర్తి లక్షణాలుంటాయి. వాటిని తర్వాత వర్ణిస్తాను."

"ఆచార్యా! లింగోద్భవమూర్తిని గురించి రెండుమాటల్లో రూపు కట్టండి."

"చంద్రశేఖరుడు లింగ మధ్యంలో నుంచి ఉద్భవిస్తున్నట్లుండాలి. దేవుని పాదాలు శివలింగం లోపలే వున్నట్లు శిల్పించాలి. ఈ మూర్తి ఎడమ వేపుపైన హంసరూపంలో బ్రహ్మ విహరిస్తున్నట్లు, కుడివేపు క్రింద వరాహ రూపంలో విష్ణువును నిరూపించాలి. హంసకు బదులు మొగలిపువ్వును బ్రహ్మ సంకేతంగా రూపించవచ్చు. మీ కందరికీ నా సలహా ఒక్కటే, ప్రతిమల్ని శిల్పించేటప్పుడు ప్రమాణాలతోపాటు అంతే కొలతలతోపాటు మీ కళాత్మక హృదయాన్ని, అనుభవజ్ఞానాన్ని, అనుభూతి పారమ్యాన్ని కూడా జోడించండి. లేకపోతే శిల్పకళ రాణించదు. ఉత్తమ శిలల సేకరణకు నేను వ్యయంగానే ఈ అరణ్య ప్రాంతాల్లో అన్వేషించాలనుకున్నాను ఈ

పోర్టి మళ్ళు వేళతాను. నెలరోజుల వరకూ కలుసుకోలేం. మీరు చెక్కి-
శిల్పాల్ని ఈ ప్రలంబ ఫలకంమీద చెక్కించి చూసుకుంటూ వుండండి•
సందేహాలుంటే ప్రధాన స్థపతులవారితో విన్నప్తి చేసుకోండి" ఎవరో వచ్చి
తనకోసం నిలుచున్నట్లు అనిపించి అటు చూశాడు సౌరాఖ్యుడు.

"ఆచార్యా! ప్రవాళమ్మ ఆలయ విషయమై ఏదో మాట్లాడాలని
మీకోసం కొలనిగట్టున వున్నారు." ఒకపరిచారిక అతని జవాబు కోసం
ఆగింది.

"శిక్షణా తరగతి పూర్తయ్యాక వస్తానని చెప్పు" అయిష్టంగా చెప్పి
నప్పటికీ, ఏదో ఉత్సాహం అతని హృదయాన్ని తొందరించి క్లుప్తంగా
తరగతి ముగించి కొలనివేపు నడిచాడు సౌరాఖ్యుడు.

* * *

సృష్టికి ప్రతిసృష్టిచేసే బ్రహ్మశిల్పి. ప్రకృతిలోని చంద్రదినేంద్రులు
అతని కల్పనతో ప్రతిభాసిస్తారు. పరిపుష్ప- ఫలాశాలకు దూరంగా అతని
అరణ్యాలు అందగిస్తాయి. లీన మీన విహగాలతో జలజాత పుష్పాలతో
అటు వన సౌందర్యం, ఇటు దినసౌందర్యం శిల్ప కల్పనలో శతాధికకోటల్ని
పులుముకుంటాయి. సృష్టి, శిల్పిచేసే ప్రతిసృష్టిని భ్రాంతాకులిత నేత్రాలతో
దర్శిస్తుంది.

ఆశ్వయుజ ఆకాశం మేఘాడంబరంతో మెరుస్తూంది. ఉరుముతూంది.
ఒకవైపు ఎండ కాస్తూంది. మరోవైపు వర్షపు జల్లులు క్రమ్ముకొస్తున్నాయి.

"సోదరా...." గగనాన్ని పరిశీలనగా చూస్తూ సౌరాఖ్యుడు సూత్ర
గ్రాహిని గట్టిగా పిలిచాడు.

"ఆర్యా! వస్తున్నాను...." అంటూ శిల్పాన్ని పరీక్షగా చూసి తిరిగి
నాసికాగ్రం మీద ఉలితో సున్నితంగా తాటించి అతను సౌరాఖ్యుని వద్దకు
వచ్చాడు.

"మీ నాన్నగారు ఒకప్పుడు నాతో మాట్లాడుతూ ఆకాశగంగలో మన ఆరాధ్యదైవమైన విశ్వకర్మబ్రహ్మను అభిషేకించాలన్న కోరిక జీవితంలో నెరవేరదేమోనని చాలా బాధపడ్డారు కదా" ఆకాశాన్ని అవలో కిస్తూ అన్నాడు సౌరాఖ్యుడు.

"అవును.... ఆయన కోరిక తీర్చే మార్గమే లేకుండా పోతూంది.... తండ్రికి ప్రియమైన పనిచేయడం తనయుడి కర్తవ్యం. నేను దానికే సర్వదా సంసిద్ధుడినే.... కానీ ఆకాశగంగనెలా సంగ్రహించను.... ఆ శాస్త్రజ్ఞానం లేనివాణ్ణి.... మహాశిల్పి ఆదిహారుడు తన తండ్రికి దేవాభిషేకానికని ప్రతి ఆశ్వయుజ మాసంలోనూ ఆకాశ గంగోదకాల్ని సంగ్రహించి అందించే వాడని చదువుకున్నాను.... ఎన్ని శాశస్త్ర గ్రంథాల్ని పరిశోధించినా ఆ జలసముపార్జనా మార్గం మాత్రం అలభ్యమైపోయింది." దీర్ఘంగా నిట్టూర్చి ఇప్పుడా ప్రస్తావన ఎందుకో అర్థంకానట్లు చూశాడు.

"సోదరా.... నీ పితృభక్తికి నా హృదయం సంతోష సంభరితమై పోతూంది. దిగులుపడకు! ఆయనకు ఈరోజే పవిత్ర ఆకాశ గంగోదకాల్ని నీ చేతులతో అందిస్తావు" అతని కళ్ళలోకి అనునయంగా చూశాడు సౌరాఖ్యుడు.

"మహాభాగా.... అరుదైన తండ్రి కోరికను తీర్చిన తనయుడిననే తృప్తిని నాకు ప్రసాదించండి.... మీ ఋణం.... తీర్చుకుంటాను." సూత్రగ్రాహి కాలయూపుడు సౌరాఖ్యుని పాదాలకు నమస్కరించాడు.

"కాలయూపా.... లేలే.... అదిగో ఆ శిఖరం మీదుగా కమ్ముకొస్తూంది వర్షం.... త్వరగా ఒక శిష్యుడిద్వారా నువ్వు చేయవలసిన పనొకటుంది.

"చెప్పండి.... అది నేనే చేస్తాను"

"సరే.... ముందు జమీందారు ఇంటిముంచి పాతవైన మేలురకపు సన్నబియ్యాన్ని సంగ్రహించు. అన్నం మెత్తబడకుండా నిరుమనదును

తగ్గకుండా వుండేలా ఆ బియ్యాన్ని మవ్వే శ్రద్ధగా పరిశీలిస్తూ వండు మీ నాన్నగారు పూజకు వినియోగించే వెండి పళ్ళెన్ని సిద్ధంచేసి వుంచు.... వస్తాను.... ఈ ప్రయోగంలో దురదృష్టవశాత్తూ మనం అనుకున్న ఆకాశ గంగ లభించక పోవచ్చు...."

"అలాగా...."

"నిరాశపడకు.... నేను పక్షం రోజుల్లో ఆ జలాల్ని సమకూర్చి నీ మనోభీష్టాన్ని నెరవేరుస్తాను .."

కాలయాపన చేయకుండా సూత్రగ్రాహి కార్యోన్ముఖుడయ్యాడు.

సౌరాఖ్యుని మనస్సు ప్రవాళ ప్రవర్తనను విశ్లేషించుకుంటూ సతమతమవసాగింది. చల్లగాలికోసం కొలనిగట్టు సోపానాలమీద నెమ్మదిగా నడుస్తున్నాడు. కలువ రేకులు రాలిన మెట్ల దగ్గర కూర్చున్నాడు. ప్రవాళ నిన్న అక్కడే కూర్చున్న ఆ స్థలం అతన్ని అయస్కాంతంలా ఆకర్షిస్తూంది. ఆ ప్రదేశంలో ముందురోజు ప్రవాళ తనతో జరిపిన సంభాషణ మనసులో నెమ్మదిగా పుటలు త్రిప్పసాగింది.

"ప్రవాళగారూ! ఏమిటి విషయం?" పలకరించాడు.

"కూర్చోండి...." ఒద్దికగా ప్రక్కకు జరిగింది.

"చెప్పండి..." ఆమె చేతిలోని కలువ పూరేకుల్ని చూస్తూ అన్నాడు.

"మీరు అంగీకరిస్తే...." సంకోచంగా చూసింది.

"అంగీకరిస్తే....చెప్పండి."

"ఈ పున్నమరేయి...." అతనేమంటాడోనన్న స్వాభిమానం ఆమె వదన కమలం మీద ప్రస్ఫుటించింది.

"ఆఁ... " పున్నమరేయి అని ఆమె అనడంతో తృణబిందు మహాముని తమ వ్యక్తం చేసిన అభిలాష గుర్తుకొచ్చి ఎద కలుక్కుమందతనికి.

"శిలా పేకరణకు మీరు ఈ పౌర్ణమినాడు వెళుతున్నారు కదా.... నన్ను కూడా మీతో రావడానికి అనుమతిస్తే...." అతని కళ్ళలోకి పరీక్షగా చూసింది.

'హమ్మయ్యా ఇదా....ఖర్మకలిందు ఆ విషయం ఈమెకు చెప్పలేదన్న మాట' తేలిగ్గా వూపిరి పీల్చుకున్నాడు.

"నాకు శిల్పకళ అన్నా శిల్పాలన్నా....ఆలయ కళలన్నా చిన్నప్పటి నుంచి ఒక అనిర్వచనీయ ఆకర్షణ వుంది."

'శిల్పాలంటే చాలా చులకన భావం కూడా వుండి వుండాలే' సౌరాజ్యుడు మనసులో అనుకున్నాడు.

"శిలాపేకరణను పరిశీలించడం నా చిరకాల వాంఛ. సహృదయులైన మీర స్థపతిగా రావడం మా అదృష్టం. ఇంతకు మునుపు వచ్చిన శిల్పులతో నేనీ వాంఛను వ్యక్తం చేయలేదు. మీరు తిరస్కరించరని...." అతన్ని ఆదుర్దాగా చూస్తూంది.

వెన్నెలరాత్రి విరిసిన అడవి మల్లెల సురభిళాలు కొండగాలిలో తేలి వస్తున్నట్లు ఏదో మనంపన్నమైన అందాల పరిమళం ఒకటి ఆమెనుంచి అతని మీదుగా వీచి వివశుణ్ణి చేస్తూంది.

"అలాగే....మీరు రావాలనుకుంటే మీ ఇష్టం. నాకేమీ అభ్యంతరం లేదు.. ."

"కృతజ్ఞురాల్ని....కృతజ్ఞతలు" అంటూ మనిషి అలికిడి విని ఎగని పోతున్న జలపక్షిలా ప్రవాళ కొలని సోపాన పంక్తుల మీదుగా పరుగు తీసింది.

'మంత్ర ముగ్ధుడిలా నేనెందుకు వెంటనే ఆమో అభిలాషను ఆమో దించాను! ఇది శాస్త్రం సమ్మతిస్తుందా? ప్రధానాచార్యులకు ఈ విషయం తెలిస్తే ప్రవాళను ఏమనుకుంటారో కదా! అసలు చూస్తే నిజంగానే శిల్ప

కళ మీద ఆమెకు ఆరాధనా భావం వుండనిపిస్తూంది. కళారాధనా హృదయం వున్న వ్యక్తికి శిల్పి అన్వేషించడం తప్పెందుకవుతుంది....' ఇలాంటి ఆలోచనలతో బరువెక్కిన హృదయంతో కోనేటిలోని కమల ముకుళాల మీద పరిభ్రమిస్తున్న భ్రమరాల్ని చూస్తూ కూర్చున్నాడు.

"ఆచార్యా! తమర్ని కాలయూపులవారు రమ్మంటున్నారు" ఓ శిల్పి తెలియజేశాడు.

"ఔనౌను.. పదండి" మబ్బు గముల గమనాన్ని పరికిస్తూ గబగబా కాలయూపుడు అన్నం వండుతున్న చోటికి చేరాడతను.

"ఆర్యా! అన్నం సిద్ధమైంది. ఇప్పుడేం చేయమంటారు?" ఉత్కంఠతో అడిగాడు.

"వెండిపళ్లెంలో అన్నం చల్లార్చి ముద్ద చేయండి. ఆ ముద్దను ఈ పళ్లెంలోనే వుంచి ఆరుబయట పరిశుభ్రమైన స్థలంలో వుంచండి....అదిగో వర్షాగమనం...." ఎండా వాన రెండూ ఆశ్వయుజ మాసంలో రావడంతో గురువర్యుని అభీష్టం సిద్ధిస్తుందని సంతోషిస్తూ ప్రధాన స్థపతి వద్దకు దారి తీశాడు సౌరఖ్యుడు.

"గురుశ్రీకి నమస్కృతులు."

"రా నాయనా! ఆలయ స్థల నిర్దేశం పూర్తయిందా?" వాత్సల్యంగా అడిగాడాయన.

"ఆ....పూర్తయింది మీ శుభాకాంక్షవల్ల....గురుదేవా! భూపరీక్ష జరిపేటప్పుడు త్రవ్విన గుంటలో నీరు పోస్తాం కదా ఆ నీరు ఇంకిందా లేదా అని చూడడానికి ఇవ్వవలసిన వ్యవధి గృహవాస్తులో అయితే వంద అడుగులు నడిచివెళ్ళి తిరిగివచ్చే కాలం అని శాస్త్రం చెబుతుంది. దాన్నే నేనూ అనుసరించాను ఆలయవాస్తు విషయంలో కూడా అదే పద్ధతే కదా! సందేహం కలిగింది...."

"అంతే....నాయనా! వంద అడుగులు వెళ్ళిరావాలి అదే కాల ప్రమాణం...." నీకు తెలియని శాస్త్ర విషయాలేముంటాయి అన్నట్లు శాన గర్వితంగా నవ్వారాయన.

"రేపు పున్నమకు వెళ్ళి శిలా సంగ్రహణను నిర్వహించాలను కున్నాను. నేను తిరిగిరావడానికి ఆలస్యమవుతుంది. అంతవరకు మీరు శిల్ప విషయంలో మనవాళ్ళకు వచ్చే సందేహాల్ని నివృత్తి చేస్తూ వుండాలని నా అభ్యర్థన. ఆలయ నిర్మాణానికి కావలసిన అన్ని జాగ్రత్తల్ని తీసుకుని వాళ్ళకు ఆయా బాధ్యతల్ని అప్పగించాను."

"దానికి నా అభ్యంతరం లేదు కానీ....నాయనా ఒక్కమాట."

"చెప్పండి ఆచార్యా."

"శిలాసంగ్రహణ విధానాన్ని స్వయంగా చూడాలని ఉవ్విళ్లూరుతూ నాతో ఎన్నోసార్లు తన వాంఛను ప్రకటించింది ప్రవాళ. నేను వృద్ధాప్య జర్జరిత శరీరంతో ఆ అడవులు, కొండలు, తీర్థతీరాలు తిరిగి అన్వేషించ లేను....దానికి తోడు ఈ మధ్య వినికిడి మందగించి స్త్రీ, పురుష శిలలకు ధ్వని భేదాన్ని కూడా గుర్తించలేని స్థితికి చేరుకున్నాను...." కాబట్టి చిరంజీవీ! నువ్వు ప్రవాళను వెంటబెట్టుకుని శిలాసంగ్రహణానికి వెళ్ళాలని నా సూచన" ఆయన దృఢ నిర్ణయం ఆ మాటలో ఆజ్ఞాపూర్వకంగా వినిపించింది.

"మీరు ఆజ్ఞాపిస్తే నేను ఆచరించనిదేదీ వుండదు. ఆమె కూడా నన్ను ఈ విషయమై ప్రాధేయపడింది. ఆమెకు మాట ఇచ్చాను కానీ.... మీతో చెప్పడానికి సంశయించాను....మీరే అనుమతించాక ఇక ఆలోచించాల్సిందేమీ లేదు."

"ఆచార్యా! ఇదిగో స్వచ్ఛమైన ఆకాశగంగా జలం" పళ్ళెం నిండుగా నానవీరు పట్టితెచ్చారు శిష్యులు.

"గురుదేవా! ఆకాశగంగా జలాలతో విశ్వబ్రహ్మాభిషేకం చేయా లన్నది మీ చిరకాల వాంఛ అని విన్నాను. ఇదిగో ఇవి గంగాజలాలు."

"ఇదెలా సాధ్యమైంది!" ఆశ్చర్యానందోత్కళిత హృదయులయ్యారు ప్రధాన స్థపతి.

"ఒక్క గంటకాలం జలాల్ని పరీక్షించాల్సి వుంది కానీ, ఆ జల స్వభావం అప్పుడే తెలిసిపోయింది. ఈ అన్నపుముద్ద రంగు మారదు....ఇక అన్నపుముద్ద మెత్తపడదు. కాబట్టి ఇది గంగోదకమే" ఖచ్చితంగా చెప్పారు సౌరాఖ్యుడు.

"గంట వ్యవధిలో అన్నం మెత్తబడి రంగు మారితే!" అంత విజ్ఞానఖనీ పసిబాలుడిలా ప్రశ్నించాడు.

"అది విప్పందేహంగా సముద్రోదకమే"

"ఇది ఏ శాస్త్రాల్లో చూసి సంపాదించావు చిరంజీవీ! నీ శాస్త్రపరిజ్ఞానానికి చేతులు జోడిస్తున్నాను" ఆనందబాష్పాలు రాలుతుండగా ఆయన సౌరాఖ్యునికి నమస్కరించారు.

"ఆచార్యా! మీరు అన్నిటా పెద్దవారు. మా నాన్నగారు మీ అభినందనకు అర్హులు. ఆయన ఒకసారి ఆశ్వయుజ మాసంలో వర్షం పడుతున్నపుడు ఈ ప్రయోగం చేసి చూపారు."

"ఆశ్వయుజంలో ఎండ కాస్తున్నపుడు పడే వర్షంలోనే ఈ ప్రయోగం చేయాలా?" ఆయన కంఠంలో ఆశ్చర్యం పీర మీరుతోంది.

"ఆశ్వయుజ మాసంలో పడే వానలో ఈ ప్రయోగం చేయవచ్చు. లేదా ఎండ కాస్తున్నపుడు పడే వానలోనూ ఈ ప్రయోగం చేయవచ్చు. రెండవ దానికి మాస నియమం లేదు."

"ఈ జలాల్ని ఎందులో పోసిపెట్టుకోవాలి?"

"వెండి లేదా బంగారు పాత్రికలో.... ఎంతకాలానికైనా ఈ జలం చెడిపోదు. స్వచ్ఛంగా, రుచిగా వుంటుంది."

"నాయనా! ఇంతకాలం నేను ఉషఃకాలంలో తీర్థాలనుంచి సంగ్రహించే జలాలు ఆకాశగంగతో తుల్యాలు అని శాస్త్రాలు చెప్పడం వల్ల ఆ హంసోదకాలతో స్వామిని అభిషేకించేవాణ్ణి. ఇప్పుడు నీ పరిచయంతో ఆకాశగంగను తాకే భాగ్యం అబ్బింది...." వెండి పళ్ళెంలోని ఆ జలాల్ని దోసిటి నిండుగా నింపుకుని ఆస్వాదించారు. ముఖం తుడుచుకున్నారు. శిరస్సుపై చల్లుకున్నారు. ప్రధాన స్థపతి శరీరం పులకరించింది. పుణ్యభావ పునీతమైన మనస్సులో ఏదో దివ్యానుభూతి తొలకరించింది. ఆయన అరమోడ్పు కళ్ళతో అనుభూతిస్తూ ధ్యానస్థితుడయ్యాడు.

హంసోదకాలు గుండె నిండుగా గలగలా పారినట్లు అనుభూతిస్తూ సౌరాఖ్యుడు ఆ జలాల్ని స్మరించుకున్నాడు:

దివార్క కిరణైర్జుష్టం నిశాయా మిందు రశ్మిభిః
అరూక్ష మనభిష్యంది తత్తుల్యం గగనాంబునా

భూమిమీద వున్న పవిత్ర జలాల్ని పూజార్థం ప్రత్యూష కాలంలోనే సంగ్రహించాలి. ఆ నీరు మలిన రహితమై, స్వచ్ఛ శీతలమై వుంటుంది. పగలు సూర్యరశ్మితో వేడెక్కి రాత్రి చంద్ర కిరణాలతో శీతలీకరణం చెందిన పవిత్ర జలాలు ఉషోదయ అరుణ కాంతుల్లో పరమ పవిత్రంగా వుంటాయి. ఇలాంటి ఉషఃకాల జలాల్ని హంసోదకాలంటారు.

సౌరాఖ్యుని హృదయహంస హంసోదకాలలో కాసేపు ఈదులాడింది రెక్కలార్చుకుని సేదదేరింది. కోల కన్నుల వాలు చూపులేవో గండు మీనల్లా తళతళలాడితే వాటి వెంటబడి వూసులాడింది. తలపుల అలల మీద ముత్యాల్లా తళతళలాడుతున్న అరవిరి చిరునవ్వుల్ని నోట కరచుకోవాలని నీటిలో మునకలేసింది. క్షీర నీర సమ్మిళితంగా సాగవస్తున్న కామ ప్రేమ మయ ప్రణయ భాండంలోకి సందుపుటాలందుతున్న దివ్య విహంగంలా

అతని మనస్సు తటతటలాడసాగింది. హంస పక్షాల మీద నిలిచిన నీటి కణాలమీద పడుతున్న కిరణ కిమ్మీర వర్ణ కీలలేవో ఎదపూలలోయల్లోకి ప్రవహిస్తూన్న అనుభూతితో గురువర్యుని వద్ద మౌనంగా సెలవు తీసుకుని వెంకి నడిచాడు సౌరాఖ్యుడు.



# 7

కృష్ణుని మురళి నుంచి సామవేదం జాలువారేలా శిల్పాలనుంచి కళలు తొణికిసలాడుతాయి. మనిషిది ఆత్మ మూలపదార్థం మీద నిర్మిత మైన మాంసల శరీరం. ఇది సత్యాన్ని పునాదిగా చేసుకున్న అసత్య నిర్మితి. ప్రతి సత్యానికి అసత్యం ఆత్మ రక్షణ కవచంగా వుంటుంది. భగవంతుని మార్మిక నాటకానికి ఇదే నాంది. దినమనే నాణానికి పగలు బొమ్మ - రాత్రి బొరుసు. అంతరంగంలో ఆశ ఒక వైష్ణవ మాయ. ఆత్మ ఒక పరిమళించే సాదరస బిందువు. శిల్పి ప్రాణరస బిందువుకు ఆత్మ బంధువు. శిలలు తాళ పత్రాలు. శిల్పి చిత్రకవి. ఉలి కలంతో అతను నవరస కావ్యశిల్పాన్ని చెక్కే ప్రబంధ పరమేశ్వరుడు. శిల్పి యదార్థవాది. ఋగ్వేదపు ఋక్కులు కూడా జీవితం ముందు ఒక్కొక్కప్పుడు చెల్లని రూకలవుతాయి.

పరమాత్మ ముద్దుటుంగరం మార్చాడు. అతను ప్రాపంచిక కార్యాలయానికి తాళం వేసి మలిసంధ్య లత్తుక మీద తన ఉంగరపు ముద్ర వద్ది పోతాడు. జ్వాలికల పారదర్శకపు తెరమాటున కళ పదహారు కళల బింబం. నక్షత్రాల బృంద నృత్యంలో చంద్రుడు గోవిందుడు.

నగం నిజం నగం స్వప్నం అదే జీవితం
నగం శిల నగం కళ అదే శిల్పం

తన నిర్వచనానికి నవ్వుకున్నాడు శిలాచార్యుడు.

"శిల్పిగారూ" శింజినీ సవ్వడిలా మంజులంగా పిలిచింది.

"రండి...ఏమిటి విషయం?"

"సాయంత్రం మనం బయల్దేరవలసిన సమయం తెలుసుకుందామని వచ్చాను."

"ఎక్కడికి?!" కాస్త ఆశ్చర్యంగానే అన్నాడు.

"పెళ్ళి చూపులకి" విచిత్రంగా చూసి వెక్కిరింపుగా అంది.

"పెళ్ళి చూపులకా..."మరింత తెల్లబోయాడు.

"అవునండి.... శ్రావణ పూర్ణిమ రోజున శిలాసంగ్రహణం చేయాలని అన్నారు మొన్న - అప్పుడే మరచిపోయారా?"

"ఈ రోజేనా శ్రావణ పౌర్ణమి? నేనేదో ధ్యాసలో...."

"అంతేగా మరి....ఏ శిల్పసుందరి అంగ భంగిమల్లోనో అదమరచి వుంటుంది మీ మనస్సు." ఓరగా నవ్వింది.

అసలు ప్రవాళలోని వినూత్న వ్యక్తిత్వం అతనికి చిత్రంగా అనిపిస్తుంది. ఆమెకు శిల్పకళ అంటే ప్రాణం. విగ్రహాలంటే ఎంతో ఇష్టం. దేవుడంటేనే పెద్దగా శ్రద్ధ చూపదు. ఆమెలో కావలసినంత మానవత్వం వుంది. అంతకు మించిన వ్యక్తిత్వం వుంది. ఈ రెంటినీ అతిశయించే కళాదృష్టి వుంది. తృష్ణ వుంది. ఏవేవో వున్నాయామెలో ఇంకేవో లేవు. ఉన్నవే ఎక్కువనిపిస్తుంది లేనివి ఆమెకు లేమిని ఆపాదించలేకపోతున్నాయి. చివరకామె దేవుడు లేడు బొమ్మని నవ్వుతుంది. ఆ నవ్వులో దేవుడి దరహాసం కనిపిస్తుంది. శిల్పిగారూ! నేను నాస్తికురాల్ని అని నాజూగ్గా హొయలు పోతుంది. కాని ఆమె ఆలయ శిల్పకళకు ఆస్థానమండపంలా వుంటుంది. మీరు శిల్పించే విగ్రహాల్లో కళను చూస్తాను గాని మీ దేవుణ్ణి కళ్ళప్పగించుకుని చూస్తాననుకోకండి అని పొడవాటి జడను దురుసుగా వెనుకకు వేసుకుని ఠీవిగా చూస్తుంది. అదేమిటో గాని ఆమెలో దివ్యత్వం ఆపాదమస్తకం కనిపిస్తుంది. సౌరాఖ్యానికే అంతు బట్టని అమృత సౌందర్యం ఆమెలో నవమయూరిలా పింఛం విప్పుతుంటూ వుంటుంది. ఆమె దేవుడే లేడన్నా అదేదో అర్థాన్ని వదలిన మధుర కూజితంలా వుంటుంది కాని మరోలా అనిపించదు. మరికొందరు కట్టు

బొట్టు జుట్టు అన్నిటా అపరభక్తుల్లా కనిపిస్తారు కానీ వాళ్ళు భయానికో, సంప్రదాయానికో కట్టుబడినట్టుంటారు. కానీ నిజంగా వాళ్ళు చేస్తున్న పూజలు త్రికరణశుద్ధిగా విశ్వసించి చేస్తున్నట్లుండవు.

"ఏమండోయ్ శిల్పిగారూ! ఏ లోయల్లో కెళ్ళిపోయారు."

"అబ్బే—అదేంలేదు. మిమ్మల్ని చూస్తూ....మీరు అడగాలే కానీ వెన్నెలవేళ కొండల్లో, కోనల్లో అదే....మీరన్నట్టు పెళ్ళిచూపులకు ఎంత ఆహ్లాదంగా వుంటుందో!!" ఆకాశానికేసి చూశారు సౌరాఖ్యుడు. నిర్మలంగా వుంది గగనం.

"సరే భోజనం చేసి సిద్ధంగా వుండండి."

"నేను భోజనం చెయ్యనీ పూట."

"ఎందుకని?"

"పెళ్ళిచూపులకు నేనలాగే వెళుతుంటాను."

"అలాగా!"

"అతను నవ్వుతూ చెప్పినా శిల్పి పరిశీలించడంలో అతనికున్న ఆరాధన ఆమెకు అర్థమైంది.

◆ ◆ ◆

ఆ అరణ్య భూముల్లో వెన్నెల వెల్లువలెత్తుతోంది. వృక్షాదుబ్బులు వెన్నెలవాగులో పడి కేలియాడుతున్నట్లు కనిపిస్తున్నాయి. పంజరాల్లో బందీ లైన పెంపుడు పక్షుల్లా దట్టమైన పొదల్లో దాగి చిరుకూజితాలు చేస్తున్నాయి పికిలిపిట్టలు.

విశాల మైదానంలో గుర్రపుబండి సాగిపోతున్న సవ్వడికి ప్రకృతి నిద్ర చెడి బద్ధకంగా పక్కకు వొత్తిగిలి తిరిగిమత్తుగా నిద్రపోతున్నట్టుంది. ధాటికి అడ్డు తగిలిన కొండవాగుల్లో గుంపులు కట్టి మూగగా సాగిపోతు న్నాయి చిరుచేపలు. గుర్రం నడకతో కలగుండువడిన ఏటివాగులోని మీనాలు చెల్లాచెదరై బిత్తరి పరుగులు తీస్తున్నాయి.—

వెన్నెల పడుతున్న బండివాడి చేతి కండలవేపు చూస్తున్నాడు సౌరాఖ్యుడు—కష్టించే కాయం శిల్ప పరిమాణాలకు దగ్గరగా వుందను కుంటూ —ప్రవాళవేపు చూశాడతను.

"ఈరోజు భోజనం చెయ్యరు -- మాట్లాడరు కూడానా? కాస్త పిల్చండి ఈ కొండగాలిన్ని" ఆమె చిలిపి చూపులు గండుమీనాల్లా తళుక్కుమన్నాయి.

"కొండగాలా? అది మీరున్న చోటికి రాదుగా—" అతని చిరుహాసం ఆమెకు సమ్మోహన మంత్రంలా అనిపించింది.

"ఎందుకో" కుతూహలంగా అంది.

"ఎప్పుడూ మీ చుట్టూ చుట్టుకుని వుండే నాగరక పరిచారికలాంటి పరిమళాలకు జడిసి."

ఆమె నవ్వింది కానీ అతను ప్రశంసిస్తున్నాడా, విమర్శిస్తున్నాడా అర్థం కాలేదు.

"ఈ అత్తరు వాసనలు మీకు పరిపడవా?"

"అవి మీనుంచి ప్రసరిస్తాయి కాబట్టి ఇష్టమే."

"అమ్మగారూ! కుదుపులు వస్తాయి గట్టిగా పట్టుకోండి" గుర్రపు పగ్గాలు బిగపడుతూ అన్నాడు బండివాడు.

బండి సాగిపోతోంది. దూరంగా చిరుదివ్వెలేవో వెలుగు తున్నట్లున్నాయి. కుందేళ్ళు, నక్కలు దారిప్రక్కన అటూఇటూ తిరుగాడు తున్నాయి. ప్రకృతి ప్రాణులకు వెన్నెలరాత్రి ఆటవిడుపుగా వున్న సందడి ఆ అరణ్యంలో చోటుచేసుకుంటూంది.

ఆమె వుండి వుండీ సౌరాఖ్యునికేసి తదేకంగా చూస్తూంది. అతను ఆమె టివికిలోని అనుభూతికి స్పందిస్తున్నాడు. ఆమె కనురెప్పల కాటుకరేఖ నికుంజాల వెనుక వెన్నెల కాంతిపుంజాలు! ఆమె కనురెప్పలు

కాటుక పిట్టల రెపరెపల్లా వున్నాయి. ఆమె చూపులు భరద్వాజ పక్షుల కూజితాల్లా వున్నాయి. స్వర్గ మధురిమ లేవో మంచుకూటాలనుంచి ఒలికినట్టు, చంద్రకాంతలు పూచిన కోనలో స్వర్ణకాంతులు చిలికినట్లు ఆమె చూస్తూంది. పూలకొమ్మల మాటునుంచి మంచుకొండలు లీలగా కనిపిస్తున్నట్టు పారదర్శకాల్లా వున్న ఆ కనురెప్పల వెనుక పారవశ్యపు కాంతి సాగరాలు కదలాడుతున్నట్లు ఆమె చూస్తూంది. మౌనంగా అతను అసాధారణ సౌందర్య సీమలను అందుకున్నాడన్న నమ్మకం ఆమెకు ఏర్పడింది.

"మీరు ఎక్కడో ఏవో దర్శిస్తున్నట్టున్నారు. మాకూ ఆ దృశ్యాలు వివరించకూడదా?" చనువుగా నిలదీసింది ప్రవాళ.

"అవన్నీ ఉన్మాదంగా అనిపిస్తాయి."

"ఆ ఉన్మాదమే మనిషి అందుకోవలసిన అంతిమ శిఖరం అనుకుంటాను" ఆమె స్వరం విందుగా పలికింది.

"గంధర్వ కామినులు విహరించే గంధమాదన పర్వత సానువుల్లోని సువర్ణ క్షేత్రాలు! అక్కడి నీలివెన్నెల రాత్రుల్లో గాత్రాలు సవరించుకునే గాయకుల గాన గంధాలు! అక్కడ తిరుగాడుతున్న జ్యోత్స్నాభిసారికల కను రెప్పలకు తగిలే గుబురుచెట్ల కారుచీకట్లు! ఆ ప్రణయ తీరాల్లో ధూమశిఖరాల్లాంటి మేఘాలు! సప్తవర్ణాల కిరణాల రామచిలుకలు చంద్రశిలల్ని పొదుగుతూ రంగురెక్కల్ని విప్పి విదిలించే తీపిరాగాలు!" ఆపి ఆమె ముఖ కవళికల్ని చూశాడు.

"ఆపకండి....మీరు అలా మాట్లాడుతుంటే ఎదలోపల ఎక్కడో పూడుకుపోయిన వెలుతురు బావుల కప్పులేవో విప్పుకున్నట్టు వుంది. మీరు మాట్లాడడం మానేస్తే ఊపిరాడడం లేదు."

"ఏమయ్యా ఎక్కడ వెళుతున్నామిప్పుడు?" బండివాణ్ణి అడిగాడు సౌదామ్యుడు.

"మీరు చెప్పిన నాపరాతి గుట్టలకింకా కొద్దిదూరం వుంది బాబు" గుర్రాన్ని అదిలించాడతను. బండి కాస్త వేగం పుంజుకుంది. దాని చక్ర నేమి తగిలి రాళ్ళలో విస్ఫురద్వలెగురుతున్నాయి.

"మాట్లాడండి _ దయచేసి మౌనంగా వుండొద్దు. నా ఆత్మకు ఏవో పురాతన స్మృతుల పరిమళాలు అందుతున్నాయి" ఆమె కళ్ళు ఆర్తిగా చూస్తున్నాయి. అతను మందహాసం చేశాడు.

"ఆదిమ అగ్నుల నుంచి ఉదయించిన ఓ తేజస్సు కళల ఏరువాకగా పాగి కళాకారుల హృదయాలకు ప్రస్థావించింది. కళాకారుడు హృదయాన్ని దిమ్మరించుకున్నచోట భగవంతుడు మృదులంగ తన పాదాన్ని అద్దుతాడు. పరమాత్మ నుంచి ప్రభవించిన జీవాత్మ మాయతెరల మరుగునపడి కళ కోసం విలవిల కొట్టుకుంటుంది. మీది కళాహృదయం. అందుకే అంతగా చలించిపోతున్నారు. కళ జీవుడికీ దేవుడికీ మధ్య రాయబారి.

కారుమబ్బుల దారిలో ఆడుకునే సౌదామని కామిని నువ్వు. దేగకళ్ళ రాగతన మేదో నీ కదలికలో కవిపిస్తూంది. చనువుగా అన్నాడు.

"నజల సరోవర ఆవరణంలో ఈదులాడే కొండగాలి కొదమలా చల్లగా వుంది మీ ఉనికి. మీ దృక్కులు వేదఋక్కుల్లా పునీతంగా వున్నాయి. మీ పాదం మంత్ర పుష్పంలా అడుగుపెట్టిన చోట అభయ ప్రదంగా వుంటుంది. మీరు ఎక్కడో గతజన్మల జలాశయాల్లో కాలమీనం మ్రింగేసిన నా ముద్దు టుంగరంలా మనస్సును ఆకరిస్తున్నారు. ఏవో స్మృతుల పూల తుపాములు రేగుతున్నాయి నాలో. ఈ స్పందనానందాన్ని నా గుండె తట్టుకోలేక పోతోంది" ఏదో వెతుకుతున్నట్లుగా ఆమె చూపులు అతని కళ్ళలోకి చొరబడుతున్నాయి. ఆమె కనుపాపలు వేగంగా కదులు తున్నాయి.

సౌహాఖ్యాడి గుండె వేగంగా హెచ్చింది. ఇది ఎక్కడికి దారితీస్తుందో తెలియని కలవరం అతన్ని ఆవరించింది. ఆమె సమక్షంలో ఎక్కడో తన ఎదమైదానంలో గతజన్మ స్మృతి ఒక చంద్రబింబంలా ఉదయిస్తూన్న ఉద్వేగం కుదుపుతూందతన్ని. చల్లగాలి బడలికను తొలగించేలా రివ్వుమని వీస్తూంది. మలివందెలో విద్రించిన ప్రకృతి కంటున్న అందమైన కలలా వుందా వెన్నెలరాత్రి. తమ కళ్ళముందే తాము మరుజన్మ ఎత్తినంత వింతగానూ ఉత్తేజంగానూ వుంది వాళ్ళకు. "మీరు చెప్పిన చోటుకు చేరుతున్నాం బాబూ" బండివాడు గుర్రాన్ని ఆపి బండి దిగాడు.

అత్తవారింట్లో అడుగుపెడుతున్న కొత్త పెళ్ళికూతురిలా ఆ అరణ్య ప్రాంతాన్ని తరచి తరచి చూసింది ప్రవాళ. సూర్యబింబాన్ని చలువ అద్దాల బరిణలో వేసినట్టు శీతలంగా వుందా వెన్నెల కాంతి. ఆ వెలుగులో గరిక పూలు కూడా స్పష్టంగా కనిపిస్తున్నాయి. కొండలోయలవేపు బండివాడు వాళ్ళకి ముందుగా దారితీశాడు.

"ప్రవాళా! చూడూ....ఇది నల్లరాయి" మట్టిని చేత్తో తొలగించి ఆ రాతిని కదిపిలేపాడు సౌరాఖ్యుడు.

"ఏదీ...." అపురూపంగా చేతికి తీసుకుని చూస్తూంది ప్రవాళ. వెన్నెల వెలుగులో ఆమె ముఖం కళలు చిందుతోంది. గాలి వీచి రెపరెప లాడే పైటతో ఆమె దివినుంచి దిగుతున్న దేవకాంతలా వుంది.

"ఈ నల్లరాయి తెలుపు, పసుపు, ముదురు పసుపు, ముదురు నలుపు, లేత ఎరుపు—ఇన్ని రంగుల్లో వుంటుంది. ఇది లేత ఎరుపులోని రాయి. ఆడపిల్ల అధరంలా రాగరంజితంగా వుంటుందిది" ఆమె బుగ్గలు రంగు లేలాయి.

"ఇది ముదురు పసుపురాయి" అంటూ పసిమి కురుస్తున్న ఆమె చెంపలవేపు చూశాడు. ఓ నాలుగడుగులు నడిచి ఓ రాతిని తీసుకుని ఆమెకు చూపాడు.

"ఈ రాతిని చూశారా లేత ఎరుపుది. ప్రస్తుతం మీ కళ్ళరంగులో వుంది" అతని గాంభీర్యంలో నుంచి తొంగిచూస్తున్న ఈ చిలిపితనం ఆమెకు మత్తుగా, ఆహ్లాదంగా వుంది.

"అయితే రాళ్ళ రంగులన్నీ నాలో వున్నాయన్నమాట. నేనో రాతి బండననా మీ ఉద్దేశం?" మెత్తగా మాటల్ని మీటింది.

"అలాకాదు — ఇవరాళ్ళ అందాల్ని ఈ రాళ్ళు అరువు తెచ్చుకున్నాయని చెప్పడమే నా ఉద్దేశం" ఆ రాళ్ళను జారవిడుస్తూ నవ్వారు.

"ఈ రాళ్ళు నాకు కావాలి...." వాటిని ఏరుకుని జాగ్రత్తగా బండి వాడికిచ్చింది.

"ఇక ముందు ముందు పెద్దరాళ్ళను పరిచయం చేయబోతున్నాను, వాటిని ఆ బండిదాకా తెచ్చిపెట్టమని నా నెత్తిన పెట్టేటట్టున్నారు మీరు."

కొండలు చిరుప్రతిధ్వనించేలా గలగలా నవ్వింది ఆమె.

"ఈ రాళ్ళ మీద కణాలు రకరకాలుగా వున్నాయే మరి" అప్పుడే వాటిని సునిశితంగా పరిశీలిస్తూంది.

"చిన్నచిన్న కణాలుండే రాతిని ఛేదించడం కష్టం. ఇవి విగ్రహాలు చేయడానికి పనికిరాదు"

ఇంకాస్త ముందుకు నడిచారు వాళ్ళు.

"ఇలా మధ్యరకమైన కణాలున్న రాళ్ళు శిల్పించేటప్పుడు ఉలికి ఒదుగుతాయి. విగ్రహం సౌష్ఠవంగా తయారవుతుంది."

"మధ్యే మార్గం సర్వత్రా ఉత్తమంగా వుండేటట్లుంది."

"అందుకేగా పెద్దలు - అతి సర్వత్ర వర్జయేత్ - అన్నారు. ఇలాంటి రాళ్ళు ఒక చదరపు అడుగురాయి 800 టన్నుల నుంచి 1200 టన్నుల బరువును నగిలిపోకుండా భరించగలదు."

"ఆ ప్రయోగాలు కూడా చేశారన్నమాట శిల్పులు."

"లేకపోతే పెను శిఖరాల్లాంటి గోపురాల బరువును, మండపాల భారాన్ని ఏ ఏ రాళ్ళు తట్టుకుని శతాబ్దాల కొద్దీ నిలబడగలవో ఎలా తెలుస్తుంది!"

"మీ రన్నట్టు రాతికీ, నాతికీ దగ్గరి పోలికలే వున్నట్టున్నాయి."

"స్త్రీ ప్రకృతికి ప్రతిరూపం. అది నా ప్రగాఢ విశ్వాసం."

"అయితే ప్రకృతి ఎప్పుడూ ఆహ్లాదాన్నే ఇవ్వదు కదా!"

"మరి స్త్రీ మాత్రం!"

"అంతేనంటారా?"

"అక్షరాలా" ఇంకాస్త ఒత్తి పలికాడు.

"అమ్మగారూ! ఆ పిట్టలు చూడండి మీకు దగ్గరగా వస్తున్నాయి." ఆమెకు పక్షులంటే ఇష్టమని తెలిసిన బండివాడు వాళ్ళకు దగ్గరగా వచ్చి ఆగి చూస్తున్న అందమైన పక్షుల్ని చూపాడామెకు.

"అవి దొరుకుతాయా నీకు?" వాటిమీది మక్కువకొద్దీ అమాయకంగా అడిగింది.

"దగ్గరున్నంత మాత్రాన దొరికిపోతాయా?" అంటూ సౌరాఖ్యుడు అందంగా ఆమెవేపు చూశాడు.

"ప్రయత్నిస్తే తప్పేముంది?" గోముగా అంది.

"ఆశాభంగం అశాంతినిస్తుంది."

"ఆశ ఫలిస్తే!"

అతను సమాధానం చెప్పకుండా నవ్వి పూరుకున్నాడు. ఆ పక్షుల కూతలు పరిసరాల్లో మారుమ్రోగుతున్నాయి.

"ఈ రాళ్ళు ముఖ్యంగా ఐదు రకాలుగా వుంటాయి" వివరాన్ని రాళ్ళమీదకు మళ్ళించాడు సౌరాఖ్యుడు.

"అబ్బ! నేను ఈ రాళ్ళనే పరిచయం చేసుకోవాలని వచ్చానను కున్నారా?' తెచ్చిపెట్టుకున్న విసుగును ప్రదర్శించింది.

"ఇవి రాళ్ళు కావు."

"మరి?"

"మూగవోయిన మునులు" అతని గొంతులోని ఆరాధన ధ్వని ఆమె గుర్తించింది

"చెప్పండి చెప్పండి. రాళ్ళు ఎన్ని రకాలు?"

"సున్నపురాయి, పాలరాయి, ఇసుకరాయి, నాపరాయి, నల్ల రాయి—" వింటూందా లేదా అని పరిశీలనగా చూశాడు.

"రాళ్ళు ఇన్ని రకాలుగా ఎలా ఏర్పడ్తాయంటారు?" శ్రద్ధగానే అడిగింది.

"అగ్నిపర్వతాలు లావాలు చల్లారిన తర్వాత వాటివాటి అంతరాల్ని బట్టి ఇలాంటి రాళ్ళు ఏర్పడతాయి. ఇసుక, బంకమట్టి, సున్నం కలిసి ఎక్కువ కాలం తడిగా వుండి కాలక్రమేణ గట్టిపడిపోయి సున్నపురాయి తయారవుతుంది. ఈ సున్నపురాయే భూమికి ఎక్కువ లోతులో వుండి భూమి ఉష్ణోగ్రతకు, భూమి బరువుకు చలవరాయిగా మారుతుంది. అదే పాలరాయన్నమాట. ఇది నల్లగా, ఆకుపచ్చగా, ఎర్రగా, బూడిద వర్ణంగా ఆయా ప్రాంతాల్ని బట్టి వాటి రంగు మారుతుంది. ఇది విగ్రహాలకు, ఆలయాలకు పెద్దగా పనికిరాదు. దీనికో గోపురాలు కట్టినా అద్దేకాలం నిలువవు. పాలరాతి విగ్రహాలు భక్తులు కొట్టే కొబ్బరికాయల్ని చూస్తే భయపడి పోతాయి."

"ఎందుకు?" ఆదుర్దాగా అడిగింది.

"ఆ కొబ్బరినీళ్ళు పడితే దేవతా విగ్రహాలు పొంగి రాక్షసవిగ్రహాల్లా వికారంగా తయారవుతాయి. మన దేశంలో విగ్రహాలకు పనికి వచ్చే పాలరాయి మృగ్యమనే చెప్పాలి.

ఇక ఇసుకరాయి విషయం—ఇసుకా, బంకమట్టీ, ఇసుకరవ్వలూ మన్నపు రవ్వలూ కలిసి నెమ్మదిగా ఈ రాయి ఏర్పడుతుంది. పై వాటిలో దేని శాతం ఎక్కువ కలిస్తే దాని రంగులో వుంటుంది రాయి. ఈ రాతితో కట్టిన కట్టడాలు త్వరగా పాడవుతాయి.

ఇసుక, బంకమట్టి, కొంత గంధకం కూడా కలిసి నాపరాయి రూపు దిద్దుకుంటుంది. ఇది తేలికగా, గట్టిగా వుంటుంది.

పట్టుశిల, స్ఫటికం, ఇనుము ధాతువులతో నల్లరాయి ఏర్పడుతుంది. దీన్ని రాతినార అంటారు. బూడిద రంగు, పసుపు రంగు, ఎరుపు, పచ్చరంగుల్లో వుంటుంది. దీనిలోనే కట్టడాలకు కావలసిన చూర్ణాలు, పరిమళ చూర్ణాలు తయారుచేస్తారు. ఇక శిలల్ని సేకరించే పద్ధతుల్ని గురించి తెలియజెయ్యమంటారా?" ఉపాధ్యాయుడిలా ప్రశ్నించారు

"ఇలా ఆ సెలయేటి రాతిపలకమీద కూర్చుని మీరేదైనా మాట్లాడండి. తర్వాత ఆ రాళ్ళ విషయాలు శ్రద్ధగా వింటాను" సుకుమారంగా చూపింది. అతను గురుస్థానీయుడై పోవడం ఆమెకు అసహనాన్ని కలిగిస్తోంది.

"అమ్మగారూ నేనా రాతిబండమీద పడుకుంటాను ఎన్నాళ్లో" అంటూ బండివాడు సెలవు తీసుకున్నాడు.

"నాకు రాళ్లూ రప్పలు తప్ప ఏమీ తెలియదు" ఆమెను అంతసేపు నిలబెట్టి మాట్లాడినందుకు నొచ్చుకున్నాడు.

"మీకు తెలిసింది చెప్పండి. రాళ్ళ గురించైనా మీరు మాట్లాడితే రత్నాల గురించి చెబుతున్నట్టుంటుంది." స్త్రీ సహజమైన సున్నిత భావమేదో ఆ మాటలో అతనికి వ్యక్తమైంది.

"ఇలా తలంలో శిలా ప్రపంచానికొక ప్రత్యేక పరిమళముంది. కనురెప్పల క్రింద కళాత్మక కలను దాచుకున్న రమణీయ కళావిభావరి ఈ

శిలాజగత్తు. శిల్పోదయం దానికి చంద్రోదయం. కళా తపస్సులో శిల్పి శ్వాసను పరచి శిలలా మారినపుడే శిలనుంచి శిల్పం జనిస్తుంది. కళ్ళలో పీల్లాడుతున్న గర్భిణులు శిలలు. ఘనీభవించిన కలలు శిలలు ద్రవీభవించని రాతిగుండెలు శిలలు.

శిల్పి దృష్టి ఈముడి శిలల ముడుల మాటున దాగిన కన్నీటి తడిని తడమాలి. కళామతల్లి కొంగునందుకోబోయి జారిపడిన పతిత ప్రాణులు శిలలు. కళల కడకొంగుగాలి వీస్తూనే వికసించాలని చూస్తున్న కొండమల్లె మొగ్గలు శిలలు" ఒక అవ్యక్త భావనతో ఆ యువశిల్పి గొంతు మూగ వోయింది. ప్రవాళ కళ్ళలోకి చూశాడు. వెన్నెలచెమ్మ కనుకొనల్లో బిందువులు కట్టినట్టు కూర్చుందామె. అతనిలోని క్రొత్తవ్యక్తిని చూస్తున్న బిడియమేదో ఆమె ముఖంలో కదలాడుతూంది.

"ఇదంతా శిల్పశాస్త్రమే చెప్పిందా?" తనకు తెలిసినా తెలుసుకోవాలనే కుతూహలం ఆ మాటలో వుంది.

"శాస్త్రం శాసిస్తుంది. ఇలా పలవరించదు. ఇది నాలోని శిల్పి కలవరింత, అంతే" వెన్నెలలో మోరలెత్తుకుని నెమరు వేసుకుంటూ కూర్చున్న పందుల మందలా వున్న దూరపు పర్వతాలకేసి లీలగా చూస్తున్నాడు సౌరాఖ్యుడు.

"ఇది అసలైన శిల్పశాస్త్రం. చెప్పండి— మీ భావచిత్రాలే శిల్పాలు. దయచేసి ఇంకో రెండు మాటలు" వేణుగాన లోలుపతకు ఇంద్రియాలు వశంతప్పి పరవశంతో ప్రాధేయపడుతున్న రాధిక ఆమెలో కనిపించింది. అతను గోపాలుడిలా శిలాగానం చేస్తున్నాడు.

"శిల్ప కన్యకలు వేసుకున్న మేలిముసుగుల్లా కొన్ని శిలలు దర్శన మిస్తాయి నాకు. మేలిముసుగుల సిగ్గుతెరలలో స్వర్ణవర్ణ యౌవన భూములు!

ఈ స్వాప్నిక జలతారు లోపలి తారకల్లా అవయవాల అందాలు శిల్పకళా ప్రవాహంలో కొట్టుకుని రావడానికి ఎదురుచూస్తున్న అమృతకలశాలు.

శిల్పి మానవాతీత స్థితిని చేరితే తప్ప శిల్పంలోని ఉజ్జ్వల ప్రతిభను స్పృశించలేడు. శిల్పులందరూ శిలమీదపడి జీవితాలను పణంగా పెట్టినవారే. దివ్యలోకాల్లో మెరిసే అమృత కళల కొనమెరుపుల్ని విరుపుల్ని సంగ్రహించుకోవాలని తపనపడేవారే వారందరూ!

ఈ శిఖరాలమీది గండశిలల శిలనుంచి ప్రణయ స్వప్నాలు రంగులుగా మారి గగన సీమల్లోకి ఎగిసిపోతున్నట్టున్న ఆ పాలపిట్టలు చూడండి. వినీల ఆకాశాలు వాటిని అపురూప అతిథుల్లా ఆహ్వానించడం లేదూ! ఈ గండశిలలకు, గగనాలకు మధ్య వర్తమానాలు అందిస్తూ విహరిస్తున్న రాయబారుల్లా లేదూ ఈ పక్షి సమూహం!

మడి శిలలు ఏవీ బంధాలు సడలని శిల్ప రహస్య గుహ్య స్థానాల్లా ఎంత భద్రంగానో భాసిస్తున్నాయి. ఈ పెను శిలలు ప్రేమికుల్లా ఏకాంతంగా కూర్చుని ఒకదాన్నొకటి చూసుకుంటూ ఈదురు గాలులతో వూసులాడుకుంటున్నట్టున్నాయి కదూ!

ఉలుల అడుగుల సవ్వడి తమ ఎదల ముంగిట గలంగలించాలని ఎదురుచూస్తున్న నిశ్చల విరహ తపస్వినులు శిలలు. పరమేశ్వరుని పరిష్వంగం నుంచి జారిపడిన దివ్య దీధితిని తమ ఎదలో బందీలుగా చేసుకున్న అంధకార రసమయ రూపాలు శిలలు. వాటిని ఉలి రాపాడినప్పుడే చదవడానికి వీలుకాని స్వర్ణమయ వీలునామాలు నామరూపాలతో బయట పడతాయి. కాంతులీనే కళలు తమ ప్రణయ కాలంలో లిఖించిపోయిన వెన్నెల జాబిల్ని భుజాలమీద విలాసంగా కప్పుకుని ఒత్తుకునే తమ యౌవన సంపత్తిని గుదిగుచ్చి పట్టుకుని కూర్చున్నాయి ఈ శిలలు. ఈ కామినీ భామినీ కమనీయ రమణీయ సుస్మిత శిలలు విచ్చుకున్న ప్రత్తి పూలు హత్తుకున్న ఒంటిరంగుల వలలు.

మౌనంగా ఘోషించే శిలావేదమే శిల్పం. శిల్పి బ్రహ్మ. శిలాతలం యజ్ఞవేదిక. శిల్పం యజ్ఞ పురుషు డందించిన అమృత కలశం. ఎంత మలచినా అందకుండా నిలిచిపోయే రూపకల్పన శిల్పం. శిల్పి మరణతల్పం దాకా శిలతో తలపడుతూనే వుంటాడు. శిల్పికీ శిలకీ ఉలి కళా ప్రవాహిక. అతను శిల్పంలోకి తన ప్రాణాన్ని ధ్యానాన్ని ప్రవహింపజేసేది దానితోనే! యౌవనాల మార్మిక భూమికల్లోని మణుషుల్ని ఉలి ఖండిస్తున్నపుడు ఎగసే శృంగార బంగారు బాష్పాలే నిప్పురవ్వలు.

మండుతున్న వెన్నెల మండలాల్ని మార్మిక కందరాల్లో నిక్షేపించుకున్న శిలలు ఉలులు పెట్టే కళా ప్రలోభాలకు లొంగి తమ జటిల జలతారు పరదాల్ని జారవిడుస్తాయి. కళకు దాసోహమన్న శిల శిల్పిని ప్రేమిస్తుంది ఉలితో చెలిమి చేస్తుంది. తన యౌవనాల కోణాల్లోని వింత గిలిగింతల్ని, పులకింతల్ని ఉలిముందు దోయిలిస్తుంది. శిల తన కఠిన ఎదలోని కారు జ్యాల్ని శిల్పి పాదాలముందు జాలువారుస్తుంది. శిల్పి గుండెలోని కళా తృష్ణా వేడిమికి కఠిన శిలల కలకంఠ కందరాలు కరుగుతాయి. శిల తనలో భద్రపరచుకున్న అందాల్ని అవయవాల్ని ఉలిముందు పరుస్తుంది.

కళాకారుడు తాత్కాలిక యోగోద్యోగి. తపోమయ భూమికల్లో తనకు అందిన స్వర్ణమయ సోయగాల్ని తరలించుకుని వచ్చి భౌతిక ప్రపంచంలో దేనిలోనో నిక్షేపించాలని తహతహలాడిపోతాడు. మనిషికి ఆత్మ ఆరని జ్వాల. అది కళల అగ్నికుండం.

సృష్టికి ముందుగా ప్రాణికోటికి ముందే శిలలు రూపుదిద్దుకున్నాయి. ఆత్మలు మొదట అడుగు పెట్టిన చరణ పీఠికలు శిలలు. అందుకే అవి దేవతలకు చరణ పీఠాలై అలరారుతున్నాయి. కొన్ని ఆత్మలు ఆనాడు శిలాతలాల్ని శయన తల్పాలు చేసుకుని నిద్రించాయి. ఆ ప్రగాఢ నిద్రలో ఇంకా జడీభూతమైన ఆ ఆత్మల్ని తన కళాత్మక అయోదండంతో తట్టిలేపే మహా మాంత్రికుడే శిల్పి.

కళ ప్రకృతిమీద మెరుపులీనే భగవంతుని దరహాస చంద్రిక. ఆత్మ అతిహేయమైన మాంసల శరీరంతోనే పరమాత్మను లొంగదీసుకుంటుంది. అతని ఒడిలోకి ఎక్కి కూర్చుంటుంది. భగవంతుని చేరుకోడానికి మనిషికి యోగమొకటే నిచ్చెన. అందులో పదికట్లు కళలు, కళకు పరాకాష్ఠ శిల్పం.

కళలు కాంతిని విరజిమ్మకపోతే మనిషి పసిపిల్లవాడిలా దుఃఖసాగర తమోవన తీరాలలోకి నడచి వెళ్ళిపోతాడు. తప్పిపోయిన పిల్లవాడై పోతాడు.

శిలలు అమాయకలు, అమాయకత ముందు విష్ణుమాయ తలవంచుతుంది. సిగ్గే తెలియని శిలకు ఉలి స్పర్శతోనే అది అలవడుతుంది.

కళాతపస్వికి ఎప్పుడో ఒకనాటికి కాంతిమూర్తులు దర్శన మిచ్చి తీరుతారు. మనం శూన్యం అనుకున్నచోటే సర్వకళలకూ జన్మస్థలం. అక్కడి మంచే కళకు ముడిసరుకు సరఫరా అవుతుంది. ఈశ్వరుని కారుణ్యం కఠినశిలల మీద ప్రసరించబట్టే శిల్పానికి శిలలు ఆలంబనా లయ్యాయి. శిల్పి హృదయాన్ని ఆవహించుకున్న ఉలి శిలతో రమిస్తుంది. భ్రమరంలా శిలచుట్టూ భ్రమిస్తుంది, ఆ భ్రమరకీట న్యాయంమంచే శిల శిల్పమవుతుంది.

ప్రకృతి పరిణామశీలి. మనిషి మనిషిగానే వుండిపోతే మనుగడ సార్థకం కాదు. మనిషి ఏదో కావాలి. అది అధోగతి కాకూడదు. అధోగతి గమనం ప్రగతికాదు. మనిషి మనీషి కావాలి. మహాత్ముడు కావాలి. దానికి మార్పు అవసరం. మార్పు పునర్జన్మ. జన్మనెత్తడం ఒక హింస. ఆ హింస వదులకోసం పరమహంసలు కావడానికవడే హింసతో సార్థకం కావాలి.

సృష్టిలో సరళమైనది వెన్నెల. కఠినమైనది శిల. శిల కళాత్మక హింసే శిల్పం. ఆ శిలలో వెన్నెలలు కాయించడమే శిల్పకళ. సృష్టినిర్మాత జగన్మాతను ఎప్పుడూ అనుసరిస్తారు. అతని ప్రేమ అలాంటిది. పరమాత్మ

అయిన తను లేకపోతే దేనిలో జీవం లేదో అది ప్రకృతి. కానీ ప్రకృతి మాత అడుగుల సమీపంలోనే పరమాత్మ ప్రచరిస్తుంటాడు.

శిలకు కాఠిన్యం ఉగ్రపాలతో అలవడింది కాదనీ, వెన్నెల వెన్న మిళితమైన లావణ్యం కారుణ్యం శిలలకు జన్మసిద్ధమని సాధించి చూపేదే శిల్పకళ.

శిల్పి సంకల్ప సామ్రాజ్యాలలో శిల్పాలు అసూర్యం పశ్యలైన యువరాణులు. అవి పౌరుషాన్ని ప్రతాపాన్ని ప్రతిబింబించే మగటిమి కూటములు. శిలమీద కళను ప్రతిష్ఠించడమే నైపుణ్యానికి పరాకాష్ఠ. కఠిన శిలతో తలపడే శిల్పి దీక్షకు ప్రకృతి కరిగిపోయి తన ఒడిలోని కళను అతని చుట్టూ వెదజల్లుతుంది.

విశాల మైదానాల ప్రాంగణాల్లో కన్నెశిలలు చీకటిపిట్టల కాటుక పాటలు సైదోడుగా వెన్నెల వానల్లో స్నానిస్తున్నట్టున్నాయి కదూ!

ఉలుల నెచ్చెలుల అడుగుల సవ్వడి గుడిగంటల్లా తమ ఎదల ముంగిట రవళించాలని తదేకంగా చూస్తున్న నిశ్చల విరహ తపస్వినులు శిలలు.

మనిషికి వుండవలసిన జ్ఞాననేత్రాన్ని భగవంతుడు చిదిమిపెట్టాడు, దానితో వాడు ప్రతి అల్పమైన పదార్థాన్నుంచి అనల్పమైన స్వర్గమయ ద్వారాలున్నాయేమోనని కళల దివిటీలు వెలిగించుకుని వెతుకులాడుతాడు. తపించే మనిషి పరుసవేది. వాడు తాకిందంతా కళాత్మక స్వర్ణం అయిపోతుంది. శిలలోని శిల్పం నివురు కప్పిన నిప్పు. శిల్పి ఆ నివురు కప్పిన ఆవరణను తొలగిస్తాడు అంతే.

గడ్డిపువ్వు నుంచి గర్భస్థ శిశువు వరకు ప్రకృతి తన పరిణతిని పరిణామక్రమంలో ప్రకటిస్తూనే వుంటుంది. హృదయనాదం సంగీతమవుతుంది. హృదయవేదన సాహిత్యమవుతుంది. శిల్పి వేదనా నాదబ్రహ్మ,

శిల్పం సూక్ష్మతంత్రులు బిగించిన వీణ. దానిపై మార్మిక వేదమంత్రాలు వినిపిస్తుంటాయి.

శిల కన్నకలే శిల్పం. చెదరని నిదురలో వున్న మధురగాథలు శిల్పాలు. అవి అప్సరసలు కంటున్న అందమైన కలలు. శ్వాస ఆగిపోయిన సజీవ యోగులు శిల్పాలు.

శిలకన్న కళాత్మక కలకు శిల్పి న్యాయం చేకూర్చినపుడు ఉత్తమ కళాఖండం ఉద్భవిస్తుంది. దేవలోకాల నుంచి ఇంద్రధనుస్సుల్లా తమ మనో ప్రాంగణాల్లో జీరాడుతున్న దివ్యానుభూతుల్ని కళాకారుడు అందుకోవాలను కుంటే దానికి మార్గం కళ ఒక్కటే. మనిషి ఆనంద చేలాంచలంలోని ఒక కొంగు పట్టుకునే లోపున మరో అంచు అందకుండాపోతుంది. అందుకే అన్ని కళలు ఉద్భవించి అందని ఆనంద చేలాంచలంలోని అన్ని కొంగుల్ని పట్టుకోవాలనుకుంటున్నాయి. కానీ కళలు పరిమితం. ఆనంద చేలాంచలపు కొనలు అసంఖ్యాకాలు. శిల్పిగా మన వంతు బాధ్యత మనం నిర్వహించాల్సిందే."

అతని గుండె శిల్పకళకు కవాటమైనట్టు అనుభూతి వాహినుల్ని వెలువరించింది. ప్రవాళ ఒక సజీవ శిల్పంలా మారి అనిమిషత్వాన్ని అందు కుంది. ఆమె తనువులోని అణువులన్నీ కన్నెశిలలుగా మారి అందమైన శిల్ప ముఖాల కోసం అతనికి అభిముఖంగా జరుగుతున్న అనుభూతికి ఆమె లోనైంది అతనిమీద స్నేహం గౌరవంగానూ, గౌరవం ఆరాధనగానూ, ఆరాధన ఆత్మీయతగానూ, ఆత్మీయత అనూహ్యంగానూ అది దేనిగానో పరిణమించి పోతోంది. ఆమె కళ్ళు అభిషేక కలశాలయ్యాయి. అనుమతి కోసం వేచి చూస్తున్నాయి.

"అమ్మగారూ! చాలా రాత్రయిందమ్మా. నాన్నగారు ఎదురు చూస్తుంటారు" అన్న బండివాడి హెచ్చరికతో ఇద్దరూ విశ్రబ్ధంగా నడవ సాగారు.

దారి పొడవునా ప్రకృతిలోని క్రిమికీటకాల సాంకేతిక సవ్వడులు - గుర్రపు సకిలింతలు - గిట్టల ధ్వని - నేలకూ, చక్రాలకూ జరుగుతున్న రాపిడి సంభాషణం - అంతా నిశ్శబ్దం! ఆ నిశ్శబ్దంలో సృష్టికి మూలమైన ఆత్మరతి పారవశ్యం!!

○ ○ ○

శిల్పి కవి - ఉలి కలం. ఇలాతలం ఓ శిల్ప ప్రబంధం. అష్టాదశ వర్ణనలన్నీ వివిధ దశల్లో శిలలమీద సాక్షాత్కరిస్తుంటాయి.

శిలలెందుకు పడుతున్నాయి? కలలెందుకు కంటున్నాయి? ఉలులెందుకు శిలల్ని ఛేదించమని కళా స్థానాల కోసం వెతుకులాడుతున్నాయి?

ఉలి దాహంతో, మోహంతో, స్నేహంతో శిలల మార్మిక స్థావరాల్ని మీటినపుడు శిల నర్మగర్భంగా నవ్వుతుంది తన గర్భంలోని శిల్ప శిశువు తాడనమంత తన్మయత శిలకు ఏర్పడుతుంది.

శిల్పాలు అహల్యలు. ఉలులు హలాలు. హల్యమైన శిలాతలం పంటకొచ్చిన ఇలాతలంలా శిల్పాల గుత్తుల్ని విరియకాస్తుంది ఉలి శిల్పానికి నెచ్చెలి. శిలామయ కోపగృహంలో శయనిస్తున్న చెలిమికత్తె శిల్పాన్ని తట్టిలేపి సర్వాలంకార సుందరంగా తీర్చి దిద్దుతుంది.

కళను అందుకున్న ఉలి రాముని పాదరేణువు. అది మంత్ర దండంలా స్పర్శించిన రాతికి ఖ్యాతి వస్తుంది. శిలలు నారికేళ పాకంలో రచించబడిన ప్రబంధాలు. శిల్పి రసజ్ఞుడైన విమర్శకుడు. విగ్రహాల్లోని విగ్రహ వాక్యాల్ని, శిలాంగ సమావేశంలోని సమాసాల్ని, శిల్పాంగ బంధాల్లోని సంధుల్ని, ఒంగిన భంగిమల్లోని వ్యంగ్యాల్ని, ప్రతిమల మలుపుల్లోని ప్రతిమాలంకారాల్ని (ఉపమల్ని), శిల్పాంగ విన్యాసంలోని అర్థాంతర న్యాసాల్ని, రూపాల రూపకాలంకారాల్ని, శిల్ప వీక్షణంలోని ఉత్ప్రేక్షల్ని ఇలా ఎన్నో - రస సరస సారస్వతాలంకార స్రష్ట శిల్పి. అతని దోశ పాహితి శిల్ప సమీక్ష.

రెండోరోజున మరో కొండచెరియ వెన్నెలలో శిలకోసం అన్వే షిస్తున్నారు ప్రవాళ, సౌరాఖ్యలు.

"ప్రవాళా! శిల కళామతల్లికి ఆసనపీఠం. దానికి పుట్టినిల్లు భూతల మైతే, అది మెట్టినిల్లు పుణ్యస్థలమవుతుంది. శిశువుల్లా ఈ శిలలు నేలతల్లి ఒడిలో నిద్రిస్తుంటాయి."

"ఎక్కడున్న శిలలైనా పనికివస్తాయా శిల్పాలకు?"

"సముద్రతీర భూమిలో వున్న శిలలు పనికిరావు."

"ఎందుకని?"

"మనవన్నీ క్షారసముద్రాలు — క్షీర సముద్రాలు కావు. ఉప్పునీటి స్పర్శతో శిలలోని జీవసారం క్షీణిస్తుంది. శిల నెమ్మదిగా బరువును కోల్పోయి పెళుసబారుతుంది. దానితో అది శిల్పార్హతను పోగొట్టు కుంటుంది."

"ఉప్పునీటికి దూరంగా పడివుండే శిలలు శిల్పానికి పనికివస్తాయా?"

"నీ ప్రశ్నల్లోనే సందేహాలున్నాయంటే నీకు శిల్పశాస్త్రం గురించి తెలిసే వుండాలి."

"నాకు శిలాసేకరణ ప్రక్రియ తెలియదు. కానీ దీనికి శాస్త్రం వుందనీ, అది అన్ని శిలల్ని అంగీకరించదని మాత్రం ఊహించగలను" సనువుగా నవ్వింది.

"నీ ఊహ యథార్థమే. అలా ఎండల్లోపడి కాగిపోతున్న రాళ్ళు కూడా మలచడానికి పనికిరావు. శిలలో ఒక తడిలేని తృణటవుంది. శరీరం లోని రక్తంలా శిలకు సారం ప్రాణం. సారహీనమైన శిల ఉలిపోటాన్ని ఓర్చుకోదు." ఒక శిలా శకలాన్ని తీసుకుని బరువును చేత్తోతూకం వేస్తూ అన్నాడు.

"మరి ఎక్కడుండే శిల శిల్పార్హమైంది?" కోనగాలికి విచ్చలవిడిగా ఎగసిపోతున్న పైటను తన నడుము చుట్టుకొలతను కొలుస్తున్నదానిలా ఓ చుట్టు చుట్టింది.

"సుందర శిల్పానికి అందాల నమూనాలా వున్నావిప్పుడు" ఉలి తొలిచే తొలిచూపుతో మందహాసం చేశాడు సౌరాఖ్యుడు.

"అందాల్ని అంది పుచ్చుకోవడంలో ఆదమరపు ఎరుగనిది మీ కళా దృష్టి...." కందిన ముఖంతో పైటచెంగును సడలించుకుంది.

"భూమాత పైటచెంగు మాటున దాగిన శిలలే శ్రేష్ఠమైనవి" దోరగా నవ్వాడు.

"అంటే...." చురుగ్గా చూసింది.

"కించిత్ లోతున్న మట్టిపొరల మాటున వున్న శిలలకే అందాలు— శిల్పార్హతలూను" భూతలాన్ని పరిశీలిస్తూ నడుస్తున్నాడు సౌరాఖ్యుడు.

"అసలు శిలలమీదకు దేవతలు వచ్చి వాలుతారా?" కొంటెనవ్వు పెదవుల మాటునే దాగడం మబ్బుల చాటున దాగిన బింబంలా అతనికి అనిపించింది.

"మృణ్మయ రూపంలాంటి మనిషిమీద దైవత్వం వాలుతున్నప్పుడు శిలారూపాలమీద కళాదీపాలు ఎందుకు వెలుతురులు ప్రసరించవు? కళ అందానికి ప్రతిరూపం. అందం దైవానికి ప్రతిబింబం." ఆమె అందాలను ఆరాధనగా చూశాడు.

"శిల్పానికున్న శాపరూపాన్ని పోగొడుతున్న ఋషి శిల్పి. అతనీ వాక్కులాంటిది ఉలి" ప్రవాళ ఉలి తాకిడితో గిలిగింతలుపోయే శిల్పంలా హొయలు పోయింది.

"ప్రవాళా! ఇది పురుష శిల...." శిలాభేదాల్ని వివరించడానికి ఉపక్రమించాడు.

"మీరు కళారాధకులు. శిల కంటే నాకు శిలమీది కళ గురించి చెపితే కృతజ్ఞురాలిని."

"రుద్రమూర్తిని ఆహరించి వుండే క్షుద్రశక్తుల్లా శిల్పాన్ని అవహించి అనవసర ప్రకృతి కల్పన వుంటుంది.

మేఘంలోని నీలిరాగానికి మెరుపు మేని విరుపు. అదొక మజిలి. శిల మేఘం—శిల్పం నిశ్చలమైన మెరుపు.

పూరేకుల మధ్య అండకోశంలో రూపుదిద్దుకున్న బీజంలా శిలల పొరల మధ్య అంతరంగంలో శిల్పం రూపొందుతుంది. శిలల పొరలు ఉలుల కిరణాలు సోకి విచ్చుకుంటాయి.

శిలాతలమంతా కళారంగ వేదిక. కఠిన యవనికల వెనుక శిల్పాలు శైశవదశలోని బాలల్లా దోగాడుతుంటాయి. సందెపొద్దు అందాల మంత్ర నగరాన్ని చూడాలన్న కుతూహలంతో శిల ఒడిలోని కొంగుచాటు శిల్పాలు గగనాన్ని పసిపాపల్లా గమనిస్తుంటాయి. ఆకాశపు ఉరుముల ఓంకార నాదాన్ని గర్భస్థ శిశువుల్లా వింటాయవి. భూమాత ఎదలోని అనురాగ వాహిమల ప్రవాహవేగ ప్రణవాన్ని వింటాయి. ఈ శిలా శిశువులకు ఆకాశం తండ్రి. భూదేవి తల్లి. కాలమహిమ కాకపోతే కొన్ని శిల్పాలు అలా అనాధ శిశువుల్లా ధూపదీపాలకు నోచుకోకుండా ఎందుకుంటాయి?

శిల్పం వేగుచుక్క. ఆ పొడుపు చుక్క క్రిందిది ఒక కళామయ ప్రపంచం. ఆశలు కొసకొదానికి అందనంత ఎత్తుల్లో పూసిన పూలగుత్తుల కోసం మత్తు కళ్ళతో చూస్తున్న అఖండ కళాఖండాలు శిల్పాలు. ముద్దుల తొలి పొద్దుల్ని, బుగ్గల మీద వికసిస్తున్న సొగసుల్ని శిలా దర్పణాల్లోకి తర్పణం వదులుతాడు శిల్పి.

గండశిలల్లోని శిల్పాలు పంజరాల్లో ప్రాయశ్చిత్తం కోసం బిగింపబడిన పంచవన్నెల రామచిలుకలు. వాటి అలకలు కులుకుల బంధనలో

అందావిన్నివ్వవు. శిల్పాలకు సత్యం – శివం – సుందరం అంగాంగ ఆభరణాలు. అవి శిల్పానికి వేదమంత్రాలు. శిల్పం ఘనీభవించిన పరమాత్మ సుందర దరహాసం. కాలానిది ఇంద్రజాలమైతే కళది మహేంద్రజాలం. క్షణం విలువని కాలాన్ని శిల్పం తనపై శిలువ వేసుకుని మోస్తుంది. తన అంగాల అంగరక్షకుల్ని కావలా వుంచి కళ కాలాన్ని బందీని చేస్తుంది.

శిలకు ఆత్మ శిల్పం. శిల్పానికి దేహం శిల. దేహాన్ని దహించి బయటపడడం శిల్పానికి మోక్షం.

పరమాత్మకు సంబంధించినవన్నీ ఆత్మకు అందుబాటులో వుంటాయి. ప్రేమ కానిదంతా ప్రేమికులకు కారవపడుతుంది.

భగవంతుడు తనకు చేసిన అసమగ్ర రూపదోషాన్ని, అసంపూర్ణ భావదోషాన్ని కళాకారుడు కళద్వారా తీర్చుకుంటాడు. అందుకే భావజీవులు, శోకమూర్తులు, మహత్తర ప్రేమికులు కళాప్రపంచంలో మనకు కంటపడుతుంటారు."

"శిల్పి కళ్ళకు ఏ శిలలో ఏ శిల్పం దాగుందో తెలుస్తుందనుకుంటాను" ప్రవాళ కళ్ళు వెన్నెల వత్తుల్లా వున్నాయి.

"శిల్ప శిశువు శిల్పి హృదయంలో ముందుగా జన్మనెత్తుతుంది. ఆ తర్వాత అది శిలల పొత్తిళ్ళు మలుచుకుంటూ నిలబడుతుంది. ద్వైదీభావ పోరాటం నుంచే వైదికభావం పుడుతుంది శిల చేసుకునే కళాత్మక ఆత్మాహుతి నుంచే శిల్పం పుడుతుంది."

"శిల్పికి, ప్రేమకు సంబంధం వుందంటారా?" అసందర్భంగా ఎందుకు ప్రశ్నించిందో ఆమెకే తెలీదు.

"శతగాత్ర నక్షత్రం కాంతుల్ని వొలికినట్లు ప్రేమ హృదయం మాధుర్యాల్ని జాలువారుస్తుంది. ఆ మాధుర్యాల్ని పోతలు పోసి అచ్చులు తీస్తేనే కళాఖండాలు ఉద్భవిస్తాయి. ఆత్మానంద జ్యోతిక ఏలిక అయిన

హృదయంలో అంతా తేజోమయ మైదానాలే. అన్నీ మువ్వల మురళీగానాలే. ఎన్నో మానసిక రణరంగాలలో పాల్గొని గాయపడైనా పరే వ్యక్తి సాధించవలసిన స్థిరాస్తే ఆత్మానంద జ్యోతిక. దానికి పాదు ప్రేమ హృదయమేగా!

చీకటి శిలాశాసనాల మీద ప్రేమ వెన్నెలను పూసికొని విశ్వరచనా క్లిష్టలిపిని తెలుసుకోలేము. ప్రేమికుడు ఓడిపోయినా, కాలగర్భంలో కలిసిపోయినా ప్రేమ అంతు చూసేదాకా మొలుస్తూనే వుంటాడు...."

"శిలగానో, కళగానో...." పూరించింది ప్రవాళ.

"ప్రకృతిలో ప్రతి పనికీ ఒక ప్రతిఫలం వుంటుంది. జన్మించడానికి ప్రతిఫలం మరణమైతే, మరణించడానికి ఫలితం జన్మించడం అయి తీరుతుంది. ప్రకృతిది సాంకేతిక సామ్యం. దేవుడు జీవుడి అనుమతితో ప్రమేయం లేకుండా సృష్టించిన జగతికి జీవుడు బందీ అయిన బానిస. బలి అయిన కూలీ. ప్రళయంలో కూడా ఆత్మకు విలయం లేదు. ఆత్మతత్వాన్ని శరీరం అభ్యసించింది. ఆ కళ శాశ్వతత్వం కోసం ఈ శిలన్ని పట్టుకుంది.

అసురగణాల కడుపులు చీల్చుకుని దేవమూర్తి ఉద్భవించినట్లు, వల్లని శిలలనుంచి కళారూపాత్మక శిల్పాలు వెలిశాయి. భూలోకానికీ, పైలోకానికి మధ్యనున్న మాంత్రిక లోకం శిల్పప్రాంగణం. శిల్పం ఒక చేత్తో భూలోకాన్ని, మరోచేత్తో స్వర్గలోకాన్ని స్పృశించే అమరదీపం.

అవాస్తవికత వికృతంగా నవ్వే లోకంలో శిల్పం వాస్తవిక స్వప్నం. మనిషి గుండెలో ఇన్ని కాంతికిరణాలు మొలవాలంటే పరమాత్మ నామం పెదవిమీద, రూపం హృదయంమీద ప్రతిష్ఠించుకోవాలి దానికి ప్రేరకం శిల్పకళ కావాలి. చూపుల కందిన శిల్పం అనుభూతిగా మారిపోయినపుడే భక్తి అవుతుంది. మనిషిలోని అమానుష అవేషాలు, అక్రమ విక్రమాలు ఛేదింపబడేది కళారూప దీపకాంతితోనే!"

"శిలలు ప్రమిదలైతే— శిల్పాలు దీపకళికలంటారా?" కళ్ళతో కాంతులు చిలికింది ప్రవాళ.

"ఎంత చక్కగా చెప్పావు! గుండె రాయి అయినవాడు త్వరగా భగవంతుని దర్శించగలుగుతాడు. ఎందుకంటే భగవంతుడి రూపం రాతిపైనే శాశ్వతంగా మలచవచ్చు కాబట్టి!

సర్వ సౌందర్యాలకు కాలిపై, వికృతపు భంగిమలతో మనిషి పతితుడై పోకుండా స్వర్గ సౌందర్యాలవైపుకు కీటకంలాంటి మనిషిని ఆకర్షించేదే శిల్పకళ. హింసను పరమహంసనుగా మార్చి వినువీథుల్లో రెక్కలు విప్పుకునేలా చేసే మంత్రం శిల్పం."

"ఇదీ....మీరు శిలను దాటి, శిలమీద విలిచిన కళను దాటి, కళ జన్మ స్థానమైన మార్మిక గ్రామసీమల్లోని అపూర్వ విషయాల్ని చెప్పారే—అదీ నాకు కావలసింది. ఇప్పుడు చెప్పండి శిలల భౌతిక స్వరూపాల్ని గురించి" తాళదప్పు స్వచ్ఛ తటాకంలా విందుగా వెన్నెల తరంగాలతో స్పందించింది.

"ఇది పురుష శిల."

"అయితే దీనికి దూరంగా వుండాలన్నమాట."

"ఎవరు?" ఉత్సుకతతో అడిగాడు.

"స్త్రీ శిల" వెన్నెలను చిదిమినట్లు నవ్వింది.

ఆమె చమత్కారానికి నవ్వొచ్చిందతనికి. "అయితే శిలల్లోని భేదాలు నీకు ముందే తెలుసన్నమాట."

"ఏమో నాకు తెలియదు. మీరు పురుషశిల అంటే నేను స్త్రీ శిల అన్నాను అంతే."

"స్త్రీ శిల పురుషశిలకు దూరంగా వుందంటే అది నపుంసక శిలకు దగ్గరవుతుందన్నమాట."

ఈసారి నిజంగానే ఆశ్చర్యపోయిందామె. "నపుంసక శిలకూడా వుందా?"

"మానవ ప్రకృతిలో వున్న గుణాలన్నీ ప్రకృతి ప్రవృత్తి నుంచి వచ్చినవే కదా" శిలన్ని చెవిదగ్గర పెట్టుకుని ఏదో వింటున్నాడు సౌరాఖ్యుడు.

"ఏమిటది....ఆ శిలలో ఏం వినిపిస్తోంది?"

"శిలలు వక్తిగద్దు. శిల్పాలు విడుగుతాయేమోనని చూస్తున్నా" అతను హాస్యంగా మాట్లాడినా అందులో ఒక అంతర సత్యం గోచరిస్తుందామెకు.

"శిల్ప శాస్త్రాన్ని శిలాపాకంలో చెప్పకండి." చిరుబురులాడింది.

"కోపం రూపాన్ని చెడగొడుతుంది. నేను వచ్చిందే మీకు శిలల్ని పరిచయం చేయడానికి" అనునయంగా అన్నాడు.

"ఇలా రండి" తనకు దగ్గరగా కూర్చోమని చేయి చూపాడు.

ఆమె అతనికి సమీపంగా కూర్చుంది. ఆమె తనూ పరిమళాలు గోరింకల్లా ఒక్కుమ్మడిగా అతని మృదులభావ విహంగాల మీదకు దాడి చేసాయి. గాలి విసురుకు ఆమె పైటచెంగు ఎగిరి అతని ముఖాన్ని పూర్తిగా కప్పేసింది. రక్త ప్రసరణ కొనసాగుతున్న శిల్పాల్లా, గుండె కొట్టుకుంటున్న శిలా విగ్రహాల్లా కాలం క్షణం స్తంభించిందక్కడ. ఆత్మ త్రుళ్ళిపడి లేచినట్లయింది వాళ్ళకు. శరీరం స్పందించినపుడు ఆత్మ జ్వలించిందా—ఆత్మ జ్వలించాక శరీరం స్పందించిందా అన్నది ప్రస్తుతం ప్రధాన విషయం కాదనిపించింది సౌరాఖ్యుడికి.

"వినండి—పురుష శిల ధ్వని" వేలితో ఆ శిలను తాటించి ఆమెను వినమన్నాడు.

అతను ముఖం నుంచి తొలగించుకున్న చీరచెంగును ఆమె గబగబా సర్దుకుని జాగ్రత్తగా పట్టి వుంచుకుంది.

"ప్రణవనాదమేదో వినిపిస్తోంది" అతను వ్రేలితో పదేపదే శిలను తడుతుండగా శ్రద్ధగా వింటూంది ప్రవాళ.

"ఘంటానాదం లాంటి ధ్వని కదూ—మీరన్నట్టు అది ఓంకార ధ్వనే. ఓంంంం ఇలా దీర్ఘంగా ప్రకంపనలు వస్తే అది పురుషశిల,"

"అలాగా...." ఆ శిలను ఆనుకుని కూర్చుంది.

"అరెరే" కంగారుగా అన్నాడు.

"ఏమైంది?" బెంబేలుపడి లేచిందామె.

"అది పురుషశిల జాగ్రత్త!"

"స్త్రీ స్పర్శతో పురుషుడే శిల అవుతుంటే—ఇక శిలేం చేస్తుంది." ఆత్మగర్వంగా ఆమె అన్నమాట ఎక్కడో మర్మభేదనం చేసినట్టయిందతనికి.

"ఈ శిలాధ్వని వినండి."

"ఇంకా తాటించండి ఉలితో."

"చింగ్...."

"ఎలావుంది?" అడిగాడు.

"తాళం సవ్వడిలాగా చింగ్ - చింగ్ అంటూంది."

"ఆ....అలా తాళం వేసేవి స్త్రీ శిలలన్నమాట" ఆమె ప్రతిస్పందన కోసం ఆమెకేసి చూడకుండా చూస్తున్నాడు.

"అంటే – మీ ఉద్దేశంలో స్త్రీలు పురుషులకు తాళం వేసేవాళ్ళన్నమాట."

"అలాకాదు—పురుషులచేత తాళం వేయించేవాళ్ళు స్త్రీలు."

"మీ వాక్చాతుర్యాన్ని గుర్తించాం లెండి."

"నేను రాతిని గురించి అన్నానుగానీ—నాతిని గురించి కాదు."

"అవును మీరు చెప్పింది చుప్పనాతిని గురించే."

"చుప్పనాతిని గురించీ కాదు. అసలు చుప్పనాతి అంటే శూర్పణఖ."

"శూర్పణఖ అనేమాట అలా రూపాంతరం చెందిందా? అయినా ఈ రాత్రిపూట రాక్షస స్త్రీలను గురించి ఎందుకులెండి" అని స్త్రీ శిలమీద చెవి ఆన్చి వింటూంది. ఆమె పాదాన్ని లయబద్ధంగా తాడిస్తూ ఆ ధ్వని సామ్యాన్ని గమనిస్తూంది.

"శిలలో మీకాళ్ళ అందెల సవ్వడి వినిపిస్తోంది కదూ."

"ఏదీ సప్తస్వర శిలను పరిచయం చేయరేం" ఆధికారికంగా అడిగింది.

"వాటిని పరిచయం చేయనక్కరలేదు. మీరు కూర్చున్నది దాని మీదే."

"అంతే!"

"అబ్బే—దీనిలో అంతరార్థం ఏమీలేదు ...ధ్వని విను—" ఉలితో తడుతున్నాడు.

"అదే ఒకసారి ఢంగ్–ఢంగ్ అంటూంది. మరోమారు టక్‌టక్ అంటూంది. ఇంకోమారేదో ఓటి శబ్దం పలుకుతోంది.

"ఈ శిలల సవ్వడులు వృద్ధుల బుద్ధుల్లా స్థిరంగా వుండవన్నమాట. ముదుసలి ఒంటి ముడుతల్లా ఈ రాళ్ళకు పగుళ్ళుంటాయి. ఇవి స్థవిర (వృద్ధ) శిలలు. తుప్ప కాష్ఠాల్లా వుంటాయీ శిలలు. తెలిసింది కదా!" గురుస్థానంలో కెళ్ళి మాటాడుతున్నట్టు కనిపించాడు సౌరాఖ్యుడు. విలాసంగా శిష్యవతుగా తలవూపింది ప్రవాళ.

"ఆ... ఈ శిలల వాసన గురించి గుర్తు వచ్చింది" ఆమె తనూ సౌరభ సమ్మోహితుడై అన్నాడు.

"వాసన కూడానా?"

"యౌవనం ఎక్కడున్నా పరిమళిస్తుంది సుమా."

"ఆ....ఏదీ ఆఘ్రాణించనివ్వండి."

"ఎలావుంది?"

"ఏదో సువాసన" ఆశ్చర్యం, కొత్త విషయాలు తెలుసుకుంటున్న ఉత్సాహం, సౌరాఖ్యుని పరిచయం ముప్పిరిగొన్న ఆమె సుకుమార రూపాన్ని వెన్నెల కుంచెతో ఏదో అద్ది దిద్దుతున్న అనుభూతికి అతను లోనయ్యాడు,

"బరువు కూడా చూడాలి."

"దేని బరువు?"

"యౌవనంలోని రాళ్ళ బరువు."

"అంటే రాళ్ళు యౌవనంలో బరువుగా వుంటాయా?"

విచిత్రంగా అడుగుతున్న ఆమెను చూస్తూ ఘోరగా నవ్వాడు.

ఆమె అందంగా సిగ్గుపడుతూ అంది—"చతురతను ప్రదర్శించాం."

"శిల్పులకు అన్ని కళలతో పరిచయం వుండాలని శాస్త్రం."

"కలలతో కూడానా?"

"అదే ప్రథమం."

ఇద్దరూ నవ్వుకున్నారు. రెండు కొండచెరియల నుంచి పారే సెలఏళ్ళు ఒకచోట కలిసి కలబడినట్లు నవ్వుతున్నారు. వడివడిగా తుళ్ళింతలాడుతూ ప్రవహించేటప్పటి గలగలలు అక్కడ ప్రతిధ్వనించేలా నవ్వుతున్నారు. వెన్నెల లోయల్లో కోయిల పాటలు దూకుతున్నట్టు నవ్వుతున్నారు వాళ్ళు. అర్ధనారీశ్వరుడి కమనీయహాసం అది. అక్కడ తగిన శిలలు లేకపోవడంతో కొంతదూరం నడిచారిద్దరూ.

"చూడు ప్రవాళా ఇది పురుష శిల. దీర్ఘ చతురస్రాకారంలో వుంటుంది. దీనికెన్ని కోణాలున్నాయో చెప్పు" ఆమె వ్రేళ్ళ కోమలతను చూస్తున్నాడతను.

"పది వున్నట్టున్నాయి" ఆమె రెండోసారి లెక్కపెట్టి చూపింది.

"ఆ పురుష శిలకు పది కాని పన్నెండు కోణాలుగాని వుంటాయి" ఇంకో శిల దగ్గరకు ఆమెను తీసుకెళ్ళి ఆ శిలకున్న కోణాల్ని లెక్కించి చూపాడు.

"అదే స్త్రీ శిలకు కోణాలెన్ని వుంటాయో చెప్పు?" సరదాగా అడిగాడు.

"ఏముంది.....అది సహజంగానే కోణాలు తక్కువ కలిగి వుంటుం దనుకుంటాను." పురుషాధిక్యత మీద తొలిబాణం సంధించింది.

"మను ఊహించినట్లే దాదాపు 8 కోణాలుంటాయి ప్రవాళా అది సృష్టి."

"నేను.........అన్నమాట" మరోసారి భావగర్వితంగా నవ్వింది. వెలుగును వెల్లువలెత్తుతున్న వెన్నెల వాకలో ప్రేమపక్షులు రెండు కువకువ లాడుతున్నట్లుంది వారి సంభాషణ.

"దేనికోసమో వెతుకుతున్నారు?"

"నపుంసక శిలను మీకు పరిచయం చేద్దామని" భూమిలోకి కొంత కూరుకుని వున్న శిలను పెకలించి ఆమె కూర్చున్న చోటికి తీసుకొచ్చాడు.

"ఈ శిలకు ఒక్క కోణం కూడా లేదేమిటి? ఇది గుండ్రంగా వుంది."

"ఇలాంటి శిలల్ని నపుంసక శిలలంటారు."

"పురుష శిలలు గుండ్రంగా వుంటే?"

"గుండ్రంగా వుంటే అది పురుషశిల కాదు. ఇవి శిలలు— బృహన్నలలు కావు." కోలకళ్ళ మీమమేవితో కాస్త దగ్గరగా వచ్చి నదు స్తూంది ప్రవాళ. వెన్నెల కోనలో ఏదో అరణ్యమృగం అరుపు లీలగా విన వస్తోంది. కొండక్రింది పల్లెల్లో నుంచి తప్పెటల మ్రోత గాలిలో అలలు అలలుగా తేలివస్తోంది. మౌనం, ఏకాంతం, వెన్నెల, సుందర దృశ్యాలు, అడవిమల్లెల వాసన ఇవన్నీ ఏదో మదన మంత్రాన్ని ప్రయోగిస్తూ సమ్మో హనంచేస్తున్నాయి.

"ప్రవాళా" ఆ పిలుపులో చనువు ధ్వనించింది.

"చెప్పండి" అనువుగా పలికింది.

"పురుష శిలలతో పురుష విగ్రహాల్ని, స్త్రీ శిలలతో స్త్రీ విగ్రహాల్నే చెక్కాలి తెలిసిందా?"

"మరి నపుంసక శిలంతో."

"మామూలుగా ఆలయ మండపాలుగా, స్తంభాలుగా, ఆలయం ఆవరణలో క్రిందపరిచే రాతిబండలుగా ఈ నపుంసక శిలల్ని వాడుకోవచ్చు."

"వాటికి విగ్రహార్హత లేదన్నమాట....మరి శివలింగాన్ని చెక్కాలంటే ఏ శిలను వాడాలి?"

ఆమె కళ్ళలోని మెరుపును గుర్తించాడు. ఆమె రువ్వాలనుకున్న ఉరుమును కూడా ఊహించి నవ్వుకున్నాడు.

"మనకు కనిపించే శివలింగం నువ్వు అనుకుంటున్నట్టు నరనారీ సమ్మిశ్రితం మాత్రమే కాదు" ఆమెలో అనుకున్నట్టే ఉలికిపాటును గమనించాడు.

"మరి శివుడిది అర్ధనారీశ్వర తత్వం కాదా?"

"కాదు."

"మరి?"

"అరపురుషుడైన శివుడు నపుంసక తత్త్వాన్ని కూడా వదిలిపెట్టకుండా తన లింగరూపంలోకి ఇముడ్చుకున్నాడని శిల్పశాస్త్రం చెబుతుంది. శివుడి లింగరూపం మూడు భాగాలుగా వుంటుంది. అది త్రిమూర్తులకు ప్రతిరూపం. మనకు గుండ్రంగా పైకి కనిపించేది శివరూపం. లోపలికి జొనిపిన లింగరూపంలో బ్రహ్మకు, విష్ణువుకు స్థానాలున్నాయి. ఈ లింగ రూపాన్నంతా పురుష శిలతో నిర్మిస్తాం. దీన్ని ఇముడ్చే పానవట్టాన్ని లింగాభిషేక జలం క్రిందకు పడేందుకు ప్రమిదలాగా వున్న శిలా భాగాన్ని స్త్రీ శిలతో నిర్మించాలి. ఈ మొత్తం నిలిచి వుండడానికి క్రింది భాగంలోని ఆధారపీఠాన్ని నపుంసక శిలతో నిర్మిస్తారు.

"ఇవి తారుమారైతే?"

"ఆలయకర్తకు ఫలితాలు తారుమారవుతాయని కాశ్యప శిల్ప శాస్త్రం వినదిస్తోంది....సరే....వెన్నెల వాలుతోంది. ఇక వెళదామా" చాపిన ఆమె

చేతిని అందుకుని పైకిలేపాడు. ధన ధ్రువ ఋణ ధ్రువాల కలయికలోని అంతర్లీన సంచలనం ఏదో మీటినట్లయింది ఇద్దరికీ.

"ఇది పాణిగ్రహణం" ఆమె నెమ్మదిగా అన్నమాట చెట్ల గుబురుల్లోని పక్షుల కూజిత ధ్వనిలో కలిసిపోయింది. ఇద్దరూ మౌనంగా, నడుస్తున్నారు.

"శిల్పాచార్యులు శిల్పమయ్యారా?"

"చిదలోపల ఏదో అర్ధనారీశ్వర శిల్పం రూపుదిద్దుకుంటుంటే చూస్తున్నాను."

"దాని లోపలనా?"

"కాదు—ఆ దివ్య రూపాలను" అతని కంఠంలో శిల ఉలి కలబడిన కరతాళంలోని ధ్వని!

"శిలకీ, శిల్పానికీ అతీతమైన అందని తత్త్వం వుందే దాన్ని చెప్పండి."

"ఎదురుగా కనిపిస్తున్న కళ్ళను గురించి చెపుతాను."

"ఎక్కడ?" అన్న తర్వాత నెమ్మదిగా అర్థమైందామెకు.

"మత్స్య నేత్రులు, కమల నేత్రులు, పద్మ పత్రాయత నేత్రులని విష్ణు ధర్మోత్తరం అనే శిల్పశాస్త్రం కోమలుల కళ్ళను విభజించింది. చేపిన మీల సోగకన్నులుంటే మత్స్యకంటి, పద్మంలా గుండ్రని కళ్ళుంటే పుండరీకాక్షి, పద్మం రేకులా సాగినట్లుంటే పద్మ పత్రాయతాక్షి అవుతారు. ఈ మూడు లక్షణాలు కలిసి వున్నవాళ్ళు అప్పటి శిల్పులకు కనిపించలేదనుకుంటాను." అతను తన్మయంగా ఆమె కళ్ళను చూస్తున్నాడు.

"కవిత్వంలో అతిశయోక్తులుంటాయేమో!"

"అసలు లేనిదే అతిశయోక్తి కాదుకదా!"

"మీరు కవయితలే."

"మీరు చతురులే."

"పరేకానీ—కళను గురించి ఇంకో రెండు మాటలు చెప్పండి."

"ఈ శిలలు ఆత్మస్థితిలో వున్న కళారూపాలు. ఇవి ఆకృతులు దాల్చిన వెంటనే పరస్పర అనుబంధానికి లోనవుతాయి. కళ శిలలకు కూడా అనుబంధాల్ని, ఆత్మీయతల్ని సృష్టిస్తుందన్నమాట" కళాత్మక ప్రపంచంలో అతని హృదయం సహస్రదళ పద్మంలా విచ్చుకుంది. అతనొక అపూర్వ దివ్యానుభూతికి లోనయ్యాడు.

"అయ్యగారూ! రండి—వేళమించుతోంది: రండమ్మా" బండివాడు హెచ్చరించాడు. ఇద్దరూ ఎక్కి కూర్చున్నారు. బండి భావగర్భిత హృదయంలా బరువుగా సాగుతోంది.

"ఈ రాత్రిపూట ఈ అరణ్యంలో మనం ..." అన్నాడు సౌహాఖ్యుడు.

"వాలుగుకాళ్ళ మృగాలకు తప్ప మిగిలినవాటికి మా నాన్నను గురించి తెలుసు" ఆమె కంఠంలో ఆభిజాత్యం తొంగుమంది.

వెన్నెల వర్షంలో ప్రకృతంతా ఏదో మైమరపుతో కురులు విప్పుకుని వేచిచూస్తున్న విరహిణిలా గోచరిస్తూంది. ఆమె ఎదలోని ప్రణయవాంతల్లో పక్షులు కూజిస్తున్నాయి.

ప్రవాళ అతని ఎదకు అంకితమైన భావనతో పూలమాలలా పరిమళిస్తూంది. బండికి అటూ ఇటూ తూగాడుతున్న పరదాల మధ్య ఏకాంతట వాళ్ళను గతస్మృతుల్లోకి మోసుకుపోతోంది. ఏదో భావం ఆమెను తొందరిస్తోంది. ఏ జన్మలోనో ఏదో ముగ్ధభావన తనను అద్వితీయ ప్రేమకు దూరం చేసిందన్న పశ్చాత్తాపం అతని పాదాల్ని స్పృశించాలని తొందరించింది.

* * *

"భూమాత ఒడిలో అల్లరి చిల్లరగా పెరుగుతున్న శిలల్ని, బండ- దొంగల్ని గురువులు నిర్బంధించినట్లు శిల్పులు శిల్పాలుగా [illegible]

శిల్పి, కళతో శిక్షించి గురువులా సంస్కరిస్తాడు. అప్పుడు శిల శిల్పమవుతుంది. అప్పుడు శిల్పం వైదిక ఉద్యానాల్లో వనమయూరి అవుతుంది. మాంత్రిక మహానగరాల్లో రాకుమారి అవుతుంది. ఆలయాల అంతరంగిక మండపాల్లో కోకిలాలికే నకలు చేస్తుంది.

మనిషి మేధ తన కళాతృష్ణను తీర్చుకోడానికి ఉలుల- వాలుకన్ను శిలాతలాలకేసి చాపుతుంది. అప్పుడు శిలా సుషుప్తి నుంచి ఒక ఉషస్సు బింబాలు బింబాలుగా తొంగిచూస్తుంది. ఆ బింబాలు (శిల్పాలు) శిల్పికి స్వర్ణకుంభాల్లా దర్శనమిస్తాయి. కనక స్తంభాల్ని చీల్చుకుని సాక్షాత్కరించిన అపర అవతారాల్లా వుంటాయి శిల్పాలు. శిల్పి వాటి సోయగాలకు ప్రహ్లాదుడవుతాడు.

శిల్పాలు శిలాతల్పాల నుంచి అమరగాయకుల్లా, అప్సర కన్యల్లా నిదురలేస్తాయి. శిల్పాలు వైదిక వీణియలు. బిగించిన తాంత్రిక తంత్రులనుంచి ఏదో మాంత్రిక మహాఘోష ఘనీభవించని గానంలా గాలికి రేగుతూ దిక్కుల్ని ఋక్కులతో పునీతం చేస్తుంది.

సున్నితత్వం అంతరంలో విశ్వాత్మ మూలబీజం దాగివుంది. పరమాత్మ నుంచి గంగావతరణం లాంటి ప్రచండ గమనంతో విశ్వమంతా ప్రవహిస్తున్న అమరాగవాహినిలోని కళా సమ్మోహన శక్తికి శిలలూ తలలు వంచుతాయనడానికి శిల్పాలే మనకు సాక్షి." తన్మయత్వంతో చెప్పుకుంటూ నడుస్తున్నాడు సౌరాఖ్యుడు. తన ప్రక్కన ప్రవాళ వస్తూందా లేదా అని కూడా అతను చూసుకోవడం లేదు. ఆలయాల్ని, శిలాతలాల్ని చూస్తూనే అతను ఏదో ఆవహించినట్లు అయిపోతాడు.

"మీరు శిలలు పిలుస్తున్నట్లు స్పందిస్తారు. అరణ్యాలు ఆహ్వానిస్తున్నట్లు త్వరపడిపోతుంటారు." అంటూ చిరునవ్వుతూ సౌరాఖ్యుని దగ్గరగా వచ్చి కళ్ళలోకి చూస్తూ నిలుచుంది ప్రవాళ.

"ప్రకృతి నాకు విశ్వకర్మ రచించిన కళాకృతిలా భాసిస్తుంది. భాష లేని భావాలు పచ్చదనాలు ప్రాకిన చోటల్లా కనిపిస్తాయి. ఎండలు, కొండలు కోవల వెన్నెల్లు, ఇసుక ఎడారులు, వాటిమీద గిరికీలుకొట్టే పడగాడ్పులు, సముద్రాలు, విప్లవకారుల్లా సుళలు విచ్చి సంచరించే తుఫానులు, తరతరాల అనుభవాల్ని వ్యక్తీకరిస్తున్న శిలాలు, సంసార జీవనుల్లా సాగిపోయే మబ్బుల గుంపులు—ఒకటేమిటి ఎటు చూసినా ఆత్మీయుల హావభావాలు వెల్లువలెత్తడం లేదూ!"

"నాకు ఆ భాషగానీ, ఆ ఘోషగానీ ఏమీ అంతుపట్టడం లేదు." గరికపోచను విరిచి విసురుగా విసిరి విసుగును ప్రదర్శించింది.

"నీకు అర్థం కాలేదని విన్నా నువ్వు మభ్యపెట్టుకోకు. ఒక మహోజ్జ్వల మహస్సును ఒక మాంసరాష్ట్రం ఎంత కాలమని నిర్బంధింప గలదు చెప్పు" లాలనగా నవ్వాడు.

"అదిగో మళ్ళీ అదే భాష—" చురచురా చూసింది.

"శరీరం కళకు పంజరం కాదు—పాదు అంటున్నాను" అని సదయంగా అన్నాడు.

"అలాగా— అయితే రోజూ కావలసినన్ని నీళ్ళు ముప్పూటలా పోసు కుంటున్నానే—ఈ పాదులో నుంచి ఒక కళాంకురమూ మొలుచుకురాలే దేమిటి?" అతని సమాధానం కోసం ఆసక్తిగా వింటూ నిర్లక్ష్యంగా ఎటో చూస్తూంది ప్రవాళ.

"ప్రవాళా! నీ చూపు, నీ రూపం, నీ హృదయం, నీ లోపలి తేజస్సు నీ శరీర పారదర్శక ఫలకం గుండా వర్చస్సుగా వెలికి ఒలికిపోతున్నదంతా కళ కాదంటావా? నీ మాటల రెక్కలకంటుకుని వెలికివచ్చి రేగుతున్న నీ ప్రేమ పుప్పొడి చూడు నీ చూపుల అంచులమీద గులాబీల గుత్తుల్లాంటి భావ గుచ్ఛాలు తేలివస్తూనే వున్నాయే మరి! నీ రూపం ఒక కళావేదికలా వుంది

"మరి మీరు గంగరావి పూవును కూడా ఎక్కడో పడేశారే! మరిప్పుడెలా? అతడేది చెప్పినా అది ఆమెకు ఉత్తేజాన్నిస్తోంది. అతని ప్రశంస ఆమెలో అపూర్వమైన అనుభూతుల వాకిళ్ళు తెరుస్తోంది.

"చెప్పానుగా అందమైన అమ్మాయి దగ్గరున్న వాడికెవ్వడికీ ఈ పనికిరాని చిల్లర సరుకును సరకు చేయనవసరం లేదని" చూసీ చూడనట్లు ఆమెను చూస్తున్నాడతను. అసంకల్పితంగా ఆమె శరీరం కంపించింది. అరుణ శిలా శకలాన్ని ఆమె పెదవి దగ్గర వుంచాడు. బుగ్గల కానించాడు. అరచేతిలో వుంచాడు. పారాణి పాదాల మీదకి వంగి చూశాడు. ప్రవాళ ఒడలెల్లా ప్రణయ భావంతో తడబడిపోతోంది. ఎగసిపడుతున్న ఎదను అదుపు చేసుకుంటూ ఇంకోరకం రాతిని చూడడానికన్నట్టు ముందుకు నడిచింది.

"ఇది పసుపురాయి అనుకుంటాను" దూరంనుంచే గట్టిగా అంది.

"అవును" వెన్నెల అలలమీద తేలియాడుతున్నట్టు గాలికి కదలాడుతున్న ఆమె ముంగురులు చూస్తూ ఉద్వేగానికి లోనయ్యాడు.

"మరి ఈ పసుపు వర్ణానికి...."

"మీ ఒంటి ఛాయతో బంగారం కలిసిపోతుంది. గుమ్మడి పూవు మీ రంగుతో రాజీకొస్తుంది. చామంతి దేమంత గొప్ప కాంతికాదు మీ మైఛాయముందు! ఆవాల పువ్వొచ్చి సవాలు చేసేదేముంది—ఇంకే" ఆమె చేతినున్న పలుచైన గాజులు గలగలలాడుతుండగా చేతులు చాచింది. అతను పసుపు శిలను ఆమె చేతిమీదుంచి ఆ వర్ణాన్ని విశ్లేషించుకున్నాడు.

"ఇక మిగిలింది నల్లపురాయనుకుంటాను" తనను తానే సంబాళించుకుంటూ, తూలిపోతున్న శరీరాన్ని కూడగట్టుకుని నడుస్తోంది ప్రవాళ.

"అవును—ఎక్కువగా శిల్పకళకు ఈ రాతినే వాడుతారు."

"దీనికి ..." సెలయేటి నీటిలో ఈదులాడే [illegible]మీనుల్లా వెన్నెల వెలుగుల్లో ఆమె కళ్ళు రెపరెపలాడాయి.

"ఇదిగో ఇవే—ఈ చేపకళ్ళ నలుపే ఈ రాతికి పోలిక" చిరు నవ్వాడు. ప్రవాళ కళ్ళు పెద్దవి చేసి అతన్ని చూసి తల దించుకుంది.

"నల్ల కలువ, నెమలి కంఠం, నల్లని తేనె, నల్లని పెసలు ఇవన్నీ ఈ నల్లరాతికి ఉపమానాలు. ఇవన్నీ నీ కురుల్లోనే కాపురం వుంటున్నాయి మరి. గేదె ముక్కును కూడా నల్లరాతి రంగుకు పోలిక తెచ్చారు శిల్పులు" ఓరగా చూస్తూ కళ్ళతోనే నవ్వాడు. కంగారుగా చూసిందామె.

"చెప్పానుగా ప్రకృతికి ప్రతిరూపం స్త్రీ అని!"

"ఇంకా నయం నేనే గేదెలా వున్నాననలేదు."

ఇద్దరూ నవ్వుకున్నారు. నిర్మానుష్యమైన ఆ కొండపానుపు ఆ నవ్వుల్ని తనమీదుగా తాలువార్చుకుంది.

"ఇక మిగిలింది తెల్లరాయి" సౌరాఖ్యుడు ఆ పరిసరాల్లో కలయ జూశాడు.

"బాబూ! నన్నొదిలెయ్—ఈ ఉపమానాలతో మానం తీయక" కాస్తంత బెరుగ్గా చూసింది.

"అదేంలేదు—శంఖం, పాలు, ముత్యం, స్ఫటికం, మల్లె, మొల్ల అన్నారంటే—నీ ఎదలో మల్లెలున్నాయి. నీ ముఖంలో స్వచ్ఛమైన నవ్వు లున్నాయ్ - చాలు."

"మీ శిల్పులు తెల్లకొంగను మరచిపోయినట్టున్నారే పోలికకు."

"తెల్లదనానికి ఐరావతం కూడా వుంది కదా" అతని చూపులు పయ్యెద మీదుగా పరుగులు తీయడంతో ఆమె లతలాంటి ఒంటిమీద పుల కింతలు పూయసాగాయి.

"అమ్మా చాలా పొద్దు గడిచింది. ఇక వెళ్ళకపోతే నాన్నగారు అందోళన పడతారు" అన్నాడు బండివాడు.

"అలాగే...."

"నెమ్మదిగా దిగాలి" అసంకల్పితంగా ఆమె అతని చేతిని ఆసరాగా అందుకుని నిలదొక్కుకుంది.

ఆమె స్పర్శలోని విద్యుద్ఘాతంతో మూలాధారంలోని కుండలినీ శక్తి సహస్రారానికి ఎగబ్రాక సాగిందతనికి. బండిలో చాలాసేపు మౌనంగా కూర్చున్నాడు.

"కళను గురించి రెండు మాటలు చెప్పండి" అందామె.

"ఇప్పుడేమీ చెప్పలేను."

"ఎందుకని" అతని చేతిని తన ఒడిలోకి తీసుకుని సున్నితంగా స్పృశించి చూసింది.

కళను సృష్టించే వాళ్ళకు కూడా కళామతల్లి స్వరూప స్వభావాలు తెలియవు. అందుకని—"

"కళ ఒక అగ్నిశక్తి ప్రవాహా!" ఆగిపోయాడు.

"బాగుంది చెప్పండి" ప్రేరేపించింది.

"కళ ఒక అగ్నిపక్షి. దానికి బంగారు రెక్కలు, వెండి ముక్కు వుంటాయి. అది వాలిన ఎండుకొమ్మ కూడా పూలకు బదులు నిప్పు బంతుల్ని పూస్తుంది. కళ కళాకారుని నిరంతరం కౌగిలించుకునే వుంటుంది. కళ కన్నెరికం చెదరని అర్ధాంగి. ఆమె నిత్యశోభన. ఆమె పక్షాల సంపదతో కళాకారుని వశీకరించుకుని కూలివానిగా తనవెంట తిప్పుకుంటుంది. ఆమె యువరాణి. ఆమె తన వశమైన ప్రతిహారి దాసినకు భాగ్యవతి పొందు అందినంత సంబరపడతాడు కళాకారుడు. కళ కళావతి. తన సోయగాలతో మతి పోగొడుతుంది అసాంతం అందాలను అమాదనం అందిస్తున్న అపూర్వ అతిథిలా నిరంతరం వినూత్నంగా కళాకారునితోనే కాపురంచేసే జవరాలు కళ. నిత్యం తను అందించే ప్రణయ పరిష్వంగంలో [illegible] మాత్రం గోప్యం చేస్తుంది. తన వికటాక్షి కుసులతో కళాకారుని కళ్ళు

కప్పుతుంది. తన తీగిమీరిన ఎద బిగువులతో ఊపిరాడనీకుండా హత్తుకుంటుంది. తన లాలనలోని తన్మయతతో అరగన్నుల అనుభూతికి గురి చేస్తుంది. తాను మెలకువతోనే వుంటూ సత్యాన్ని మాత్రం మర్మంగా దాచుకుంటుంది, కళకు సత్యానికి చుక్కెదురు. సత్యం విస్తరం. నీరసం. కళ మిథ్యా తథ్య మధ్యమం, మధురం. అందుకే కళ యువరాణి. కళా కారుడు మనసువడ్డ దాసీడు.

ఆమె అవయవాలు ఊహకు అందరాని సుందర సీమల కోమల మధురళావాలు. ఆమె కళ్ళు వసంతాలు బాలెంతరాళ్ళై తిరుగాడే నందన వనాలు. ఆమె కదలికలో లాస్యాలు—ఆమె మాటలలో లాహిరులు—ఆమె పిగలో పండె రంగు పొద్దు బంతులు. ఆమె జగన్మోహన మంత్రం. కళ చంద్రకళ. నిత్యపున్నమలు పూయించడం కష్టసాధ్యం.

ఆమె రేరాణిలా తన పారాణి పాదాలతో పలుచని చీర అంచుల్ని సుతారంగా పైకి పట్టుకుని వెన్నెల తీరాల వెంబడి, రాయంచల కోలా హలంలా ధ్వనిస్తున్న కింకిణులతో సాగిపోతుంది. ఆ దృశ్య దర్శనంతో పవిమాలిన వనమాలిలా భ్రతిమాలుకుంటూ కొండకోనల వెంబడి వడిచి పోయే బాటసారి కళాకారుడు. ఆమె నవ్వుకోసం ప్రతిరాత్రిని శివరాత్రి చేసుకుంటాడు. ప్రాణాన్ని చూపుల పూలతూపులుగా సంధిస్తాడు. కళ కళా కారునితో కలిసిరాని కల. కల వస్తుంది. కళనిస్తుంది. కళ సంకెళ్ళతో కల కలం రేపి లాక్కుపోతుంది. ఆమె సువర్ణ లావణ్య క్రీడకోసం తనను క్రీగంట చూసి రమ్మంటుందని రమించే హృదయంతో శ్రమిస్తాడతను. తీరా రమ్మంటుంది. కమ్ముకుంటుంది. ఒరుసుకుని మెరుస్తుంది. హత్తుకుని ఉన్మత్తతతో కురుస్తుంది. చెప్పరాని తీపి తప్పులకు లొంగి కారుణ్యంతో కారుమేఘంలా దిగివస్తుంది. సంభోగరస కుంభవృష్టి కురిపించి వెలిసి పోతుంది. తిరిగి ఏమీ ఎరుగని ఏ మాత్రం కరగని కన్నెబిగువుగా మారి మరులుగొంటుంది."

"అమ్మా" బండిని ఆపి చాలాసేపు నిలబడ్డాడు బండివాడు.

"తిరిగి రేపు వెళదాం" ప్రవాళ అతి కష్టంగా అతని దగ్గర సెలవు తీసుకుని మహల్లోకి వెళ్ళిపోయింది. అతను మనసును ఆమెతోపాటూ పంపి తనువును తన విడిదికేసి నడిపించుకుపోయాడు.



# 8

ఆత్మ చైతన్యాన్ని విశ్వచైతన్యంతో సంధానిస్తే అనంత చైతన్యం ఉద్భవిస్తుంది. ఆ సంధానకర్త శిల్పి. ఆ సంధాన సాధనం శిల్పం. కళాకారుడు మానవుణ్ణి మహాత్ముడిగా మార్చే యత్నం చేస్తాడు. మనిషి అల్పజీవే కానీ భగవంతుని అనల్పత్వాన్ని గుర్తించడానికి పరమాత్మకు మనిషి ఉనికి ఎంతైనా అవసరం. కాలం భైరవుడయితే ప్రకృతి ఆనందభైరవి.

మహోన్నత శిఖరాలమీద రెక్కలు విప్పుకునే నీలి విశాలాకాశ మేఘం దేవలోక ఆరామాల నుంచి సంజీవని ఓషధిని ముక్కున కరచుకొస్తున్నట్లు మెరుపుతో తళతళ లాడుతుంది. ఆ మెరుపు మూర్ఛిల్లే సాగరాల మీద పడి ఒళ్ళు విరుచుకుంటున్నట్లు ప్రకాశిస్తుంది. రోదసి నుంచి ఏదో హెచ్చరిక వచ్చినట్లు సంద్రాలు క్షణకాలం నిశ్చలంగా చూస్తాయి.

అసలు ఈ ఖగోళ గోళాలన్నీ విండుసున్నాలు. ఇవి ఏ అంకె ప్రక్కనో చేరితే తప్ప వీటికి విలువలేదు. ఆ అంకె ఒకటి, ఏకైక పరమాత్మ. సూర్యోదయాలు, చంద్రోదయాలు పరమాత్మ పరిపాలనకు నిదర్శనాలు. అసంఖ్యాకాలైన తారలు, అనంతాలైన ఆకాశ కాంతిమైదానాలు, ప్రజ్వలించే గోళాలు హిరణ్యగర్భుని అనూహ్య స్వప్న స్ఖలన బిందువులు. విశ్వం విశ్వేశ్వరుని పగటికల. ఆ కిరణాలతో రూపొందిన శరీరాలు తమస్సుతో మైత్రికి ఇష్టపడతాయా?

పగడాలు పిండిన వెన్నెల దీవుల్లో విశ్రమించే విహంగాలు అప్పుడప్పుడూ జగడాలకు దిగినట్లు మనలోని సత్సంకల్పాలు ప్రేమ భావాలు క్వచిత్తుగా సంఘర్షించుకోవడం కద్దు.

"శిల్పిగారూ ఎక్కడ విహరిస్తున్నారు?" అతని పెదవుల మీది దరహాసాన్ని చూస్తూ అడిగింది ప్రభాత.

"ప్రేమభావాల సంఘర్షణను గురించి ఆలోచిస్తే నవ్వొచ్చింది అంతే" ఆమె సుస్మిత సౌందర్యాన్ని సుతిమెత్తగా తాకాయి అతని చూపులు.

"అసలు మనిషి ప్రేమ అనే ఇంత పునాదిని ఒంటికి పట్టించుకోక పోతే రెండుకాళ్ళ కీటకమైపోతాడు. వాడు సాధించే విజయాలన్నీ బూటకమై పోతాయి. ప్రేమ వినా మనిషి కార్మిక క్రిమి అని నా వుద్దేశం." సిగలోని పూలను కళాత్మకంగా సవరించుకుంది.

ఇంత సుకుమార సౌందర్యంలో అంత పదునైన భావాలు దాగున్నాయా? ఆశ్చర్యాన్ని అతని చూపులు దాచుకోలేకపోయాయి. అతను ప్రవాళ మధు హృదయ కోశాల లోతులు తడవాలనుకున్నాడు. అది పలి వంటె సంపెంగ మాలికలపై సిందూర మధూళిక రాలుతున్న సొబగుతో ఎదల్ని గుబగుబలాడిస్తోంది. ఆ వెలుగుల నలుగులు సోకిన ప్రవాళ అందాలు పిందెలు వేస్తున్నాయి. ప్రవాళలోని ఆకర్షణ తీవరించిన అనుభూతిని రేపుతోంది.

"మీరు కళను గురించి ఆ రోజు ప్రవచించిన భావఝరీ మాధురిలో నేనింకా ఓలలాడుతూనే వున్నాను. నన్ను ఆకట్టుకున్న ఆ కళా నిర్వచనాలు అనిర్వచనీయాలు. ఇది ముఖస్తుతి కాదని మీరు నమ్మగలిగితే చాలు" ఆమె నయనాలలో కదలాడిన జలద మాలికలు అతని చూపులను ఆర్ద్రం చేశాయి.

"అవును ప్రవాళా! కళలు పరంజ్యోతి ప్రసరించే కాంతికిరణాలు. అవి ఏ ఎదముంగిట మహర్షుల్లా అడుగిడుతాయో వాళ్ళు కళాతపస్వులవుతారు. శిల్పభావాలేవో రోదసీ హృదయాన్ని ఛేదించుకుని కాంతి కిరణాలై ప్రసరించి శిలాతలాలమీద సిరి మువ్వల సవ్వడిలో నర్తిస్తాయి. ఆ బృంద నృత్యం తర్వాత చిరు స్వేద బిందువులతో అర్చించిన

అస్త్రాల్లాంటి ఆ కిరణాలు తమ నివాసానికి అనువైన శిల్ప హృదయాల కోసం తీవ్రంగా అన్వేషిస్తాయి. అప్పుడు ఆ శుభ ముహూర్తంలో ఆ మార్మిక కిరణాలు వరించిన వారందరూ శిల్పి బ్రహ్మలవుతారు.

ప్రవాళా! ఈ ఎండమావులు స్వారిచేసే శిలాతలాలమీద అతిశప్త అర్ధశిలాశాలేవో అహల్యల్లా ధూళి ధూసరితంగా తమ అద్భుత అందాలపై శిధిల శిలాఖండాల్ని ఆరోపించుకుని అజ్ఞాతవాసం చేస్తున్నాయి. ఆ శిలల చెలుల మలిన వస్త్రాల్ని గోముగా తొలగిస్తూ ఉలితో కలబడే ప్రణయ శిల్పి కావాలి. ఆ శిలల కన్నెచెరలు తీరే సుశోభన శుభవేళ కోసం ప్రకృతంతా అవ్యక్త అభిసారికలా వేచి వుంటుంది.

విశ్వకర్మ దరహాసం ఉలుల అధరాలమీద ప్రతిఫలించి శిలల తపస్సు ఫలించే తరుణం ఒకటి వస్తుంది. అప్పుడు శిలల శకస్థావల్లోకి చొరవతో చొరబారే ఉలుల ఉపరతులకే జవరాళ్ళు కామన్న రాళ్ళ గొంతుల్లో మన్మథరాగాల గలగలలు వినవస్తాయి" ఆమెను స్పందనానికి గురిచేసి తన వైపుకు మలచుకునే మార్గం దొరికిందనిపించింది. లోహాల్ని వేడిమీదే వంచుకోవాలన్న ధర్మసూక్ష్మాన్ని విస్మరించరాదనుకున్నాడతను. ఏ జన్మలో ఏ అమృత చషకం పెదవిని తాకి జారిపోయిందో తెలియదు కానీ అతని మనసుకు ఆమె ప్రేమను వదలుకోకూడదనిపించింది.

"శిల్పిగారూ! ఉలిని తనకు చిత్రహింసలు పెట్టే శస్త్రంగా అనుకున్నంతవరకూ శిలకు మోక్షం లేదు. ఉలి శస్త్రచికిత్సకు తలవంచిన రాతికే ఖ్యాతి వస్తుందని, ఆ శిలే పూజనీయమవుతుందని తెలిపినదాన్ని" ప్రవాళలో ఏనాటి పొరబాటో ఎడబాటుకు బాటవేసిన చేదు అనుభవం ఒకటి ఎదను తుదుపుతోన్న బాధ వదలడం లేదు. అది వెన్నంటుతోంది — వేటాడుతోంది. అందుకే అతనికి అనుగుణంగా తాను ఒదిగిపోవాలనుకుంటోంది.

"ప్రవాళా! ఆకాశ ఆశ్రమ భిక్షుకుల్లా మిలమిలమని విహరించే ప్రణయ తేజోబింబాల్ని ఒక్కదాన్నయినా హృదయం చుంబించకపోతే

అధరం విప్పుకోదు. కొండల కొండచిలువల కుశిల్లో నిదురిస్తున్న యక్షిల్లా శిలాజల్లాశయాల్లో శిల్పాలు మునిగి పడివున్నాయనిపిస్తుంది వాటు.

పర్వతాల లోయల్లో, లోయల గుహాంతరాలలోని శిలల గర్భాల్లో ఏదో శిల్పాకాంక్ష వెన్నెల కిరణాల గర్భాధానంతో ఎదుగుతున్న స్పందన! శిల్పికోసం తపిస్తూన్న ఆ శిలల తమితరంగాలు శిలానందేశాల్లా ఆ శిల్పుల్ని తాకి తమ ఆకర్షణాస్థానాలకేసి రప్పించుకుంటున్నాయి.

శిల్పాల అజ్ఞాతవాస కఠినపురాలే శిలా సమూహాలు. శిలా సందో హాలు శిల్పాల మారువేషాలు. ఉలి తమోహరణ కిరణం. అది శిలల చీకటికోణాల్ని భేదించుకుంటూ శిల్ప పరిధుల్ని అధిగమించకుండా శాస్త్ర కక్షలో చరించే ఒక పరలోక పాదచారి. ఉలి విశ్వశిలా యజ్ఞాగ్నినుంచి వెలికి వచ్చి ఘనీభవించిన ఒక కాంతి కిరణం.

యౌవనంలోని ఈ శిలలన్నీ తమ కలల్లో కాంతి లోకాల్లో విహరిస్తూ, కళారాధకుల కళ్ళ కొలమల్లో ప్రతిఫలిస్తున్నాయి. ఈ శిలలు పించాలు ముకుళించుకుని ఒదిగి కూర్చున్న మయూరాలు. శిలల కంఠాల్లో చిక్కుకుని వెలికి ఒలికి పడాలని తొట్రుపడుతున్న మూగరాగాలు శిల్పాలు. ఈ శిలలు శిల్పాల్ని మోస్తున్న విందు గర్భిణులు. శిల్పి శస్త్ర చికిత్స చేసే వైద్యుడు." తను ఆవిష్కరిస్తున్న ప్రతి భావచిత్రం ప్రవాళ ఎదలోనూ, కళ్ళలోనూ అసూహ్యమైన కవళికల్ని తెస్తూండడం అతని దృష్టిని దాటిపోలేదు.

"చాలు శిల్పీ! ఇక నీ ఉలి భాషను భరించలేదీ చెలి" ఆమె లేచి నిలుచుంది. ఆమెముందు పూలతో తూగాడుతున్న లోతైన కొండ లోయ కనిపిస్తూంది. మాటు రెక్కలుంచే ఇతనితో కలిసి ఆ మధూర పీతభూములకేసి ఎగిరిపోయేవాళ్ళం. అవును — 'ఇకచాలు – కవి క్రౌంచమా ఇక కూజించకు' — ఏ జన్మల గొంతుల వాక్కులివి! ఎద

లోతులనుంచి నివిపిస్తూ నినిపిస్తూ హోరున పూపేస్తున్న ఈ జ్ఞాపకాలు ఎక్కడివి? ఎక్కడివీ జనవాంతర సౌహృదాన్ని పదిలంగా దాచుకున్న పరిమళ పుష్పాది బరిణెఖ? ఎక్కడివీ కుంకుమ శోభిత పూల ముకుళాలు? ఇవి ఇప్పుడు విచ్చుకుని నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయెందుకు? ఇతనెవరు? గతమేమిటి?

"ప్రవాళా పూలలోయల్లో విహరిస్తున్నట్టున్నావు" ప్రేమ పరిమళ మేదో అతనినుంచి వెలువడుతుండగా దగ్గరికి వచ్చాడతను "నువ్వొక మొగలిపూల మేఘం. నేనొక కడిమిపూల తిన్నె. ఇక నేను నీ వ్యర్థకు దూరంగా బ్రతకడం భారం" ఆమె అనుమతి లేకనే తలుపుతీసిన పంజరం నుంచి పక్షులెగిరి పోతున్నట్టు పెదవుల్ని తోసుకుని ఆమెనుంచి ఆ మాటలు వెలువడ్డాయి. "నువ్వు — మాట్లాడుతున్నావా? కలగంటున్నావా? ప్రవాళా" పొగడ దండలాంటి ఆమె కోమలహస్తాన్ని పట్టుకుని తనవేపు తిప్పుకున్నాడు సౌరాఖ్యుడు.

"ఈ పండె వెలుతురు — ఈ పూలలోయలు, అటు ఎదుగుతున్న వెన్నెల బింబం, ఎత్తైన ఈ కొండలమధ్య విశాలమైన వనాలు, పక్షుల పిచ్చిపాటలు, ముందూ వెనక చూసుకోకుండా దూకుతున్న ఆ సెలయేరు — ఇవన్నీ ...."

"చెప్పు—ఇవన్నీ ...."

"నన్ను నీ వేపుకు...."

"ఆగిపోయావేం."

ఇద్దరూ భావగర్భితంగా చూసుకున్నారు. అది వెన్నెలవేళ కాబట్టి ఉత్సాహంతో అడవంతా కేరింతలు కొడుతున్నట్టు చిలుకలు, కోకిలలు, గోరు వంకలు, పికిలిపిట్టలు, పసుల పాలిగాళ్ళు, పులిచంద్రాయిలు, అడవికోళ్ళు,

నెమళ్ళు, బెళవాయలు, కొంగలు, పాలపిట్టలు, పేరు తెలియని పిట్టలు, ఏవో మూగజీవులు రకరకాల శబ్దాలతో కొండచెరియల్ని ప్రతిధ్వనింపజేస్తు న్నాయి. ఆ యువప్రేమికుల హృదయాల్లోని తరుణభావ విహంగాల కిలకిలలకు ప్రతీకగా వుందా అరణ్య సామ్రాజ్యం.

"చిత్తం చైతన్యాత్మకం. అది పూరుకోదు. దేన్నో కోరుకుంటుంది. కోరుకున్న చోట చోటు దొరక్కపోతేనూ పూరుకోదు" తనలో కదిలే భావావేశానికి కొన్ని అక్షరాలు దొరకడంతో ఈ మాటలు వినిపించాయి శిల్పాచార్యుడికి.

వెళ్ళి అతని కౌగిలిలో ఇమిడిపో—మదన బాణఘాత రాజహంసిలా అతని ఒడిలో ప్రణయ హింసల ననుభవించు—వెళ్ళు వెళ్ళు వెళ్ళు—ఎద ప్రాణచెలిలా తొందరించడంతో ప్రవాళ రెండడుగులు ముందుకేసింది. అతను ఒకడుగు ముందుకు రావడంతో అనూహ్యంగా దూరం తగ్గి పోయింది. ఆమె పరువాలు అతని ఎదకేదో సందేశాలు అందిస్తున్నాయి. అతని ఊరు జోడు సంకేతాల్ని వెలువరిస్తూంది. ఇద్దరు గాఢ పరిష్వంగంలో ప్రకృతిని మరచిపోయారు. వెన్నెలతో కలిసిన పూలు వాళ్ళమీద రాలు తున్నాయి. అవి వనరాణి జార్చిన తలంబ్రాలు. ఇద్దరి ప్రణయ వృత్తులు దివ్య పరిమళ ప్రేమ శ్రుతులై వినిపిస్తున్నాయి—ఈ కౌగిలికి పణంగా నా ప్రాణం పెట్టగలను—ఈ అనుభూతికి పరిహారంగా నా జీవితాన్ని అర్పించగలను. శారీరకంగా ఏకమైన కౌగిలిలో అలాగే మమైక స్థితిలో నిలుచునే వున్నారు వాళ్ళు. ఆ కౌగిలి ప్రణయాగ్ని హోమంలో వెన్నెల ఆజ్యమై కురుస్తోంది.

"ప్రవాళా" నిలబడే తనమీదకు ఒరిగిపోయిన ప్రవాళను కదిపా డతను. దూరంగా బండివాడు గుర్రాన్ని అదిలిస్తున్న సవ్వడి ఆమెకు వినిపించింది. వెంటనే తన తండ్రి, వంశగౌరవం, తన ప్రణయ స్థితి

గుర్తురావడంతో తేరుకుంది. వెన్నెల కిరణాలు రేకుల్ని బీటలు కొట్టి విచ్చుకోజేసిన సిగ్గుమొగ్గలా వుందామె.

"బాబూ మీరు చూపించిన చోట పట్టిని తొలగించి, పూడిన శిలా భాగాన్ని బాగా కనిపించేలా చేశాను. చూద్దురుగాని రండి. అమ్మగారూ! ఎగుడు దిగుడు దారి — చూసి అడుగులేయండమ్మా. లేకపోతే నాన్నగారు చంపేస్తారు నన్ను" ఆ వంశం మీద తనకున్న గౌరవాన్ని విశ్వాసాన్ని వ్యక్తం చేస్తూ ముళ్ళకంపల్ని దారినుంచి తొలగిస్తూ పాగిపోతున్నాడతను. ప్రణయ ప్రకంపనల్ని కట్టుకుని యథాస్థితిలో నిలపడానికి వాళ్ళిద్దరూ ఎంత గానో యత్నించవలసి వచ్చింది.

"ఇదో ప్రవాళా' ఈ శిలను మనం విగ్రహయోగ్యంగా గుర్తిం చాక...."

"విగ్రహ యోగ్యంగా ఎలా గుర్తించాలి?"

"నీకు ముందే చెప్పానే శిలల పరిశీలనకు సంబంధించి."

"ఔనౌను."

"ఇంకా కొన్ని సూచనలున్నాయి."

"ఏమిటవి?"

"భూమిలోపలికి వున్న రాతినే తీసుకోవాలి. రాతికి గాయం అయి వుండకూడదు."

"అంటే?"

"ఖండించబడో, పగులగొట్టబడో వుండకూడదు శిల."

"అలాగా."

"అయా రంగులలో వున్న రాళ్ళకు మచ్చలున్నాయా లేదా అని గమనించాలి" సౌరాఖ్యుడు పగటివేళల్లో క్షుణ్ణంగా ఆ శిలాతలాల్ని పరిశీలించాకే వెన్నెల వేళల్లో సునాయాసంగా శిలాభేదాల్ని గుర్తించగలుగు తున్నాడు.

"ఆడవాళ్ళకే కాదు రాళ్ళకూ మచ్చలుంటాయన్నమాట."

"ప్రకృతిలో వున్నవాటికన్నిటికీ మానవ ప్రకృతిలోని అన్ని లక్షణాలూ అంటుకుని వుంటాయి."

వెన్నెల కన్నెలా కళ్ళతో నవ్విందామె.

"నేరేడు పళ్ళంత మచ్చలుంటే ఆ శిలను వదిలేయాలి శిల్పి. నల్ల ద్రాక్షపళ్ళంత మచ్చలున్నా వదిలేయాలి." ఇంకా దారం పేనినట్లు, సూర్య కిరణాలు వాలినట్లు, వర్షధారలు జారినట్లుగా శిల మీద రేఖలు కని పించినా అవి విగ్రహాలకు పనికిరావు" ప్రణయ భావాలనుంచి బయటపడి ఇంత త్వరగా ప్రవాళ శాస్త్ర విషయాల్ని ఆకళింపు చేసుకోవడం సౌరాఖ్యకి ఆశ్చర్యాన్ని కలిగించింది. ఈమెలో ప్రణయతృష్ణతో సమానంగా విజ్ఞానతృష్ణ వుందన్న విషయాన్ని అతను గ్రహించాడు.

"ఈ శిలలకు, దిశలకూ ఏదన్నా సంబంధముందంటారా?"

"అవునవును—విగ్రహానికి సేకరించే శిల భూమిలో ఎటువైపుకు వుందో శిలమీద సంకేతించుకోవాలి. ఆ శిల తూర్పు పడమరలుగా వుందనుకుంటే తూర్పువైపుకు వున్న శిలాభాగంలో శిరస్సును చెక్కవలసి వుంటుంది పశ్చిమం వైపున్న శిలాభాగంలో పాదాలు చెక్కాలన్నమాట. అదే ఇంకో శిల ఉత్తర దక్షిణంగా వుందనుకుందాం—ఉత్తరంగా శిరస్సు వుండాలి. దక్షిణంగా పాదాలు వస్తాయి. ఇది ప్రధాన విషయం."

"ఇంత పెద్ద శిలల్ని తరలించడమెలా?"

"తాటి చెట్లను పడగొట్టి వాటిని రెండుగా చీల్చుతారు. మట్టిని ఏటవాలుగా పోసి దానిమీద ఈ చీలిన మానుల్ని పరుస్తారు. బలమైన త్రాళ్ళతో రాళ్ళను బంధించి ఏనుగులతోగాని, ఎద్దులతోగాని లాగించి తరలిస్తారు. ఇది పెద్ద శ్రమతో కూడుకున్న పనే."

"జీవితాంతం మనిషిని శశి కళవళపెడుతూనే వుంటుందనుకుంటాను."

"నగ్న సత్యాన్ని గుర్తించావు."

"మరి ప్రేమ."

"అది అన్ని కళలకు ఆది. ఇక దాని దారుణ కారుణ్య హస్త లాఘవాన్ని నీకు వివరించడం అసంభవం."

"మీరు సమర్థులే చెప్పండి."

"మీ ఆజ్ఞ – అనుల్లంఘనీయం."

"అన్నిట్లోనూ ఇలానే అంటారా?"

"విష్పందేహంగా"—ప్రకృతిలోని శబ్దాలన్నీ ఓంకారం నుంచి వెలువడినట్లు, ఆ ప్రణవంలోనే లయమవుతున్నట్లు కళలన్నీ ప్రేమ నుంచే పుట్టాయి. ప్రేమ జీవితాన్ని మథిస్తుంది. మనిషి దేన్ని ప్రేమిస్తే దాన్ని సంస్కరిస్తాడు. సంస్కరణ కళ. కళ సంస్కారవంతమైంది. వాక్సూత్రానికి ఈ శబ్దాలన్నీ ఒంతిపూలు. ప్రేమ సూత్రానికి కళలన్నీ కలువపూలు. ప్రకృతి కళాత్మక పూలమాలిక. ప్రేమికుడు తోటమాలి" అనంకల్పితంగా అతని మాటలు ఆమెకు మదనమంత్రాలయ్యాయి.

"మనోభవ భావాలు అల్లిన తీగలు విద్యోతిల్లిన గుండె ఉజ్జ్వల ప్రేమనికేతనం అవుతూంది. వెన్నెల వడగళ్ళు పడి ప్రాణులు ప్రాణాల రాబొమ్మలవుతున్నాయి. ప్రణయభారత సురాళించి హం—నీరభావ మొక్కటి హమ్మని సంరావిస్తూంది. ముకుళీ భూతాత్మ నేత్రద్వయాల్లో వ్యాకులీకృత విరహభావాలు సాహో అంటున్నాయి. భావజుభావ పరిష్కృతద్య సువర్ణపీఠంమీద ఆసీనమైన ప్రేమహృదయానికి తనువు పుర్యాంగ గాంగఝురులు పాయలు కట్టేలా ప్రణయాభిషేకం చేస్తూంది ఇక నీ వశ పరవశతనందుకుంటున్న నన్ను కరుణించవలసింది."

ప్రవాళ సౌరాఖ్యని అధరాలకు చివురుటాకుల కవిలెలాంటి తన అరచేతిని సున్నితంగా అడ్డుపెట్టింది. తన అరవిరి సొబగు సోయగాల యాగభూమికి కేంద్రంలాంటి భావాభిన్నల శోభను అతను అందుకుంటుంటే

అర్ధగించలేకపోయింది. అది అనర్ఘ్య సంగమోత్సవం. అది అలేఖ్య విలోకనం. అది భూతలంమీద స్వర్గస్థాపనకు చేస్తున్న శంకుస్థాపనం. అది బామ భూమిపూజ.

యుగాల శకలాలతో కాలభేరుండం ఎగిరిపోతుంది. పావన పంకు లావణ్యం పరిచారికలు విరిచిన ప్రణయ భూమిలా సుమనోహరంగా వుంది. మేఘాలు గగనవీధుల్లో మెరుపు రథాల్లా సాగిపోతున్నాయి. పురాతన పుణ్య భూమి అయిన చంద్రబింబం వాళ్ళ సనాతన ధర్మయాతనకు సాక్ష్యంగా వెన్నెల సంతకం చేసింది.

"రెక్కలు విప్పుతున్న శిల్ప భావాలు శిలల్లో గూడుకట్టుకుని పొదుగుతున్నట్టుంటాయి. శిల్పాల్ని ఏ గండభేరుండాలో ఏ శిల్ప రత్నాల లోయల్లో నుంచో తన్నుకుని వచ్చి వడవేసినట్టుంటాయి కదూ!" గుర్రం సకిలిస్తూంది. బండి బాటను ఈదుతుంది. ఆ ఏకాంత వేళలో కళల నిర్వచనాలు ప్రవచనాలుగా సాగుతున్నాయి. ప్రవాళ శిష్యురాలై పోయింది.

"ఎగిరిపోయే భావాలకు రూపాలావాహించి శిల్పాలుగా మార్చి కళాపంజరాల్లో బంధిస్తున్న వేటగాళ్ళు శిల్పులు" అతని పాదాలమీద శిరస్సు వుంచుకుని పడుతుంది ప్రవాళ.

"ప్రవాళా!" గొంతు మూగపోయిందతనికి.

"మీరు మాట్లాడకపోతే నాకు వూపిరాడటం లేదు" బరువుగా వున్నాయామె మాటలు.

"ఆ పర్వతాల భేరుండ పక్షులు పెట్టే అండాలు శిలలు. ఆ శిలల్ని భేదించుకుని శిల్పశాబకాలు వెలికి వస్తాయి.

శిలతో ఉలి తల బాదుకుంటేకాని శిల్పం పుడుతుందా? భక్తి చదరంగంలో ప్రతి శిల్పం ఒకపావు. ప్రతి శిల్ప ప్రతిష్ఠకు విశ్వాంతరాళంలో ఎక్కడో కలనం జరిగిపోతుంది. యుగాలుగా కల్పాలుగా సాగుతున్న ఈ

పందెంలో అందెవేసుకునే చేయి ప్రతిసారి భగవంతునిదే కాకూడదు. భక్తుడూ ఒకనాటికి జయించి తీరాలి భగవంతుణ్ణి!

అంతుపట్టని అందాల నిరాశలల్లిన గూడు ప్రకృతి అగోచరమైన ఆ మంత్రాల తంతువులతో పద్దుకుపోతున్న సాలీడు మానవుడు. కఠోర వ్రతాల వెనుకే మధుర ప్రసాదం వుంది.

పర్వతాల పాలనలో అంధకార శక్తుల పహరా క్రింద, అజ్ఞాత ధర్మకర్తలెవరో వచ్చి తమ చెఱను విడిపించి విముక్తుల్ని చేస్తారని చూస్తున్న శిల్పాలు, కఠిన శిలా చెఱసాలల్లో బంధించబడిన విరసరాధల్లా దర్శనమిస్తున్నాయి నాకు.

ఉలి ఖణేల్‌మన్నపుడు శిలనుంచి ఎగిసిపడే మిణుగురులే శిల్పి అనే ధర్మాధికారి ఇస్తున్న సాహసోపేతమైన తీర్పులోని పదాలు, అక్షరాలూను.

శిల్పి కవితా వనితా ప్రియుడు. శిల్పం కవితకు తోబుట్టువు. పసుపు పూతలతో, పచ్చతోరణాల రాపులతో అలరారే ఆలయ ప్రాంగణాంలో అడుగుపెట్టే ప్రతి శిల్పం ఓ నవ వధువు. కొండ శిల్పానికి పుట్టిల్లు. గుడి దానికి మెట్టిల్లు. శిల్పి శిలకు చెలిమికాడు. ఉదయకాంతులు హవణిల్లే కాంతారాల నోయగాలు శిలాకాంతలకు శిరోధార్యాలు. అడవుల్లో వసంత స్నానాలాడిన శిలల్లో నవనీతార్ద్రి నయనాలు ముకుళిత కోరకాల్లా ముద్దగట్టి వుంటాయి.

శిలలు అంధకార యుగంలో ముకుళించుకుపోయిన కమలాలు. వాటిలో బందీలయిన అందాల బంభర బాలబాలికలే శిల్పాలు. శిల్పి చూపులు భాస్కర కిరణాల్లా ప్రసరించినపుడే శిలా వికసన. శిల్ప విముక్తి. ప్రవాళ కళ్ళు విప్పార్చి అతనికి కనకాంబరాభిషేకాలు చేసింది.

"మాడు! గగనంలో రెక్కలు విప్పుకునే గరుడపక్షి విశ్వావిశంతా చెందిన ఒక ప్రతీక. అది ఏ కొమ్మమీదో వాలిందంటే అది ఆ చెట్టుకు వరి

మితమైపోతుంది. మనిషి పాపం మోపని ఈ లోయల్లో గండశిలలు విందు మనస్సుతో చేస్తున్న మౌన ప్రార్థనలు వినిపిస్తున్నాయా మీకు! మలిసంధ్య వేళ విప్పారని శిలల రంగమండపాల్లో దాగిన నర్తకీమణుల అందెలు అతి కష్టంమీద కదలాడుతున్న రవళి కంటికి చెవి వుంటే కానీ వినిపించదు." ఆర్ద్రంగా చూశాడు.

ప్రవాళ సౌరాఖ్యుని పాదాల్ని బుగ్గలకానించుకుంది. అనుభూతి ఘాతానికి విచలితుడయ్యాడతను. బండి కుదుపులతో సాగిపోతోంది. అతని మానసం పూలతెప్పలా వుంది. అతని అధర దళాల మీదుగా వ్యాఖ్యాన పరిమళం వ్యాపిస్తూందక్కడ. మానుషశక్తి దైవీశక్తితో కరచాలనం చేయాలని కలలు కంటున్న శిల్పి స్వప్నమే కదా శిల్పకళాశాల. కళాత్మకమైన కళ్ళకు ఏ శిల్పమూ పసహారు కళల పూర్ణబింబంలా కన్పించకపోవచ్చు. ఆ కళాపూరణమే శిల్పిధ్యేయం. ఆ ధ్యేయం వెనుక ఒక అగాధ గాథ వుంటుంది. అనంతృప్తిగా స్పందించే నిజమైన శిల్పి బాధ అది. శిల్పం ప్రకృతి. శిల్పి అశ్వపతి. విశ్వశిల్పి అస్పృశ్య హస్తంతో జన్మించిన శిల్పి అజ్ఞాన హస్తం ఏ నిర్దిష్ట శిల్పాన్ని సృజించగలదు!

పర్వతాల కర్మాగారాల్లో శిల్పులు సూర్యుడి పర్యవేక్షణలో పనిచేసే కార్మికులు. వాళ్ళకు శిరం జీవితం. వాళ్ళ నివాసం అజ్ఞాతవాసం. కలలు శిలలు కాకుండా, శిలలు కలలుగా రూపొందే పథకంలో ప్రయోగించబడి పనితనం చూపుతున్న ఈ విశ్వకర్మ వారసులు, సృష్టి అనంత వసంతాలు మోసిమోసి కన్న సంతాన ఫలాలు.

శిల్పశాస్త్రం శిలాయజ్ఞంలో పఠిస్తున్న కళాసూత్రం. శిల ఋక్కు. శిల్పి ఋత్విక్కు. శిల్పం సాక్షాత్కారం. ఉలి దర్వి. కేళి హవ్యం. అదో నిర్విఘ్న శిలాయజ్ఞం" సౌరాఖ్యుడు వెన్నెల తీరాల వెంబడి విహరించడానికి చూపుల్ని విప్పి వదిలేశాడు. ప్రవాళ తన మనోతుంగాన్ని వాటికి వాహనంగా మార్చి పంపింది.

పర్వతాలు వృక్షాల మాలల్ని తమ సాను వక్షాలమీద వేసుకున్నట్టు శోభిస్తున్నాయి. కొండల గుండెల్లో వగరు గానాలు పొగరు మీరుతున్నాయి. మధుపాలు ఏలుతున్న మధుగంధిల వృక్షాలు వికసించిన పూలకంఠాలతో గీతాలు పాడుతున్న చెంచెతల్లా వున్నాయి. అందం తప్ప ఆకలి తీర్చలేని చెందు దానిమ్మల కొమ్మల్లో వెతుకులాడుతున్న పిచ్చిపక్షుల్లా అతనిలో ఏవో భావాలు కొన్ని పిరవ లోకతీరాల్లో సంచరించి వెనుదిరిగాయి. అత్యూహం (పిటికోడి) విరహ విచ్ఛేద వ్యూహంలా దానిచుట్టూ అలలు అల్లిబిల్లిగా వలయాలు కడుతున్నాయి.

కోకిల ఆకులపాటు చివురాకుల సీమల వెనుక దాగినట్టు శిల్పంలోని తడబాటు శిలాఖండం వెనుక ఒదిగిపోయింది. అరణ్యాలు ఆహ్వాన ఘోషతో ఎవరికోసమో ఎదురుచూస్తున్నాయి. జలకుక్కుటాల కూతలతో కోయవనితలకు విరహాన్ని రేకెత్తించేలా వుంది వాతావరణం. పశుపక్షి మృగాల రవరవరావ విరావంగా వుందా సందెపొద్దు. చెట్టు తొర్రల్లో పొదుగుతున్న మగపిట్టల పొట్టల కపోష్ణతకు చిట్లబోతున్న అండాల గుండెల్లో ఏవో భావాలు విచ్చుకుంటున్నట్టు వాళ్ళ ఎదల్లో నూతన భావాలు పొటమరిస్తున్నాయి.

అశోకాది మహావృక్షాలు తమలో దాచుకున్న ఈతిబాధల్ని వసంత కాలాగ్నులుగా వెళ్ళగక్కుతున్నట్టు అంగారవర్ణ కుసుమ స్తబకాలతో అరుణారుణ కిసలయాలతో ఆవిష్కృతమవుతున్నాయి. ఆ అగ్నిపూలమీద, ధూమశకలాల్లా ఎగురుతున్న షట్పదులు వాటిపై పాదాలు మోపడానికి శంకిస్తున్నట్టు ప్రవాళ తీక్ష్ణదృక్కుల్ని మోహాలు దాహాలు స్పృశించలేక పోతున్నాయి సచిత్ర విచిత్ర తాళపత్ర గ్రంథాల్ని కట్టిపెట్టుకున్న శిల్పాచార్యుల్లా మయూరాలు సంవృత పింఛాలతో కొమ్మలమీద కూర్చుని ప్రకృతి శిల్ప సోయగాల్ని తిలకిస్తున్నాయి. ఆ వృక్షాల క్రింద రతిమూర్ఛిత వనితల్లా పుష్పలతలు పట్టుతప్పి నేలమీద పడివున్నాయి.

కాడికీ మేడికీ నడుమ నడిచే ఎద్దులా అతని మానసం ఏదో అస్వతంత్ర సంకుచిత చింతాసంతతితో సంతపిస్తున్న అనుభూతికి లాస్యభూమిక అవుతూంది. ప్రేమ నేర్పే పాఠాల్లో ఈ అనుభూతులు పుటాగా, సంపుటాలుగా ఎదురుపడతాయి కాబోలు.

'అర్థస్య పురుషోదాసః' అనడం కన్నా 'ప్రణయస్య రసికో దాసః' అంటే బావుంటుందా? కర్ర వున్నవాడిదే బర్రె అనే న్యాయం చోటు చేసుకుంటున్న ఈ అరణ్య సంస్కృతిలో కళాకారులకు సంస్కారవంతులకు ఆశ్రయం కల్పించే ఆశ్రమాలు ఎదురుపడతాయా?'—కొంగులు తిరుగుతున్న ఇలాంటి భావవీచికలేవో సౌదామిని ఎదలో రింగుమంటున్నాయి. బ్రహ్మతేజం క్రొంబూతలు పూస్తున్న అతని వదన మండలాన్ని చకోరికలాగా చూస్తూ కూర్చుంది ప్రవాళ.

"నానా వర్ణమాలిని అయిన ఈ అరణ్యక సోయగం చంద్ర నక్షత్రశాలిని అయిన ఈ శారదరాత్రిలో మోహపాత్రమవుతూంది కదూ! ఈ నేపథ్య గర్భ సందర్భంలో గంగోదక ఘటం తొణికిసలాడుతున్నట్టు గుండెలో ఏదో శీతలభావ చాలనం జరుగుతూంది. ఈ పురోత్తమ ఉపకంఠగ్రామ భూముల్లో తిరుగాడుతున్న హయోత్తమాల్లా ప్రణయోన్మత్తభావాలు మన ఎద ప్రదేశాల్లో వాలచాలనాలు చేస్తున్నాయి కదూ!" అంటూ దరహసించాడు.

జగజ్జేగీయమానంగా దగద్దగాయమానంగా ఒక పులకింత ఆమె ఒళ్ళంతా విహరించసాగింది.

"ఔదుంబర భద్రపీఠంమీద అభిషేకార్థం కూర్చున్న యువరాజులా వున్నావు నువ్వు."

"హంసలు తాకని పద్మసింహాసనంమీద కొలువున్న కమలవాసినిలా వుంది నీ అధరాలమీది దరహాసం."

"ఇలా ప్రేమికులు పరస్పరం వందిమాగధులైపోతే ఎలా" అందామె.

"ప్రవాళా! సర్వం సహా చక్రవర్తి అయిన పరమాత్మ వారసత్వాన్ని మరచిపోయి నదివీథుల్లో పడి తిరిపమెత్తుకుంటున్న దీనుడు మనిషి. కనీసం ప్రేమికులకైనా ఆ స్పృహ కలుగుతున్నందుకు గర్వించాలి కాని ఇలా న్యూనతా భావాన్ని పెంచుకోకూడదు. ఏం చేద్దాం—మనకు యుగయుగాలుగా తరతరాలుగా నరాల్లో జీర్ణించుకుపోయిన భావం దయనీయ దైన్యం.

వంధిమాగధులు చేసే పని అదే—అయ్యా నీ తాతలు తండ్రులు ఇంత మహత్తరంగా బ్రతికారు—నువ్వూ అలాంటి ఉత్తమవంశ సంజాతుడవే—దిగజారిపోకు అంటూ చేసే హెచ్చరిక లేదూ వాళ్ళ స్తోత్రాల్లో! మనిషి దేవుడి తర్వాత దేవుడంతటివాడు కాదనడానికి నీకున్న ఋజువేమిటి?" అన్నాడు. అతనిలోని ఆత్మస్థైర్యాన్ని చూడాలనే ఆమె అలా ఎదురు ప్రశ్నలు వేస్తుంటుంది. నవధాన్యాలు నవరత్నాలు కలగలిపి జాలువార్చినట్టు నవ్వుతున్నారు వాళ్ళు. వాళ్ళ నవ్వులు వెన్నెల దివ్వెల్లా వున్నాయి. మలినందెల్లో వెలిగిన గృహదీపికల్లా వున్నాయి. భాగ్యార్ధి చంద్రికల్లా వున్నాయి. అశాంతిలోని అదృష్టరేఖల్లా వున్నాయి. తొలకరి మబ్బుల్లో మెలికలు తిరుగుతున్న మెరుపు తునకల్లా వున్నాయి. పద్మాల మిద్దెలకు అద్దిన తొలిసంజె బంగారు పూతల్లా వున్నాయి శిశిరాతిథి కురిపిన జాబిలి జిలిబిలి లేత వెన్నెలల్లా వున్నాయి. ఆ నవ్వులు పొగత్తల కందని ఆకాశదేశాల ఉజ్జ్వల అగద్దల్లా వున్నాయి.

పాలు, తేనె, నేయి, దర్భలు సంగ్రహించుకుని శుభకార్యానికై తరలివస్తున్న అందాల అష్టకన్యకా బృందంలాంటి దృక్కులతో అతన్ని చూసిందామె. అతని మాటల కోటకొమ్మలమీద ఆర్ష సంస్కృతీ ధర్మ

ధ్వజాలు రెపరెపలాడుతుండడం అమోఘ హర్షవర్షం. ఆకలి ఘాటలు గంటలు పడ్డ గుండెల్లో అభయగంటలు మ్రోగిస్తున్నాయి.

"ప్రవాళా! నీ అంచాల్లో చందన సంధ్యలున్నాయి. మందమారుతాల్ని వీస్తున్న నీ చిగపాయలు కదలి మేఘోదర సాదరాహ్వానం లాంటి ఆకాశ వాయువులు రేగుతున్నాయి. నీ పగల మొగలిపూల గంధాలు దాహాల్ని మోహాల్ని రేపుతున్నాయి. నీ సుకుమార మారుత పూరితాకాశాలు విరహంతో ఘూర్ణిల్లుతున్నాయి. మేఘాలు ముడి దూదిపింజల్లా తేలియాడుతున్నాయి. సూత్రయజ్ఞంలో నూలుదారాలు పెనవడుతున్నట్టు వర్షధారలు దీర్ఘీకృతమవుతున్నాయి. వాగులూ వంకలూ నేతబట్టల్లా భూతలంమీద పరచుకుంటున్నాయి. కడిమిపూలు చిన్నపిల్లలు వదులుతున్న పడవల్లా పిల్ల కాలవలమీద తేలిపోతున్నాయి. గాలి పతంగులా రంగు రంగుల పూల పడవల్ని కొండవాగుల వెంబడి నడుపుకుపోతున్నాడు. ఏదో రాగం కొండ గుండె నుంచి గాలిమీద ఒరిగిపోయి తూగాడుతూ సాగిపోతూంది. కేకాభిరామంగా మయూరాలు విహరిస్తున్నాయి. స్నానించే వనకన్యల పసుపు పారాణి సెలఏటిలో ప్రవహిస్తున్నట్టు కొండచెరియల ధాతువులు కరిగి వస్తున్నాయి.

జలదాశ్వాలమీద మెరుపు కొరడాలు ఝళిపిస్తున్నారెవ్వరో! అశ్వహేషల్లా ఉరుములు పెళపెళమంటున్నాయి. ప్రతిహత చంద్రకళలు కాముకులకు హితకరాలవుతున్నాయి. మహాకాయుల మెడలోని హారాల్లా కారుమబ్బులకు మెరుపులు వ్రేలాడుతున్నాయి. విద్యుత్పతాకలతో, తూర్య రావాలతో జలద ఘూర్ణితాకాశం ఏదో దండయాత్రకు బయలుదేరిన సేనా వాహినిలా వుంది. తుముల రణం ప్రచలితమై శరపరంపరతో నిండిపోయి నట్టు అరణ్యం వర్షధారలతో నవమదమైపోయింది.

వాన వెలిసింది. ప్రకృతిలో ఆహ్లాదకర వాతావరణం చోటు చేసుకుంది. పక్షి సంఘాలు సంగమిస్తున్నాయి. హరిణసారసాలు మధురంగా

వరసాలాడుకుంటున్నాయి. చక్రవాకాలు ప్రణయవాక్యాలు పలుకుతున్నాయి. ప్రకృతి శృంగారం గిరిశృంగసమంగా సాగుతోందక్కడ" సౌరాఖ్యుడు ఆ వన రామణీయకతను చిత్రికపట్టి చూపాడు.

ఆమె మనసు వనమయూరి అయింది. ఆమె వయసు సుమవయార మయింది. ఆమె దృష్టికి సృష్టి తన కొత్త కొత్త కోణాల్ని చూపుతోంది.

"సౌరా నీ చూపులో వుంది అందం. నీ భావనలో వుంది రస ప్రబంధం. అసలు భౌతిక దృక్కును, సుఖలోలుపతను, విజయాకాంక్షను, లోభ లాభాపేక్షతో చేసే వినతుల్ని, నతుల్ని సంపుటీకరించుకున్న వేద మంత్రాల్లోవి బీజాక్షర సముదాయంలో నాదశక్తి వుండొచ్చు కాని, వాటిలో భావనాశక్తి చాలావరకు లోపించిందనే చెప్పాలి."

"ప్రవాళా! వేదమంత్రాల్లో అద్భుతమైన అందాలున్నాయి."

"ఎన్నింటిలో?"

"వాటి శాతం తక్కువే. అవి ఒకరకంగా ఆనాటి జనుల జీవన విధానాన్ని పంక్తీకరించిన చారిత్రక సంపుటాలు."

"నేను వేదాల్ని తక్కువగా అంచనా వేయడంలేదు. భౌతిక దృక్కును దాటిన ఒక మహత్తర నిస్సీమ సోయగాల్ని ఆవిష్కరించడంలో అవి ఎంతవరకు కృతకృత్యమయ్యాయన్నదే నా సందేహం."

"వేదాంతాల్లో అంటే ఉపనిషత్తుల కాలంలో ఆ ప్రయత్నం జరిగింది ప్రవాళా! అది సరేకానీ అటు చూడు ఆ శిఖరగ్రామాల సొబగు—సముద్రపు చలివేందరలో కుక్షింభరులైన బాటసారుల్లా నీలిమేఘాలు మెల్లగా కదలిపోతున్నాయి. తలపాగాలు, తెల్లని వస్త్రాలు ధరించిన భక్తబృందాలు భగవద్దర్శనోత్సుకతతో పర్వతారోహణం చేస్తున్నట్టు మేఘాలు తేలిపోతున్నాయి. మబ్బుతునకలు విడిపోయి ఎగిరిపోతున్నట్టు పక్షిగుంపులు ఆకాశంలో కిలకిలమంటున్నాయి.

అవిచ్ఛిన్నంగా సాగుతున్న ఈ అరణ్య సంగీతానికి మంత్రముగ్ధమై పోతుంది మానసం. చూడు ఈ హింతాళ వృక్షాలు వంతపాడుతున్నాయి, తిలకవృక్షాలు తళుకులీనుతున్నాయి. చంపకాలు విరహాల్ని చంపుకుంటున్నాయి. తాళవృక్షాలు తాళాలు వేస్తున్నాయి. ఈ తమాలవాటికలు సుమాశించుకోనీయడంలేదు. పువ్వు గుమవిందలు నవ్వులాడుకుంటున్నాయి. అశోకాలు విరహశోకమర్దనం చేయలేకపోతున్నాయి. నీపవృక్షాలు ఓపికను పోగొడుతున్నాయి. వకుళాలు సిగ్గుల ముకుళాల్ని రూపొందిస్తున్నాయి. మొగలిపొదలు రగిలిపోజేస్తున్నాయి. లొద్దుగుచెట్లు ముద్దులు అద్దుతున్నాయి, రేలచెట్లు ఈలవేస్తున్నాయి. విర్వర ఆభరణాలతో వ్యసన వసనాలు ధరించిన విరహిణిలా వుంది సుందర వనతీరం" సౌరాఖ్యుడు ఆ వన సోయగాల్ని ఒక సుందర భావమంజరిలా అచ్చుతీసి ఆమె ముందు వుంచాడు.

"ఇది ఇదీ మనిషికి అలవడవలసిన చూపు. ఆ చూపులో పరా ప్రకృతి ఆకృతిగొన్న కృతిలా దర్శనమిస్తుంది. ఇప్పుడని కాదు— ఎప్పుడూ నీ మాటకొక అందాలరేఖ హత్తుకుని వుంటుంది. దానిముందొక ఆనందపు ఏరువాక సాగుతుంటుంది. అది ఎదిరి ఎదలో కాదంబినీ జలశీకరాల్ని చిలకరిస్తుంది. పక్వ గోస్తనీ ఫలరసాల్ని చిప్పిలి పోజేస్తుంది. వెన్నెల గుత్తుల్ని చేతికందిస్తుంది. గోమాతలోని కరుణతీసి చేపి క్షీర ధారలో కలిపి చిమ్ముతున్నట్టు శ్రోతల్ని లేగదూడల్ని చేసి కడుపు నింపుతుంది. శృంగార వాగుల్లోని బంగారు దొరువుల్ని అందుకోజేస్తుంది. జేవురించే సంధ్యమోవి శోభల్ని చూరలాడజేస్తుంది. వనరాణి చలితచలిత నేత్రాంచల విగారింపుల్ని పైపైకి ఒంపుతుంది. ఉత్తుంగ తరంగాల గంగనో, తుంగనో మరవతిప్పి ఎదలోకి ఎక్కిస్తుంది. పరిమళదళ సుమాల పరాగ రాగాల్ని తూరుపార పట్టి గుండె గరిసెలు నింపుతుంది. కడుపు చల్లగా కన్నతల్లి ఒడిలాలిత్యాన్ని ఒడిసిపట్టుకోజేస్తుంది.—కుంకుమాంకిత లలాటాల

మీద జిలుగు వస్త్రాల కుచ్చు తలపాగాలమ విలపుతుంది. బంగరు మిద్దెల్ని, నందెపొద్దు గద్దెల్ని పూలతేనె తెప్పల్ని ఎక్కించి తిప్పుతుంది. శుభ్రా భ్రమణి దీపాల్ని వెలిగిస్తుంది. చేటికా పీటికా కరండికలా నోరూరింప జేస్తుంది. మధూక ప్రసూన ప్రమద మాలికల్ని ఎదవేదికల గుమ్మాలకు వేలాడదీస్తుంది. పరువాల తోపుల్లో సోయగాల త్రోదోపులతో మలిమాపుల సొబగుల్ని గుబాళింపజేస్తుంది. విప్పపూల దళాల మధురస స్పర్శనందించి దళవాయిలా తన దిశకేసి దారితీసుకోజేస్తుంది. ఒక మాటలో చెప్పాలంటే ఏ మాట మనిషిని రసార్ద్ర ప్రబంధకంగా మారుస్తుంది" ప్రవాళ కళ్ళు బాష్ప స్పర్శతో స్నిగ్ధాలయ్యాయి. ఆమె వదనతేజం ఆమెనొక ఋషికలా మార్చింది.

"ప్రవాళా నా వాక్కును గురించి వ్యక్తీకరించిన నీవి మాత్రం వాక్కులు కావు—ఋక్కులు" సౌహాఖ్యుడు ఆమెను ఆత్మీయంగా తన ఒడిలోకి లాక్కుని పూల సుడిగాలిలా చుట్టుకుపోయాడు. "సౌరా నిన్ను చూసాకే నాకు వాక్కు అబ్బింది. నన్ను నువు పొగిడితే సిగ్గుపడి పారి పోతాను" అతని పరిష్వంగాభిషేకం నుంచి తేరుకుని తెప్పరిల్లుతూ అంది.

"ప్రవాళా! ఏదో హిరణ్మయ రసాయన ప్రసవంతో తడిసిపోయింది మానసం—తనిసిపోయింది జీవితం."

"పర్యవసానం తెలియని ఈ ప్రణయ వ్యవసాయంలో అసహాయ శూరుడివి నువ్వు" సిగ్గుపడిందామె.

"అలాగా—వ్యవసాయం స్థిరం కదు" గగనాని కేసి చూస్తూ కొంటెగా అన్నాడు.

"గోసాయివి అనుకున్నా. కానీ సాయం అడగని ప్రేమ వ్యవ సాయివి నువ్వు."

వాళ్ళ రతిపరవశ పులినకలాలు హంసపాదాల ముద్రలతో హింస పడుతున్నాయి. ఆకాశాంగన లెవ్వరో తారాభరణాలతో తరలివస్తున్న దీధితి

గగనంలో ఎగసివస్తూంది. కాలబ్రహ్మచారిలా కన్మచ్ఛన్న శరీరంతో అగ్ని దేవుడి శిల్పరూపం అతని చూపులకు రూపుకట్టింది. "ప్రవాళా! ప్రియంగు వృక్షంలా ప్రియమైన వ్యక్తివి నువ్వు. ప్రేంకణపు పువ్వులా అందమైనది నీ నవ్వు. నీ నగలు పగటి నెగళ్ళు. నీ ఒళ్ళు నెమలి దిగుళ్ళు. నీ చూపు మోపినవారికి సింగాలు చిత్తడి కొనల కుందేళ్ళవుతాయి. నీ రూపు రేపే మోహావికి సమయసౌమ్యతను పాటించడం యోగికే సాధ్యం కాదు" తను తంగా ఆమెను చూస్తున్నాడు.

"నీ చూపులు రుచివంతం శుచివంతం అయిన జలాశయాల్లా మంద రంగా వున్నాయి. వాటిలో నా పరువాల బంగారు దొరువులూడి ఒరుగుతున్న గరగరికలు ఎదలో విన్వవిస్తున్నాయి" అందామె రాగిల్లిపోతూ.

"ప్రవాళా! అలా చూడు—కుంద (మొల్ల) సింధు వారాలు (వావిలి) కదంబ, కురంటాలు (కడిమి, గోరింటలు) వావివరుసలు కలుపుతున్నట్టు విరియబూసి పొరలిపోతున్నాయి. ఈ సమతల శిలా తలాలమీద శిసంకర జలాలు శుశంకర ధ్వనులు చేస్తూ ప్రవహిస్తున్నాయి. కారుమబ్బులు సగం కరిగి నేలమీదకు వడిపోయినట్టు బహుకోణాలతో శిలలు అలరారుతున్నాయి. ఈ వంకజ మండిత సరోవరాలు విరహుల మానసాల్ని మండిపోజేస్తు న్నాయి. మయూరనాద బోధిత లతాశతాలు పులకల పుష్పాంగాలతో నర్తి స్తున్నాయి. వరివరి (విధ) వరిమళ సంయుక్త మారుతాలు ముక్తసరిగా వీస్తున్నాయి" అతని వాక్కులు మంత్రదండాలై ఆమెను సమ్మోహింప జేస్తున్నాయి. ఇంకా ఆమె పరవశస్థితికి చేరలేదు. అందుకే అతను తిరిగి వర్ణనాకర్ణ రసాయనాన్ని చిప్పిలిపోజేస్తున్నాడు.

"పగటి తారకాగణంలా పారవ చారుపంక్తి గగనంలో విస్తరిస్తూంది. నీ పద్మోత్పల పాదాలు బంధుర వాదాళిలాషను వ్యక్తం చేస్తున్నాయి. నువ్వుల ఘురకలు ఛిపురించిన వేణువనస్వన భరితారణ్యంలా నా హృదయం

రవళించి పోతుంది. ఆ కాసారం చూడు గృహిణిలా నింపాదిగా కూర్చుని వుంది. ఆమె హంసల పాలును పట్టుదారాలుగా చేసుకుని, కమలాల ఎరుపు రంగు దారాలుగా మార్చుకుని అలల నేతతో పీతాంబరం అల్లుతోంది. కవ్వం జవజవలాడే జవరాలి చేతిగాజులు, పిగజాలు కొలనిమీద ప్రతిఫలిస్తున్నాయి. ఎదలో ఏదో మృదుల పవనాలు కదలాడుతున్నాయి. పద్మాసన పద్మాసన వ్యసనంతో షట్పదాలు (తుమ్మెదలు) ఝుమ్మంటున్నాయి. కమల కోశాల ముకుళాల గనుల్లో భ్రమిస్తున్న కీటకాల కాళ్ళకు పరాగాల గండపెండేరాలు తొడుగుతున్న కమనీయ దృశ్యం! ఈ సెలఏటిలో జలకన్య జారవిడుచుకున్న వెండి మొలత్రాడులా కోలచేపలజాలు సాగిపోతోంది. కామిత కామినుల్లా కానన భూముల్లో మందమారుతాలు మందలు కడుతున్నాయి."

ప్రవాళ పరవశపు తారాస్థాయి నందుకుంటూ కళావాహినిలో మువత లేస్తూంది. ఆమెలో ఇంకా బాహ్య స్పృహ కొంత మిగిలే వుంది. అది ఆమెకు అశాంతిని కలిగిస్తూంది. ఆ కొద్ది స్పృహను కూడా పోగొట్టి ఆమెను తనకు మముఖురాలినిగా చేసుకోదలచాడతను.

ప్రవాహా! దశదిశల్లోని ప్రసన్న జలాల్లో జలపక్షిజాలం కోలాహలం చేస్తూంది. జలదకామినులైన పక్షులు వాతావధూత శాలికా కుసుమాల్లా ఎగసి పోతున్నాయి. వివిధ పక్షి కూజితాలతో నవీన వన సంగీతం ఒకటి ఈ హరితసరిత్తులో రూపుదిద్దుకుంటూంది. ఒడి నిండిన ధాన్యపు గింజల్ని కాలు వార్చుతున్న పసిపిల్లల్లా కారుమబ్బులు తెల్లమొహాలేసుకుని చూస్తున్నాయి చూడు.

బర్హా భరణ మయూరాలు మేఘాలల్లా శిఖరాలపైన పెనుశిలల మధ్య తచ్చాడుతున్నాయి. భూదేవి వక్షోజాలు ఉప్పొంగినట్టు పర్వత శిఖరాలు చివురించి తేవురించి వున్నాయి. వదులు అలల పళ్ళెరాలలో పూలు పళ్ళు

వింపుకుని కాముని వోముకు వెతుకుతున్న కామినుల్లా వున్నాయి." ఆమె కళ్ళలోకి చూసాడతను.

"శౌరా! సరోవర జలగర్భంలో ఈదులాడే శఫరీ బృందం లాంటి సుందర భావజాలాలేవో ముందుకు తోసుకువస్తున్నాయి. ఆ దృశ్యం అదృశ్యం కాకముందే చూడు. దూరాభార ప్రయాణంలో రెక్కలలసి వాలిపోతున్న నీలి మబ్బు శకలాల్లా గగనం నుంచి మయూరాలు వృక్ష శిఖరాల పైన వాలుతున్నాయి. ప్రస్రవణ గాన సంగీతం శ్రవణ మోహనంగా వినవస్తూంది నాకు. శరన్నదుల్లా కరుగుతున్న సిగ్గులతో వధూజనం మిథునాయత్తలౌతున్న దృశ్యం నాకు సాక్షాత్కరిస్తూంది." నెమ్మదిగా రస నిర్భర నీరవ స్వరంతో పలికింది.

అతను ఆమెను ప్రణయ సజ్జితం చేయబోయాడు. ఆమె చిరునవ్వుతూ సోగచేతులతో వారించింది. ఈసారి తన భావావిష్కరణ తీవ్రతకు ఈమె స్వంతం కావాలన్న పట్టుదల అతన్ని పట్టు విడువనీయలేదు. మన్నితత్త్వంతో తప్ప మహత్కార్యాలు దారికిరావన్న సత్యం తెలిసినవాడతను. "ప్రవాళా! చూడు ఆ మహామేఘాలు ఆకాశదేశ పర్వతాల్లా వున్నాయి కదూ! పచ్చని పట్టుపుట్టం తొలగినచోట అరణ్యాంగన ఘనజఘనాల్లా పర్వతాంగాలు కానవస్తున్నాయి. కలహం వదిలి కలహంసలు, చక్రవాకాలు కలసి నదీతీరాల్లో సంచరిస్తున్నట్టు రక్తిభావాలు, భక్తిభావాలు కలగలిసినపుడే హృదయ సౌందర్యం వర్ధిల్లుతుంది. మనోజ్ఞ గంధాలు చిందుతున్న లోయల్లో పుష్పాలంకార లతాయుత తీగాల్లో రంగుల పురాల్లా మయూర బృందాలు అందగిస్తున్నాయి. ఈ అరణ్యం నయనాభిరామ ఆరామంలా వుంది. సంధ్యారుణ తమోవిమోచనంతో ఆకాశం వనుదలోహప పళ్ళెరంలా రాగరంజితమవుతూంది.

నవరతలైన శుకపిక జలకుక్కుటాలతో ప్రమోదోత్కట తటకాలు మదలాలస హంసపదన్యాసాలతో ప్రేమికుల్ని చుంబనయుద్ధ బుద్ధుల్ని చేస్తు

న్నాయి. ప్రణయగుణం ఆప్యాయత నందుకుంటూంది. నీ చూపులు తాకుతున్న ఈ భుజాలు భుజభూషణాలతో అలరారుతున్నాయి. చంద్రమంద్ర స్పర్శతో తారకలు కోరికల కిరణాల్ని వెలువరిస్తున్నాయి. సంధ్యారాగం ప్రకృతిని ప్రేరేపిస్తూంది.

పూచిన కాశ పుష్పాలు ప్రకాశిస్తున్న పట్టుదుప్పటిలా పరచుకున్న పట్టుదలలో లేళ్ళు, పక్షులు ఆడుకుంటున్నాయి. కొమ్మలనుంచి తొంగి చూస్తున్న పుష్పస్తబకాలు ఆ కర్ణాంతం లాగి వదలనున్న మన్మథ శరాల్లా ప్రేమికుల్ని దడదడలాడిస్తున్నాయి.

చూడు! ఆ పూచిన పొగడకొమ్మ విరహుల పాలిటి మదన ప్రచండ దండంలా ఎలా కదలాడుతుందో! కారుణ్య రహిత దండకారణ్య రక్కసుల్లాంటి విరహభావాలు యవ్వన ఏకాంత హృదయాల్లో వీరవిహారం చేస్తున్నాయి. శీతల భూతలాల్లో ప్రకంపనాలు పొడచూపినట్లు స్థితప్రజ్ఞుల మానసాల్ని కూడా మరుని తలపులు మరిగిపోజేస్తుంటాయి. జవరాళ్ళ కుచోన్నతి హృదయానికి కూడా వర్తించాలి. అలాగే కుచ సంకోచం ఆలోచనలకు ప్రాకిపోకూడదు.

తన మర్మభేదనం జరిగినట్టు చూపిందామె.

"వాటిమృదుత్వ మాధుర్యాలు స్త్రీల ఎదల్లో మిళితం కావాలి. లేకపోతే స్త్రీ ఒక మాంస శిల్పం అవుతుంది.

"షా....రా" అంటూ అతని ఎదకేసి గట్టిగా నొక్కిపట్టుకుందామె. ప్రవరాఖ్యుని అనుభూతి లోతులో గండుమీల చాల వాలు జరుగుతున్నట్టు ప్రకంపించాడతను. "ప్రవారా! లాలిత్య మానసాలకు లాలనే అలనా పాలనా కదా."

శిఖరం శిరస్సు వంచి జలపాత జలాంజలి వదులుతున్న దృశ్యాన్ని తదేకంగా చూస్తూండిపోయిందామె. అతను అందరాని తేనెపట్టును కొల్లగొట్టతీరాలన్న తమకంలో తపించి ఎగబ్రాకే వలపు తోటవాడిలాగా తన హృదయరస వర్షాన్ని కుమ్మరిస్తున్నాడు—

"అంబరం అడంబరించింది. వర్షం దర్శనమిచ్చింది. జలధారలతో జలజ ముకుళ కుడ్మాలు బీటలువారుతున్నాయి. పుష్పాలు విచ్చిపోతూ కేస రాల పుప్పొళ్ళు రాలి ఊసర క్షేత్రాలు స్వర్ణ కమలాలవుతున్నాయి. గజేం ద్రాలు మదధారల్ని వదలుతున్నట్టు జలదాలు జాలువార్చే నవాంబుధారలతో గవేంద్రాలు కండవట్టి కొండల్ని కొమ్ములతో కోరాడుతున్నాయి. ఒక రతి సూత్రానికి బంధించి కేళి సలుపుతున్న రతీంద్రుని ఇంద్రియ ఇంద్రజాలా నికి ప్రకృతి దాసోహమంటూంది.

వర్షాకాల ఆకాశం మేఘాల అలలతో ఘోషిస్తున్న నీలిసముద్రంలా భయద సుందరంగా వుంది. భూగోళ లింగానికి జలద కుంభాభిషేకం చేస్తు న్నారు దివ్యులు. కొండరాళ్ళు కోరిక తీర్చమంటున్నాయి. కోననీళ్ళు గల గలా నిండిపోతున్నాయి. సామగులు వేదాధ్యయనం ఆరంభించే భాద్రపద మాసంలా పునీతంగా వుందామె రూపం. మాలతీ సుమాలు వికసించి మలిసంధ్య సూర్యదేవరకు భోగావళి (దినచర్య) వినిపిస్తున్నట్టు ఝుమ్మం టున్నాయి. మనసాతీతనేత చేతి బటాల నేతపట్టంలా మనసు ప్రణయ ముద్రికలతో అందగిస్తూంది.

రమ్య జ్యోత్స్నానులేపిత రూపమామెది. గత విద్యుద్వలాహక గగనంలా ఆమె మనసు నిర్మలంగా వుంది. సారస పక్షుల సరాస సరసంలా సరళంగా వుంది వారి మానస సల్లాపం. పాంచరాత్రాగమంలా పవిత్ర కార్యక్రమాలతో కూడుకున్న వేడుకలా వుంది వారి సహవాసం. సరస సారస వాదిని అయిన మనసు కమలవన వినోదిని అవుతూంది. తేగినపూలు బంగారు నిగారింపు భూషణాల్లా శోభిస్తున్నాయి, శిరదూరాల్లో. హత్తరించు కుంటున్న పొదగులతో సామ్రద్రుమ పురోగమంగా వుందా పర్వతం. ఆమె ప్రణవ కైంకర్య లక్ష్మి సంపన్నంగా వుంది. నీలోత్పలదళ శ్యామల భావనలో సంభావించుకుంటున్న రాధ ఆరాధన వేదికలా మలిసంధ్య భాసి

స్తూంది. కరుగుతున్న కుంకుమరాగాలతో సమ్మోహన మంత్ర వాహనంగా వుందా దిశ చూడు—ఏనుమద్ది పూలను ముద్దిడుకుంటున్న కొండగాలులు కొండమల్లె వల్లెల్ని పరివశింపజేస్తున్నాయి. విశావశంగతం అవుతూంది మానసం.

గగన వేదికమీద తారల తెరలు దిగుతున్నాయి. తనూలతలకు వలపుల తలపుల చివురులు పొటమరిస్తున్నాయి. గజ్జెలు కట్టి నటిస్తున్న నాట్యమండపాల్లా తరువుల గుబురుల్లో విహంగాలు కూజిస్తూ తకపికలాడుతున్నాయి. మధనచింతలు చింతవిప్పు లవుతున్నాయి. విచక్షణలు పక్షులై కాళ్ళు పెట్టలేక ఎగిరిపోతున్నాయి. ప్రణయ శ్రావణ సజల జలద నాద వినోదం సాగుతోంది లోలోని నాలో. నైష్ఠిక శిలా పుట సంపుటాలు ఈ చెలి చేతిస్పర్శతో వెన్నలా ద్రవించి స్రవిస్తున్నాయి."

అతని పాదాల్ని తన కళ్ళకేసి అద్దుకునే బిగింపుకో ఆమె స్పందనను వ్యక్తం చేస్తూంది. సౌరాఖ్యుడు నెమ్మదిగా లేవనెత్తాడామెను. ఆమె కళ్ళు సజల కాసారాల్లా, ఆమె చూపులు కమల పుష్పాల్లా, ఆమె మధురభావాలు సుధాధారల్లా—ఆమె ఒక కమల కల్హార సరోవరంలా—అందులో అతని ప్రతిబింబం వెలుతురు బంతిలా—

"శిల్పీ నన్ను చెక్కయి. నా ప్రాణాన్ని నీ పైన శిలువ వేసుకో. నేను బ్రతకలేను. నీ కళామాధుర్య స్రవంతిలో తప్ప బయటి వెన్నెలలో, రాతి కట్టడాల్లో, లౌకిక వ్యామోహాల్లో నేను బ్రతకలేను. నన్ను చంపి నీలో ఐక్యం చేసుకో. నిన్ను అర్థిస్తున్నాను—నీలోకి ప్రవేశించి దాగిపోవడానికి నాకు దారి చూపించు. దయచేసి నా ఆర్తిని, ఈ స్ఫూర్తిని అర్థం చేసుకో." ప్రవాళ ప్రవాళమాలలా అతనికి చుట్టుకు పోయింది.

"ప్రవాళా....ప్రవాళా...." మృదువుగా కదిలించాడామెను. తన శిల్పకళంతా రూపుదిద్దుకుని తనను పరిరంభింపుతున్నట్టు, తనలోకి ఆవహించడానికి అను

మతి కోరుతున్నట్టు, తన జన్మకు అదో మౌక్తిక మోక్ష ఘట్టమైనట్టు అనుభూతించాడతను. "అమ్మా" బండివాని పిలుపు విని తేరుకుందామె.

దూరంగా ఉలి శిలను ఖంగుమని ప్రశ్నిస్తున్న సవ్వడి వినవచ్చిం దతనికి. తన భవంతి ద్వారం తెరుచుకుంటున్న ధ్వని వినిపించిందామెకు. బండి ఆగింది. వాళ్ళు నెమ్మదిగా నేలమీనకు దిగారు.

° ° °

అరణ్య గర్భాల్లో అర్భకుల్లా కాళ్ళు చేతులు కడుపులోకి ముడుచు కుని వున్న శిలా శిశువులు శిల్పి కళ్ళకు కనిపించాలి. ఈ శిలాపిండాల ముకు శిత సంధిబంధాల్ని ఉలితో ఛేదించి లేపి నిలబెట్టడమే శిల్పి సాధన. శిల్పి మంత్రసానికుడు. అరణ్యాల్లో పుట్టే సంగీతమేదో శిలలకు సోకి లోపలి శిల్పాల వరకు ఇంకిపోతూంటుంది. ఉలి శిలావీణలు మీటే గోటు.

ఉడులు చెరపట్టిన శిలలు వస్త్రాపహరణకు గురవుతున్న అబలల్లా అల్లాడిపోతూ మూర్ఛపోతాయి. వాటికి స్పృహ వచ్చాక తెలుస్తుంది— శిల్పుల శస్త్రచికిత్సతో తొలగించిన అనర్ధ శిలామాంసం వల్లే దివ్యరూపులై పోయామని! శిల్పి శిల్పవైద్యుడు.

ఉలి శిలలోని కలను త్రవ్వితీసే పలుగు. ఉలి శిలల పురాతన సుకృతాల నెచ్చెలి. శిల్పి శిలాయాజ్ఞికుడు. ప్రతి శిలా తలుపులు మూసుకున్న ఒక దేవాలయం. లోపలి శిల్పం మూలవిరాట్టు. కొండగాలులూ, వెన్నెల కిరణాలు భక్తబృందాల్లా శిలల ముందు కదలాడుతాయి.

దిక్కులకు తన శాఖోపశాఖల్ని పరచిన మహావృక్షం నీడలో కూర్చున్న సౌజాఖ్యుని మీదకు ఇలాంటి కళాత్మక తల్పులేవో నిల నిలమని వచ్చి వాలుతున్నాయి. శిల్పులందరూ నెమ్మదిగా సమావిష్టులవుతున్నా రక్కడ. అతన్ని తదేక ధ్యాన దృష్టి నుంచి మరల్చడం ఇష్టంలేక వాళ్ళు చాలాసేపుగా కూర్చుని వున్నారు. ప్రక్కన కొలనిమెట్లు మీదుగా తను

లాలతో గబగబా ఎక్కివస్తున్న ప్రవాళ అందెల సవ్వడి లయబద్ధంగా గాలిలో తేలిరావడంతో అతను చలించాడు. పరిసరాల్ని పరిశీలించాడు. శిల్పుల్ని సంబోధించాడు. "శిల్పదీక్షకు అంకితమైన కళాతపస్వులు మీరు. మీతో కొన్ని విషయాల్ని చర్చించాలని మిమ్మల్ని ఇక్కడ సమావేశ పరచాను. శిల్పికి భావావేశం ప్రధానం. అదే వాడి చేతిలోని ఉలికి ఊపిరి. దాన్ని మీలో రేకెత్తించి నిత్యనూతనంగా వుంచితేనే అద్భుతమైన కళా ఖండాలు బయటపడతాయి.

శిలాతలాల్లో కళాక్షేత్రాలున్నాయి. అవి యోగి అయిన శిల్పికి మాత్రమే దర్శనమిస్తాయి. శిల్పి శిరస్సులోని అరవింద కేంద్రం విచ్చుకుంటేనే ఆ శిలల్లోని కళాక్షేత్రాలు ప్రసారం చేసే శిల్పసందేశాలు మనకు వినిపిస్తాయి. శిల్పి చూపు సంకల్ప కిరణంలా ప్రసరించి శిలలోని పాదరస రూపాన్ని పట్టుకోవాలి. శిలకీ శిల్పికీ జరిగే ఈ ఆత్మరతి నుంచే శిల కళగా పునర్జన్మిస్తుంది.

ప్రపంచ పంచబంధాల్ని తెంచి ఒక అలౌకిక అనుభూతిలో హృదయాన్ని ముంచగలశక్తి శిల్పకళకుంది. ఒకప్పుడు ఆకాశంలో ఉజ్జ్వలంగా వెలిగి క్రమేణా కాంతిని కోల్పోయి నివురు కప్పిన నిప్పు ముద్దల్లా పడి వున్నాయీ శిలా గోళాలు. వీటి కడుపులోని కాంతే శిల్పం.

తమాల వృక్షాల్లో అరమరచి నిద్రిస్తున్న తమో శకలాల్ని వేటాడే అరుణ కిరణాల్లా శిలల్లోకి ఉలి కాంతి ధారలు చొచ్చుకుపోవాలి. అప్పుడు రాళ్ళ కొమ్మల్లో దాగిన రామచిలుకలు శిల్పాల్లా వెలికివస్తాయి. సామాజికులకు విలువైన రత్నాలు ఆరణ్య వాసులకు మామూలు రాళ్ళు. అరణ్యాలోని మామూలు రాళ్ళు శిల్పులకు విలువైన కళారూపాలు. పర్వతాల లోయలు శిలల ధ్యానమందిరాలు. ప్రతి శిలా శిల్ప శోభనానికి కలలు కనే కన్నెపిల్లే! ఉలిని చూస్తే శిలకు మోహం, దాహం, కించిత్ భయం కూడా!

ఈ కొండలవి ఇనుప గుండెలు. లేకపోతే ఇన్ని తరుణ వయస్కులైన శిలల వయో మనో వేదనల్ని ఎలా భరించగలవు? ఈ పర్వత సానువుల్లోని శిలలన్నీ నిద్రిస్తూ సుదీర్ఘ మధుర స్వప్నాల్ని కంటున్నాయి. లేకపోతే ఈ దండెత్తే ఎండల్ని దండనగా ఎలా మార్చుంటాయి? శిల మృత్యువు. శిల్పం పునర్జన్మ. శిల్పి బ్రహ్మ." ఎదుట ఆసీనులై వున్న శిల్పు లందరినీ చిరునవ్వుతో చూస్తున్నారు సౌరాజ్యుడు. వాళ్ళ కళ్ళలో కొత్త కాంతి కనిపించింది. చేతి నిండుగా ఆవేశం ఆవహించినట్టనిపించింది. అతని శిల్ప వ్యాఖ్యానాల్ని గురించి అనోట ఈనోట విన్నవాళ్ళు కాబట్టి శ్రద్ధగా విని ఆ శిలాక్షరాల్ని మనోఫలకాలపై లిఖించుకున్నారు.

"ఆర్యా! మీరు మాకు ఇచ్చిన ఈ ప్రేరణ శిల్పకళకు మూలాధారం. శిల్పి భావుకుడు కావాలి. భావన కళకు ప్రాణం. భావ చిత్రాలు ఎదలో మొవలవిదే కళారూపాలు ఎలా వెలువడతాయి?" కృతజ్ఞతల్ని వ్యక్తం చేసారు.

"మనకు తెలిసిన విషయాలే అయినా మననంతో దృఢపడతాయి కాబట్టి మనం కలిసినపుడు వాటిని చర్చించుకోవడం ముఖ్యం.

శిల్పకళ అన్ని కళలతోపాటూ రూపురేఖలకు మరిన్ని సొగసులను దిద్దుకుంటూనే వస్తూంది. పల్లవరాజుల కాలంలో శిల్పులు మొదట శిల్పాలను అతి సాధారణంగా చెక్కేవారు. వాటికి ఆభరణాది అలంకారాలు అప్రధానంగా వుండేవి. చోళుల కాలంనాటికి శిల్పాలు తమను తాము అలంకరించుకోవడం మొదలుపెట్టాయి. పాండ్యులు చోళులకు పోటీగా శిల్పశోభను పెంచుకుంటూ పోయారు. ఇక కృష్ణరాయల యుగం వచ్చేవరకి పై అన్ని రకాల శిల్ప పద్ధతుల్ని మేళవించి శిల్పకళకు పైతళాన్ని హత్తించాడు. వస్త్రాభరణాలు, స్తనకట్టు, కట్టూ బొట్టూ అందాన్ని సంతరించుకున్నాయి. కాలానుగుణంగా శిల్పులు తమ ప్రజ్ఞను ప్రదర్శించవలసి వుంటుంది. పోయి

శిల, వేలూరు, హలబేడు, హంపి ఇలాంటి క్షేత్రాలు మన కళ్ళముందు కదలాడుతూ వుండాలి. ఇప్పుడున్న శిల్పఖండాల నుంచి అలనాటి కళా ఖండాల్ని ఊహించుకోవాలి.

మీరు చెక్కబోతున్న శిల్పాల్ని నాలుగు విభాగాలుగా వింగడించు కోండి. అవి 1. అ భంగం 2. సమ భంగం 3. అతి భంగం 4. అభాస భంగం.

శిల్పానికి ఒక కాలు సమస్థితంగా వుంచి రెండోదాన్ని చిరుకుంచితంగా వుంచడం అ భంగం. శిరస్సు మధ్య సూత్రంలో వుండి, నడుము కుడివేపుకుగాని ఎడమ వేపుకుగాని వంగి వుండే భంగిమ సమభంగం. ఇలా ఒకవేపుకు ఎక్కువగా వంగి వున్నది త్రిపురాంతకమూర్తి భంగిమ. ఇక కొలతలకు అందకుండా అందాన్ని ప్రాధాన్యంగా వుంచుకున్న ఈ భంగిమ అభాస భంగం. శివతాండవం, రాధాకృష్ణులు, రతీ మన్మథులు ఇలాంటి శిల్పాల్ని మలచేటప్పుడు శిల్పి స్వాతంత్ర్యాన్ని తీసుకోవచ్చు. అక్కడ కొలతలు కాదు అతని కళాత్మక విరుపులు అందాన్ని ద్విగుణితం చేస్తాయి. అందం పొంగి వచ్చేచోట మీరు శాస్త్ర ప్రమాణాన్ని అధిగమించండి. అందాన్ని కొలతలు అణచివేయకూడదు." వివిధ విగ్రహాల్ని వాళ్ళకు ఉదాహరణకు చూపుతున్నారతను.

"అందమైన భంగిమలే ఒకనాటికి ప్రమాణాలౌతాయనుకుంటాను." అన్నాడొక శిల్పి.

"సోదర శిల్పి చెప్పింది వాస్తవం. ప్రకృతి నుంచి ఉపమల్ని వెతికి పట్టండి. తాబేలు చిప్పల్లాంటి మోకాటిని, చేపల్లాంటి పిక్కల్ని, అరటి చెట్టులాంటి ఊరువుల్ని, గోముఖం లాంటి ఎద ప్రదేశాన్ని, ఈ వక్క చెట్టు పాలలాంటి గుండ్రని కంఠాన్ని, తిలక పుష్పంలాంటి నాసికను, కోడి గ్రుడ్డు ఆకారంలా (కుక్కుటాండ మస్తకం) తలను — ఇంకా మీరేదైనా

కొత్త దృక్పథంలో అందమైన మార్పుల్ని కనుగొంటే నేను హర్షిస్తాను. వాటికి శాస్త్రార్హత దక్కుతుంది కూడా!"

చంద్రకాంత శిలలు విగ్రహాలకు పనికి వస్తాయంటారా?" ఒక శిల్పి ప్రశ్నించాడు.

"నిస్సంశయంగా....శిల్పికి కొలతలు చాలా ప్రధానం. అతను కొలబద్దమీదే బద్ధుడై పనిచేయాలి. ఈ కొలబద్దను చూడండి—చందనం, అశోకం ఇలాంటి చెట్లమధ్యనుంచే దేవదేరిన కర్రను సంగ్రహించాలి. దానిని నీటిలో నానబెట్టి వుంచాలి. తర్వాత చెక్కి కొలబద్దను తయారు చేసుకోవాలి. ఇక అది ఎలాంటి వాతావరణంలోనూ మార్పు చెందదు. అన్ని కొలతలకు కొలబద్దే పనికిరాదు కాబట్టి మూడుపురుల తాటినార దారం గానీ, కొబ్బరినార దారం గానీ అవసరం అవుతుంది. పట్టుపురుల రజ్జువు కూడా ఒకటి పేని వుంచుకోవాలి. దేవాంగుళ కొలమానానికి, కిష్కుల కొలమానానికి ఇది ఉపయోగపడుతుంది."

"ఇంతకు మును పే ప్రతిమలను కొలిచే నాలుగు విధానాల్ని గురించి—" "మానాంగుళం, మాత్రాంగుళం, దేహలబ్ధాంగుళం, యవాంగుళం—కదండీ."

"అవును—అచ్చితంగా అవే—ముచ్చటించుకున్నాం."

"ఆర్యా! శిల్పాల హస్తాల్ని మలచేటప్పుడు ఈ తాటిగేగును గానీ, ఈ వెదురు బంబును గానీ ప్రమాణంగా తీసుకుంటే ఎలా వుంటుందంటారు?"

"ఇలా ఇవ్వు" అన్ని కోణాల్లోనూ దాన్ని పరిశీలించాడు సారాఖ్యుడు. దాని ప్రమాణాన్ని ఒక ఫలకంపై గీసి చూశాడు. మిగిలిన శిల్పుల అభిప్రాయాల్ని సేకరించాడు. తాటిగేగును మోచేతి నుంచి క్రింది హస్తానికి దృష్టాంతంగా వాడవచ్చునని ఆమోదించారు వాళ్ళు.

"ఇలా మీరు ప్రకృతినుంచి శిల్ప ప్రమాణాల్ని సేకరించండి. నూతన ప్రయోగాల్ని చేయండి. శాస్త్రం ఎప్పుడూ ఒకేచోట, ఒకేలా ఆగి పోదు. ఉదాహరణకు ఈ శివఢమరుకం మధ్య భాగాన్ని నెలతల వెన్నడుముల్ని చిత్రీకరించడానికి వాడవచ్చునేమో గమనించండి" ఢమరు కాన్ని వాళ్ళకు అందించాడు. "నిజమే దీన్ని కళాత్మకంగా వినియోగించి వాడుకోవచ్చు" సంతోషంతో అంగీకరించారు వాళ్ళు. ఇలా వాళ్ళలో నూతన్న శిల్ప ప్రయోగాభిలాష రేకులు విప్పడానికి నాంది పలికాడు సౌరాఖ్యుడు.

"ఆర్యా! కవికి కవితావేశం కావాలి. శిల్పికి శిల్పావేశం రావాలి. ఎద లోతుల్లో ఎక్కడో దూరంగా సిందూరపు సందె సుడులు తిరిగితే తప్ప భావావేశం రాదు. ఆ ఆవేశాన్ని మరోసారి రగిలించండి. శిల్పకళకు శిల, ఉలి, శాస్త్రం, సాధన మాత్రమే చాలవు. వీటికి అతీతమైన స్ఫూర్తి ఒకటి కావాలి. అది మీలోనుంచే రావాలి. దయచేసి ఆ స్థితిని ప్రసాదించండి" వాళ్ళు ప్రాధేయపడడంతో భావ సమాధిలోకి వెళ్లాడు సౌరాఖ్యుడు. నెమ్మదిగా కళ్లు విప్పాడు. ప్రబోధగా ఇలా చెప్పాడు—"మనం మనసులోపల పునీతభావ దేవాలయాన్ని నిర్మించుకోవాలి. నీలినీలి ఆకాశ సాగరాల నుంచి తెరచాపలెత్తి కట్టుకుని కళాసామగ్రితో సాగివచ్చే సారస పక్షుల్లా దివ్యభావాలు వచ్చి వాలుతాయి. అవి ఎదలోని గుడిగోపురాలమీదకెళ్ళి కువ కువ లాడుతూ గూళ్ళు కట్టుకుంటాయి. లేకపోతే ఇట్టే ఎగిరిపోతాయి. ఈ ఎముకల గూటిమీద దేవలోక దేవాలయ పక్షులు వచ్చి వాలాలంటే ఎంత అందమైన భావాలతో అలంకరించుకోవాలి! మనిషి సదాచార సంపన్నుడు కావాలి. సుందరమైన విహంగాలు కాపురం చేసి ఎగిరిపోయిన పుడకల గూడు కాకూడదు. శరీరం. కళ అంటూ హృదయానికి అంటుకుంటే ఇక బాహ్యం భావం అంటూ ఏదీలేదు. ఉపాధి, ఉపాసకుడు, నిర్మితి, నిర్మాత, నిర్మాణం అంటూ ఏదీ అవసరం లేదు. అంతా కళే, కళ కళే! మనలో కళ కళకళలాడుతూ వుండాలి. మన ఎదలు కళాంతికలకు పాదులు కావాలి.

ఉలి దెబ్బలు తిన్న శిలలకే చందన చర్చలుంటాయి. ఆత్మీయ అర్చనలుంటాయి. కాబట్టి గాయానికి నీ ఒంటిని ధ్యేయంగా పెట్టుకో—ఒక గేయానికి పాత్రమవుతావు. కళ ఉద్విగ్నమైనపుడు నగ్నత చోటుచేసుకుంటుంది. నగ్నత సత్యం. పైనవన్నీ ఆదేశాలు—ఆగమాలు—ఆచ్ఛాదనలు. శిల్పానికి నగ్నత లేదు. శిలే కళకొక ఆచ్ఛాదన. మేఘం మెరుపు రెక్కలతో హంసలా ఎగిరిపోతుంది. శిల కళతో శిల్పంలా ప్రచలితమవుతుంది.

ఆలయాలు శిల్పకళా సంకలనాలు. శిల్పాలు ముద్రణా స్థలాలు. శిల్పాలు ముద్రాపకులు. శిల్పాలు బంగారు నాణాలు. అవి ఏ దేశంలోనైనా చలామణి అవుతాయి.

ఇటు కలియుగానికి, అటు కృతయుగానికి మధ్య సంధియుగంలో సరిహద్దు రేఖలో దాగిన అప్సరసలీ శిలలు. అదిగో చూడండి—గాలుల అలలమీద పూలు హంసల్లా తూగాడుతున్నాయి కదా. పొదలు హరిత సరస్సులయితే పూలు రెక్కలు విప్పిన పిటిపక్షులు.

శిలకు ఉలి వేగుచుక్క. తమోసమాధుల నుంచి వేళమించింది రెమ్మవి శిల్పాలకు మేలుకొలుపులు వినిపించే వెలుతురు పిట్టలు ఉలులు.

శిలలు చీకటి పొదలు. వాటి వెనుక లేళ్ళలా పొంచివుంటాయి శిల్పాలు. శిల్పి కళాధనుస్సుకు ఉలిని ఎక్కుపెట్టి ఆ హిరణ్మయ ఆకారాల కోసం యత్నించే వేటగాడు. అదో వ్యసనం. కళలన్నీ వసనాలు అర జార్చిన వ్యసనాలే.

ఈ శిలాసమూహం నాకు ద్రవీభవించిన శిల్ప సరోవరంలా కనిపిస్తుంది. అందులో ప్రకాశిస్తున్న స్వప్న సరోజాల్లా శిల్పాలు దర్శనమిస్తున్నాయి. గండశిలల శిరలమాటున అందమైన శిరోజాలతో ఉన్నత ఉరో

జాలతో పెళ్ళితెర మాటున తాళి కట్టించుకోడానికి సిద్ధంగా కూర్చున్న నవ వధువుల్లా శిల్పాలు దర్శనమిస్తాయి.

గండశిలలకు, గండరించే శిల్పికి మధ్య శిల్పకళ సువర్ణ వారధి దాని మీదుగా ఆరాధకులు దివ్య లోకాలకు వస్తుంటారు. అసంపూర్ణ శిల్పం ఒక భగ్నప్రేమకు ప్రతీక. శిల్పులు అర్థాంతరంగా వదలిపెట్టిన శిల్పాల నుదుట జగన్మాత శాపగీతి రాసినట్టు జాలిగా కపిపిస్తాయి.

శిలల నెచ్చెలులలోని శ్రామగ్రంధుల్ని శిల్పి ఉలి తాకనేకూడదు. వికారరేఖ శిల్పానికి శోభనివ్వదు. శిలలలోని శృంగార వలువల ముడులు విప్పాలి శిల్పిచూపు. పశుదశను మనిషి దాటాలనుకున్నపుడు కళాకారుడు కళతో వాపికుడిలా ఒక కేక వేస్తాడు. ఆ తరుణంలో యాత్రికుడు జాగ్రత్తగా తరించాలి.

చివురాకుల్ని రెక్కలుగా హత్తుకుని మనం దేవలోకాల కెళ్ళ గలమా—ఎదకు దృఢమైన సంకల్పాలు పిచ్చుకరావాలి కానీ! మనిషిని మలచిన పరమేశ్వర ప్రజ్ఞ తిరిగి మనిషి ద్వారానే శిలలమీద సృష్టి విన్యాసాలు చేయిస్తుంది. కణం ప్రకృతి నుంచి సేకరించుకున్న కందరాలతో గండశిల అవుతుంది. శిలల మాతృగర్భాల్లోని ఈ కణాలు కాలక్రమేణా శిశువుల్లా ఎదిగి శిల్పార్హతను పొందుతాయి. అవును — శిలా తలాలు కళా స్థావరాలు. ఉలికి శిలకి మధ్య జరిగే ప్రణయ ఘర్షణలో ఎగసిపడే మిణుగురులు రాతిరిలాంటి రాళ్ళ ముంగిట రాలే ఉల్కలు. అవి దీపావళి దీపాలు.

తరతరాల పరిస్థితులకు అలవాటు పడిన శిలల సహిష్ణుత నుంచి పుట్టిన శిల్పాలకెంత ఔన్నత్యం! శిలా కుడ్యాల మధ్య శిల్పకన్యలు అంతఃపుర కాంతల్లా వుంటాయి. పాతరాతి యుగంనాడు అంతఃపుర కన్యల్ని రాక్షసులెవరో చెఱపట్టి కఠిన కారాగారాల్లో బంధించినట్లు కారు శిలల్లో జల కారు శిల్ప ఖాఖినులంటారు. శిల్పులు రాళ్ళమీద ఉలులతో దాడిచేసి

వాళ్ళను చెరనుంచి విముక్తిచేసే రాకుమారులు. ఆ శిల్పాలు అప్సర కన్యల్లా శిల్పుల్ని వరిస్తాయి.

శిల్పికి ఉలి చూపుడు వ్రేలులా శిలా కళాస్థానాలకు దారి చూపుతుంది. ఏ తమో యవనికల తారుపాటులోనో ఏమరుపాటుగా వుండి ముకుళీభూత శిలా పద్మాల్లో ఇరుక్కుపోయిన అమర భ్రమరాల్లా శిల్పాలు వెలికి వస్తుంటాయి. శిల్పి నాగస్వర వాదకుడు. శిలా వల్మీకాల్లో నిద్రిస్తున్న కళాదేవ సర్పాల్ని కుండలినీ శక్తుల్లా తట్టి లేపుతాడు శిల్పి. పారలౌకిక అపార శక్తులు కళాత్మకంగా విచ్చుకున్న రాతిపూల శిల్పాలమీద వాలాలని వస్తాయి.

శిలాతలానికి, ఇలాతలానికి యుగ యుగాలుగా విడదీయరాని బంధం వుంది. ఇల తల్లి, శిల శిశువు. ఇల శిలకు పుట్టిల్లు. శిల్పశాల శిలకు మెట్టిల్లు. మెట్టినింట మణిశిలలాంటి కన్య ఎన్ని పరిమాణాలకో లోనై మాతృత్వాన్ని సముపార్జించుకుంటుంది. అలాగే శిల కూడా విచిత్ర హింసలకు గురై పూజార్హ శిల్పమవుతుంది. ఉలిదెబ్బల నుంచి ఒళ్ళు దాచుకున్న సోమరి శిలలు గండశిలల్లా ఊసర క్షేత్రాల్లో పొదలక్రింద నిరుపయోగంగా పడి వుంటాయి. శిలలు నేలలోకి దించుకున్న కూకటివేళ్ళు పెకిలించబడకపోతే అవి కలాఖండా లెలా అవుతాయి?

అజ్ఞానపు ఊబిలో కూరుకున్నవాడు శిల అవుతాడు. అజ్ఞాన ఆవరణాన్ని ఛేదించుకున్నవాడు అహల్య కన్న కల అవుతాడు. గండశిలలు రాక్షసులు. ఉలి విష్ణుచక్రం. శిల్పి విష్ణువు. ఫలితం శిల్పం. శిల సమస్య— కళ సమాధానం. ఈ రెంటి మధ్య అనంత సాధన వుంది. అదే శాస్త్రం.

భగవంతుడు సృష్టిలో అసంపూర్తిగా విడిచివేసిన కళారూపాలే ప్రేమికులకు కలల రూపంలో వస్తుంటాయి. శిల్పి మహాప్రేమికుడు. ఎందుకంటే అతను శిలలోని స్త్రీలను ప్రేమిస్తాడు. ప్రకృతిలో సృష్టికర్త పూరించకుండా వదలిపెట్టిన ఖాళీలను నింపడానికి ప్రేమికులు, ఆరాధకులు, కళాకారులు అహరహం శ్రమించవలసి వుంది.

శిలలు పిగ్గుతో కఠినంగా వారించే మార్మిక కోణాల్లో ఉలులు నిప్పు రవ్వల్ని తోడుకోవాలి. అప్పుడు వశం తప్పిన శిలలు అపార పార వశ్యంతో అందాలను సంతరించుకుని సుందరీమణులుగా పునర్జన్మిస్తాయి.

ఉలి శిక్షణ ధారా వీర్య స్పర్శకు నోచుకోని పావం ఒక శాపమని శిలల్ని కన్నీళ్ళు పెట్టుకునే ఏకాంత విశిథి వేళను శిల్పకన్ను కనిపెట్టి కనుకట్టు చేసి కళను ఆకట్టుకోవాలి. చెట్టూ చేమా రాయీ రప్పా మూసు కున్న తమ కనురెప్పలు విప్పి చూసే ఏకాంత మౌక్తిక క్షణం కోసం కళా కారుడు నిరీక్షించాలి. ఆ అంతర్లోక అగ్ని లోయల్ని పరీక్షించాలి. అనాదరణీయంగా అడవుల్లో పడివున్న పెనుశిలల్లోని పెన్నిధుల్ని శిల్పి చూడగలగాలి. అదృశ్య ఈశ్వరీయ అధరాలమీద దరహాస కాంతి స్పర్శను నోచుకోవాలని ఎన్నో నోములు నోస్తున్నట్టున్న శిలోచ్చయ శిలా ప్రపం చంతో శిల్పి పరిచయం పెంచుకోవాలి. గండశిలల గళంలో తారాస్థాయిలో తారాడే మౌనరాగాన్ని ఉలి వినగలగాలి. పెనుబండల వరదాల మాటున దోగాడే అంతు లెరుగని కాంక్షను శిల్పి పసిగట్టగలగాలి. ఓ శిల్పి! తడిలేని రాతి ఒడిలోకి తలపెట్టి సున్నితంగా పడుకో ఎన్ని స్నిగ్ధరాగాలు వినిపిస్తాయో వింటు. సోదర శిల్పులు ఈ విషయాల్ని విస్మరించరని ఆశిస్తాను" సౌరాఖ్యుడు శాపేష ప్రశాంతంగా కళ్ళు మూసుకున్నాడు. అపాత మధుర ధారాపాతంగా కురుస్తున్న అమృత వర్షిణి ఆగిపోయినట్టు విలవిలలాడారా శిల్పులు. వాళ్ళ హృదయాల్లోకి తేనె వీణ తంత్రుల గాలివాన రాగం చొరబారింది. ఆత్మల్ని మంత్రంతో మీటినట్టు చలించిపోయారు వాళ్ళు. వాళ్ళందరూ అప్రయత్నంగా శిరస్సులు వంచి సౌరాఖ్యునికి కృతజ్ఞతా భారంతో ప్రణ మిల్లారు.

బాగా విస్తరించిన ఉత్తాల వృక్షశాఖల క్రింద నీడల్లో పెద్ద పెద్ద శిలాఖండాలు పడివున్నాయి. వాటిమీద ఏ శిలలు ఏ ఏ శిల్పాలకు సరి

పోతాయో ఆ శిల్పాల పేర్లను, వాటి కొంతల్ని రంగు కుంచెలతో రాస్తున్నారు కొందరు. కళింగ నాట్యం అని రాసివున్న పెనుశిలను పరీక్షగా చూస్తూ నిలుచుంది ప్రవాళ. ఇంత పెద్ద కఠినశిల నుంచి ఎంత అందమైన రూపం వెలువడుతుంది! సాహిత్యంలో గద్యప్రబంధం అన్న పేరుంది కానీ అంతకన్నా వహాప్రాధిక క్రమాభాయిష్టమీ శిలా ప్రబంధం, ఈ నల్లని రాళ్ళు ఏనుగుల్లానే వున్నాయి.

అక్కడ పెద్ద పెద్ద ఉలులు, మధ్యరకం ఉలులు, సన్న ఉలులు పడి వున్నాయి. శిల్పాలకు అవసరమైన చోట రంధ్రాలు చేయడానికి వాడే తప్ప ఉలులు, మాలలు, ఆభరణాలు వేసుకోవడానికి అనుకూలంగా ఉపయోగించే కంతద్వారం ఉలులు (పతయాసు) వున్నాయి. మొదట రాతిలో పెద్ద ఉలుల ద్వారా ఒక ఆకారాన్ని లీలగా వచ్చేలా చెక్కుతారు. తర్వాత మధ్యరకం ఉలుల్ని వాడి కొంత సమపుదనం వచ్చేలా చెక్కుతారు. చిన్న ఉలుల ద్వారా నిగనిగలకు దగ్గరగా ఆ శిల్పాన్ని తీసుకుపోతారు. కళ్ళు గోళ్ళు ముక్కు పెదవులు ఇలాంటి సున్నితమైన అంగాల్ని అరపాళం అనే ఉలితో మలుస్తారు. రవ్వ పళ్ళు, సన్న పళ్ళు, నునక పళ్ళు అంటే అర్థ చంద్రాకారం పళ్ళున్న పండ్లమొన అనే పరికరంతో శిల్పానికి కావలసిన శోభను సమకూరుస్తారు. దారాలతో విగ్రహ అవయవాల్ని పరిచూసుకునే ప్రలంబ పలకలు అక్కడ వున్నాయి. వాటిని చూస్తూ ఆ శిల్పోద్యమానికి పనికివచ్చే ఆ పరికరాల్ని ఉపయోగించే శిల్పుల హస్త లాఘవాన్ని, బుద్ధి బలాన్ని అంచనా వేసుకుంటూ కూర్చుందామె.

కొన్ని భారీ శిలల వెనుక భాగాల్ని చెక్కడానికి ముందుకు తొల్గించి వున్నారు. ఆ విధంగా వుంచడంలో ముఖభాగాలు దెబ్బతినకుండా ఆ ముఖాల క్రింద దూదిబస్తాల్ని వుంచారు. కొన్ని విగ్రహాల క్రింద ఇసుక బస్తాలు వేసి ఆయా భాగాలు దెబ్బతినకుండా జాగ్రత్త తీసుకుని వున్నారు. వాళ్ళ

నాలలో నుంచి నీళ్లని దించడానికి అనుకూలంగా కట్టిన ఒక ఏటవాలు శిలావేదిక అక్కడ వుంది. వివిధ దేవ ప్రతిమలు చిన్నవీ పెద్దవీ అక్కడక్కడా పడివున్నాయి. అవి రూప పరిపూర్ణత కోసం పరితపిస్తున్నట్టు కనిపిస్తున్నాయి. విగ్రహ పీఠాలకు రంధ్రాలు చేయబడి వున్నాయి. శిల్పం క్రింది భాగంలోని పొడవాటి భాగం ఆ పీఠరంధ్రంలో సరిగా అమరేలాగా కొలతలు తీసుకుని చెక్కారు. అందమైన దేవీ విగ్రహం చేతిలోని వీణా దండపు చెక్కడపు కొన పొరపాటున విరిగిపోయినట్టుంది. దాన్ని ఏ మాత్రం లోపం కనిపించని రీతిలో బంధన ప్రక్రియతో అతుకువేసి వున్నారు.

"ఇటువేపుగా నడచివస్తున్న దెవరో" అనుకుంటూ వెనుదిరిగి చూసిందామె.

"ఏం ప్రవాళా! శిల్ప పరికరాల్ని నీ అమృత కరాలతో పునీతం చేస్తున్నావా?" తెల్లని వస్త్రాలు ధరించిన అందాల శిల్పం ఒకటి నడచివస్తున్నట్టుగా తనవేపు వస్తున్న సౌరాఖ్యుని క్రొత్తగా చూస్తున్నట్టు కను రెప్పలు వేయకుండా చూసిందామె.

అతను కాళ్ళకు తొడుగుకున్న చందనపు పాదుకలు రాతిపలుకులమీద చిరుసవ్వడి చేస్తున్నాయి. చేతిలో ఎండిన జువ్వి కొమ్మ నొకదాన్ని పట్టుకుని వున్నాడు. అతని లలాటం విబూది రేఖలతో అందగిస్తూంది. వాటి మధ్య కుంకుమ బిందువు శివుని త్రినేత్రంలా వుంది.

"మీరు శివదేవుడిలా కనిపిస్తున్నారీ వేళ" తన మనసుకు తోచిన మాటను అతనితో అనేసింది.

"పరమాత్మకు శివ వైష్ణవ భేదంలేదు ప్రవాళా! అనాదిగా చాలా మంది శిల్పులకు శివుడు ఆరాధ్య దైవంగా రూఢికెక్కాడు. నేను శివ విగ్రహాన్ని కానీ, శివలింగాన్ని కానీ ఎంత శ్రద్ధాభక్తులతో శిల్పిస్తానో, విష్ణు

దేవుని విగ్రహాన్ని కూడా అంతే భక్తితో మలుస్తాను, కళకు అజ్ఞానం అడ్డు రాకూడదు" ఆమె ప్రక్కనే కూర్చున్నాడు. అక్కడ ఏదో పవిత్ర పరిమళం గుబాళిస్తుంది.

"పైగా ప్రవాళా! ప్రక్కన నది ప్రవహించినపుడు ఆ ఊరి అందం శోభాధికం ఎలా అవుతుందో నుదుట తిలకం ఒలికినపుడు ఆ వదనారవిందానికి శోభ ఇనుమడిస్తుందని నా దృష్టి. తిలకస్థానంలో సంగమించే నాడులకు విబూది రేఖలు చలువదనాన్ని అందిస్తాయి. శిరోవేదన తగ్గుతుంది. భ్రూమధ్య దేశం ఆత్మస్థానం. ఆజ్ఞాచక్రం వుందక్కడ. ఇక దానికి సంబంధించిన విషయాలు ఆలోచించేకొద్దీ నీకే అర్థమవుతాయి."

"లాభ లోభ పక్షపాత దృష్టికి అతీతమైన మన సంప్రదాయాలన్నీ శాస్త్రీయ దృక్పథాలతో ముడిపడినవేనని నాకు తెలుసు." పూర్తికావస్తున్న ఒక శిలకు వొయ్యారంగా ఆనుకుని కూర్చుందామె. "శిల్పం మరో శిల్పానికి నమూనాలా వుందిక్కడ" చమత్కరించాడు.

"ఆ శిల్పం శిల—మరి ఈ శిల్పం" లావణ్యాన్ని తొణికిస్తూ ముందుకు వంగి నెలవంకల్లాంటి గోళ్ళతో జడ అల్లికను మీటుకుంటూ అడిగిందామె.

"చెలి" సహజంగా అన్నాడు.

ప్రవాళ నిలువెల్లా పులకించింది.

"ఆ శిల్పం పనికిరాదు తీసివేయండి" తనతో పనిచేస్తున్న శిల్పుల వంక తిరిగి కాస్త ఉద్వేగంగా అన్నాడు సౌరాఖ్యుడు.

"ఏం—నేను ఆనుకున్నందుకేనా? నా చెమట ఆ శిల్పానికి తగిలితే అది మైలపడిపోయిందా" ప్రవాళ గతుక్కుమని మెల్లగా అన్న మాటలు అతనికి వినబడలేదు. అతను ఆ శిల్ప నిర్మాణంలో శిల్పి పడ్డ శ్రమంతా బూడిదలో పోసిన పన్నీరు అయిపోయింది కదా! అనుకుంటూ ఆ శిల్పంలోని సొంపులన్ని బేరీజు వేసుకుని బాధపడుతున్నాడు.

"ఆర్యా!" ఆయోమయంతో పాటూ ఉలిని మరోచేత పట్టుకుని శిల్పులు వచ్చారక్కడికి.

"ఈ శిల్పం చెక్కిన అతను ఇక్కడున్నాడా?"

"లేదండి."

"ఈ శిల్పం అర్హతను కోల్పోయింది."

"ఎందుకు?" ఆతృతగా అడిగారు వాళ్ళు.

"ప్రవాళ స్వేదజలం తగలడంవల్ల...."

"పోనీ లెండి ఆ శిల్పికి నష్టపరిహారం క్రింద కావలసినంత బంగారాన్ని సమర్పించుకుంటాను. ఇక ఈ పరిసరాలకు రాను" సౌరాఖ్యాని మాట పూర్తికాకనే ఆమెలోని ఆభిజాత్యం కన్నుమని పడగ విప్పింది.

"ప్రవాళా! నువు తొందరపడుతున్నావు. ఇప్పుడు చూడు నీకో వింతను చూపుతాను."

"ఇక్కడ ఉలితో గట్టిగా కొట్టి ఇంత శిలాఖండం వూడిపోయేలా చెయ్యి" ఒక శిల్పిని ఆదేశించాడు.

మంచి శిల్పాన్ని పాడుచేయమంటున్నాడేమిటా అని సంకోచిస్తూ ఆ పనికి తటపటాయిస్తూ ఆయత్తమవుతున్నాడా శిల్పి.

"చూడూ—ప్రవాళ ఈ విగ్రహానికి ఆనుకుని లేచింది. దానితో ఆమె స్వేదం ఈ విగ్రహానికి ఈ మేరవరకూ కమ్ముకుంది. ఇప్పుడు ఆ చెమటంతా ఆరిపోయింది. ఒక్కచోట మాత్రం ఆ చెమ్మ అలాగే మిగిలిపోయింది. అలా చెమ్మ ఇంకిపోకుండా మిగిలినచోట రాతిలోని ఉష్ణశక్తి తగ్గిపోయిందని అర్థం. అక్కడ ఉష్ణం ఎందుకు లేదంటే శీతలమైన ప్రాణి ఒకటి అందులో ఉండితీరాలి. రప్పలో కప్ప వుండడం సహజం. ఈ శిల గర్భిణీ శిల. విగ్రహానికి పనికిరాదు. ఖండించు ఆ భాగాన్ని" తదేకంగా విగ్రహ ఉదరభాగాన్ని చూస్తూ అన్నాడు.

"అమ్మో" అంది ప్రవాళ. ఒక కప్ప ఆ శిల్ప గర్భంలో నుంచి ఎగిరి దూకి గెంతుకుంటూ పోతూంది.

"ఇలాంటి విగ్రహాల్ని పూజించడం అరిష్టం. ప్రవాళా! మన్యాక శుభకార్యాన్ని చేయించావు మాచేత."

"ఆ కప్ప అక్కడ లేకపోతే ఆ విగ్రహం వృథాగా చెడిపోయి వుండేది. అంత ఖచ్చితంగా నువ్వు చెప్పగలగడం చూస్తే...."

"చెప్పింది నేనుకాదు ప్రవాళా! శాస్త్రం."

"శాస్త్రమే! దానికి గౌరవం కలిగేది దీక్షదక్షులైన శాస్త్ర వల్లనే కదా!"

"అంగీకరించాం" చూపులు చల్లుకున్నారిద్దరూ.

"చూడండి! ప్రతి శిల్పానికి చందన చర్చ చేసి బాగా ఆరిందా లేదా పరిశీలించండి. చందనం ఆరని భాగాలుంటే నాకు చూపించండి. తొందరపడి అంగవిచ్ఛేదం చేయకండి. రాత్రింబవళ్ళు చేసిన శ్రమ వృథా అవుతుంది." సౌరాఖ్యని కంఠంలోని శాసనాన్ని వాళ్ళు శ్రద్ధగా స్వీకరించారు.

"ఈ చిరుమామిడి పిందెను చేత వుంచుకుని వాపికాపంద్రాల ఆకారాల్ని అందంగా మలచమనండి. గర్భగుడిలోని దేవ విగ్రహానికి సరిగ్గా పై భాగాన గుడికి అమర్చే బ్రహ్మరంధ్రం కప్పు రాతిని అత్యంత దీక్షతో మలచి రూపొందింపవలసి వుంటుందని సూత్రగ్రాహితో నా మాటగా చెప్పండి. గర్భాలయ కలశరంధ్రం విగ్రహం శిరస్సుమీద నుంచి చూస్తే తెలియాలి" హెచ్చరికగా వివరించాడు.

ఆగమశాస్త్ర పండితులైన శిల్పులు పంచరాత్రం, వైఖానస ఆగమాల శ్లోకాల్ని మననం చేసుకుంటూ వైష్ణవ దేవతా విగ్రహాల్ని రూపొందించ టానికి పూనుకుంటున్నారు. రూపధ్యానం చేసుకున్న తర్వాత ఒక పల్లబల్ల మీద ఆ రూపురేఖా విలాసాల్ని చిత్రించి చూపుతున్నారు. ఆ తర్వాత

శిల్పార్హత వున్న శిలమీద రంగు కుంచెతో రూపవిన్యాసం చేస్తున్నారు. ఆ గురువుల దగ్గర కళాభ్యాసం చేస్తున్న శిష్యులకు వాళ్ళు ఎడమవైపు శిల్పం ఏర్పడేలా చెక్కిచూపి అలాగే కుడివైపున మీరు చెక్కి చూపండని పరీక్షలు పెడుతున్నారు. ఆ శిష్యులు ఉలిని పట్టుకునే ఎడమచేతికి తోలు పట్టీలు కవచాలుగా ధరించి చెక్కడపు పనిని ప్రారంభిస్తున్నారు. రూపు రేఖలు సరిగా ఏర్పడని పెద్ద పెద్ద దేవశిల్పాలమీద కూర్చుని నిర్వికారంగా మలుస్తున్న శిల్పవరులు వాటికి ఆకారరేఖలు ఏర్పడేకొద్దీ ఆ శిల్పాల వద్ద భయభక్తులతో ప్రవర్తిస్తున్నారు.

"సోదరా ఈ దేవశిల్పానికి జీవరేఖ ఇచ్చేశాను. కాలు తగిలించకోకావు జాగ్రత్త" అంటూ కొందరు శిల్పులు తమ తోటి శిల్పుల్ని హెచ్చరించి పూజాద్రవ్యాల కోసం కలయజూస్తున్నారు.

దేవశిల్పం సమాప్తదేలడానికి ముందు ఏర్పడే పూర్తి రూపాన్ని 'జీవరేఖ' అంటారు. జీవరేఖను తీసుకున్న శిల్పానికి మెరుగులు దిద్దవలసి వున్నా, యజమాని ముందరి సేవకుడిలా ఆ విగ్రహం ముందు శిల్పి మసులుతుంటాడు. ఇది శిల్పులకు వంశపారంపర్యంగా వస్తున్న ఆచారం.

అలా జీవరేఖల్ని సముపార్జించుకున్న దేవ విగ్రహాల్ని జాగ్రత్తగా నిలబెట్టి పసుపు రాసి కుంకుమల్ని తిలకాలుగా దిద్దుతున్నారు. పరిసరాల్లో పూచిన పూలను కోసి తెచ్చి ఆ మూర్తుల శిరస్సులమీద, హస్తాల మధ్య నిలిపి నమస్కరిస్తున్నారు. ఆ దృశ్యం శిల్పుల మనోభావ సంస్కారాన్ని ఆవిష్కరిస్తోంది.

9

ఓం నమః సర్వలోకాయ విష్ణవే ప్రభవిష్ణవే
విశ్వాయ విశ్వరూపాయ స్వప్నాధిపతయే నమః
ఆచక్ష్వ దేవదేవేశ ప్రసుప్తోస్మి తవాంతికమ్
స్వప్నే సర్వాణి కార్యాణి హృది స్థాని తు యానియే

దేవతా విగ్రహాల్ని చెక్కాలని సంకల్పించిన సౌరాఖ్యుడు తనకు కలల్లో ఆయా దేవతల దర్శనభాగ్యాన్ని కల్పించమని స్వప్నాధిపతి అయిన విశ్వరూపుని ప్రార్థిస్తున్నాడు. విగ్రహ నిర్మాణోద్యుక్తుడైన శిల్పికి దేవతాస్తవ ధ్యానాదులు అతి ముఖ్యమన్న విషయాన్ని విస్మరించని దృఢ విశ్వాసి అతను.

శిల్పి వివిధ దేవతాహ్వాన మంత్రతంత్ర కుశలుడుగా వుండాలి. బహుశాస్త్ర కోవిదుడై వుండాలి. సదాచారశీలుడై వుండాలి అనుకుంటూ ఆత్మపరిశీలనలో ఏకాంతంగా ఆ పర్వత సానువు మీద కూర్చుని వున్నాడు సౌరాఖ్యుడు. శుక్రనీతి శాస్త్ర శ్లోకమొకటి అప్రయత్నంగా అతనికి స్మృతిపథంలో మెదలడంతో ఆ శ్లోకాన్ని రాగయుక్తంగా పాడుకున్నాడు.

సర్వాద్య దేవతా ధ్యానైః ప్రతిమాస్తే షు యోజయేత్
ధ్యాన యోగస్య సంసిద్ధ్యై ప్రతిమా లక్షణం స్మృతమ్
ప్రతిమా కారకో మర్త్యో యథా ధ్యానరతో భవేత్
తథా ధ్యానేన మార్గేణ ప్రత్యక్షేణాపి వాఖలు

తాను రేపు శిల్పించదలచిన ప్రతిరూపాలు ముందు తన మనో ఫలకంపైన ముద్రితం కావాలి. ఆ సాక్షాత్కారం అయ్యాకే శిల్ప నిర్మాణం—అనుకుంటూ ఆ శిల్పరూప దర్శనం కోసం ఆ ప్రశాంత అరణ్యస్థలంలో గట్టిగా యత్నిస్తున్నాడు.

శరీరాంకురాల హోమపరిమళం అతనికి గాలివాటుగా అహ్లాదంగా సోకుతోంది. 'కారీర్యావృష్టి కామో యజేత్' అని యజుర్వేదం సూచించిన విధంగా అక్కడి గ్రామీణులు శిల్పాచార్యుని సహకారంతో వర్షంకోసం కారీరిష్టిని చేయించుకుంటున్నారు. సోమలతతో సమానమై సౌమ్యాకార కరీరాంకురాల్ని అగ్నివేదిలో ఆహుతి చేస్తున్నారక్కడ. దానితో పడమటి గాలి బంధించబడి వర్షానుకూలమైన తూర్పుగాలి చలితమవుతున్న గగన వీథిలో ఏదో అహ్లాదసూచన అతనికి కానవస్తుంది. ఆరోగ్యకరము, ఉత్సాహజనకమైన ఆ పరిమళం అతన్ని ఏదో దివ్యావేశానికి గురిచేస్తోంది, అంతలో ఘుమఘుమలాడే అత్తరు వాసన వచ్చి అతని హృదయానికి శృంగారభావాన్ని హత్తిశించింది. పరిసరాల్ని పరిశీలించాడు. పర్వత పానువు వేపు ప్రవాళ మరొక వ్యక్తితో కలసి ఏదో ముచ్చటించుకుంటూ వస్తోంది. ఆమె రాకను తదేకంగా చూస్తున్నాడతను. లీలగా వినిపిస్తున్నాయి వాళ్ళ మాటలు. పక్షులు కూజిస్తున్నాయి. పడమర కొండలకు దగ్గరవుతున్నది సూర్యబింబం. "ఇతను ప్రణవదత్తు అని నా సహాధ్యాయి. చదువుకునే రోజుల్లో నాకు మంచిమిత్రుడు. చాలాకాలం తర్వాత ఈ పరిసరాల్ని చూడాలని వచ్చాడు." మామూలు మనుష్యులకు అందని దూరతీర సంచారాలు చేస్తున్నట్లున్న సౌరాఖ్యుని కళ్ళలోకి లోతుగా చూసింది. ప్రవాళ.

"అలాగా" అంటూ చేతులు జోడించాడు. తను సంచరిస్తున్న దివ్యపథాలనుంచి అతి కష్టం మీద భూమికి దిగినట్లుందతని ధోరణి.

"ఏమిటి దర్శిస్తున్నారు ?" నెమ్మదిగా మాటలు కదిపింది.

"ఏదో నా చిత్త విభ్రమంటే ప్రవాళా" ముభావంగా అన్నాడు.

"మీరు ఏ ప్రాంతం నుంచి వచ్చారు ?"

ప్రణవదత్తువైపు తిరిగి సౌమనస్యంతో అడిగాడు.

"మాది కొండైమండలం" సౌరాఖ్యని పరిశీలనగా చూస్తూ చెప్పారు. సంప్రదాయం కొంత అధికంగా ఒంటపట్టినవారిలా కనిపిస్తున్నారతను సౌరాఖ్యకి.

"మీరు ఈ పర్వతాల ప్రశాంత ఆవరణంలో ఏమిటి చూస్తున్నారు?" మీ తపనలో ఏ విషయం రెక్క విప్పుకుంది?" తిరిగి అడిగింది ప్రవాళ.

"చెప్పేదాకా వదలనన్నమాట" చిరునవ్వు, కాస్త చిరాకు కలిసి మారాకు తొడిగినట్టు నవ్వారు.

"అవన్నీ పిచ్చిగా వుంటాయి"

"ఆ పిచ్చే పై లోకాల విజ్ఞానం"

"మనం వున్నది ఈ లోకంలో కదా"

"అందుకే విసుగెత్తి ఆ లోకాన్ని ఆలోకించాలనిపిస్తుంది. అది అందరివల్ల కానిపని కదా" చెప్పమన్నట్లు వేడుకోలుగా చూసింది. "ఎవరెవ్వరి పిచ్చి వాళ్ళకు ఆనందం మరి" మధ్యలో హాస్యం చేసుకున్నారు ప్రణవదత్త.

"అది పిచ్చేనని పొరబడి చెబుతున్నారు చూడుమరి" సౌరాఖ్యకు అతని మాటలోని మోటుతనాన్ని గుర్తించినట్లు పసిగట్టింది ప్రవాళ.

"అలా అనుకోవడం అతని పిచ్చి అనుకోండి" ఆమె సరదాగా నవ్వినట్టు కనిపించినా తనకు ఓ చురక పడినట్టే భావించారు ప్రణవదత్త. అతని లోలోపల అసహనం చోటుచేసుకుంటోంది. ప్రవాళ సౌరాఖ్యనికి అంత ప్రాధాన్యతనివ్వడం అతను సహించలేకపోతున్నారు.

"చెప్పు సౌరా. ఇన్నిపాట్లు నేను ప్రాధేయపడితే తప్ప నోరు విప్పనన్నమాట" నిష్ఠురంగా అంది. ఈ సంఘటనలన్నింటి మధ్య అతని దివ్య ప్రశాంత భావ ప్రపంచం కంపించిపోయింది. అయినా అతను

ఆమెకోసం ఇంత కాల హృదయాన్ని ఆవిష్కరించి చూపింది అను కున్నారు.

"శిల్పి విశ్వశిల్పి అయిన బ్రహ్మతో పోటీపడినట్లు శిలలమీద పునఃసృష్టిని ప్రారంభించాడు. బ్రహ్మసృష్టి మూన్నాళ్ళకు ముగిసిపోతూ వుంటుంది. శిల్పిసృష్టి యుగాలదాకా పడివుంటుంది. శిల్పి శిల్పవిద్యలో విశ్వశిల్పితో స్పర్థించినా పిడిలోని కళాత్మక అశాంతిమాత్రం అతనిదే!

ఉచ్ఛ్వాస నిశ్వాసాలు స్తంభించిన ఉన్నత సమాధి స్థితిలోని యోగ సాధకుల్లా శిల్పాలు భాసిస్తాయి. శిల్పి మహావైద్యుడు. శిలల గర్భాల్ని ఉలుల శస్త్రాలతో చికిత్స చేసి శిల్ప శిశువుల్ని వెలికితీస్తాడు. శిల్పి శిల్ప శాస్త్రవేత్త. ఏ శిలకు నెలలు నిండాయో తెలుసుకుని శస్త్రచికిత్స ప్రారంభిం చాలి. శిల్పశాస్త్రం ఓ శస్త్రచికిత్సా విజ్ఞానశాలం. శిలల్ని ఛేదించేటప్పుడు వెలికి తొణికే రాగమే రక్తం. ఉలి శిలా కలిసిచేసే సవ్వడే గర్భస్థ శిశువు పంపే సంకేతం. ఎగసిపడే రవ్వలే బోసినవ్వులకు సంకేతం. శిల్ప శిశువులన్నీ దివ్య ముహూర్తంలో జన్మిస్తాయి. ప్రవాగా! ఈ శిలలన్నీ తమ గర్భాల్లో శిల్పరీతుల్ని నిక్షిప్తం చేసుకుని నెలలు నింపుకుంటున్న గర్భిణులు. మన యుగాలు శిలలకు నెలలు.

శిలాతలాలమీద ఉలి హంసలా దున్నుకుంటూ పోతుంటే సీతల్లా శిలాబాలలు బయల్పడతాయి. శిల్పి జనకుడు. కళాభిరాముల కోసం కలవ రిస్తాడు.

శిలాతల గ్రామికులు శిల్పులు. శిల్పశాస్త్ర కార్మికులు శిల్పులు. పర మాత్మ ఏకాంతమందిర రహస్య భంగిమలను కూడా శిల్పించడానికి అను మతి పొందిన స్వర్ణవర్ణ ఛాయాగ్రాహకులు శిల్పులు. పరంధామంలోని విశేషాన్ని విశ్లేషంగా రూపొందించగల దర్శక నిర్మాతలు శిల్పులు. అంగాంగంలో అసంపూర్ణులైన మానవాకారాలకు సర్వాంగ సుందర కోరను

చేకూర్చాలనే తపనతో దివ్యసౌందర్యాలను దివినుంచి దిగుమతి చేసుకునే శిల్పవర్తకులు శిల్పులు. వాళ్ళు కళా తపస్వులు.

ఈ శిలల్లో దివ్య కళల్ని విశ్లేషించాలని తలలు కొట్టుకునే ఈ శిల్పుల తపనకు ముచ్చటపడ్డ వాత్సల్యమూర్తి భగవంతుడు భూగోళం మీద ఎప్పుడు కాలుపెడదామా అని ఉవ్విళ్ళూరుతుంటాడు. ఆకాశ రహస్యాలకు రహదారులు వేయాలని శ్రమించే శ్రామికులు శిల్పులు. వాళ్ళు తమ స్వేదాన్ని, బాష్పాన్ని రంగరించి శిలల్ని తడుపుతుంటారు. స్వర్గలోక అమరాలయంలో రాత్రిపూట కళాఖండాలు కొట్టుకొని వచ్చి భూగోళ ద్వీపానికి తగులుకుని ఆగిపోయినట్టు అక్కడక్కడ శిల్పాలు దర్శనమిస్తాయి.

కర్కశ స్కంధాలున్న వృక్ష శాఖలనుంచి ఎంత కోమల శిరీష పుష్ప కోరకాలు! కఠిన శిలా మలుపులనుంచి ఎంత స్నిగ్ధ ముగ్ధ సౌందర్యాలు!" సౌరాఖ్యుడు ఆగిపోయాడు. పగటిపూట తారలుదిగి తారంగాలాడి చిరుచెమరుతో అరజారిన అలంకారాలతో నదీ తీరాలమీది మేడల్లో సేదదేరినట్టు ఉపశమించారు. 'సౌరా! నీ ఈ భావామృతపానం లేని దినం నాకు పిచ్చి పడుతుంది. ఎందుకు నన్ను నీ భావ పీయూషపానోన్మత్తురాలినిగా చేస్తున్నావు. నాకీ బలహీనతనెందుకు అలవాటు చేస్తున్నావు?' ప్రవాళ అసంకల్పితంగా అంటున్న మాటలు సౌరాఖ్యునిలో స్పందనను, ప్రణవదత్తులో ఈర్ష్యను రేకెత్తించాయి.

"శిలకు పరాకాష్ఠ శిల్పం. మనిషికి పరాకాష్ఠ ప్రేమికుడు." ఎవరూ మాటాడని మౌన క్షణాల్ని ఛేదించుకుంటూ నెమ్మదిగా అన్నాడు సౌరాఖ్యుడు.

"సౌరాఖ్యగారూ! శిల్పశాస్త్రకర్తల సంతానం ఎవ్వరి నుంచి వచ్చిందో వారి వారసులెవరో కొంత ..." ప్రణవదత్తు అడిగాడు.

"సోదరా! శిల్పశాస్త్ర ప్రవర్తకుడు శుక్రాచార్యుడు. ఆయనకు నలుగురు పుత్రులు. వాళ్ళలో ఒకరి పేరు త్వష్ట. ఆ త్వష్టకు మయుడు

విశ్వకర్మ అని ఇద్దరు కుమారులు. విశ్వకర్మ దేవశిల్పి—మండోదరి తండ్రి అయిన మయుడు దానవశిల్పిగా ప్రవర్తిల్లుతూ వచ్చారు. ఇక వారి తర్వాత అంటే క్రీ.పూ. 3 వేల సంవత్సరాల తర్వాత .."

"శిల్పుల ఆదిపురుషుల్ని గురించి చెప్పారు బాలు."

"శుక్రాచార్య శిల్పసంప్రదాయానికి దగ్గరగా వుంటుంది మొహంజదారో శిల్పకళ. కాబట్టి మొహంజదారో, హరప్పా నాగరికతలకు వీళ్ళ వారసులు వలస పోయి వుండవచ్చు."

"అది చరిత్రకారుల అభిప్రాయం."

"అంతే మరి."

"సౌరాఖ్యగారూ! మూరదేవాః అనే పదం అటు వేదాల్లో ఇటు శిల్ప శాస్త్రంలో కూడా తగులుతూ వుంటుంది. అది మూర పౌరవు దేవత అని అర్థమా?" ఓరగా నవ్వుతూ ప్రశ్నించాడు.

'దాన్ని రాక్షసులు అనడానికి బదులుగా వాడతాను."

"బాగా చెప్పారు."

"బాగా చెప్పడమంటే అదికాదు. మారణం చేసే దేవతలు అనే అర్థంలో మూరదేవులు అనే రూపం ఏర్పడింది. అలాంటిదే మరో పదం చూస్తుంటారే."

"ఏమిటది?"

"శిశ్నదేవాః."

"అవును."

"శివలింగ ఆరాధకులని దాని కర్థం."

తనకు తెలిసిన దానికన్నా కొంత లోతుకెళ్ళే కొద్ది ప్రణవదత్తులో ఓ చలనం ఏర్పడింది. అది అవమానం అని గ్రహించాడు సౌరాఖ్యుడు.

"అవాపః అనే పదం ఒకటి సింధు నాగరికతలో కొట్టుకవచ్చింది.

మరి వాళ్ళు అవావవళ్ళు ఇష్టపడేవారనా?" అతని చూపు గాలంలా కద లాడింది.

"...." నవ్వి ఊరుకున్నాడు సౌరాఖ్యుడు.

"పరిప్రశ్న అంటే అర్థం తెలుసా మీకు?" సౌరాఖ్యుడు ప్రవాళను అడిగాడు.

"బాగా ప్రశ్నించడమా?" నవ్వుతూ అంది ప్రవాళ.

"కాదు—వినయంగా తెలియక తెలుసుకోవాలని ప్రశ్నించడం" కొంచెం ఉలి రాపిడి ధ్వని సౌరాఖ్యుని కంఠంలో వినిపించింది.

"మరి తెలిసి అడిగే ప్రశ్నకేం పేరు?"

"ఉపరి ప్రశ్న అందాం" సౌరాఖ్యుడు, ప్రవాళ అంటపతులు కూతించినట్టు గలగలా నవ్వుకున్నారు.

"ప్రణవదత్తుగారూ! అవాచః అని కదూ మీరు అడిగింది" ప్రవాళ నవ్వు ఆపుకుంటూ అడిగింది.

"...." కొంత దెబ్బతిన్నట్టు చూశాడతను.

"వాచం అంటే ముక్కంది—అవాచః అంటే ముక్కులేని వాళ్ళని కాదుకానీ పొట్టిముక్కు వాళ్ళనే అర్థం" సౌరాఖ్యుడు విశదీకరించాడు.

"శారదీపురాలు అని శిల్పశాస్త్రంలో కొన్ని పురాలు వున్నాయి మరి...." సౌరాఖ్యుని ఆత్మాభిమానాన్ని దెబ్బతీయాలనుకున్న ప్రణవదత్తుకు అదే పరిస్థితి ఎదురుకావడంతో అతను సౌరాఖ్యుణ్ణి ప్రవాళ ముందు శాస్త్ర జ్ఞానంలో ఓడించాలని నిశ్చయించుకున్నాడు.

"వరదలు ఉప్పెన లాంటి అవాంతరాలు వచ్చే సమయంలో ప్రజలు తలదాచుకోడానికి అనాటి శిల్పులు నిర్మించిన భవనాలకు శారదీపురాలని పేరు" చిరునవ్వుతో చూశాడు శిల్పి.

"మానసార శిల్పశాస్త్రంలో దండకం ప్రకారం నిర్మించారు అని, సర్వతోభద్రం పరిమాణంతో వుందని కట్టడాల్ని అంటున్నారు. మరి—ఏ దేవుని దండకాల్ని దృష్టిలో పెట్టుకున్నారోనని నాకు అనుమానం. సర్వతోభద్రం వ్యూహమా—కట్టడమా?"

"మీకు శిల్పశాస్త్రంమీద ఇంత శ్రద్ధ వున్నందుకు నేను అభినందిస్తున్నాను. అసలు మానసారం గ్రామనిర్మాణ లక్షణాలు అష్టవిధాలు—అంది. అందులో దండకం ఒక నిర్మాణ క్రమం. సర్వతోభద్రం మరో రకమైన కట్టడం. నంద్యావర్తం, పద్మకం, స్వస్తికం, ప్రస్తరం, కార్ముకం, చతుర్ముఖం—ఇవి గ్రామాల రకాలు. విశ్వకర్మ వాస్తుశాస్త్రంలో 12 రకాలున్నాయి. పట్టణాలు, మహాపట్టణాలు వేరు."

"శిల్పి భక్తుడు అయితీరాలా?"

"భక్తుడు అవసరం కంటే యోగికావాలి. ధ్యాని కావాలి. అసలు శిల్ప శబ్దం శిలధాతువు నుంచి పుట్టిందే. శిల్=శిలయతి=ధ్యానించు, యోజించు. పునః పునః అభ్యస్యతి ఇతి శిల్పమ్—శిల్పి శిల్పాన్ని గురించి పదేపదే ధ్యానించాలి—మరి అతను భక్తుడు కావద్దూ."

"నిజమే. ఋభువులు అంటే?"

"రథకారులైన శిల్పులు ఋభువులు."

"మరబాను—మోహన గృహాలు వుండేవి అంటారు—"

"మోహన గృహాలు ఏదైనా అవాంతరాలు, తిరుగుబాట్లు ఎదురైనపుడు అంతఃపుర జనం రహస్యంగా తప్పుకుని పోవడానికి కోట గోడల ద్వారా ఏర్పరచిన మార్గాలు. వీటిని చంద్రగుప్తుని కాలంలో కౌటిల్యుడు బాగా నిర్మించాడు రాజుల రహస్య కలాపాలకూ వీటిని వాడుకునేవారు. ఇక కన్యాగృహాలు — అంతఃపుర కన్యలు ప్రత్యేకంగా నివసించే గృహాలు."

"సుధర్మ విపుల సభలు అన్నావి...."

ఇవి నిజంగానే తెలియకుండా అడిగిన ప్రశ్న అనిపించింది సౌరాఖ్యునికి.

"సోదరా! సుధర్మ అనేది ఇంద్రుని సభపేరు. ఇక విపులధనదుడు అంటే కుబేరుని సభపేరు. అలాంటి సభలు అన్నపుడు వీటితో ఉప మిస్తారు శిల్పశాస్త్రకారులు."

ప్రణవదత్తు ప్రారంభించిన శాస్త్ర చర్చలో సౌరాఖ్యుడు నిశ్చల గాంభీర్యంగా సమాధానాలు చెప్పడం ప్రవాళకు మరింత ఆశ్చర్యాన్ని మరింత అనురాగాన్ని రేకెత్తించింది. అవమానించాలనుకున్న ప్రణవదత్తు పథకం తలక్రిందు కావడం భరించలేకపోయాడతను.

"శిల్పులు సర్వశాస్త్ర నిష్ణాతులంటారు గదా!"

"అవును."

"మరి పతంజలి యోగశాస్త్రంలో కొన్ని సందేహాల్ని తీర్చి పుణ్యం కట్టుకుంటారా?" ఎంత ప్రయత్నించినా ప్రణవదత్తు వాక్కులో తాను స్పర్ధాళువన్న ధ్వని అతనికే వినిపిస్తూంది.

"దత్తుగారూ దానిదేముందండి? తోచినంత చెబుతాను" నింపాదిగా వుంది సౌరాఖ్యుని కంఠం.

పరిచయం చేద్దామని తను తీసుకువచ్చిన మిత్రుడు ఇలా ద్వంద్వ యుద్ధానికి తలపడతాడని ఊహించలేకపోవడంతో కొద్దిగా తటపటాయిస్తూ చూస్తూంది ప్రవాళ.

"వాక్కు ఎన్ని రకాలు?" ప్రకటించని వాగ్వాదానికి నాంది పలికాడు ప్రణవదత్తు.

"ప్రధానంగా పరవాక్కు అపరవాక్కు అని రెండు రకాలు. మొదటిది దేవభాష. రెండవది మానుషభాష. అది వ్యోమగత సంకేతం. ఇది

భౌతికానుభవం. ఆ అంభృణీ వాక్కు, ఆ అంభస్సంబంధ వాక్కు భావదశకు వచ్చేటప్పుడు పశ్యంతి వాక్కు అవుతుంది. అక్షరమూ అర్థమూ విడివడిన దశలో ఈ బృహతీ వాక్కు మధ్యమా వాక్కవుతోంది. శబ్దార్థాలు విడిపోయిన దశవుండే ఇది మానవభాష—దీని పేరు వైఖరి. పరావాక్కు, పశ్యంతి వాక్కు, మధ్యమా వాక్కులు అకాశ గుహాంతరాళంలో చలనం లేకుండా వుండే ఋతవాక్కులు. వైఖరి మాత్రం మానవభాష.

ఋత తత్త్వం వుండే ఇదే ప్రకృతి. వేదం దీన్ని ఏకార్ణవం అంది. మహయోని రప్పంతస్సముద్రే—నా గర్భం సముద్రం. సృష్టి క్రమం ఆ మహాయోని నుంచే ఏర్పడింది. జగద్గర్భస్థానం సముద్రం."

"దీన్ని తాంత్రిక పరిభాషలో ఏమంటారు?"

"మహాయోని అంటారు."

"పౌరాణిక పరిభాషలో అయితే?"

"పార్వతి అంటారు. ఈమె జగన్మాత. సంద్రం ఆ జగద్గర్భస్థానం. సరస్వతినే గౌరి అంటారు. సరస్వతినే మహో అర్ణః అంటుంది ఋగ్వేదం. ఆమె సృష్టి శిల్పకర్త్రిగా కొలువబడుతోంది. రూపాలు వేరు కాపీ మూల తత్త్వం ఒకటే.

దేవతలు వాక్కును వీర్యవంతంగా మార్చడానికి రేతస్సును సంగ్రహించి చర్మంమీద పెట్టారనీ, అది చూసి ఆ దేవతలే 'అత్రి'=అక్కడున్నదని అన్నారని—అత్రి నుంచి ఆత్రేయ శబ్దం వచ్చిందనీ, ఆత్రేయ అంటే ఋతుమతి అయి సంతానధారణకు యోగ్య అయిన స్త్రీ అని అర్థమని శాస్త్రం చెబుతోంది. ఆత్రేయ అంటే పార్వతి. ప్రసరణ శీల గుణం వున్నది జ్ఞానం. సరః అంటే ప్రవాహం. అందుకే సరస్వతి అవుతుంది."

"వషట్కారానికి అసలు అర్థం?" ప్రణవదత్తు నుంచి సూక్ష్మంగా వస్తున్న వైదికవాసనను పసికట్టాడు సౌరాఖ్యుడు.

"పంచభూతాలు, ప్రాణం కలిపి షట్ గుణాలు. ప్రాణం పంచ భూతాలలోకి వెళితేనే చలనం. ఈ విధానం అను ప్రవేశ విద్య అని ఐతరేయోపనిషత్ అంటూంది. ఈ పధాన్ని వేదమంత్రోచ్చారణ శుద్ధ్య పలుకుతారు."

"శివలింగరూపం ఎలా ఏర్పడిందంటారు?"

"అది స్త్రీ పురుష అంగ సంభవమన్న వాదం అటుంచి—పానవట్టం సముద్రమనుకుంటే—అంటే దానిని ఆదిమ అర్ణవం అనుకుంటే ఆ మూల ప్రకృతి నుంచి లేచిన అర్ధ వృత్తాకార తరంగం లింగరూపం. అదే జగత్తు. ఆ పానవట్ట సముద్రం జగద్యోని. ఈ లింగాకార కోణం వుండే అవి ధ్వన్యాత్మకం. కోణం అంటే గుణం—అంటే శబ్దం. వ్యక్త జగత్తు శబ్ద సహితం."

"యంత్రం అంటే?"

"ఇది తాంత్రిక ప్రపంచ విషయం, మంత్రం సూక్ష్మరూపి. యంత్రం స్థూల రూపం. 'యం' అంటే విశ్వవాయుబీజం. విశ్వ ప్రాణ వాయువు దాన్ని నియంత్రించేది. త్రం—అదే యంత్రం."

"సృష్టి—లయల్ని సంక్షిప్తంగా వివరించండి."

"ఒక కిరణం నేలమీద అనేక కిరణాలుగా రంగులుగా మారడం సృష్టి. ఈ రంగులన్నీ ఒక్క కిరణంలో కలిసిపోవడం లయం.'' చిన్న ఉదాహరణతో పెద్ద సత్యాన్ని వివరించిన అతన్ని తదేకంగా చూస్తోంది ప్రవాళ.

"సౌరాణ్యగారూ! యోగమంటే కూడా కొంత విశదీకరించండి. ఇలా అడుగుతున్నందుకు మరోలా అనుకోరనుకుంటాను. ఎందుకంటే ఒక శిల్పాచార్యుని విజ్ఞాన వైశద్యాన్ని విపులంగా పరిశీలించదలచుకున్నాను." ప్రణవదత్తు వినయంలో విమర్శకదృష్టి తొంగి చూస్తోంది.

"యోగం అంటే మనసు పనిచేయడాన్ని ఆపివుంచడమే. అప్పుడు ఆ ఖాళీ జాగాలోకి విశ్వశక్తి చొరబడుతుంది. పతంజలి తన యోగ సూత్రాల్లో 'యోగశ్చిత్త వృత్తి నిరోధః' అంటారు. స్వర్గం కూడా పతనని వైరాగ్యం మానవులకు ధ్యేయం కావాలంటారు. 'క్షీణపుణ్యే మర్త్యలోకం విశంతి' అంటూ స్వర్గానుభవంతో పుణ్యం క్షీణించి తిరిగి మర్త్యలోకంలో పుట్టవలసి వస్తుంది."

"పంచక్లేశాలని పేటినంటారు?"

"రాగ, ద్వేష, అభినివేశ, అవిద్యా, అస్మితా అని...."

"అస్మితా అంటే....ఉనికా?"

"బుద్ధిని ఆత్మలో అన్వాపించి ఈ రెండూ ఒకటే అనుకునే భ్రమ. ఇక అభినివేశమంటే మరణభీతి."

"ఈ ఓంకారం వుండే దాన్ని మీరేమంటారు?"

"అది పరమేశ్వర సంబోధన. ఒక రకంగా అతని పేరు."

"అన్ని పేర్లుండగా ఓంకారమేమిటి?"

"మనోవాగతీతుడైన ఈశ్వరుణ్ణి ప్రణవంతో తప్ప అంత సులభంగా చేరలేం—తస్య వాచకః ప్రణవః."

"అలబ్ధ భూమికత్వం అంటే...."

"సమాధి స్థాయిని అందుకోలేని యోగస్థితి అది. అతను 'అవిరతి'లో అంటే విషయ భోగాలలో ఆశదీరని స్థితిలో వున్నాడన్న మాట."

"మనిషికి దుఃఖం ఎన్ని రకాలు?"

"ఆధ్యాత్మిక, అధి భౌతిక, అధి దైవికమని మూడు రకాలు. మీరడిగే ప్రశ్నలకు నేను బదులు చెప్పలేకపోతే అది వాట్లో రకం కావచ్చు."

ప్రవాళతో పాటూ ప్రణవదత్తు కూడా నవ్వకుండా వుండలేక పోయాడు. "ఆధ్యాత్మిక దుఃఖమంటే?" ఈ ప్రశ్నలో సౌరాఖ్యుడు తగులు కుంటాడన్న సంతోషం కలిగింది ప్రణవదత్తుకు.

"శారీరక మానసిక వ్యాధులవల్ల కలిగే దుఃఖం."

"మరి ఆధ్యాత్మిక మన్నారే."

"ఆత్మ అంటే శరీరమనే అర్థం వుందని మీకు తెలియదను కుంటాను." కనుచీకటిలో సౌరాఖ్యుని ప్రహేళికలాంటి చూపును ప్రవాళ చూడగలిగింది.

"ఆ...." దీనికి ఏం సమాధానం చెప్పినా ప్రవాళ ముందు చులక నవుతానని మిన్నకుండిపోయాడు ప్రణవదత్తు.

"యోగంలో సాధకుడికి ఏవో వాసనలు, రుచులు వస్తాయంటారు నిజ మేనా?" సౌరాఖ్యుడికి ముందుచూపుతో మాటాడే నైపుణ్యం వుందని తెలిసి పోయిందతనికి.

"అవును - యోగి నాసికాగ్రంమీద దృష్టి నిలిపి సాధన చేసిన ట్లయితే 'గంధ సంవిత్' అనే స్థితి కలిగి అతీంద్రియమైన సువాసన వస్తున్న అనుభూతి కలుగుతుంది. జిహ్వాగ్రంలో దృష్టిని కేంద్రీకరించి ధారణ చేస్తే దివ్యరసానుభూతి ప్రాప్తిస్తుంది. దీన్ని రసవతీ ప్రవృత్తి అంటారు. జిహ్వ మధ్యభాగంలో దృష్టి నిలిపి ధ్యానం చేస్తే దివ్యస్పర్శాను భూతి వస్తుంది. తాలుక మూలంలో భావనను కేంద్రీకరించి ధారణ చేస్తే దివ్య శబ్దానుభూతి కలుగుతుందని పాతంజలి యోగదర్శనం వివరిస్తోంది. 'పరమాణు పరమ మహత్త్వాంతో అస్య వశీకారః' అణువు నుంచి అనంతం దాకా యోగానికి అందిరానిది లేదు. ఋతంభరా ప్రజ్ఞ అని యోగ సిద్ధిలో ఓ ప్రజ్ఞ వుంది తెలుసా మీకు?" —సౌరాఖ్యుడు ప్రణవదత్తును ప్రశ్నించాడు.

"అది—తెలియదు" కొంత సిగ్గుపడుతూ ఒప్పుకున్నారు దత్తు.

"యోగికి సర్వ శాస్త్ర, సర్వ తర్క వితర్కాతీత పాండిత్యం, ప్రజ్ఞాకౌశలం సిద్ధిస్తాయి. ఆ దశను అలా అంటారు. పతంజలి మరో రెండు చిన్న యోగసూత్రాలు చెప్పారు. బహుశా అతను సూత్రించిన 150 యోగ సూత్రాల్లో 53, 54 వ సంఖ్య సూత్రాలనుకుంటాను—"

"ఏమిటవి?" యోగాన్ని గురించి ప్రశ్నించి అవమానపరచాలను కున్న ప్రణవదత్తు సౌరాఖ్యుడితో సంభాషించే కొద్దీ తను శిష్యస్థానానికి దిగ జారుతుండడం గమనిస్తూనే వున్నాడు

"సుఖానుశయీ రాగః దుఃఖానుశయీ ద్వేషః – అనురాగం సుఖా న్నిచ్చి తిరిగి ఆ సుఖం కావాలని కోరుకుంటుంది. అదే ద్వేషం దుఃఖా న్నిచ్చి దుఃఖహేతువును ద్వేషిస్తుంది." వివరించాడు సౌరాఖ్యుడు. ప్రవాళ భావగర్భితంగా నవ్వడం ప్రణవదత్తుకు కంటకమనిపించింది.

"యోగం పరాకాష్ఠ కైవల్యం అంటారు గదా? అసలు కైవల్యం అంటే ఏమిటంటారు?"

"ఇది పరిప్రశ్న" చనువుగా నవ్వింది ప్రవాళ.

"కేవలస్య భావమ్ కైవల్యం—అంతేనండి. యోగికి దృగ్గోచరమవు తున్నదంతా కేవలంగా అనిపిస్తుంది. విష్ణు ప్రహస్య తృణమ్ జగత్ అన్న స్థితి.

'కృతార్థం ప్రతినష్టమపి అనష్టం తదన్య సాధారణత్వాత్' —అని పతంజలి మహర్షి అంటారు. యోగకృతార్థుడికి జగత్తు మిథ్యగా వినష్టమై లోపించినదిగా కనిపిస్తుంది. దానికి విరుద్ధంగా సాధారణమైన వ్యక్తులకు అనిపిస్తుంది అంటారాయన.

తస్యహేతు రవిద్యా -- అంటూ తేల్చి చెప్తూను 'సత్య ప్రతిష్ఠాయాం క్రియా ఫలాశ్రయత్వమ్—సత్యమైన యోగికి తలచిందల్లా

ఫలాన్నిస్తుందంటూ 'అస్తేయ ప్రతిష్ఠాయాం సర్వరత్నోపస్థానమ్' అంటూ వివరిస్తాడు ఆకలి పోతులు అన్నీ దూరమవుతాయనీ, వికీహానికి సంపదలు దగ్గరవుతాయనీ ఓ మాట అంటాడు.

ప్రవాళా! యోగంవల్ల మనిషి సాధించలేనిది లేదు. మనిషి తనలోని శక్తుల్ని ప్రేరేపించుకోవడం తెలియక భిక్షగాడిలా తయారవుతున్నాడు. తనకు తెలియకుండా ఇంట్లో వున్న పెన్నిధిమీద పస్తు పడుకునే అజ్ఞాని లాంటివాడు యోగశక్తి తెలియని మనిషి. నేటి మానవుడికి యోగం అత్యంత అవసరం అనిపిస్తుంది. యోగి కావాలనుకున్నవాడు మొదట పరిశుద్ధతను అలవరచుకోవాలి. 'శౌచాత్ స్వాంగ జుగుప్సాపరై రసంసర్గః' అన్నట్టు శుచిత్వంవల్ల తన అంగాలమీద తనకే జుగుప్స ఏర్పడుతుంది. పరులతోటి కలయికమీద అనిష్టత చోటు చేసుకుంటుంది. అలా ఏకాంత మనస్తత్వం అలవడిన మనిషి ఇష్టదేవతను ధ్యానించాలి.

స్థిరసుఖ మాసనం— స్థిరమైన సుఖాన్నిచ్చేలా ధ్యానంలో కూర్చోమంటాడు పతంజలి. దానితో కామేంద్రియ సిద్ధి ఏర్పడి అశుద్ధి క్షయమవుతుంది. మనిషికి అణిమాది అష్టసిద్ధులు వాటంతట అవే వశమవుతాయి. సంకల్పాలు ఫలిస్తాయి. అనుకున్నవి సాధిస్తాడు. ఇష్టదేవత వశీకరణంతో అతని ఇష్టాలు సిద్ధిస్తాయి.

'యోగేన యోగో జ్ఞాతవ్యః'—యోగం చేయడం ప్రారంభిస్తే యోగలక్షణాలు, ఫలితాలు అదే తెలియజేస్తుంది. ఉచ్ఛ్వాస నిశ్వాసాలు యోగం క్రమేణ ఆగినట్లు తగ్గిపోవడం స్తంభవృత్తి అంటారు. ఈ స్తంభవృత్తిని చేరుకున్న యోగి దేనిమీద సంయమం చేస్తాడో అంటే బుద్ధిని కేంద్రీకరిస్తాడో ఆ శక్తి అతనికి సంక్రమిస్తుంది.

బలేషు హస్తి బలాదీని— అంటాడు పతంజలి. ఏనుగు బలంమీద సంయమం చేస్తే దాని బలం సంక్రమిస్తుందంటాడు.

భువన జ్ఞానం సూర్యే సంయమాత్
చంద్రే తారావ్యూహ జ్ఞానమ్
ధ్రువే తద్గతి జ్ఞానమ్—అంటూ 'కంఠకూపే క్షుత్పిపాసా నివృత్తిః' అంటాడు. ఇది ప్రజలకు ప్రధాన సూత్రం. అసలు ఈ దేశంలో పేద ప్రజలందరికీ ఈ యోగం నేర్పాలనిపిస్తుంది. కంఠమూలంలో దృష్టిని నిలిపి యోగం చేస్తే ఆకలి దప్పులు పూర్తిగా తగ్గిపోయి మంచి ఆరోగ్యం చేకూరుతుందంటాడు ఆ మహర్షి.

అంతరిక్షంలో సిద్ధులు అనేవారు మానవులకు అగోచరంగా సంచరిస్తుంటారు. 'మూర్ధ జ్యోతిషి సిద్ధ దర్శనమ్'—అనే సూత్రం క్రింద యోగి బ్రహ్మరంధ్రంలోని అంతశ్ఛిద్రమందున్న భాస్వర జ్యోతిస్సుమీద ఏకాగ్రతతో ధ్యానం చేస్తే ఆ సిద్ధులతో పరిచయభాగ్యం ఏర్పడుతుందంటాడు. దానితో వివేక ఖ్యాతికి పూర్వ తారకమనే జ్ఞానం సూర్యోదయానికి ముందు స్వర్ణవర్ణ ఉషః కాంతులుదయించినట్లు ఉదయిస్తుంది. ఈ ప్రాతిభ జ్ఞానం అన్ని జ్ఞానాల కంటే అతీతమైంది

ఇక నాభిమండలంలోని సమానవాయువు మీద మనస్సును లగ్నం చేసి ధ్యానించే యోగికి అగ్నిలాంటి తేజోరూపం ఏర్పడుతుంది. శరీరమంతా వ్యాపించి వుండే వ్యాన వాయువు మీద సంయమంతో ధ్యానం చేసే యోగికి క్రమేణ నీటిలో నడవడం, అగ్నిలో నడవడం లాంటి శక్తులు సిద్ధిస్తాయి.

'శ్రోత్రాకాశయోః సంబంధ సంయమాత్ దివ్యం శ్రోత్రమ్'—చెవులకు సంబంధించిన ఆకాశ శబ్దగుణకం మీద సంయమం చేసే యోగికి దివ్యసందేశాలు అందుతాయి. చెవికి, ఆకాశానికి వున్న సంబంధంతో ఆ యోగి ప్రపంచంలో ఎక్కడ బయలుదేరిన శబ్దాన్నైనా వినగలడు. అంటే దూర శ్రవణం సిద్ధిస్తుంది. బ్రహ్మర్షులు సమాధి నిష్ఠలో వుండగా

ఇలాంటి శ్రుతులు విన్నారు. అవే మన వేదాలు అందుకే వేదాలకు శ్రుతులని పేరు.

యోగంతో 'కాయ సంపత్' సిద్ధి వస్తుంది. దానితో రూపలావణ్యం, వజ్ర సంహనత్వం సిద్ధిస్తాయి. ఇంద్రియావశ్యకతలేని వికరణ భావంతో దూరదర్శనం, మనోజవిత్వం—అంటే సశరీరంతో మనోజవంతో ఎక్కడికి వెళ్ళాలనుకుంటే అక్కడికి వెళ్ళడం, సర్వప్రకృతి వికారాల వశీకరణం—అంటే వర్షాలను ఆపడం, కురిపించడం, గ్రహగతుల్ని ఆపడం ఇలాంటి ప్రధాన జయశక్తి కలుగుతుంది. దీన్నే 'మధు ప్రతీకలు' అంటుంది యోగశాస్త్రం.

ఇంద్రియాల్ని జయించిన యోగికి అసాధ్యమైంది ప్రకృతిలో లేదంటే ఆశ్చర్యపడనక్కరలేదు. కాదంటే సాధన అత్యవసరం. ఈ 'ప్రాతిభజ్ఞానం' (Spiritual Intution) తో మనిషి దివ్యశక్తుల్ని వ్యంతం చేసుకోగలడు. ఇది ప్రాచీనుల అనుభవ జ్ఞానమే కానీ ఊహ కాదు. ఈ దేశప్రజలు ఈ యోగమార్గాన్ని అనుసరించిన నాడు వాళ్ళు చేసే ప్రతిపనీ కళాధిక నైపుణ్యంతో శోభిస్తుంది. ఏదీ ప్రజల దగ్గరకు ఈ యోగవిద్యను చేర్చే గురువు? ఏదీ విద్యావిధానంలోకి ఈ ఆత్మిక శక్తిని చొప్పించే పరిస్థితి? విద్యార్థికి చదువూ—సంధ్యా ఎంతో ముఖ్యం. చదువునే దృష్టిలో పెట్టుకుని సంధ్యను వదలివేసే విద్య రాణించదు. ఆ సంధ్యే యోగవిద్య. ఈనాటి విద్య మనిషిని తెలివిగలవానిగా చేస్తుందే తప్ప ఉన్నతమైన వ్యక్తిగా మార్చలేదు. దానికి సంధ్యోపాసన తోడ్పడాలి." సౌరాఖ్యుని వాగ్ధాటి ప్రవాళను కదిలించి వేసింది. ప్రణవదత్తు కూడా సౌరాఖ్యుని శాస్త్ర జ్ఞానానికి ఆశ్చర్యపోయాడు. శిల్పి అంటే రాళ్ళు చెక్కుకునే కూలివాడనే భావం అతనిలో మటుమాయమైపోయింది.

"సౌరా! యోగానికి, కాలానికి సంబంధముందంటావా?" ప్రవాళ అతనిలో మరో కోణాన్ని తడమాలని ప్రశ్నించింది. "కాలం మూడు విధాలు.

1. మహాకాలం—ఇది లోకాలకు ప్రళయం కలిగించే కాలం. ఇది మన మేధకు అందదు. 2. కలనాత్మక కాలం—మానవుడు కొలవదగిందిది. 3. సూక్ష్మకాలం— ఇది మానవుడు కొలవలేనిది. తామరాకును సూదితో పొడిచేకాలం త్రుటికాలం—రెప్పపాటుది. దీనిలో కోటి అంశం, అర్ప దాంశం కూడా వుంది దీన్ని కొలవలేం. మనం కొలవదగిన కాలం సాత్త్వికం, రాజసం, తామసికం అని మూడు విధాలు.

ఉదయాత్పూర్వం 4 గం॥ నుంచి 8 గం॥ సాత్త్వికం—

ఉదయం 8 గం॥ నుంచి సాయంత్రం 4 గం॥ రాజసం—

సాయంత్రం 4 గం॥ నుంచి రాత్రి 8 గం॥ తిరిగి సాత్త్వికం—

రాత్రి 8 గం॥ నుంచి ఉదయం 4 గం॥ తామసికం—

మనిషి సాత్త్విక కాలంలో ఆధ్యాత్మిక జ్ఞానార్జనకు. రాజసిక కాలంలో ధనార్జన కోసం. తామసిక కాలంలో భోగాభిలాషతో గడపడం ప్రకృతి ధర్మం. జీవి ధర్మం కూడా!

గణితంలోని సిద్ధాంత భాగంలో గ్రహగతులకు చెందిన విజ్ఞానం. ఫలిత భాగంలో జాతకశాస్త్రం, సంహితా భాగంలో దేశం—కాలం —దాని పాలకుడు పరస్పర ప్రభావ విధానాలు ఇలా చక్కటి వివరణ వుంటుంది. మీరు దాన్ని పరిశీలించాలి. మీ సందేహాలు తీరిపోతాయి.

ఈ ఉపవాసాలు ఇవన్నీ గ్రహకిరణ ప్రభావంమీద ఆధారపడి వచ్చినవే. ఏకాదశినాడు ఉపవాసం వుండాలి—ఎందుకు? ఏటవాలుగా 120° డిగ్రీలలో చంద్రకిరణాలు ప్రసరిస్తాయి. ఆ రోజు చంద్రకిరణాలు జీర్ణశక్తి నివ్వలేవు. లవణవర్జితంగా ఆ మధ్యాహ్నం భోజనం చేయాలి. చాంద్రాయణ వ్రతాలన్నీ ఇలా వచ్చినవే.

సూర్యోదయం వేళలోని నీలికిరణాలు శాంతినిస్తాయి. అరుణవర్ణ కిరణాలు జీవశక్తిని ప్రసేరిస్తాయి. సూర్యోదయానికి ముందు ఒక గంటా

ముప్పైఆరు నిమిషాల కాలం పవిత్రమైనదని జగోశాస్త్రం అంటుంది. ఉదయం నుంచి సూర్యుడు మధ్యాహ్నం వరకు గగనంమీద తెగ్రాకే కాలంలో దేవతల పూజా కార్యక్రమాలు చేయడం మంచిది. మధ్యాహ్నం నుంచి సాయం సంధ్య వరకూ సూర్యుడు దిగివచ్చే కాలంలో పితృదేవతలు మొదలైన శ్రాద్ధకర్మలు నిర్వర్తించడం ఉచితం.

అత్యవసర కార్యక్రమాలకు అభిజిన్ముహూర్తాన్ని ఎన్నుకుంటారు శాస్త్రజ్ఞులు. నిటారుగా ఒక పుల్లను భూమిలో పాతి, దాని నీడ దానిక్రిందనే వుండి కనిపించని వేళను అంటే మధ్యాహ్నం 12 గం॥ కాలాన్ని అభిజిన్ముహూర్తం అంటారు. 'అభిజిత్ సర్వ దోషఘ్నం' అని శాస్త్రం.

శాంతిసామ్యం అని ఒకరోజు వుంది. ఆ రోజున పాలుకారే చెట్టును చిందిస్తే స్వచ్ఛమైన నీరు కారుతుంది తప్ప పాలు రావు. అదీ గ్రహప్రభావ మహిమ చంద్రమానం, సౌరమానం, నక్షత్రమానం మొదలైన వాటి ద్వారా గ్రహగతుల్ని, కాలజాలాన్ని పసిగట్టారు మన శాస్త్రజ్ఞులు.

అసలు సూర్యునిలోని ఏడు కిరణాలు గ్రహాల్ని పోషిస్తున్నాయి. గ్రహాల ఋజు వక్రగతులు, అనియత గమనాలు గ్రహాలకు ఆత్మ అయిన సూర్యదేవునిమీదే ఆధారపడి వున్నాయి. జ్యోతిషం గణితశాస్త్రంమీద ఆధారపడి వుంది. వేదానికి ఇలాంటి జ్యోతిషం నేత్రం. శిల్పశాస్త్రానికి సహస్ర నేత్రాలుంటాయి.

ఒక్కో గ్రహం ఒక్కో భూతానికి ప్రతీక. పంచభూతాలమీద గ్రహగతులు ప్రభావాన్ని చూపుతాయి. మనిషి శరీరం పంచభూతాత్మకం కదా మరి! కుజుడు అగ్నిప్రభావం వున్న గ్రహం. బుధుడు, భూమి ప్రభావాలున్న గ్రహాలు. గురుడు ఆకాశప్రభావం వున్న గ్రహం. శుక్రుడు జలంమీద ప్రభావం చూపే గ్రహం. శని వాయువుమీద తన శక్తి చూపుతాడు. చంద్రుడు మనసుమీద ప్రభావం చూపుతాడు. ఎందుకంటే పరమాత్మ అయిన ఆదిపురుషుని మనస్సునుంచి పుట్టినవాడు 'చంద్రమా మనసో జాతః' కాబట్టి.

శుక్లపక్షం వృద్ధికాలం. కృష్ణపక్షం క్షయకాలం. శుద్ధ పాడ్యమి నుంచి అమావాస్య వరకూ వున్న తిథులన్నీ మనకు అతిథులే గదా! ఖేచర విజ్ఞానంలోకి అడుగుపెడితే ఇక మనిషి నేలమీదకు దిగడు. నేనూ అలాగే నాకు తోచిందంతా చెప్పి మిమ్మల్ని విసిగించాననుకుంటాను" మందహాసం చేశారు సౌరాఖ్యుడు.

నిరుత్తరులై చిత్తరువుల్లా చూస్తున్నారు వాళ్ళు.

"గణితం ఎలా పుట్టిందంటారు?" అంది ప్రవాళ.

"అన్నీ ప్రకృతి నుంచే—ప్రకృతి అనుకరణే. చేతివ్రేళ్ళే లెక్కలకు ఆధారం. ఉదాహరణకు రోమ్ దేశంలో అంకెలు ఇలా కనిపెట్టారు చూడండి— ఒకటి అనడానికి ఒక వ్రేలు—రెండు, మూడు, నాలుగు అనడానికి నాలుగు వ్రేళ్ళు. ఇక ఐదు అనడానికి బొటన వేలికి, చూపుడు వేలికి మధ్యవున్న తమర కర్రలాంటి ఖాళీను సూచించారు. అది ఐదు అన్నారు. ఈ రెండు చేతివేళ్ళను ఒక చేతిమీద అడ్డుగా ఇంకో చేయి వుంచి చూపారు. అది ఐదు ఐదు కలిపిన X అన్నారు. ఇంతే ఏదైనా ప్రకృతి నుంచే మనిషి నేర్చుకుంటాడు." దాచుకోవాలన్నా కానంత ఆశ్చర్యం ప్రణవదత్తు కళ్ళలో కనిపించింది.

"మనిషి ప్రకృతి నుంచే నేర్చుకున్నా ప్రకృతిని జయించితీరుతాడు" అన్నారు ప్రణవదత్తు.

"నిజమే కానీ ఆ జ్ఞానం కూడా తరతరాల మానవ మేధో పరిణామంలో ప్రకృతి అతనికి అందించినదే కదా!'' అన్నాడు వింపాదిగా సౌరాఖ్యుడు.

''ముమ్మాటికీ సత్యం'' ప్రవాళ సౌరాఖ్యునితో ఏకీభవించింది.

"మనిషి ఎన్ని కళలు నేర్చుకున్నా మానవత్వాన్ని మరచి

పోకూడదు. రాళ్ళలో దేవుడున్నాడనుకుంటేనే చాలదేమో?" వాదంలో ఏదో భేదం సృష్టించాలని యత్నిస్తూనే వున్నాడు ప్రణవదత్తు.

"నిజమే దత్తుగారూ! దేవుడు రాయి కాదు. రాతిలో కూడా దేవుడున్నాడనీ, కళాత్మక శిలలో మరీ ఆ అంశ అధికంగా వుంటుందనేదే నా విశ్వాసం. నేను శిలలోనే దేవుణ్ణి చూసేవాణ్ణి – మనిషిలో లేదని ఎలా అనుకుంటాను" వాడిగా అన్నాడు సౌరాఖ్యుడు.

"అవును దత్తుగారూ! సౌరాఖ్యుడు ఇప్పుడు కడుతున్న గుడి ప్రక్కనే అనాథ బాలులు తలదాచుకోవడానికి, ఆలయ కార్యక్రమాల్లో వాళ్ళు పాలుపంచుకోవడానికి తన స్వంత ఖర్చుతో ఒక సత్రం నిర్మిస్తున్నాడు. ఇది దేవాలయం — అది మానవాలయం అంటుంటాడు నాతో —" ప్రవాళ మాటల్లో ఆర్ద్రతను ప్రణవదత్తు గమనించాడు. శిల్పాచార్యుడంటే అటు వేదవాఙ్మయం నుంచి ఇటు భూగర్భ విజ్ఞానం, అటు శిల్పశాస్త్రంతో అనుబంధంగా వున్న నాట్యశాస్త్ర పరిజ్ఞానం, యోగశాస్త్రం, ఖగోళశాస్త్రం, గణితశాస్త్రం, సర్వ శారీరక శాస్త్రం, గ్రహగతుల విజ్ఞానభరితమైన పంచాంగ పరిజ్ఞానం—ఒక్కటేమిటి శిల్పాచార్యుడు సర్వజ్ఞుడేమో అనిపించి కొంత అసహనం, అసూయ కూడా ఏర్పడింది ప్రణవదత్తుకు. ప్రవాళ తనను సౌరాఖ్యుని ముందు అల్పజ్ఞునిగా గుర్తించిందన్న విషయం అతనికి అర్థమైంది. నిజానికి కూడా అదే వాస్తవమని తెలుసుకున్నాడు.

"అసలు శిల్పులకు మన సాహిత్యంలో కానీ, ప్రజల మనసుల్లో కానీ రావలసినంత కీర్తి, దక్కవలసినంత స్థానం ఏర్పడిందంటారా?" సౌరాఖ్యుని సూటిగా ప్రశ్నించింది ప్రవాళ.

"శిల్పిగా నేను, అలాంటి స్థానం శిల్పులకు దక్కలేదనే చెప్పాలి. ఏ అమరశిల్పుల వ్యక్తిగత శిల్పనైపుణ్యం వల్లనో వాళ్ళ పేర్లు ప్రచారానికి వచ్చాయి కానీ—సాహిత్యం ద్వారా గానీ, దానివల్ల ప్రజల అభిమానం

పొందింది కానీ ఏ శిల్పికీ గౌరవస్థానం దక్కలేదనే చెప్పాలి—ఇది సత్యం కాబట్టి—సత్యాన్ని చెప్పడం తప్పుకాదు కాబట్టి" సౌదామిని కళ్ళలో కించిత్ ఆవేశం చోటు చేసుకుంది. ఒక శిలాఖండాన్ని చేతిలోకి తీసుకుని అటూ ఇటూ చూస్తూ కూర్చున్నారు.

"అవును – నేనూ అలాగే అనుకుంటున్నాను. రాత్రింబవళ్లూ సర్వ శాస్త్ర విజ్ఞానాన్ని ఆర్జించి, చేతులు బొబ్బలెక్కేలా శిలాఖండాలతో తలపడి కళాఖండాల్ని సృష్టించేది శిల్పులు. వాళ్ళే కాళ్ళు చేతులూ నలగగొట్టుకుని శిల్పాల్ని ప్రతిష్ఠించి నేత్రోన్మీలనం దాకా దేవతా విగ్రహాలకు సర్వ కళల్ని అవహింప జేసేది శిల్పులు. రాళ్ళను దేవుళ్ళు, దేవేరులుగా మార్చిన శిల్పులకు సాహిత్యంలో చోటు లేకుండా పోయింది. శిల్పులు చీమల్లా పెట్టిన శిల్పాల పుట్టలు ఆలయాలు ..." ప్రవాళ మందిపడుతోంది. ఆమె మనస్సుకు కొందరు నయవంచకుల్ని ఆజన్మాంతం శపించాలనిపించింది.

"ఏం ప్రణవదత్తూ! శిల్పులకు తీరని అన్యాయం జరిగిందంటావా లేదా?" ఎరుపెక్కిన కళ్ళతో ప్రశ్నిస్తున్న ప్రవాళముందు అతనికి ఒప్పుకోక తప్పలేదు.

"శిల్పులు చెక్కి ప్రాణప్రతిష్ఠ చేసిన విగ్రహాల్ని పూజిస్తూ, తమ జీవితాల్ని సుఖప్రదం చేసుకుంటున్నవాళ్ళే తమ కడుపుల్ని నింపుతున్న ఆ విగ్రహాల్ని చెక్కిన అభాగ్యుల్ని చులకన చేసి మాట్లాడ్డం, చిన్నచూపు చూడడం అమానుషం, అతిదారుణం! అవును సౌదా! మీరు చెక్కిన ఆ విగ్రహంమీద దేవుని ఆవాహన వుంది గదా! ఆ దేవుడు విశ్వాంతరాళం నుంచి భూమిమీదకు అవతరించడానికి ఆవాహక వాహకాలు శిల్పులు చెక్కుతున్న విగ్రహాలే గదా! మరి వాటిని పూజించేవాళ్లూ, ఆ దేవుళ్లూ వాళ్ళను పట్టించుకోరా? తమకు ఆధారభూతమైన విగ్రహాల్ని శిలాయజ్ఞం చేసి సృజించిన శిల్పుల్ని విస్మరించడంలో ఎంత కృతఘ్నత? ఎంత చిత్రం?

సత్యం భగవత్స్వరూపం కదా! మరి ఆ సత్యాన్ని హత్యచేసి, పొరపాటున
కూడా శిల్పుల ప్రతిభా పాటవాల్ని ఒక నాటి అనుమానపు కూడా రానీకుండా
జాగ్రత్తపడిన ఈ నాస్తికుల్ని ఏమనాలి? భగవంతునికి ప్రతినిధులుగా నిల
బడి సర్వ సపర్యలు చేస్తున్న మనిషి, సత్యస్వరూపునికి ప్రతిబింబమైన
సత్యాన్ని హత్య చేసే చేతులతో కొందను అందించే హారతులు, ఎందరిని
ఏ లోకాలకు ఉద్ధరిస్తాయంటారు?

మహాశిల్ప కళను కఠిన శిలలమీదకు ఆరోపించి, ఆ శిల్పాలమీదకు
వివిధ దేవతలను ఆవహింపజేసే అమాయకులైన మహాత్ములను నిర్దా
క్షిణ్యంగా, నిస్సంకోచంగా ఆలయం వెలుపలికి గెంటివేస్తున్నపుడే ఆలయా
ల్లోని అమరభావం, దివ్యత్వం వెలివేయబడుతూందండీ. మన సంస్కృతికి
మనికి పట్టైన ఈ దేవాలయాలు, మన చరిత్రకు చారిత్రక గౌరవాన్ని
సముపార్జించి పెడుతున్న ఈ దేవాయతనాలు, మనలోని సత్ సంస్కృతిని
వెలికి రానీయకుండా ఆధ్యాత్మిక పురోగాములుగా మనల్ని నిరంతరం
మలుస్తున్న ఈ దేవమందిరాలు, ప్రపంచ దేశాలకే శిల్ప, చిత్రకళలతో
పాటూ ఆధ్యాత్మిక భిక్ష పెడుతున్న మన ఆగమాలకూ, ఆగమ శాస్త్రాలకూ
ఆయువుపట్టు అయిన ఈ దేవాయతనాలు, ఏ దేవగృహాల్ని భారతభూమి
మించి తొలగించివేసి చూస్తే దేశమంతా ఒక యాంత్రికపు బంజరు భూమిలా
కన్పిస్తుందో ఆ దివ్య శిల్పక్షేత్రాలు — భువికి, దివికి సంధానకారులుగా
నిలిచిన ఈ మహోన్నత గోపుర మూపురాల్ని దాల్చిన ఈ గుడిబస
న్నలు — ఏ మహాశిల్పాచార్యుల మేధో జనితాలో, ఏ శిల్ప కార్మికుల స్వేద
పునీతాలో, ఏ స్థాపనాచార్యుల స్వర్ణాదర్శన మహిమాన్వితాలో ఆ శిలా
కళాకారుల్ని విస్మరించిన సాహిత్యం కానీ, సనిగట్టుకుని నిర్లక్ష్యం చేసిన
మహానుభావులు గానీ ధర్మబద్ధంగా వున్నట్లేనా? ధర్మాన్ని విస్మరించినవారు
దైవానికి ప్రీతిపాత్రులౌతారా?" ధర్మదేవత నయనాలు జలజలా వర్షి

స్తున్నట్టు కన్నీరు కార్చింది ప్రవాళ. ఆమెలోని దివ్యాంశను దర్శించాడు సౌరాఖ్యుడు. ఆమెలో యుగయుగాల శిల్పాల ఆర్తి ధ్వనిస్తున్నట్టు

అది అసుర సంధ్య దాటిపోయిన సమయం. ఒకరి ముఖకవళికలు ఒకరికి కనిపించనంత చీకటి కమ్ముకుందక్కడ. తీవ్రమైన భావావేశంతో ప్రవాళ స్పందిస్తోంది. సౌరాఖ్యునిలో ఏదో తెలియని బాధ గూడు కట్టుకుంది. ప్రణవదత్తు అశాంతితో కొట్టుకుపోతున్న అనుభూతికి లోనయ్యాడు. ముగ్గురూ కలిసి మౌనంగా శిల్పశాలవైపు నడక సాగించారు.

* * *

శిల్పుల ధ్యానంతో సకల కళల మానసాన్ని సకలీకరించుకుని సౌరాఖ్యుడు శిలలతో తాదాత్మ్యం చెంది పనిచేస్తున్న శిల్పకారుల మధ్యకు నడిచాడు. పీఠాల్ని, విగ్రహాల్ని గట్టిగా పట్టివుంచడానికి శిల్పులు అష్టబంధన ప్రక్రియను నిర్వర్తిస్తున్నారు.

"ఆర్యా! ఒక్కసారి అష్టబంధనంలో వాడే వస్తువుల్ని మీరు గుర్తుచేస్తే ఆ ప్రక్రియను ప్రారంభిస్తాము" సూత్రగ్రాహి కొందరు శిల్పివరులతో పాటూ సౌరాఖ్యునిదగ్గరకు వచ్చారు.

"ఆఁ....అవును చెప్తాను" కాసేపు కళ్ళు మూసుకున్నారు.

"మీరు అంతలోపల కర్రతో నిర్మితమైన రోలు రోకలిని శుభ్రంగా కడిగి సంప్రదాయబద్ధంగా సిద్ధంచేసి తీసుకురండి" వర్ధకి కొందరు శిల్పులకు సూచన చేశాడు.

"కొంబరక్కు సుక్కాంతూల్ కుంగులియమ్ కర్కావి, సెంపంజి, జాదిలింగం, తేన్ మెఝుగు తంపకుడు పిక్కి ఎరుమై వెణ్ణై కూట్టి వఝి యిడుత్తు అక్కల్....అష్టబంధనం" సౌరాఖ్యుడు తాను ఎప్పుడో ఒక తమిళ శిల్పశాస్త్ర గ్రంథంలో చదివిన అష్టబంధన ప్రయోగ శ్లోకాన్ని

మననం చేసుకున్నాడు. తమిళంలో అతడు చెప్పినవి అర్థం అయ్యాకాక. రెండోసారి అడగలేక సందిగ్ధంగా చూస్తున్నారు వాళ్ళు.

"చెట్టు బెరడుతో కూడిన లక్క-ను సేకరించి నెమ్మదిగా చెట్టు బెరడును తొలగించివేయాలి. సుక్కాన్ ధూళిని తీసుకోవాలి. ఇందులో రెండు రకాలుంటాయి. నల్లగా వున్నది పనికిరాదు. కపిల పీలం రంగులోనిదే తీసుకోవాలి. దీన్ని కూడా వేడి కళాయిలో వేసి చూడాలి. ఆ వేపుడులో పెళ్లేది మంచి పొడి కాదు. పెల్లని పొడినే తీసుకోవాలి.

కుంగులియం—దీన్ని నాటుమందుల షాపుల్లో మంచి కొనితెండి. కర్కా-వి పువ్వులా విచ్చుకున్నది పనికిరాదు. ఎర్రగా వుండే ఉండలు శ్రేష్ఠం. సెంబంజి—ప్రత్తి."

"అవునండి ఎర్ర పత్తి."

"ఎర్రగా వుండే ప్రత్తి ఉత్తర భారతదేశంలో (బీహారు) వుంటుంది."

"మనం అక్కడ మంచే తెప్పించాం కదండి."

"అవును—మనం తెప్పించింది బాదం పప్పు రంగులోనే వుంది కదా."

"ఆ రంగులోనే వుందండి."

"ఇక అతి ముఖ్యమైంది జాతిలింగం. అష్టబంధనంలో ఇది చాలా ముఖ్యం. ఇందులో చాలా రకాలున్నాయి. ఇనుములా ఘనంగా వుంటూ సులభంగా పొడి అవుతుండే అది మంచిరకం అన్నమాట—దాన్ని చూసుకోండి."

తేనెతెట్టు—పసుపు తేనెతెట్టు పనికిరాదు. తెల్లని రంగులో వుండే తేనెతెట్టే ఉత్తమం. మీరు గుర్తుంచుకోవలసింది తేనె అయిపోయిన తేనె తెట్టు. అంటే పున్నమకు పూర్తి అయిపోయి బాగా ఎండిపోయిన తేనె తెట్టును సేకరించండి.

గేదె వెన్న అతుకుది. బాగా జిడ్డు తేలే వెన్న కావలసి వుంది. దీన్ని సంగ్రహించి కొత్త కుండకు లోపల బాగా అతికించాలి. చీకటి గదిలో రెండురోజులు దాన్ని బోర్లించి వుంచాలి. అప్పుడు ఆ వెన్నకున్న తేమ నంతా ఆ కొత్త కుండ పీల్చివేస్తుంది. అప్పుడు తడి ఇంకిన ఆ వెన్నను తీసివుంచుకోవాలి. ఇక పీటికి సంబంధించిన కలయికలోని విషృత్తిని గుర్తుంచుకోవాలి మీరు."

"ఇలా తీసుకురండి" దారునిర్మిత ఉలూఖలాన్ని మోసుకొస్తున్న వారితో చెప్పి సూత్రగ్రాహి దానికి స్థలాన్ని నిర్దేశించాడు.

"ఇంతే—బాగుంది" ఆ రోటిని చూస్తూ సంతృప్తిని వ్యక్తం చేశాడు సౌరాఖ్యుడు. ఆ రోలును, కర్రరోకలిని శుభ్రంగా కడిగివున్నారు. దానికి మామిడాకుల తోరణం కట్టివుంది.

"ఈ వస్తువుల్ని దంచడానికి ఎవరిని నియమించారు?" సౌరాఖ్యుడు అడిగాడు.

"ఆర్యా! ప్రణామాలు" అంటూ ఒక వ్యక్తి సౌరాఖ్యుని ముందుకు వచ్చాడు.

అతన్ని సంతృప్తిగా చూశాడా యువశిల్పి. ఆ వస్తువుల్ని దంచడానికి వచ్చిన వ్యక్తి శుచిగా స్నానం చేసి, పరిశుభ్రమైన వస్త్రాల్ని ధరించివున్నాడు. మంగళాశాసనంతో అష్టాక్షరీ మంత్రాన్ని జపిస్తూ కార్యోన్ముఖుడై వున్నాడతను.

"ఈ అష్టబంధనంలో—లక్క, సుక్కాంధూళి, కుంగులియం, కర్కావి, జాదిలింగం, తేనెమైట్టు, ఎర్రపత్తి, గేదె వెన్న పీటన్నిటినీ బాగా వేడిచేసి తెళ్ళబెట్టి కుతకుతలాడాక దించి చల్లార్చి ఆ పదార్థాన్ని ఇలా పీఠాలూ విగ్రహాలు అతకడానికి వాడడం ఒక పద్ధతి. పీటిని కర్రరోలు, కర్ర రోకలితో మనం చేస్తున్నట్టు దంచి ఆ పొడిలో వెన్న కలిపి అతి

కించడం రెండవ పద్ధతి. రాతితో పీటిని దంచకూడదన్న విషయం మరచి పోకూడదు మీరు. అరగంట ఇలా దంచిన పొడిని వెన్నతో కలిపి ఎండబెట్టి ఉండలు చేసి వుంచుకోవాలి. ఆ ఉండలకు చీలతో మధ్యలో వందు చేయాలి. పరిశుభ్రమైన స్థలంలో ఈ ఉండల్ని రెండురోజులు ఆర బెట్టాలి.

తర్వాత ఆ ఉండల్ని రోటిలో వేసి అర గంట దంచాలి. మరో అరగంట కాలం వాటిని అలాగే వుంచాలి. ఇలా అర గంట అర గంట వ్యవధి ఇస్తూ ఈ పదార్థాన్ని 8 సార్లు దంచాలి. అలా తయారైన ఆ వ్యంజన పదార్థాన్ని అష్టబంధనం అంటారు. ఈ ఎనిమిది పదార్థాల సమ్మేళనం రాతికి రాతికి మధ్య గట్టి బంధనాన్ని ఏర్పరుస్తుంది. విగ్రహాన్ని, విగ్రహ శిలాపీఠాన్ని ఇది ఎంతకాలమైనా పట్టి వుంచుతుంది. జీర్ణోద్ధరణ కార్యక్రమాలకూ ఈ అష్టబంధనాన్ని అనుసరిస్తారు.

తిరుమంధనం అని మరో ప్రక్రియ వుంది. విగ్రహ పీఠాన్ని, దాని ఉప పీఠాన్ని కలపడానికి దాన్ని వాడతారు మన శిల్పులు. దీనికి మూడు వస్తువుల్ని కలపాలి.

సుక్కాన్ తూల్ వర్కరి తొల్ప్రేయన్ సర్కనియం
వక్క కలందు అమైతల్ ఉట్రు తిరుబంధనం.

ఆ సుక్కాన్ చూర్ణం, చక్కెర, బాగా పండిన అరటిపండు ఈ తిరుబంధనానికి అవసరం.

వెడల్పయిన పాత్రల్ని తీసుకోవాలి. వాటికి బాగా కళాయి పెట్టి వుండాలి. త్రుప్పుపట్టిన పాత్రలు పనికిరావు. సుక్కాన్ పొడిని జల్లించి తీసుకోవాలి. దానిలో చక్కెర కలపాలి. బాగా పండిన అరటిపండును (తొక్క తీసివేసి) ఆ పొడిలో వేసి మిశ్రమం చేయాలి అది వేడెక్కుతుంది. కర్ర కవ్వంతో బాగా చిలికితే అది అంబలిలాగా తయారవుతుంది. ఇలా

తయారైన శిరుదంధన వ్యంజనాన్ని ¼ అంగుళం మందం వచ్చేలా ఉపపీఠానికి పట్టించాలి. దానిమీద ఆ పీఠాన్ని వుంచి సమంగా వుండేలా చూడాలి. ఇక ఆ అతుకు రెంటినీ గట్టిగా పట్టివుంచుతుంది."

"ఆర్యా! ఆ విధంగానే మీరు చెప్పిన క్రమంగా చేస్తాం. మాకున్న సందేహాలు తీరాయి."

మరోమారు వాళ్ళను హెచ్చరించి సౌరాఖ్యుడు ఆలయనిర్మాణ కార్యక్రమాల్ని పర్యవేక్షించడానికి దృఢ దీక్షతో ముందుకు అడుగు వేశాడు.

° ° °

మహోన్నత ప్రమాణంలో ఎదిగిన బంగారు గోపురం సిగలో సూర్యబింబిని చెరువుకుని ధగధగలాడుతున్న భావన ఒకటి అతనికి స్ఫురించి శరీరం జలదరించింది. ఆలయం ప్రహరీగోడలు లేచి గోపుర నిర్మాణాన్ని అందుకుంది.

ప్రతిమా లక్షణాల్ని ఒకసారి పరీక్షించుకోదలచాడతను. గోడకు వ్రేలాడుతున్న పడంబపు త్రాడు తీసుకున్నాడు. ఆయా స్థలాల్లో అందంగా ప్రతిష్ఠించడానికి సిద్ధంగా వున్న విగ్రహాల్ని అంచనా వేసుకుంటున్నాడా యువస్థపతి. 'ఆత్రేయ తిలకం' అనే శిల్పశాస్త్రం గ్రంథాన్ని కాసేపు స్మరించి ఆ కొలతలకు ఈ విగ్రహాలు సరిపోతున్నాయా లేదా సరిచూసుకుంటున్నాడు. "ద్వాదశాంగుళ ప్రమాణాన్ని తాళం అంటాము. పురుష దేవతా విగ్రహాలు దశ తాళప్రమాణంలో వుండాలి. వున్నాయి. స్త్రీ దేవతా విగ్రహాలు నవతాళ ప్రమాణంలో వుండాలి. వున్నాయి. మనుష్య పురుష విగ్రహాలది అష్టతాళ ప్రమాణం, స్త్రీ విగ్రహాలది సప్త. తాళ ప్రమాణం—సరిపోయాయి. బాల విగ్రహాలది షష్ఠ తాళ ప్రమాణం—బాగుంది—సూత్రగ్రాహీ! నిన్ను ప్రశంసించకుండా వుండలేను" అన్నాడు సౌరాఖ్యుడు.

అక్కడ సూత్రగ్రాహి లేడు. అయినా ఎవరో విని ఈ ప్రశంసను అతనికి తెలియచేశారు. ఇది దేవజన విద్య. శిల్పులు దేవజనులు. అసలు లలిత కళ లన్నీ దేవజన విద్య క్రిందకే వస్తాయి. కళ వక్రిస్తే కళంకం వచ్చి పడు తుంది—ఇలా ఆలోచిస్తూ వున్నంతలో వచ్చి నమస్కరించాడు సూత్ర గ్రాహి.

"వచ్చావా! నిన్ను ప్రశంసించకుండా వుండలేను. నేను చేసిన రూప విన్యాసానుగుణంగా అలాగే ఒలిచిపెట్టావు శిల్పాల్ని. ఈ శిల్పాల పొడవు వెడల్పుల్లో తేడాలు వస్తే దానివల్ల రాష్ట్ర భంగం, దుర్భిక్షం వచ్చి తీరుతాయి. అపరాజిత పృచ్ఛ సూత్రధారి లక్షణాలు చెపుతూ—'శాస్త్రజ్ఞః కుశలో దక్షో వాస్తువిద్యా విబోధకః సూత్రధారో మహాప్రాజ్ఞః షట్కర్మసు నిరంతరమ్' అంటుంది. ఆ శాస్త్ర నిర్వచనాలు నీకు సరిపోతున్నాయి." భుజంపై చేయివేశాడు సౌరాఖ్యుడు.

"కృతజ్ఞతలు—ధన్యులం" సూత్రగ్రాహితో పాటూ వర్ధకి ఇతర శిల్పివరులు తమకు కనకాభిషేకం జరిగిన అనుభూతినందుకున్నారు.

"మీ ఏకాగ్రతను చలింపజేసినందుకు క్షమించాలి" అంటూ ముందుకు కదిలాడు సౌరాఖ్యుడు. వారందరూ అతని కార్యారాధనా భావాన్ని ప్రశంసించుకుంటూ సెలవుతీసుకున్నారు. కళాకారునికి ప్రశంసలు తమ నైపుణ్యాల్ని క్షీణింపచేయకూడదని పదే పదే తమతో సౌరాఖ్యుడనే మాటను స్మరించుకుంటూ తమ తమ పనుల్లో నిమగ్నులయారు ఆ పాంచార్షేయులు.

విశ్వాన్ని జయించినవాడు విశ్వజిత్ యాగం చేస్తాడు. తన సర్వ స్వాన్నీ దానధర్మాలు చేసినవాడు అభిజిత్ యాగం చేస్తాడు. ఇద్దరివీ యాగాలే. భావాలే బలీయమైనవి. మనిషి దేన్ని నిర్మించినా, దేన్ని సాధిం చినా చివరకు వీటన్నిటినీ పరిత్యజించి ఆత్మవిద్యను ఆశ్రయించి తీరవలసి

వుంది. ఆత్మదృష్టిని కలిగించే దృష్టిని ఏర్పరచడానికే ఈ శిలారూప విన్యాసాలూ, శిల్ప గోపుర విలాసాలూ—సౌరాఖ్యుడు ప్రాకారాల మధ్య నడుస్తూ ఆలోచిస్తున్నాడు.

'దేహో దేవాలయః ప్రోక్తా, జీవో దేవ సనాతనః
త్యజే దజ్ఞాన నిర్మాల్యం సోహం భావేన పూజయేత్॥'

దేహాలయంలో సనాతన దేవుడైన ఆత్మను ఆరాధించి, అజ్ఞానాలనే అర్పించి పడవేసిన ద్రవ్యాల్ని చిమ్మివేసి శివోహం భావనతో తనే దేవుడనే సత్యదృష్టిని జనగణంలో తీసుకురావడానికే కదా శిల్పులిలా కాళ్ళు చేతులు నలగగొట్టుకుని పనిచేస్తున్నది—ఒక మందహాసం అతని పెదవులపైకి ఎగసివచ్చింది.

ధ్వజస్తంభాన్ని తయారుచేస్తున్న దృశ్యం అతని కంటబడింది. ఇది ఇంద్రధ్వజం. ఉపరిచర వసువుకు ఇంద్రుడు తన ప్రతీకగా బహూకరించిన వేణుయష్టికి ప్రతిరూపమే కదా ఇది. ఉపరిచర వసువు ఇంద్రుడు తనకిచ్చిన వెదురు గడను వివిధ పుష్పమాల్యాది వస్త్రాలతో అర్చించసాగాడు. అతన్ని అందరు రాజులూ అనుసరించి ఆ వెదురు గడను పూజించసాగారు. ప్రతి సంవత్సరం ఆ ధ్వజాన్ని ఉత్థానపరచి అర్చించే ఆచారానికి ప్రతిరూపంగానే కదా ఈ ధ్వజస్తంభం రూపొందింది—ఇలా అతనిలో శిల్పాగమ ఆదిమ విషయాలు అలలు అలలుగా తరంగలించసాగాయి.

ఈ శిలాక్షరాలు—నందంపూడి శాసనం 11 వ శతాబ్ది లేఖకుని గురించి లేఖకో గండాచార్యః అంటూంది. మంత్రాక్షరాల్ని చెక్కుతున్న శిల్పిని మందహాసంతో సన్మానించి ముందుకు పొగాడతను.

'చత్వారి శృంగా త్రయో అస్య పాదా
ద్వే శీర్షే సప్తహస్తా సో అస్య॥'

ఈ అగ్నిదేవుని ఆరాధించే పెనుశిలల మీద, మహా దారుఖండాల మీద శిల్ప విన్యాసాలకు పూనుకునేవారు మన పూర్వ శిల్పాచార్యులు.

"ఉలి దెబ్బకు నలిగిన మీ బొటనవ్రేలు ఎలా వుందో చూపండి" అగ్నిదేవుని రూపాన్ని రెండు శిరస్సులతో, నాలుగు శృంగాలతో, మూడు పాదాలతో, ఏడు హస్తాలతో తదాకారంగా చెక్కుతున్న అతని చేతిని మెత్తగా స్పృశించాడు సౌరాఖ్యుడు.

"ఆర్యా! ఈ మూడు పాదాల భంగిమ సరిపోయిందా చూడండి" అంటూ వాటిని చూపుతున్న మిషతో చేతిని వదిలించుకుని పనిలో నిమగ్న మయాడా శిల్పివరుడు.

"సరిపోయింది" భావగర్భితంగా నవ్వాడా యువ స్థాపనాచార్యుడు. శిల్పి శిల్పాన్ని చెక్కుతున్నపుడు ఆ శిల్పదేవత అతన్ని ఆవేశించి వుంటుంది అలా వున్నపుడే ఆతని చేతులమీదుగా ఒక మహా కళారూపం బయల్పడ్తుంది—సాలోచనగా ముందుకు సాగుతున్నాడు.

ద్వారాల వ్యాళీ స్తంభాల ప్రక్కనే ద్వారపాలికలు డంకలపై నిల బడి డంకా నృత్యాలు చేస్తున్నట్టు, రంభా స్తంభాల కానుకున్న గంధర్వ కామినుల సోయగాల గాంధర్వ గానాలు నలుదిశలా నినదిస్తున్నట్టు, ధ్వజ స్తంభం కనకమయ కింకిణీలతో నిక్వణిస్తూ చుక్కలతో ఏదో మంతనాలు మంత్రాలు చదువుతున్నట్టు, ఆలయ ప్రాకారాల మీద శిల్పించబడిన కపిల ధేనువులు కదలివస్తున్నట్టు, పద్మంతల్పి తుండాలతో పట్టుకున్న గజ రాజులు ఆకాశగంగా తీరాల నుంచి దిగి గుడిగోడలమీద చిత్తరువులై నిలిచి పోయినట్లు, ఆలయ కుడ్యాల మీద అరలతో శిల్పించబడిన పురాణ పురు షులు తనతో ఆత్మీయంగా సంభాషిస్తున్నట్టు, వేటలో రాటుదేలిన భిల్లులు పోటుకోలలతో అడవి మృగాల్ని వేటాడుతున్న కల్పన నుంచి ఏదో వినా దాలు వెలరేగుతున్నట్టు, అశ్వికులపై కొన్ని మృగాలు లంఘిస్తున్నట్టు,

వాటివి చెట్టు మాటునుంచి ఇంకో సహచరుడు వేటాడుతున్నట్టు, అంద చందాల ఖనులైన అప్సరకాంతలు, కిన్నరస్త్రీలు తమ కమనీయ రమణీయ సొగసులతో తనమీదకు తరలి వస్తున్నట్టు అకనొత అపూర్వానుభూతికి లోనయ్యాడు.

మూడడుగుల వెడల్పు, ఆరడుగుల పొడవుగల శిలలు ఎనిమిది వరుసలతో పేర్చిన విశాల వేదికమీద రూపొందుతున్నా ఆలయం, ఉలుల హలాలతో శిల్పి కర్షకులు ఆ శిలాతలాల్ని దున్ని ఒరగ పండించిన శిల్పాల్ని రాసులు పోస్తున్నారక్కడ.



# 10

"ప్రభూ! స్త్రీ దేవతలకు, పురుష దేవతలకు దారువిగ్రహ, ఆలయ నిర్మాణం కోసం వృక్ష సంగ్రహణం చేయవలసిన కార్యక్రమం ఒకటుంది." పరిసరాల్లోని వృక్షాల్ని పరిశీలిస్తూ అన్నాడు సౌరాఖ్యుడు.

"దేవతామూర్తుల విగ్రహాలకు సంగ్రహించే శిలల విషయం గురించి ఇంతకు పూర్వం చదివానుగాని ఈ వృక్షాల విషయం నాకు బొత్తిగా తెలియదే" కుతూహలంగా అంది.

శిలల్లోలాగే వృక్షాల్లో కూడా స్త్రీ వృక్షాలు, పురుష వృక్షాలు, నపుంసక వృక్షాలు అని మూడు రకాలున్నాయి."

"అలాగా—ప్రకృతిలోని అన్నింటిలోనూ ఈ భేదాలున్నాయా ఏమిటి?"

"ఉన్నట్టే అనిపిస్తుంది."

"పురుష వృక్షాన్ని చూపించవూ "

దట్టమైన అటవీ ప్రాంతంలా పెరిగిన పర్వత పాదంలో దారి వెతుక్కుంటున్నారు వాళ్ళు. అడవి గాలికి ఎగిరిపోతున్న వస్త్రాల్ని పొదివి పట్టుకుంటున్నారు. ఎత్తైన రాళ్ళను ఎక్కుతూ దిగుతూ వృక్షాన్వేషణ చేస్తూ సౌరాఖ్యుడు ఆమెకు దూరంగా వెళ్ళిపోయాడు. ఆలయ నిర్మాణం కూడా దాదాపు పూర్తి కావస్తుండడం, ఆ సమయానికి ఈ దారుకర్మ కూడా పూర్తికావలసి వుండడంతో ఆ వృక్షాల కోసం సౌరాఖ్యుడు పట్టుదలతో పరిశీలిస్తున్నాడు. ఇదివరకే అతను చాలా ప్రయాసతో ఎగుడు దిగుడు సానువుల్ని ఎక్కి-దిగడం వల్ల అతను విశ్రాంతి తీసుకోదలచాడు.

దూరంగా చంద్రబింబం ఇంద్రలోక-ప్రతినిధిలా నెమ్మదిగా

పయనమై గగనతలం మీదకు వస్తూంది. శిల్పం చెక్కడానికి ముందు శిలమీద శిల్పి గీసుకునే రూపవిన్యాస రేఖల్లా సుమార శిఖర పంక్తుల లీలగా కనిపిస్తున్నాయి. శిఖరం మీదనుంచి చూస్తున్నపుడు లోయల్లో ఎగురుతున్న పక్షులు రంగుల గాలిపటాల్లా అతనికి కనిపిస్తున్నాయి. ఒక వృక్షలక్షణాలు అతనికి నచ్చినట్లనిపించాయి. 'ఇక కాసేపు విశ్రమించక తప్పదు' అనుకుంటూ అతను పరిసరాల్ని పరిశీలించాడు. ఆశ్చర్యకరంగా అక్కడొక పురాతన శిథిలాయం కనిపించింది.

ఈ పర్వతం మీద ఈ చిన్న గుడిని ఎప్పుడు కట్టారు? ఎవరు కట్టారు? ఇది ఏ దేవాయతనం? అనుకుంటూ అతను ఆ గుడిలోకి ప్రవేశించాడు. లోపల విశాలమైన ప్రాంగణంలో పండుటాకులు, ఎండుటాకులు రాలివున్నాయి. వాటిమీద అతను వేస్తున్న అడుగుల సవ్వడి విని గుడి కప్పుకు వ్రేలాడుతున్న గబ్బిలాలు కిలకిలమని చీలిన చీకటి పేలికల్లా లేచి యాడుతున్నాయి. వెన్నెల కాంతి వాహినిలా వచ్చి ఆ ఆలయ ప్రాంగణంలో పడుతూంది. గుడి గోడల్ని అధిగమించి పొరలి వస్తున్న వెన్నెల వాకలో చలిబారిన ఒక మండప స్తంభానికి ఆనుకుని అతను కాసేపు విశ్రమించాడు. కొండగాలులు మోసుకొస్తున్న కొండమల్లెల పరిమళానికి, వెన్నెల తరంగాల శీతలానికి ఆ శిల్పి మగతనిద్రావశుడయ్యాడు.

"శిల్పీ! శిల్పీ! శిల్పీ!" తీగసాగిన తీపి పిలుపు అతనికి లీలగా వినిపిస్తూంది.

"శిల్పీ!" ఈసారి అతనికి స్పష్టంగా వినిపించిందా పిలుపు.

"ఎవరు?" మగత నుంచి మేల్కొని కలయజూశాడతను. మల్లెలు, మొల్లలు ఒత్తుగా చల్లినట్లు ఆ గుడిలో వెన్నెల పడుతూంది. గుడి గోడలు, శిథిలగోపుర శిల్పాలు, మండప స్తంభాలు వెన్నెల్లో పీడలు చూసుకుంటున్నాయి.

"శిల్పీ! నేనే!" ఆ మండపానికి దూరంగా గుడి ప్రాంగణంలోనే ఒక మూల శిలాపీఠంమీద లీలాకమలాన్ని చేతబట్టుకుని కుంచిత వామ పాదంతో ఒయారంగా నిలబడిన ఒక సుందర స్త్రీమూర్తిని చూశాడతను.

"ఎవరు నువ్వు?" అతను గబ గబా అటుకేసి నడిచాడు.

'స్త్రీ మూర్తి అనుకున్నా! ఇది శిల్పమా? ఎవరో ఆ మహాశిల్పాచార్యుడు? ఎంత అందమైన రూపకల్పన!' అనుకుంటూ ఆ శిల్పానికి అల్లుకుపోయిన పూలతీవెల్ని తొలగించి ఆమె సమ్మోహక అంగసౌష్ఠవాన్ని, ముఖమండలంలో ఉట్టిపడే కళాత్మక తేజాన్ని పదే పదే పరికించసాగాడు. వెనుకనుంచి పడుతున్న వెన్నెలతో ఆ శిల్పానికి బుగ్గలు నిగ్గుదేరి అతన్ని చూసి మందస్మితం చిందించినట్టు అనిపిస్తూంది. అతను ఆ లతల నుంచి కోసుకున్న పుష్పాల్ని అంజలి పుటితో ఆ శిల్పసుందరి పాదపీఠంమీద పెట్టాడు.

'ఏ కాలం నాటిదీ ఆలయం?' ఆలయ కుడ్యాలమీద పడుతున్న వెన్నెల వెలుగులో అరిగిపోయినట్లున్న శిలాశాసనాన్ని చదవడానికి యత్నించాడు కానీ ఆ లిపి అతనికి అంతుపట్టలేదు. 'ఎలాగైనా ఈ ఆలయ నిర్మాణ కాలం తెలుసుకోవాలి' అటూ ఇటూ పరికించి గోడల నెరియల్లో మొలిచిన పసరు ఆకుల్ని సేకరించాడు. ఒక రాతితో ఆ పత్రాల్ని మర్దించి ఆ శిలాశాసనానికి ఆ పసరు అద్దాడు. తెల్లని కాగితం అక్కడ అందుబాటులో లేదు కాబట్టి ఉత్తరీయంతో తన వీపును శుభ్రంగా తుడుచుకున్నాడు. ఆ శిలాశాసన ఫలకానికి తన వీపును గట్టిగా ఆనించి ఆ శాసనం తన వెనుక ముద్రితమయ్యేలా చేసుకుని వెనుదిరిగాడు.

"శిల్పీ!" తిరిగి అదే పిలుపు. అందాలు తొణికిసలాడే మధురమైన పిలుపు వెన్నెలలో నేసిన తెలినలిపాలు గాలిలో ఎగసిపడుతుండగా ప్రవాళ లాంటి ఒక నవీన సుందరి ఎవరో ఆ శిల్పం వెనుక నుంచి చూస్తున్న

దృశ్యం అతనికి సాక్షాత్కరించింది. ఆమె పాదాల అందెల రవళి వినిపిస్తూంది. ఆమె తనూ పరిమళం వ్యాపిస్తూంది. ఎన్ని శతాబ్దాల నుంచో ఎదురుచూస్తున్న ఆర్తి ఆమె పిలుపులో ప్రతిధ్వనిస్తూంది.

"సుందరరూపమా! ఎవరు నువ్వు?" అతను వాలుగడుగులు ముందుకు వేశాడు. ఆ శిల్పం వెనుకకెళ్ళి చూశాడు. అక్కడ వెన్నెల తప్ప వెన్నెల బొమ్మ ఎవరూ కనిపించలేదతనికి. తిరిగి అతను ఆ మండపంమీది రాలిన పత్రాల్ని ఉత్తరీయంతో తొలగించి తలక్రింద చేతి నుంచుకుని ప్రక్కవాటుగా పడుకుని ఆ విగ్రహాన్ని తదేకంగా చూస్తున్నాడు. అతని చుట్టూ ఏవో పదమంజీర నాదాలు, హస్తకంకణ నిక్వణాలు, లయబద్ధ లాస్యపదన విన్యాసాలు, చందనగంధ మృదంగ ధ్వనులు సందడించి అతన్ని సంబరపెడుతున్నాయి.

శ్వేత వస్త్రాలతో, ధవళ కుసుమాల మాలతో, చందన చర్చతో ఒక సుందరి సువాసనల సహవాసినులతో అతని దరికి గాలిలో తేలుతూ అతని మండపం చుట్టూ ప్రదక్షిణ చేసి గాలిలో నిలుచుంది.

"సుందరీ!" అంటూ మండప సోపానాలు దిగి ఆమె కోసం ఆకాశాన్ని చూస్తూ ధ్వజస్తంభ పీఠానికి కాలు కొట్టుకుని పడిపోయాడు.

తిరిగి తెలివి తెచ్చుకుని లేచేసరికి అతను మండప తలంమీద పడుకుని వున్నాడు. అతని ఒంటికి ఒక అపూర్వ పరిమళం అంటుకుని వుంది. అతని పెదవులు చుంబన విధితో తడిసి వున్నాయి అతని కనురెప్పలమీద తడి గురుతులున్నాయి. పదే పదే ముద్దాడినట్టు అతని చెక్కిళ్ళు ఎరుపెక్కిన అనుభూతి అతనికి తెలియవస్తూంది. అతని అధరాలకు ఒక రకమైన మధుర రస స్పర్శ అంటుకుని వుంది. తన ఎదమీద మరో ఎద బరువు మోపగా హత్తించుకున్న రాగరక్తిను అనురక్తిని తొడుగుతూంది. ఆత్మరతిలో అంగాలు పట్టు సడలిన మత్తులో తేలిపోతున్నాయి. సౌరాఖ్యుడు శక్తినంతా

కూడగట్టుకున్నారు. అతనికి కించిత్ భయం వేసింది. ఆ ఆలయంలో వుంద కూడదనుకున్నారు. చరచరా ఎండుటాకులమీదుగా నడుచుకుంటూ వెలుపలికి వచ్చేశారు. వచ్చిన దారివెంబడి గబ గబా నడక సాగించారు.

"ప్రవాళా"లోయలు ప్రతిధ్వనించేలా పిలిచారు.

"ఆచార్యా! ఇక్కడున్నాం రండి" ప్రవాళతో పాటు వున్న ఆ బాలుడు ఎలుగెత్తి పిలిచాడు. అనాథుడైన ఆ బాలుని సౌహార్ద్యుడు చేర దీశాడు.

"వస్తున్నా" అంటూ విర విరా వాగులు దొంకలు దాటుకుంటూ వస్తున్నారు.

"ఏం శ్రీవృక్షం విన్ను బిగి కౌగిలిలో బంధించి వుంచుకుందా?'' ప్రవాళ కోపంగా మూతి ముడుచుకుంది.

"ఆ .. అలాంటి అనుభూతే ఎదురైంది.

"ఏమిటీ!"

"అవును ప్రవాళా!"

"బాబోయ్ — నేను సరదాగా అంటే నువ్వు నిజమే నంటున్నావు!"

"అక్కడో పాడుబడిన గుడి వుంది."

"అక్కడ పురాతన ఈశ్వరాలయం వుందన్నారు కానీ—నే నెప్పుడూ వెళ్ళలేదు."

"అదినరే గానీ ముందు నా వీపును వెన్నెల్లో చదువు"

"నీ వీపువా! నీ హృదయాన్ని చదవగలనేమో కాని వీపునెలా చదవడం! ఆలస్యంగా వచ్చినందుకు నీ వీపును చరచాలి గానీ."

"చదివాక చరుద్దువు గానీ."

"ఇంతకీ — ఏవో అక్షరాలు వచ్చటోసినట్టు కవిపిస్తున్నాయి. ఉండు — క్రీ.శ. 875 వ సంవత్సరం నాటిదీ గుడి—మిగిలిన లిపి తెలియ లేదు. నువ్వే చదువుకో" కొంటెగా నవ్వింది. —

"నా అరచేతికి కళ్ళుంచే అలాగే చదువుకునేవాణ్ణి. నరేగానీ బాగా రాత్రవుతూంది. ఇక్కడ నుంచి వెళదాం. ఏం బాబూ భయపడ్డారా?" పిల్లవాణ్ణి పలకరించాడు.

"నాకేం భయంలేదు బాబుగారూ. అక్కయ్య చక్కని కథ చెప్పింది."

"ఆ కథ నేను వినకూడదేమో."

"అదీ శిల్పాల కథేనండీ."

"అలాగా — ఇప్పుడు నా కెదురుపడిన కథ చెప్పనా" అంటూ సౌరాఖ్యుడు గుడి దగ్గర తన కెదురైన అనుభవాన్ని వాళ్ళకు చెప్పాడు.

"చూడు ప్రవాళా ఇవి గుండ్రని రాళ్ళు. వీటిమీద అడుగు వేసే టప్పుడు ప్రక్కనున్న కొమ్మల్ని పట్టుకోవాలి." అలా దారి తెన్నూ చూపుతూ సౌరాఖ్యుడు వారిని ఆ కొండా కోనలనుంచి నెమ్మదిగా కాలిబాట లోకి తీసుకువచ్చాడు. వాళ్ళ ముగ్గురికీ మరో ముగ్గురు రక్షక భటులు తోడు వస్తున్నట్టు వెన్నెలలో వాళ్ళ నీడలు పడుతున్నాయి.

"అక్కడకు ఇప్పుడే వెళదాం—ఆ విగ్రహాన్ని చూద్దాం" అంటూ ఒత్తిడి చేసిన ప్రవాళకు ఆ విగ్రహాన్ని తప్పకుండా తరలించి తెచ్చుకుందా మని నచ్చచెప్పి హామీ ఇచ్చాడు సౌరాఖ్యుడు.

"నాకు ఈర్ష్యగా వుంది సౌరా! ఆ శిల్పసుందరిని శిల్పించింది నువ్వే!" చాలాసేపటి మౌనం తర్వాత దృఢంగా అంది ప్రవాళ.

"ప్రవాళా! ఈ ప్రాంతానికి నేను రావడం ఇదే మొదటిసారి" అన్నాడు.

"సౌరా! నువ్వు కూడా ఇంత అమాయకంగా మాట్లాడతావని అను కోలేదు."

"................" ప్రశ్నార్థకంగా చూసాడతను.

"నీకు పూర్వజన్మలు లేవంటావా? ఈ జన్మలోనే ఇంత శిల్ప నైపుణ్యాన్ని సాధించుకున్నానంటావా" అతని చేతిని నొక్కింది. అతను చాలాసేపు ఏదో ఆలోచిస్తూండి పోయాడు.

• • •

"ఇదో ప్రవాళా ఇది పురుష వృక్షం" ఉదయ కిరణాలు పడి ఒక వృక్షం మిలమిల లాడుతూంది. చాలాసేపు ఆ వృక్షాన్ని అన్ని కోణాల నుంచి అన్ని దూరాల నుంచి దీక్షగా పరిశీలించాక అన్నాడు.

"నువ్వెలా కనిపెట్టావీ విషయాన్ని?" అరమూసిన కోలకళ్ళతో అందంగా చూస్తూ అడిగింది.

"చెప్తాను — ఈ నేల చూడు గట్టిగా వుంది. తడిగానూ వుంది. ఔనా" మొనదేలిన రాతితో కొంత లోతు త్రవ్వి చూపాడు.

"ఔను" ఆ మట్టి తాకి చూపిందామె.

"ఇలాంటి భూమిలో పుట్టిన వృక్షం వంకర లేకుండా పెరిగినదై వుండాలి. ఆ వృక్షానికి సంబంధించిన కర్ర బరువుగా వుండాలి. కించిత్ సువాసనతో కూడి వుండాలి." ఆమె చేతికి విరిగిన ఎండు కర్ర నొకదాన్ని అందించాడు.

"ఇది బరువు తూగుతూంది. స్వల్పమైన వాసనా వేస్తూంది."

"దీని పళ్ళు చూడు పెద్దవిగానూ వున్నాయి. గట్టిగానూ వున్నాయి"

"ఔను."

"కర్రలో చలువ ఉష్ణం రెండు లక్షణాలూ కలిపి వుండాలి. ఒకింత చమురు వున్నటువంటి గుణమూ వుండాలి. అలాంటిది ఏదైనా పురుష వృక్షమే అవుతుంది."

"నువ్వు చెప్పినవన్నీ ఈ వృక్షంలో కనిపిస్తున్నాయి."

"అందుకే పురుష దేవతా విగ్రహాల్ని గానీ, శూలాల్ని, ఇతర ఆయుధాల్ని గానీ తయారుచేయడానికి ఈ వృక్షం పనికి వస్తుంది."

"బాగుంది—దీనికి ఒక గుర్తు పెడతాను." అంటూ ఆమె అతని చేతిలోని శిలాఖండాన్ని తీసుకుని ఆ చెట్టుకు ఎదురుగావున్న ఒక శిలమీద 'శౌర' అని చెక్కింది.

"ఇక స్త్రీ వృక్షాన్ని చూపించు."

మీ జాతి వృక్షాన్ని నువ్వు గుర్తించు చూద్దాం."

"గుర్తించలేనా?"

"అది నే నడలేదే."

"గుర్తిస్తాను చూడు." అంటూ ఆమె ఆ పరిసరాలంతా తిరిగింది. ముళ్ళకంపలు చీరుకుని వాళ్ళ చేతులకు, కాళ్ళకు ఎర్రటి గీతలు పడ్డాయి. ఆత్మీయతతో ఆ అరణ్యం వాళ్ళకు కెంపుల కంకణాల్నీ ఒంపుల కడియాల్నీ తొడిగినట్టుంది. తిరిగి తిరిగి ఆమె ఒక వృక్షం ముందు ఆగింది. సౌరాఖ్యుడిలో పట్టరాని సంతోషం ఏర్పడింది. అతను ఏమాత్రం బయటకు ఆ చిహ్నాలు కన్పించకుండా గంభీరంగా చూస్తున్నాడు.

"ఇది స్త్రీ వృక్షం" అంది—అతని ముఖ కవళికల్ని పరిశీలిస్తూ.

"ప్రవాళా!" ఆ శిల్పి పురివిప్పుతున్న పింఛంలా తన బాహువుల్ని విశాలంగా సాచి కౌగిలిలోకి ఆమెను ఆహ్వానించాడు.

"సౌరా!" ఆమె దాన్నొక మహా సత్కారంలా భావించింది. అతని కౌగిలిలో కాసేపు సేదదేరింది

"ఎలా కనిపెట్టావీ వృక్షాన్ని?"

"నువు చూపిన పురుష వృక్ష లక్షణాలకు పూర్తి విరుద్ధంగా వున్న లక్షణాలు కలది స్త్రీ వృక్షం అనుకుని నిర్ధారించుకున్నాను."

"నిన్ను ప్రశంసించకుండా వుండలేను. అంత గట్టిగా కాకుండా సారంగల భూమిలో పెరిగిన వృక్షమిది. మరీ మృదువుగా లేకుండా మధ్యస్థంగా వుండాలి దాని కఱ్ఱ. దాని మొదలు నుంచి కొనవరకూ క్రమంగా

సన్నబడుతూ పెరగాలి. బాగా తడివున్న కర్రతో ఎదిగి పుష్పం, ఫలం, ఆకులు మృదువుగా వుంటూ ఇది ఎక్కువ చమురు, నీరు కలిగివున్న వృక్షం. స్త్రీ దేవతల విగ్రహాలకు, శూలాది ఆయుధ విశేషాలకు అర్హమైంది." ఆమెను అభినందించాడు.

"సరే—ఇక్కడ నేను మూడక్షరాల్ని చెక్కుతాను." నిముషాల్లో శిలమీద అతను లిఖించిన అక్షరాల్ని చూసుకుంది. ఆమె చెక్కిళ్ళు ఎరుపెక్కాయి.

"ఇది నపుంసక వృక్షం కదూ!"

"రా చూపిస్తాను—ఇది దీని మొదలు సన్నబడిపోయిందా? పళ్ళు పుష్పాలు దుర్బలాలై రాలిపోతున్నాయి. ఇది ప్రకృతిలో తృతీయ ప్రకృతికి చెందిన విషయం."

"పాపం" జాలిగా దాన్ని తాకి చూపింది.

"సౌరా! శిలల్లోలాగే వృక్షాలు కూడా పరిహరించబడిన వృక్షలున్నాయా?"

"తమ రంగులు మారిపోయిన వృక్షాలు, కొనలు లేనివి, రాలినవి, కొమ్మలు లేనివి, పరతబడి పెరిగినవి, క్రిందపడిపోయిన వృక్షాలు, పిడుగు పడి దెబ్బతిన్నవి. పొదలచేత, పుట్టలచేత. పాములచేత ఆవరించబడినవి, సన్యాసుల ఆశ్రయం కల్పించుకుని వున్నవి, శివాలయాలలోవి, కర్మకారుల ఇళ్ళలోవి, అగ్నిచేత దహించబడినవి అయిన వృక్షాల్ని మనం పరిహరించాల్సి వుంటుంది. చందనం, ఎర్ర చందనం, టేకు, సంపెంగ చెట్లు, నల్లతుమ్మ హేమశీర్షం, మద్దిచెట్టు, శింశుపం, మధూకం, క్రముకం; పద్మజం, రాజాతనం, కుంకుమం, సప్తవర్ణం ఇలాంటి వృక్షాలు దేవకార్యాలకు పనికివస్తాయని శిల్పశాస్త్రం చెబుతోంది."

"నిజంగా ఈ శిల్పాచార్యులకెంత పరిశీలనాత్మక దృక్పథం వుందో! శిలల్నేగాక వృక్షాల్ని అధ్యయనం చేశారు వీళ్ళు."

"సరే....ఇక ఇంటికి వెళదాం. చాలా సమయమైంది."

"మరి ఇక్కడికెప్పుడొద్దాం మళ్ళీ."

"శ్రేష్ఠమైన నక్షత్రంలో, శుక్లపక్షం వస్తున్న వారాన్ని చూసుకుని ఓ మందిరోత్సవ శిల్పాచార్యులు, శిల్పి ఆలయ దర్శకర్తలు ఈ వృక్షాల దగ్గరకు రావాలని నిశ్చయం."

"మరి నేనో."

"నువ్వు లేకుండా నేనెలా వస్తాను!"

ప్రవాళ తన హృదయ గంధాన్ని, తనూగంధాన్ని అతని ఎదకు హత్తుకునేలాగా ఒక ప్రగాఢ పరిష్వంగాన్ని అతనికి ప్రసాదించి అతన్ని సమ్మానించింది.

° ° °

శిలాపరీక్ష పరిపూర్తి అయిన తర్వాత ప్రధాన స్థపతిని ఆహ్వానించి సౌరాఖ్యుడు ప్రవాళతో కలసి బయలుదేరాడు. అతని శ్వేతవస్త్రాలు గాలికి ఎగసి పడుతూ అతని ఆకార రేఖకు హారతులెత్తుతున్నాయి. అతని తనూ విగ్రహం శ్వేతచందన చర్చిత అర్చిత దేవబింబంలా పరిమళిస్తూంది. సానువుమీద శ్వేత జలదాలు మాలకట్టినట్టు అతని వక్షం మీద శిల్లితి పూదండ ఒకటి అమరి వుంది. గోపురం మీద అక్కడక్కడా దీపకళికలు ప్రకాశిస్తున్నట్టు అతని ఉన్నతమైన మూర్తి పంచాంగ భూషణాలతో కాంతులీనుతూంది.

"సౌరా! శిలా పరిచ్ఛేదానికి ఇలా వెళుతున్న నిన్ను చూస్తుంటే...."

"ఏమనిపిస్తూంది?"

"దేవ ప్రతినిధి ఎవరో భూమిపైకి దిగినట్టుంది." అంది.

"అది నీ చూపుతున్న సంస్కారం."

"శిలా సంగ్రహణానికి వెళ్ళేటప్పుడు శకునాల్ని గమనించాలి అన్నావుగా. ఆ శకునాలు ఏమిటో చెప్పవూ" అతను పరిసరాలకేసి, ఆకాశానికేసి చూస్తూండడంతో అడిగిందామె.

"వాటినే గమనిస్తున్నాను" అంటూన్న అతని పాదాలకు దారిలోని ముళ్లూ రాళ్లూ తగలకుండా జాగ్రత్తపడుతూందామె. అలా వాళ్ళు ఎగుడు దిగుడు దారి వెంబడి శిల్పార్హమైన శిలయున్న ప్రదేశం వేపు నడక సాగించారు.

"చూడు ప్రవాళా! అలా డేగ కుడినుంచి ఎడమవేపుకు ఎగిరి పోవడం, కాకి ఎడమనుంచి కుడివేపుకు ఎగిరిపోవడం మంచి శకునం. ఇలా ఆలమంద ఎదురుపడడం శుభ నిమిత్తం. పాలచుత్తలతో, నీళ్ళ కడవలతో, చల్లకుండలతో పల్లెపడతులు కనిపించడం, బిడ్డను ఎత్తుకున్న ముత్తైదువ రావడం, పొలంలో పనిచేసే వాళ్ళకోసం గానీ, మరెందుకోసం నీ అన్నం తీసుకెళ్లే అన్నపూర్ణల్లా అంగనలు తారసపడటం, అందమైన వేశ్యాంగనలు, కన్నెలు కనుల పడడం శుభసూచకాలని కాశ్యపుడే కాకుండా ఇతర శిల్ప శాస్త్రకారులు కూడా అంగీకరించారు. రాత్రిపూట అయితే దారిలో అగ్నిగానీ, దీపంగానీ కనిపించడం ఉత్తమం."

"అశుభ నిమిత్తాలేమైనా వున్నాయా?"

"శిల్పులు శిలల కోసం వెళ్లేటప్పుడు పరిసరాల్లో ఒకవైపు తగలబడ కూడదు. ప్రళయ పవనాల్లాగా గాలి వానలు రాకూడదు. తిత్తిరిపిట్ట, గూబ మనపైన ఎగురుతూ అరవకూడదు. తలకు నూనె అంటుకున్నవాళ్ళు, దిగంబరంగా తిరిగేవాళ్ళు, కావిరంగు బట్టలు కట్టుకున్నవాళ్ళు, ఖాళీకుండల్ని గానీ, నూనె కుండల్ని గానీ ఎత్తుకున్నవాళ్ళు, వికలాంగులు కానీ, అతి

నిశకులు గానీ ఎదురవకకూడ దంటున్నాయి శాస్త్రాలు. రాత్రులలో అయితే ఆకాశం నుంచి ఉల్కలు రాలకూడదు."

"అలాగా" ప్రవాశతో పాటు సౌరాఖ్యుని వెంట నడుస్తున్న యువ శిల్పుల కూడా అలాంటి నిమిత్తాలేవైనా కనిపిస్తున్నాయేమోనని పరికించ సాగారు. వాళ్ళు నేతిచెంబులు, నానావిధ మధుర పదార్థాలు. సమిధలు మోసు కుని వస్తున్నారు.

"ఇలా ప్రాణికోటి సంచార శుభాశుభ దర్శనాల్లో అశుభాలు మనకు తెలియకనే ఎదురై వుండవచ్చు కాబట్టి మనం అశుభదోష పరిహారార్థం ముందు జాగ్రత్తతో అగ్న్యాధానం చేయవలసి వుంది. ఆచార్యుడు, శిల్పి తనవారితో కలసి కొండల్లో నుంచి, మహానదులు మహాక్షేత్రాలు, అడవులు వాటి పరిసరాల నుంచి శిలల్ని సేకరించేటపుడు అనుసరించే పద్ధతి ఇది" ఇలా ముచ్చటించుకుంటూ వాళ్ళు ఆ ప్రాంతాన్ని చేరుకున్నారు.

"ఈ పాలుగారే వృక్షాలు, ఇలాంటి లతలు వున్న ప్రదేశంలోని శిలలు శిల్పయోగ్యాలు" అంటూ సౌరాఖ్యుడు ఆ ప్రాంతంలో అగ్న్యాధానా నికి ఏర్పాట్లు చేశాడు. అంతలో ప్రధాన స్థపతి సూత్రగ్రాహి, వర్ధకులతో పాటు ఆ ప్రాంతాన్ని చేరుకున్నాడు. పరిసర జలాశయంలో సంధ్యవార్చు కుని వచ్చి ఆయన అగ్నికార్యానికి ఉపక్రమించాడు.

ఏతద్వృక్షాశ్రితా దేవాః దానవాశ్చ పిశాచకాః

నాగా గరుడ గంధర్వాః సిద్ధవిద్యాధరాశ్చయే—

అంటూ ఒక ఇసుక వేదికమీద నుంచి వెలుగుతున్న అగ్నిహోత్రానికి నేతిని, అన్నాన్ని హోమం చేస్తున్న అమర పరిమళం ఆ ప్రాంతమంతా పరివ్యాపిస్తూంది.

ఖండించబోతున్న వృక్షాల క్రింద శుభ్రం చేసి శూలాలు నేలలోకి దించివున్నారు. ఆ శూలాల క్రింద యంత్రాలను గీసివున్నారు.

'ఈ వృక్షాన్ని ఆశ్రయించుకుని వున్న దేవతలు కానీ, దానవులు కానీ, పిశాచాలు కానీ, నాగ గరుడ గంధర్వ సిద్ధ విద్యాధరులు దయతో వెళ్ళిపోదురుగాక!' అంటూ సౌరాఖ్యుడు మంత్ర సంకల్పం చేస్తున్నాడు.

'మేము దేవళించాని దేవకార్యాల కోసం ఈ వృక్షాన్ని తరలించుకు పోదలచాము, మీ అనుమతిని కోరుతున్నాము' ఇలా శిల్పాచార్యుడు సమిధలు, నెయ్యి, అన్నం లాంటి ఒక్కొక్క హోమద్రవ్యంతో 108 సార్లు ఆహుతులు సమర్పిస్తున్నాడు, దధ్యోదనం బలిపిండాలుగా వుంచుతూ దానిపైన పుష్పంతో ఎర్ర చందనం నీళ్ళు వదులుతూన్నాడు. చెట్టుకు ఈశాన్యంగా హోమం ప్రచలితమవుతూంది.

ఆ తర్వాత అగ్నిని ఉద్వాసనం చేసి శివోదకాలను 'శివాత్మకం' అనే మంత్రంతో ఆచార్యుడు చెట్టుమీద చల్లుతున్నాడు

ఆ వృక్షాన్ని ఛేదించాక చెట్టు నుంచి పాలు రావడంతో శుభసూచకంగా వారందరూ సంతోషించారు. వృక్షమూలం తూర్పుగా, దాని కొనలు పడమరగా పడటంతో అది కూడా శాస్త్ర ప్రకారం శుభసూచకమే అయింది. చెట్టుకున్న లావుపాటి కొమ్మల్ని శ్రామికులు ఛేదిస్తున్నారు. ఆ చెట్టును ఆవుపాలతో, గంధోదకంతో కడిగి చందనం పూసి పుష్పమాలలతో అలంకరించారు. అలంకరించిన ఒక శకటంమీదకు ఆ వృక్షాన్ని చేర్చి ఆలయం ప్రక్కన వున్న నిర్మాణ స్థలానికి చేర్చారు. ఆ మండపాన్ని పరిశుభ్రంగా అలికివుంచారు. పిండి ముగ్గులతో అలంకరించారు. నాలుగు అంగుళాల ఎత్తులో సమ చతురంగా ఇసుకతో అమర్చబడి వున్న వేదికమీద ఆ వృక్షాన్ని తూర్పువైపుకు అగ్రభాగం వచ్చేలాగా దించారక్కడ. నెల రోజులు అలా నీడలో ఎండితేనే అది దేవకార్యానికి పనికివస్తుంది.

•  •  •

'ఓం నమశ్శివాయ స్వాహా' అంటూ ఆయన జ్వలిస్తున్న హోమ శిలకు నూటఎనిమిదిమార్లు ఆహుతులు అర్పించి మహానై వేద్యం పెట్టిన మధుర పదార్థాల్ని అందరికీ పంచిపెట్టాడు.

"నాయనా సౌరాఖ్యా! వయోభారంవల్ల నేను ఈ పనిని నీకు అప్పగిస్తు న్నాను. శుభారంభం కావించు" అంటూ శ్రామికులు భూతలాన్ని త్రవ్వి లోపల శయనించి వున్న శిలను గుర్తించిన చోటికి తీసుకుని వెళ్ళా డాయన.

సౌరాఖ్యుడు సమాహితచిత్తుడై ఆయుధాల్ని స్వీకరించి శిల పడుకుని వున్న ప్రదేశానికి వెళ్ళి ఆ శిలను ఏకాగ్రతతో పరిశీలించాడు. ఆ శిలకు ముమ్మారు ప్రదక్షిణం చేశాడు. తరువాత క్షీరధారలతో ఆ శిలను సంస్క రించాడు. దాని పరిమాణ కోణాల్ని గమనిస్తూ ఆ శిలను ఖండించడానికి సౌరాఖ్యుడు సమాయత్తమయ్యాడు. ఆ ప్రాంతమంతా శిలాఖండన సవ్వడితో ప్రతిధ్వనిస్తూంది. ఆ శిలలోపల శ్రీ ఫలాల్ని చేతబట్టుకుని వరప్రసాదానికి సిద్ధంగా వున్న దేవతల్ని అతను దర్శిస్తున్నాడు. ఆ శిలలోపల కర్ణికల చుట్టూ శిలాదళాలతో పద్మాలు విచ్చుకుంటున్నట్టు, పీఠాలు ఉపపీఠాలు వెలుస్తున్నట్టు, వాటి పై భాగాన మహాపీఠాలు విలుస్తున్నట్టు, నాదం లింగాకారమై పీఠమైన బిందువు మీద వెలసినట్టు అతను భావిస్తున్నాడు.

అలా అతను శ్రామిక శిల్పుల సహాయంతో ఆ శిలను పెనుశిల నుంచి వేరుచేశాడు. చంటిబిడ్డను తల్లి నుంచి లాగినట్టు భావించాడతను.

"అయ్యా! ఈ శిలకు శిరస్సు తూర్పువైపున వుంది. మొదలు అంటే పాదభాగం పడమర దిశగా వుంది. ఆ శిల క్రింది భాగాన్ని, పై భాగాన్ని కూడా గుర్తించండి. బాగా గుర్తుపట్టేలాగా చిహ్నముద్రితం చేయండి." ఆ శిలను ఉద్ధరిస్తున్న శిల్పులవేపు చూస్తూ సౌరాఖ్యుడు మంత్రోచ్చారణ చేస్తు న్నాడు. ఉద్వాసన మంత్రం పూర్తి అయిన వెనుక ఆ శిలను శకటంమీదకు

ఎక్కించారు. ప్రధాన స్థపతి, సౌరాఖ్యుడు, ప్రవాళ ముందు నడుస్తున్నారు శిల్పులు వ్యస్తి వచనాలు, శాంతిమంత్రాలు చెప్పుకుంటూ వాళ్ళను అనుసరిస్తున్నారు.

"ఆలయానికి ఉత్తరభాగంలో ఆ శిలారాజాన్ని దించండి ఈశాన్య దిశగా శాంతి హోమానికి ఏర్పాటు చేయండి" ప్రధాన స్థపతి సూచించారు.

సౌరాఖ్యుడు ఆ శిలకు ఆవుపాలతో, పెరుగుతో, నేతితో శుద్ధ స్నానం చేయించారు. మంచి గంధంతో, సువాసన పెదజల్లే సుమాలతో పూజించారు. ఒక్కో దేవనామంతో నూరుమార్లు వ్రేల్చుతూ శాంతి హోమాన్ని నిర్వర్తించారు.

"ఈ శిలను పగలగొట్టే సందర్భంలో...." అంటూ ప్రధాన స్థపతి సౌరాఖ్యునివైపు తిరిగిచూశారు.

"శస్త్ర మంత్రంతో పూజించాల్సి వుంది."

ప్రశంశాపూర్వకంగా చూశాడాయన.

"ఆర్యా! శిల్పాల్ని, స్తంభాల్ని గట్టిగా ఆధారపీఠానికి అతికేటట్లు చేసే అష్టబంధన ద్రవ్యానికి వాడే పదార్థాల కొలతలు దయతో గుర్తు చేస్తారా" సౌరాఖ్యుని శిష్యులు ప్రశ్నించారు.

"కావిరంగు — 7½ తులం
నున్నపురాయి పొడి — 25½ తులాలు
కుంగిలాయం — 3 తులాలు
చెంబంజి — 1 తులం
కొంబరక్కు — 3¾ తులాలు
జాదిలింగం — 7½ తులం
తెల్ల మైనం — 3¾ తులం
గేదె వెన్న — 7½ + 7½ తులాలు

అష్టబంధనంలో మైనం అంటే తేనె పూర్తిగా లేని తెల్లని తేనెపట్టు, సున్నపురాళ్ళు తెచ్చి పొడిగా చేసి ఇసుకగిన్నెలో వేయించాలి. ఉప్పులా పగిలిందంటే పనికిరాదు. పగలక ఇసుకలా వుంటే అది పనికి వస్తుంది.

పై ఏడు వస్తువుల మిశ్రమాన్ని త్రాసుతో తూచి 20 సమ భాగాలుగా వుంచుకోవాలి. ఒక్కొక్క భాగం 68 తులాల బరువుంటుంది. 20 మట్టి పాత్రల్లో వీటిని వేరు వేరుగా వుంచుకోవాలి.

గట్టిగా నాటిన వెదురుబొంగులకు రెండు కొయ్య రోళ్ళను రెండు వైపులా కదలకుండా కట్టివేయాలి. ఒక్కొక్క భాగానికి వెన్న చేర్చుతూ అర్ధ అర్ధగంట దంచాలి. అలా ఎనిమిదిపార్లు దంచాలి. చివరగా ఒకమారు దంచి ఆ వేడి తగ్గక ముందే ఆ పదార్థాన్ని తాడులాగా పేనుకుని వస్తూ అష్టబంధనం చేయాలి. ఇలా దంచి నిల్వచేసిన ఈ పదార్థం ఆరునెలల వరకు పదును చెడదు.

అష్టబంధనం అంటే శిల్పి దృష్టిలో విగ్రహానికి చుట్టూ వున్న 8 దిక్కులందు బంధనం చేయడం అన్నమాట. తూర్పు దిశలో విగ్రహ పీఠానికి సరిగా బంధనం చేయకపోతే జీవరాశులు నాశనమవుతాయి. ఆగ్నేయ దిశలో సరిగా బంధనం లేకపోతే గోవులు క్షీణిస్తాయి. పశ్చిమాన లేకపోతే ప్రజలు బాధపడతారు. వాయవ్యంలో లేకపోతే రాజూరాజ్యం, ఉత్తరాన లేక పోతే పైరుపంటలు, ఈశాన్యంలో లేకపోతే వాస్తునాశనం జరుగుతాయి. అష్టబంధం అన్ని దిక్కుల్లో గట్టిగా వుంటే శుభం.

ఇక ప్రతిమాపద ప్రతిష్ఠను గురించి—గర్భగృహానికి లోపల సోమ సూత్రానికి ముందున్న పది పదాలను వదలి వెనుకనున్న పది పదాలతో పూజా ప్రతిమల్ని ప్రతిష్ఠించాలి. బ్రహ్మసూత్రం, సోమసూత్రం కలిసే చోట మధ్యగా శివలింగ ప్రతిష్ఠ జరుగుతుంది" చిరునవ్వుతో సమాధానం చెప్పారు సౌరాఖ్యుడు.

"ఆర్యా! వాస్తుకట్టడాల్లో ఒక్కో అంతస్థు ఒక్కో జంతువు ఆకారంతో వాస్తు శిల్పులు మునుపు కట్టారట నిజమేనా?" సౌరాఖ్యుడు శిల్పాగమ శాస్త్రాల్ని క్షుణ్ణంగా చదువుకున్నాడని వాళ్ళకు తెలుసు.

"నాగార్జున కొండలో ఒకప్పుడు 500 గదులున్న 5 అంతస్థుల భవనం వుండేది. మొదటి అంతస్థు ఏనుగు ఆకారంతో, రెండవ అంతస్థు సింహాకారంతో, మూడవ అంతస్థు గుర్రం ఆకారంతో, నాల్గవ అంతస్థు ఎద్దు ఆకారంతో, ఐదవ అ.తస్థు పావురం ఆకారంతో వుండేదట."

"ఊరేగింపుకు తేలికగా వుండాలంటే విగ్రహాల్ని ఏ కర్రతో చేస్తే బాగుంటుంది?"

"పొణిక కర్రతో చేసే దారు విగ్రహాలు తేలికగా వుండి వూరేగింపుకు బాగా పనికివస్తాయి."

"శిల్పాచార్యా! అపామార్గ పత్రాన్ని గురించి వివరిస్తానని ఒకసారి అన్నారు. ఇప్పుడు చెబుతారా?"

"అపామార్గ పత్రం అంటే 'ఉత్తరేణి ఆకు'. ఈ అపామార్గ పత్రాలతో, పుష్పాలతో ఒక తైలాన్ని తయారుచేస్తారు. నేను ఆ రోజు ఒక శిలకు పూసానే ఒక ద్రవం అది ఆ ఆకు పసరే."

"ఆచార్యా! దాన్ని పూశాక ఆ రాతిమీద ఉలి బాగా విరిచి కదలాడింది."

"అంతేకాదు ఉత్తరేణి పసరు లేపనాన్ని రాతి పైభాగానికి దట్టంగా పట్టించి మూడురోజులుంచితే ఆ కఠినశిల ఉలికి సుతిమెత్తగా లొంగుతుంది. చెక్కిన శిల్పాలకు దీన్ని పూస్తే కూడా నునుపుదనం వస్తుంది."

"పంచబేరాల్లో ధ్రువ బేర అంటే—"

"మూల విరాట్టును ధ్రువబేర అంటారు. బేర అంటే 'మూర్తి' అని అర్థం. కౌతుక బేర అంటే తామ్రాది లోహమూర్తులు. ఇవి స్వామివారి

ప్రక్కన వుంటాయి. ఉత్సవ బేర అంటే ఊరేగింపులకు వినియోగించే విగ్రహం. స్నపన బేర అంటే నిత్యనైమిత్తిక కార్యకలాపాలు, అభిషేకాదులు చేసే మూర్తి. బలి బేర అంటే ఆలయాల్లో, గ్రామాల్లో చేసే బలి పిండాదుల్ని ప్రదానం చేసే విగ్రహం— అది సరేగానీ మన ఆలయానికి కావలసిన పూజాలోహ సామగ్రిని సరిచేసి పెట్టారా?" శిల్పుల్ని ప్రశ్నించాడు.

"మీరు చెప్పినట్టే అర్చాగంట, దీపారాధన, ప్రమిదలు, తీర్థపాత్రలు, ఉద్ధరిణి, శఠారి, తులసికి కర్పూరానికి హారతిపళ్ళెం, అర్చనానంతరం విసరడానికి వింజామరలు, ఉత్సవంలో వేంచేపు చేసి ఊరేగించే పల్లకీలు, శ్వేతఛత్రాలు ఇత్యాదుల్ని సమకూర్చాము" సౌరాఖ్యుని ప్రశంసా దృక్కులు వాళ్ళను సంతోషపరచాయి.

"ఆర్యా! మీరు చెప్పింది సత్యం. అర్ధరాత్రివేళ విశ్రాముద్రలో వున్న పెనుశిలల్ని ఆలయం మీదకు లేపినపుడు అవి మునుపటికంటే తేలికగా అనిపించాయి "

"ఆ గడియను పసికట్టే మునుపటి శిల్పాచార్యులు అంతంత పెద్ద శిలా ఖండాల్ని గుడుల మీదకు లేపారు" సౌరాఖ్యునిలో ఒక విధమైన ఉత్తేజం కనిపిస్తోంది.

"నాసికా ప్రతిమలంటే సౌందర్యవతులైన స్త్రీ శిల్పాలే, వీటినే మదనికా మూర్తులు అని కూడా అంటారు." వాళ్ళ సందేహాల్ని తీర్చాడు. ఇలా శిల్పశాస్త్ర చర్చలతో దారి సునాయాసంగా గడిచిపోయింది. వాళ్ళు ఆలయ ప్రాంతాన్ని చేరుకున్నారు.

* * *

పున్నమి వెన్నెల వెల్లువలెత్తుతోంది. ప్రవాళ హృదయం విర్భరానందంతో లేడిపిల్లలా గంతులు వేస్తూంది. ఆలయ పరిసరాల్లోని వనారణ్యం ఆమెను ఈ జనారణ్యానికి దూరంగా రమ్మని ఆహ్వానిస్తూంది.

"సారా!" ఆమె కంఠం మత్తుగా పలికింది.

"వెన్నెలలో ఈది రావాలని వుందా?" ఆమె మనసును పసిగట్టాడతను.

"అవును - అలా - ఆ దట్టమైన వృక్షాలు తమ మనోభావ చిత్రాల్ని నేలమీద నీడలుగా రచిస్తున్నచోట - తమ పూల భావాల పుప్పొళ్ళు గుట్టు గుప్పిళ్ళు విప్పుకోడానికి మనల్ని రమ్మని అలా మూగగా ఆహ్వానిస్తున్నాయి చూడు" అతని చేతిని అంది పుచ్చుకుని చిన్నగా పరుగు తీసిందామె. ఇద్దరూ ఇసుక తీరంలోని పసిపిల్లల్లా ఆ చిట్టడవిలోకెళ్ళి అందమైన ఒక శిలాశాసనం మీద ఒడిగి కూర్చున్నారు.

"వసంతం ప్రాప్తించిన వన ప్రాంతంలా శోభస్కరంగా వున్నావు నువ్వు" అందాలు చివురులు తొడిగినట్లున్న ఆమెను చూస్తూ అన్నాడు.

"అది ఈ మాంత్రికుడి మంత్రం.

"ఈ తాంత్రికురాలి తంత్రం కాదా."

"మంత్రమో తంత్రమో కుతంత్రం మాత్రం కాదు." ఆమె చమత్కరించినప్పుడంతా అతనొక ప్రణయచేష్టతో సత్కరిస్తుంటాడు.

"నాభవంతుల నమకంలా, చంద్ర ముఖుల చమకంలా సంస్కార చమత్కార సీత్కార సంపన్నంగా వుంది మీతోటి ప్రణయం." అన్నాడు.

వాగ్మినుల పరస్పర జిగీషా వాంఛల్లాంటి ఊహా చిత్రాలు ఇరువురి మానసాల్లో మథనపడుతున్నాయి. బాహువు చాచినంత దూర దూరంగా యజ్ఞభూమిలో నిలిపిన (మారేడు, చంద్ర, మోదుగ, దేవదారు) యూప స్తంభాల్లాంటి దృఢ సంకల్పాలు వాళ్ళ మనోభూమికల్లో పాతుకుని నిలబడ్డాయి. పుష్పగంధ భూషితంగా, శిల్ప విన్యాసశోభితంగా, వస్త్రాలంకృత భాసితంగా వున్న యూప స్తంభాల్లాంటి ఋషులు దీప్తులు చల్లుతూ ఆకసం నుంచి నేలమీదకు దిగి ఇరువురికీ వరాల వరమాలలు తెచ్చి ఇస్తున్నట్టు ఉప్పొంగి పోతున్నారు వాళ్ళు.

అశ్వమేధయాగంలోని అశ్వానికి ప్రదక్షిణంగా అప్రదక్షిణంగా తిరుగుతూ మూడు బంగారు సూదులతో ఆ గుర్రానికి గాట్లు పెట్టే పట్ట మహిషిలాంటి బాంధవ భావమొకటి అతని హృదయాశ్వాన్ని అందంగా గాయపరుస్తూంది.

అలాగే ఆమెలోని రాజపత్నీ నైష్ఠికత క్షణం మేల్కొంది. అశ్వమేధంలో వధించబడిన గుర్రంతో కూడి రాత్రిని గడుపుతున్న మహారాణి లోలోపలి అయిష్టతను అధిగమించి శుభాన్ని కామించి కళ్ళు మూసుకుని పడుకున్న అనుభవాన్ని ఆమెలోని పురాతన రక్తం తోడి చూపింది. విశసనం కోసం యాగభూమిలోని స్తంభాలకు కట్టబడిన జలచర వాయుచరాల (తాబేళ్ళు, పక్షులు) లాంటి అభిజాత్య భావాలు ఆమెలో కొంతసేపు టపటపా కొట్టుకున్నాయి.

ఇద్దరూ ఆ అనుభవాల్ని క్షణంలో అతిక్రమించి ప్రేమగమ్యం వైపు ఉపక్రమించ సాగారు. అమర ప్రేమ యజ్ఞానికి విఘ్నం కల్పించే రాక్షస భావాలు మేలి ముసుగులు ధరించి శ్రేయోభిలాషుల్లా వచ్చిపోవడం వారు గమనిస్తూనే వున్నారు.

"విత్తం చేతలేని పురుష సత్తముని స్థితిలాంటి దశనుంచి మనం ముందుకు నడువవలసి వుంది. దీన పండితుని చేతిలో రాజు దానం చేసిన చేతి కడియం లాంటి ప్రణయ భావనను పట్టుకుని ప్రేమికులు సాగిపోవలసి వుంటుంది." సౌరాఖ్యుడు క్రాంతదర్శిలా తమ స్థితిని అంచనా వేసుకుని ఆమెకు ఆత్మ స్థైర్యాన్ని నూరిపోశాడు. జంబూ ద్వీపంలోని జంబూ నదీ స్నానం చేసినట్టు వాళ్ళ మానసాలు సువర్ణ భావ దీధితులతో ప్రకాశించాయి. వాళ్ళ చూపులు సుమనమాహితమయ్యాయి. దానితో విఘ్నాల గర్వ గ్రంథులు ద్రవీభవించాయి. పరమ కారుణికుని దృక్కుల్లాంటి ప్రణయ ఉదయ కిరణాలు వాళ్ళలోకి ప్రసరించసాగాయి. ఆ కాంతుల్లో వాళ్ళకు

జగత్పతి పీతాంబర దళదళలు తెలియవస్తున్నాయి. దశ తిరిగిన త్రిదశ పుంగవుడిలా సర్వలోక నమస్కృతుడుగా, ధర్మ సంహితుడుగా అతనామెకు కనిపించాడు. ఇతనితోటి సాంగత్యం కన్నా కన్నెతనానికి ఏ దివ్యత్వంతోటి అగత్యం లేదు—అనుకుందామె పలానా అని చెప్పలేని పద్మ పలాశాక్షుని చూపులోని భావం ఒకటి అతని నవ్వులో తళుక్కుమందామెకు. లక్షల శుభలక్షణాలు అతన్ని ఆవరించి వున్నాయి. అతని మాటలామెకు దివ్య పాయస సంపూర్ణ పాత్రికల్లా వుంటాయి. పావక సమ ప్రకాశంతో వెలిగే ఒక ఆంతరతేజం అతనిలో వుంది. ఏ దివ్యాగ్ని రూపోపాసనతోనో తప్ప లభించని ఆవరణమది.

"సౌగా! మన మెందుకిలా అజ్ఞాతవాసం చేయాలి? నువ్వు చేసిన తప్పేముంది? నువ్వు అజాతశత్రుడివే కాదు జాయమాన శత్రువు కూడా లేనివాడివి. మాయామయ రాయబారుల్లాంటి ఆలోచనలతో మనం నైతిక శక్తిని కోల్పోకూడదు."

అతను ఆమె ఒడిలో పడుకుని ఆమె ప్రబోధాన్ని శ్రద్ధగా వింటున్నాడు. ఇలా ధైర్యం చెప్పగలవాళ్ళు లేకనే ఎప్పుడో పలాయితుడై పరాజితుడై పరాభూతుడై పశ్చాత్తప్తుడైన ఒక పురాకృత కృత్యానికి సంబంధించిన వాసనలు అతన్ని ఆవహించి విలవిలలాడిపోతేశాయి. ఆమె అతన్ని పొదివి పట్టుకుంది. వెన్ను నిమిరి వెన్నెల కన్నులతో అతనిలోకి తురిపి గతంలోని అతని వెలుతుర్ని వెలుతురుతో నింపి వెతలు నిలిపిన షుల్ని నవరించి రసవంతం చేసింది. దానితో కోలుకున్నాడతను—మేలు మలుకున్నా డతను.

"సౌగా! నీ ప్రేమ ఆరోగ్య వర్ధక ఔషధి. అది దేవకల్పిత క్షీర ధార. ఎన్ని జన్మలో తపిస్తే తప్ప ఆ కామేష్టి అగ్నినుంచి దేవదత్తమైన హిరణ్మయ పాత్రికలాంటి హృదయం లభించదు. ఎంతో తపన పడితే తప్ప

యజ్ఞపురుషుడు ఆ హృత్పాత్రికను ప్రేమ పరమాన్నంతో నింపడు.

నీ స్పర్శతోనే నా అంతరంగ అంతఃపురాకాశంలో అమృత కలశం లాంటి శరద్రాత్రి చంద్రబింబం ఆవిర్భవించింది. అది హర్ష రశ్మి సంపన్న మవుతూ వుంది. నీతోటి ప్రణయ సంబంధ అనుభూతి కూడా తలపుల్లో ఉత్తమ పాయసాల్ని ఉప్పతిల్ల జేస్తున్నాయి. కృశోదరులైన విద్యాధర కన్యల్లాంటి విద్యలెన్నో నీ పరిచయ భాగ్యంతోటే నాతో నేస్తం కట్టాయి.

వనచరుల దినచర్యలు మనకు ఆదర్శం కావు. ఆకాశం జపాకుసుమ సంకాశంగా కనిపించే బ్రాహ్మీ ముహూర్తంలో అందాల గంధమాదన శిఖరాల మీది చందన వృక్షశాఖలలో కూజించే భరద్వాజ పక్షి పక్షం వహించే కళాత్మక యోగి మానసం మనకు ఆదరణీయం కావాలి" అంటూ ఆమె అతన్ని ఆపాదమస్తకం ఆదరించి అనునయించింది.

"ప్రవాళా! నీ ఎద ఔన్నత్యాల్ని ఆశ్రయించి విశ్రమించిన శుభ వేళ రూపద్రవిణ సంపన్నలైన దేవకన్యల కాళ్ళ కడియాలు పలికే కవితలు వినిపించాయి నాకు. వాళ్ళ కోలకళ్ళు జరుపుతున్న శిల్పకళా సమ్మేళనాల్లో సన్మానితుడనైన అనుభూతి ఆవరించింది నన్ను. ప్రకృతి యుగాల కొద్ది పడిగాపులు పడి సాధించుకున్న అమర భావన ప్రేమ. ఆ దివ్య హిరణ్మయ ద్రవదర్శనం జరిగాక వజ్ర సంహనన సంకల్పాలు కూడ ఎవర్ని వదులు కోవలసిందే. మేరు మందర ధీర సుందర హృదయులు తప్ప అందుకోలేని అవధులున్న అమర భావన ప్రేమ. ప్రేమికుల హృదయాల్లో పరితృప్తి అయిన సంద్రంలోలా ప్రణయ శైలేంద్రాలెన్నో దాగి వుంటాయి. శతం శత సహస్రాల కామరూపాలు మన మనో నక్షత్రాలలో భ్రమాజనిత దీపాల్ని వెలిగించుకుంటూ పోతూ వుంటాయి. ఆందోళిత హృదయంతో ప్రేమికుడు ఆలోచించి అర్థం చేసుకునేవేవీ వుండవు. ఏది భ్రమో ఏది ప్రేమో అతనికి తెలియాలంటే స్థిత ప్రజ్ఞత అలవడాలి. మన మానసాలు

చైత్ర మాసాలు కావాలి. మన అడుగులు పుష్యమీ నక్షత్రాలు కావాలి. మన ఆలోచనలు నవమి తిథి పుణ్య గడియలు కావాలి. మన కర్తవ్యాలు దివ్య శిశువులుగా జన్మించాలి. మనం అడుగు వేసి తీసిన స్థలంలో స్థలపద్మాలు వికసించాలి. మన చూపులు పడిన స్థలంలో ప్రేమాంకురాలు మొలిచి తీరాలి. అదీ ప్రేమ మహత్త్వం—అదీ ప్రేమికుల తత్త్వం." సౌరాఖ్యుని కళ్ళు అమరకాంతి పుంజాల్ని పుంజుకున్నాయి. అతనిలో మంచి ఏ గంధర్వుడో, దివ్యుడో చూస్తున్న స్పృహ కలిగింది ప్రవాళకు. ఆ నూతన అతిథిని తన అందాల పందిరి క్రింద ఆదరించి పదమదనాలతో పరిచర్యలు చేసిందామె అతని చేతిమీద శిరసు వాల్చుకుంది. వజ్రాయుధమేదో తన తలక్రింద వున్నంత ధైర్యం కలిగిందామెకు. మేఘాల పేటలు దాటి సముదిత అమిత తేజోకిరణ వాజాల మీద శుభాల పరివారం తరలివస్తున్న దృశ్యాన్ని ఆమె దర్శించింది. అభిజిన్ముహూర్తంలో విశ్వజిత్ సంకల్పంతో అతిరాత్రం (అశ్వమేధ యాగంలో మూడవ రాత్రి) గడిపిన పట్టపు రాణిలా ఆమెలో ఏవో అనిర్వచనీయ భావాలు చోటు చేసుకున్నాయి. లక్ష్మీ వర్ధన లక్షణాంతో విలక్షణంగా కనిపిస్తున్న సుస్నిగ్ధ ముగ్ధ రూపంతో లోకాభి రామంగా దర్శన మిస్తున్న లేమలాగ తన సోయగం తనకే సమ్మోహ నాన్ని కలిగిస్తూం దామెకు. కారణం ప్రేమ సిందూర రేఖల్ని తన అందం అద్దుకున్నందుకే కాబోలు అనుకుందామె. తన దర్పం అతని మనోదర్ప ణంలో కనిపించి కాబోలు సౌరాఖ్యుడు ఆమెను గాఢంగా ఆశ్లేషించు కున్నాడు. నాగదేవత అధీనమైన ఆశ్లేష నక్షత్రంలోని దశమిలాంటి పుణ్య దశ ఏదో మనసులో ఉదయించి ఆమెను ఉత్తేజ పరుస్తూంది.

"ప్రవాళా! నూతన మాగధవందుల స్తోత్ర పాఠాలతోటి భోగావళులు ప్రతిధ్వనిస్తున్న గంధర్వ నగరాలు ఏవో నాలో రూపుదిద్దుకుంటున్నాయి."

"అవును—మనిద్దరి ప్రణయరాజ్య శార్దూలాలివి."

"అవునవును—నా కోసం ఒక రణభూమికి ప్రవేశించ దలచి అజ్ఞాతవాసంలో అస్త్రాలు సంపాదించుకుంటున్న వీరవనితవు నువ్వు" చిరునవ్వాడు.

"ఈ అరణ్యవవాల్లో వినవస్తున్న ఋషుల వాక్కులు ఉత్తేజితం చేయడం లేదూ మనల్ని."

"యుద్ధానికి సిద్ధమవుతున్న శంబర గ్రామ కోవిదుల రణవినాదాలు కూడా వినవస్తున్నాయి నాకు."

"నిజమే అన్నీ కలగలిసిన సంస్కృతే మన అరణ్య సంస్కృతి. అనాది వేదవాదాల్లో జనజీవనమంతా చోటుచేసుకునే వుంది ప్రవాళా! జీవితాన్ని వదలిపెట్టి ఏ వేదాలు కానీ, ఋజ్మివాదాలు కానీ రూపొందలేదు."

"సౌరా! అజ్యాసిక్త అగ్నిగుండం లాంటి హృదయం అగ్నికల్పులైన మహర్షుల ఉనికితో భగ్గుమన్నట్టు ఏదో శుభాశుభ భయశోభ ఆవహిస్తోంది నన్ను" స్త్రీ సహజమైన ఆందోళనను వ్యక్తం చేసింది. సబాంధవ సఖీయుతంగా సాగిపోతున్న లేళ్ళగముల్లాంటి చూపులతో ఆమెను తనియించాడు సౌరాఖ్యుడు. స్నేహవర్యాళులాక్షర వచన మాలికలతో ఆమెను అలంకరించాడు. ఆ ప్రేమికుని హృదయం తనలోని తంత్రులన్నిటిపీ మీటి అమర సందేశాన్ని ఆమెకోసం గానం చేసింది. అంతే—

శోభాయమాన వాయుయానాలపైన పయనిస్తున్న హంస జంపతుల మానసిక ఉల్లాస పల్లాపాలు, చల్లారని యజ్ఞాయసాల్లా ఆమె నవవాదులలోకి అనాయాసంగా ప్రసరించాయి. చల్లారిన లావాల్లాంటి ప్రణయభావాల్ని మెల్లగా ఆమెలోకి చొప్పించాడతను. ప్రియవచనాలతో ఆమెను సేవించి సేదదేర్చాడు. ఆమె పూవులాంటి పారువపువు నవ్వుల మంజరిలా మారి అందాలతో అతనికి అంజలించింది. పునీతవించిన గంధర్వ గానంలా, మూర్తీభవించిన మానసార శిల్పశాస్త్రంలా, రూపస్థితిని చెందిన యజ్ఞాగ్ని

జ్వాలికలా మారి అతణ్ణి మంత్రముగ్ధుణ్ణి చేసింది. రుద్రుని మూర్ధంమీద గంగాదేవి పాదముద్ర నద్దినట్టు సౌరాఖ్యుని శిరస్సును చుంబించిందామె. శివజటామండల గహ్వరంలో బంధించబడిన గంగ గర్జించినట్టు అతని పరిష్వంగంలో అనంగరంగ నృత్యం చేసిందామె యౌవనం. పరమశివునికి తప్ప పరునికి పరమ దుర్భర అయిన సురగంగ నిండిన శివశిరోవర సరోవరంలోని హంసలా ప్రవాళ ఆత్మ పరమానంద డోలికలలో తేలియాడింది. వేగవతి అయిన హైమవతి గమన గాంభీర్యాన్ని ఆమె ఒంపులు ఒడిసిపట్టుకున్నాయి. పాదాంగుష్ఠాగ్ర నిపీడనంతో నిలబడి ఉపాసిస్తున్న ప్రేమ తపస్వినిలా ఆమె అతణ్ణే వరపడి త్వరపడుతూంది. శివజటామండల మోహిత అయిన ఆ జలమూర్తికి బాహ్యప్రపంచం కానరానట్టు ప్రవాళ త్రికరణాలన్నిటా సౌరాఖ్యుని మానస తరంగాలే ఆవరించుకున్నాయి. అంతఃపుర జటాజూటంలో బంధించబడిన వరగంగలాంటి ప్రవాళ మీనలీన భావతరంగ శోభితంగా సౌరాఖ్యుని కోసం శిలాతలంపైకి పరవళ్ళు త్రొక్కి ప్రవహించి అతని ఒడిలోకి ఒదిగిపోయింది. గాంగ నలిం క్రియతో సగర పుత్రులు పునర్జన్మించినట్టు ఆమె స్పృశించిన రాతినెంతు శిల్పఖ్యాతి సిద్ధించింది.

"ప్రవాళా! ఉభయపక్ష క్షయకర భావాలెవరికి పనికిరావు. భయాందోళనా లతలు తలలో చివురు తొడగకూడదు. ఇలా మణిరత్న భిత్తికల మీద వెన్నెలలు కొలువుతీరినట్లు నీ కనురెప్పలమీద స్నేహపు తరితీపి తలపులు నిలిచి ఎదగాలి. కారురాత్రి కారడవిలో మెరిసే క్రూర కళ్ళ కాంతుల్ని దాటి అడవి ఒళ్ళు విరుచుకుని లేచేలా మనిషి మార్మిక ఆందోళనం కలితంగా నిలబడగలగాలి" సౌరాఖ్యుడు కొండవాటు గాలి పాటను వింటూ చెరియంమీద ఆమెతో కలిసి ఉత్సాహంగా వాహ్యాళిస్తున్నాడు.

"సారా! హయ శ్రేష్ఠమైన ఉచ్చైశ్శ్రవాల్లాంటి భావాలు ప్లుత గతిలో పరుగులు తీస్తున్న ధ్వని సుదూర ఎదమైదానాల నుంచి విన వస్తూంది. అవునూ—అమృతం కన్నా ఉత్తమౌషధం ఏది?"

"ఇది.........ఇది,"

"బాగుంది."

"ఈ రోజుకి అధరౌషధం చాలు."

"అన్నం అక్కరలేదన్నమాట."

"అన్నాలు ఎన్నో రకాలు కదా!"

"అందాలన్నీ అందమైన కళ్ళకు ఆహారాలే నంటావు."

"చక్కగా చెప్పావు—ముల్లోక మోహనాకారాన్ని చూసి ఎవరికి మాత్రం వికారం కలుగదు."

"అందరూ అందాలకు బానిసలవుతారా?" పద్మపత్ర పుత్రికల్లాంటి కళ్ళను రెప రెపలాడించి అడిగింది.

"అందరూ అన్ని కాలాల్లోనూ కాదు—సుదారుణ తపంతో దివాక రాకారాన్ని సంతరించుకున్న ఋషి సత్తముల ముందు ఈ బాహ్యసౌందర్య సంబంధాలు రత్నాల ముందు గాజురాళ్ళు. కామస్పర్శ తోకచుక్కలా తాకిన నాడు మనిషి వృత్తాంతం తుషారావృత చంద్రేతి వృత్తంలా కళాహీనమై పోతుంది. యోగిసముల ఎదల్లో తన్మకాయినీ అర్షభావాలు తపోదీక్షతో అక్షులు ముకుళించుకుని వుంటాయి. కామం కళ్ళు విప్పుకుంటే దానికి ఇల్లూ ఒళ్లూ తెలియదు.

"కృతార్థాస్మి సురశ్రేష్ఠ! గచ్ఛశీఘ్రమితః ప్రభో:"

"శుశ్రోణి పరితుష్టోస్మి! గమిష్యామి యథాగతమ్—"

అనుకోవలసి వస్తుంది. ఎవ్వరో పాదంతో తాడించేదాకా శిలాకృతి దాల్చిన మనోప్రకృతిలో బ్రతుకవలసి వస్తుంది. దుర్మదుల దుర్మేధోజనిత

భావాలకు ఇదే ప్రకృతిగా విధించిన ప్రతిఫలం. పరమ సత్కారపూర్వకంగా శాపాన్ని చూసుకోగలిగినవారు అది ఋతుకాలపూజనంగా, సర్వజన భాజనంగా మారుతుంది.

వరాయుధ ధరులైనరో ధరా భారంమీద నిలబడి సత్కార్యాలకు ధైర్యం చెబుతుంటారు. అది సత్పురుషులకు అనుభవైక వేద్యం."

"అవును— సత్సంకల్పాలు మనిషిలో దృఢపడనపుడు అవి మిథ్యా స్వర్గంలోని కాంతి వలయం మధ్య తలక్రిందుగా వ్రేలాడుతుంటాయి. మనసులోకి వెళ్ళని మహా భాష్యాలు—విశ్వామిత్రుడు సృష్టించిన నక్షత్రాలు ఆకాశంలోని అనాది జ్యోతిశ్చక్రానికి బాహ్యప్రదేశంలోనే ప్రకాశిస్తున్నట్లు వుండిపోతాయి. మనిషి పవిత్ర పాశానస్తుడు కావాలి. యజ్ఞవాటికలో ప్రత్యక్షమైన విష్ణుదేవుని పోలిన యూపస్తంభాల్లాంటి భావాలు గుంభనగా ఎదలో ఎదగాలి. మనిషి ఆర్తిని చూసి ఆదుకోవడానికి పరమాత్మ పరమాతురతతో రావాలి." ప్రవాళలో ఒక ఆధ్యాత్మిక ఆశావాదం వేద మంత్రంలా ధ్వనించింది. తమసా తీరసమీప తామరస వనాల్ని దినప్రభువు ప్రభాకరుడు వికసింపజేస్తున్నట్లు, ఆమె అంతర్య భావాంతర్దామరలు అతని చూపులతో రేకులు విప్పాయి.

"ప్రవాళా! నా శిలాకళా క్షేత్రంలో పేద్యంచేసి ప్వైదాళరణ భూషితంగా మారిన సుగాత్రివి నువ్వు. నర వ్యాఘ్రాలు పక్షిసంఘాల ఛాయలకు కూడా చేరలేనట్లు, నీ దరికి భయాలు, బలహీనతలు రాలేవు. నీ కదలికల్లో కల్పసూత్ర క్రమంలో చోటు చేసుకునే సామూహిక వివాహాల సంబరాలు అంబరాల నంటుతున్నాయి. ఓళల్లో దివ్యపక్షుల్ని పక్షాలు విప్పి చెప్పే శుభ శకునాలు నీ కన్నుల్లో కనిపిస్తున్నాయి. అకులత చెందని శాకుంతకులం చేసే శిశోదయ కలకలం నీ పలుకుల్లో ప్రకటితమవుతోంది. భూతల భూత ప్రపంచాని కేవో శుభవార్తల సువార్తలు ప్రసరింపజేస్తున్నట్లు నన పవనాలు

ప్రసన్నంగా ప్రసరిస్తున్నాయి. సర్వ ప్రాణులకూ దుఃఖాతిశయ ప్రశమనం జరుగుతోంది. జటామండల ధారణాదీక్ష అంత సులభం కాదు. అది సర్వలక్షణ లక్ష్మాచారుడైన అగ్ని దేవుణ్ణి ఉత్తమాంగం మీద ప్రతిష్ఠించుకోవడం లాంటిది. అగ్నికి ఆజ్యానికి కుదిరిన దుస్సహ సహవాసం లాంటిదే స్త్రీ పురుష సంబంధం. అది సవ్యంగా సాగితేనే యజ్ఞం అవుతుంది. లేదా జీవితమే భగ్నం అవుతుంది. యథా సుఖంగా ఏదో విధంగా అనుభవించాలనుకున్నవాళ్ళు అక్రమ సుఖాలకు శుల్కాలు చెల్లించవలసి వుంటుంది. మేధోశోధిత ప్రేమ సందిగ్ధ పరాక్రమాన్ని అలవరుస్తుంది. సత్పురుషుని చేత ప్రేమించబడిన ముగ్ధ శృంగార సందిగ్ధ కాకూడదు. ప్రేమాగ్ని హోత్రుడికి ఓంకార వషట్కారాల్లాంటి శ్రేష్ఠ శబ్దాలే అలవడాలి. క్షాత్ర వేదం పురుషుడు. బ్రహ్మవేదం స్త్రీ. ఇవి పరస్పరం ప్రేమ పూర్వకాలు కావాలికానీ సంఘర్షించుకోకూడదు. ప్రతి మనిషి హృదయం ఒక యాగభూమి. అందులో సాంగమంగళాలోచనాలాంగలాలు దువ్వాడాలి. సీతల్లాంటి భావపేటికలు బయల్పడాలి. అవి అభిరామ ప్రణయ మోహితలు కావాలి" అన్నాడు. ప్రణయ వేదాధ్యయన శాలినిగా అందంగా చూస్తూందామె.

"విరామయ విరామంలో ఏదో అవ్యక్త భావఝరి నాలోకి పొరబారుతోంది. నా ఏకాంత ధ్యానాల్లో దేవదుందుభి ధ్వానాలు వినావిస్తున్న అనుభూతి ఒడి విందుతోంది. యజ్ఞోప సదనంలో అరణుల మథనం జరుగుతున్నట్టు ఎదలో ప్రణయభావ సంఘర్షణోష్టం చోటు చేసుకుంటూంది. అశేష మామషీ భావనతో ప్రణయ భాగార్థిలా ఆర్తితో నిన్ను అభ్యర్థిస్తూంది హృదయం. తపోధ్యోతిత ద్యుతి మతిలో మంత్రాక్షరాల్ని జపింప జేస్తుంది. ప్రణయస్కంధ బంధిత హృదయం శిశువశగ మానసంతో ఉన్మాదవాదం


చేస్తూంది. ప్రణయ పథకాల పతాకలు నా భుజాలమీద ఎగురుతున్నట్లు ఈ కొంగు రింగులు వారుతోంది. మంద మంద గమనంలోనే అందం వుందని ఆత్మ రతి ప్లుతి భావాన్ని చేరుకోవడానికి మరీ ఆలస్యం చేయకూడదు," అందాల దీవిలా అంది.

"ప్రవాళా! ప్రణయ ఘన విద్యుద్గణోపమంగా వుంది నీ రూపం. నిజమే ఖదీకృత పదాకృతితో కమనీయ రమణీయ కవితావిర్భావం జరగదు. నిత్యం ప్రణయ సంతర్పణం చేసుకుంటాను నీకు" అంటూ కూర్చుని వున్న ఆమెను మంచుతో తడిపిన బరువైన పొగడ మాలలా పైకి లేవ నెత్తాడు. వరధనుస్ఫూరణం చేస్తున్న స్వయంవర వీరుడిలా అత నామెను ప్రణయానికేసి ఎక్కుపెట్టాడు.

— ఓం —

SRI VENKATESWARA CENTRAL LIBRARY & RESEARCH CENTRE
TIRUPATI.
48796





ల ఋక్కు. శిల్పి ఋత్విక్కు. ఉలి దర్వి. కళ హవ్యం. శిల్పం
సాక్షాత్కారం. శిల్ప శాస్త్రం శిలాయజ్ఞంలా పఠిస్తున్న కళా సూక్తం.
దాక నిర్విఘ్న శిలాయజ్ఞం.
ల మీద ఆపి నిలిపే వ్యక్తి శిల్పి. శిల్పి ఆపి శిల్పం. శిల్పం చిత్రలిపి.
ల్పం మాట్లాడని కావ్యం. కావ్యం మాట్లాడే శిల్పం. శిల్పి శిలాప్రియుడు.
పుత్రుడు. శిల్పకళ విశ్వకర్మ కన్న కల. శిల్పాలు కప్పుకున్న
ల ముసుగుల్ని తొలగించే వెజ్జెలు ఉలులు.

సగం నిజం సగం స్వప్నం అది జీవితం
సగం శిల సగం కళ అది శిల్పం.